www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 65
సంచిక (Issue) : 224
శుక్రవారం | 29-11-2024 | పేజీలు: 14

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం; తిథి: త్రయోదశి ఉ. 8.40 తదుపరి చతుర్దశి; నక్షత్రం: స్వాతి ఉ. 10.18 తదుపరి విశాఖ; వర్జ్యం: సా. 4.25-6.10; దుర్ముహూర్తం: ఉ. 8.44-9.28, మ. 12.25-1.09; అమృతఘడియలు: రా. 2.56-4.41; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.31; సూర్యాస్తమయం: 5.35

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



లోక్‌సభలో కొత్త కళ

సభ్యురాలిగా ప్రియాంక ప్రమాణం
గ్యాలరీ నుంచి వీక్షించిన సోనియా
పార్లమెంటులోకి వస్తుండగా
ఫొటోలు తీసిన అన్న రాహుల్‌గాంధీ
2
ఇండియా కూటమిలో చిచ్చు!
కాంగ్రెస్‌కు రబ్బర్ స్టాంపుగా ఉండం
పార్లమెంటు స్తంభనపై మమత ఆగ్రహం
అతివిశ్వాసంతోనే మహారాష్ట్రలో ఓటమి



గ్రాండ్ క్యాన్యన్‌లా గండికోట

కేంద్ర మంత్రి పెమ్మసాని వెల్లడి 12
గండికోట అభివృద్ధికి కేంద్రం నుంచి రూ. 77.91 కోట్లు

16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా నిషేధం

కీలక బిల్లును ఆమోదించిన ఆస్ట్రేలియా పార్లమెంటు
జాబితాలో యూట్యూబ్‌కు మాత్రం మినహాయింపు
వయసు ధ్రువీకరణ బాధ్యత సంబంధిత వేదికలదే
ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు.. వచ్చే ఏడాది అమలు
పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యం రీత్యా నిర్ణయం
తల్లిదండ్రులు మద్దతివ్వాలి: ప్రధాని అల్బనీస్



కాన్‌బెర్రా, నవంబరు 28: ఆస్ట్రేలియా పార్లమెంటు గురువారం రాత్రి కీలక నిర్ణయం తీసుకొంది. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని 16 ఏళ్లలోపు పిల్లలకు సామాజిక మాధ్యమాలను నిషేధిస్తూ బిల్లును ఆమోదించింది. పిల్లల వయసు ధ్రువీకరణకు సామాజిక మాధ్యమాల వేదికలే 'హేతుబద్ధమైన చర్యలు' తీసుకోవాలని సూచించింది. ఇందుకు ఏడాది గడువు ఇచ్చింది. ఆ ప్రక్రియ అంతా పూర్తయిన తరువాత వచ్చే ఏడాది

మిగతా 2వ పేజీలో...

సన్మానం చేయాలా?

అబద్ధాలు చెప్పినందుకు శాలువా కప్పాలా?



మీడియాతో మాట్లాడుతున్న మాజీ సీఎం జగన్

ఆ కేసులో నా పేరెక్కడుంది?

అదానీ నాకు లంచం ఇచ్చినట్లు ఎక్కడ రాశారు?
ఒప్పందం సెకీతో.. థర్డ్ పార్టీ ఎక్కడ?
అతి తక్కువ ధరకు కొన్నాం.. లక్షల కోట్లు ఆదా చేశాం
మంచి చేసినందుకు నన్ను సన్మానించాలి
సీఎంతో పారిశ్రామికవేత్తల భేటీ మామూలే
48 గంటల్లో 'ఆంధ్రజ్యోతి' క్షమాపణలు చెప్పాలి
లేదంటే.. రూ.వంద కోట్లకు దావా వేస్తా
మాజీ సీఎం జగన్ బెదిరింపులు

ట్రాన్స్‌మిషన్ చార్జీలు లేవంటూ జగన్ బుకాయింపు
'నెట్‌వర్క్' చార్జీలుంటాయని నాడే చెప్పిన కార్యదర్శి
2021లో యూనిట్ సౌర విద్యుత్తు రూ.2.14
రూ.2.49తో పాతికేళ్లు కొనడం రాష్ట్రానికి భారం కాదా?
రాష్ట్ర కార్పొరేషన్ టెండర్లలోనూ అదే ధర పలకలేదా?
ఆ టెండర్లను రద్దు చేసి సెకీతో ఎందుకు డీల్?
సెకీ నుంచి కొనుగోలు చేసేది అదానీ పవర్‌ను కాదా?

సెకీతో ఒప్పందంపై జగన్ అడ్డగోలు వాదన

(అమరావతి - ఆంధ్రజ్యోతి)
ఆంధ్రప్రదేశ్ ప్రజలారా... వినండి! మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డికి శాలువాలు కప్పాలట! సన్మానాలు చేయాలట! రాష్ట్రానికి ఆయన లక్షల కోట్లు మిగిల్చారట! ఈ మాటలన్నీ ఎవరో చెప్పినవి కావు! ఆయనకు ఆయనే చెప్పుకొన్నారు. తనకు తాను జేజేలు కొట్టుకున్నారు. 'జగన్-అదానీ... ముడుపుల

మిగతా 13వ పేజీలో...

ఇదిగో తమరి పేరు..

83. Shortly after Gautam Adani's meeting with Andhra Pradesh's Chief Minister, and the payment or promise to pay bribes, communications internal to Adani Green and Azure reflected that Andhra Pradesh had agreed to buy power from SECI.

'నా పేరు ఎక్కడుంది? నాకు లంచాలు ఇవ్వడంపై బేరసారాలు జరిపినట్లు ఎక్కడ రాశారు?'... అన్న జగన్ ప్రశ్నకు సమాధానమే ఈ చిత్రం! అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (సెక్) దర్యాప్తు చేసి అక్కడి కోర్టుకు ఇచ్చిన నివేదికలో... 'ఆంధ్రప్రదేశ్ చీఫ్ మినిస్టర్' అని స్పష్టంగా ప్రస్తావించింది. "ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిని గౌతమ్ అదానీ కలిసి... ముడుపులు చెల్లించడం లేదా చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఆ తర్వాత సెకీతో ఒప్పందానికి ఏపీ అంగీకరించిందని అజ్యూర్ ప్రతినిధులకు అదానీ గ్రీన్ సమాచారం పంపించింది" అని సెక్ స్పష్టం చేసింది. అప్పట్లో ఆంధ్రప్రదేశ్ చీఫ్ మినిస్టర్ వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు కదా!

• రూ.2.14 కంటే 2.49 తక్కువా?

'దేశంలోనే అత్యంత చౌక ధరతో సౌర విద్యుత్ కొనుగోలు ఒప్పందం కుదుర్చుకున్నాం. రాష్ట్రానికి లక్షల కోట్లు మిగిల్చాం. ఇందుకు శాలువా కప్పి సన్మానించాలి'... అని జగన్ తనను తాను ప్రశంసించుకున్నారు. మరి అసలు విషయంలోకి వస్తే! 2021 డిసెంబరులో జగన్ 'సెకీ'తో ఒప్పందం కుదుర్చుకున్నారు. యూనిట్ రూ.2.49 చొప్పున పాతికేళ్లలో 7వేల మెగావాట్ల సౌర విద్యుత్ కొనుగోలు చేసేందుకు కుదిరిన డీల్ అది! అయితే... అదే ఏడాది మే నెలలో సెకీ వేసిన వేలంలో యూనిట్ సౌర విద్యుత్తు రూ.2.14లే పలికింది. 2022 జనవరిలో ఈ ధర రూ.2.17 మాత్రమే! జగన్ చెప్పిన రూ.2.49 'లెక్క' ఏరకంగా తక్కువో! ఇవేం లెక్కలో!

జే ట్యాక్స్ పోయింది



మద్యం ధర తగ్గింది

తాజాగా రేట్లు తగ్గించిన 3 పాపులర్ బ్రాండ్లు
కంపెనీల ప్రతిపాదనలకు ఎక్సైజ్ ఆమోదం
వెంటనే అమల్లోకి రానున్న కొత్త ధరలు
క్వార్టర్‌పై 30, ఫుల్ బాటిల్‌పై 200 తగ్గింపు
గత ప్రభుత్వంలో తాడేపల్లికి కప్పం కట్టేందుకు జనం నుంచి పిండేశారు
ప్రభుత్వం మారడంతో కమీషన్లు మాయం
3 రోజుల్లో మరో 2 కంపెనీల ధరలు తగ్గుదల

(అమరావతి-ఆంధ్రజ్యోతి)
జగన్ ప్రభుత్వం దిగిపోవడంతో 'జే ట్యాక్స్' కూడా పోయింది. దీంతో మద్యం ధరలు తగ్గాయి. ఈ జే ట్యాక్స్‌కు, మద్యం ధరలకు సంబంధం ఏంటంటే... వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో మద్యం అమ్ముకోవాలంటే ఏ కంపెనీ అయినా అప్పటి ప్రభుత్వ పెద్దలకు కప్పం కట్టాల్సిందే. ఒక్కో లిక్కర్ కేసుపై రూ.200 నుంచి రూ.250,

మిగతా 13వ పేజీలో...

వెంకట్రామిరెడ్డి మందు పార్టీ



ఉద్యోగులకిచ్చిన మందు పార్టీలో వెంకట్రామిరెడ్డి

అనుమతి లేకుండా విందు, ఫుల్లుగా మందు
అరెస్టు చేసిన ఎక్సైజ్ అధికారులు
సచివాలయ క్యాంటీన్ ఎన్నికల్లో ప్రలోభాలు
2

'ఈగల్' సైన్యం సిద్ధం



ఆకే రవికృష్ణ

గంజాయి కట్టడికి 459 మందితో ప్రత్యేక పోలీసు బృందం



అధిపతిగా ఐజీ ర్యాంకు అధికారి ఆకే రవికృష్ణ
ప్రతి జిల్లాలో ఈగల్ సెల్.. ఐదు ప్రత్యేక కోర్టులు
మత్తు రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దడమే లక్ష్యం
సాగు నుంచి వినియోగం వరకూ ఉక్కుపాదం
ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు 'మహా సంకల్పం' సభలు
డ్రగ్స్ సమాచారం ఇచ్చేందుకు 1972 టోల్ ఫ్రీ నంబర్
అహర్నిశలు శ్రమిస్తాం: రవికృష్ణ

వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో విచ్చలవిడిగా సాగైన గంజాయి తోటలు ఇకపై కనిపించకూడదని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. దేశవ్యాప్తంగా అక్రమ రవాణా చేసిన వాహనాలు ఇకపై కదలడానికి వీల్లేదని స్పష్టం చేసింది. స్మగ్లర్లు రాష్ట్రంలో ఉండటానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశంలేదని తీర్మానించింది. మత్తు పదార్థాల విక్రయాలనే మాటే వినిపించరాదని.. వినియోగం వాసనే రాకూడదంటూ స్పష్టం చేసింది. దీనికోసం గద్దల్లా వేటాడే 'ఈగల్' సైన్యాన్ని సిద్ధం చేసింది. ఈ సైన్యంతో గంజాయి స్మగ్లర్ల పీచమణచడానికి కార్యక్షేత్రంలోకి దిగింది.

12

గ్రూప్-1 కథ కంచికేనా?

ఆధారాలతో సహా నిరూపించిన అభ్యర్థులు
2018 మెయిన్స్‌ను రద్దు చేసిన హైకోర్టు
మరోసారి పరీక్ష నిర్వహించాలని ఆదేశం
దానిపై అప్పీలుకు ఏపీపీఎస్సీ, జగన్ ప్రభుత్వం
సీబీఐ విచారణకు నాడు చంద్రబాబు డిమాండ్
అధికారంలోకి వచ్చి 6 నెలలైనా ఆ ఊసే లేదు
ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి కీలక పోస్టులు
ఆవేదన వ్యక్తంచేస్తున్న నష్టపోయిన అభ్యర్థులు

వైసీపీ హయాంలో మూల్యాంకనంలో అక్రమాలు

2018 గ్రూప్-1 మెయిన్స్ కథ ఇంకా కంచికి చేరలేదు. మూల్యాంకనంలో అక్రమాలు జరిగాయని నిర్ధారణ కావడంతో హైకోర్టు ఈ పరీక్షను రద్దు చేసింది. మరోసారి పరీక్ష నిర్వహించి ఆరు నెలల్లోగా అభ్యర్థులను ఎంపిక చేయాలని ఆదేశించింది. ఇది జరిగి 9 నెలలు కావస్తోంది. అయినా ఇప్పటి వరకూ పట్టించుకున్న నాథుడే లేడు. ఈ అక్రమాలపై నాడు ప్రతిపక్ష నేతగా చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అందులో భారీ కుంభకోణం జరిగిందని, దీనిపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కానీ అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా ఇంతవరకూ ఆ ఊసే ఎత్తలేదు. ఇప్పటికైనా విచారణ జరిపి నష్టపోయిన వారికి న్యాయం చేయాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

APPSC

(అమరావతి-ఆంధ్రజ్యోతి)
2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం 164 పోస్టులతో గ్రూప్-1 నోటిఫికేషన్ జారీ చేసింది. 2019 మే 26న ప్రిలిమ్స్, 2020 డిసెంబరు 14 నుంచి 20 వరకు మెయిన్స్ నిర్వహించారు. 6,807 మంది అభ్యర్థులు మెయిన్స్ రాయగా వారిలో నుంచి 326 మందిని ఇంటర్వ్యూలకు ఎంపిక చేశారు. ఇక్కడే ఏపీపీఎస్సీ నిబంధనలు ఉల్లంఘించింది. మెయిన్స్ సమాధాన పత్రాలను మాన్యువల్ విధానంలో మూల్యాంకనం చేస్తారని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. కానీ అందుకు విరుద్ధంగా కోవిడ్‌ను కారణంగా చూపుతూ డిజిటల్ విధానంలో

మిగతా 14వ పేజీలో...

ఉద్యోగులకు వైద్య బీమా



బ్యాంకు ఖాతాతో ఆరోగ్య భద్రతకు భరోసా.. ప్రభుత్వం కసరత్తు

బ్యాంకర్లతో సీఎస్, ఆరోగ్య శాఖ అధికారుల చర్చలు
ప్రీమియం తక్కువ ఉండేలా చూడాలని స్పష్టీకరణ
ఈ అంశంపై 15 రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం
5 లక్షల మంది ఉద్యోగులకు ఒకే బ్యాంకులో ఖాతా
ప్రమాద, జీవిత బీమాతో పాటు వైద్య బీమా కూడా
ఈహెచ్‌ఎస్‌లో వైద్యసేవలకు ఆటంకాలతో నిర్ణయం
రీయింబర్స్‌మెంట్ ద్వారా ప్రభుత్వంపై కోట్లలో భారం
ఈ సమస్యలకు చెక్ పెట్టే దిశగా సర్కారు అడుగులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)
ఉద్యోగుల ఆరోగ్య భద్రతకు భరోసా కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. బ్యాంకులతో అనుసంధానం కావడం ద్వారా వారికి వైద్య బీమా సదుపాయం కల్పించాలని భావిస్తోంది. ప్రస్తుతం ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగులకు ఆరోగ్య

మిగతా 14వ పేజీలో...


14

అసభ్య పోస్టుల కిరాయి మూకలపై చర్యలు తప్పవు!

అసభ్యకర భాషతో తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారు
వారు సోషల్ మీడియా ఉద్యమకారులు కాదు
వ్యవస్థీకృత విష ప్రచారంతో పౌరులకు నష్టం
విజయ్‌బాబు పిల్ వెనుక రాజకీయ దురుద్దేశం
హైకోర్టు ఆగ్రహం.. వ్యాజ్యం కొట్టివేత
రూ.50 వేల జరిమానా విధింపు



ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు

వరి రైతుపై తేమ కత్తి!

పంట కొనుగోళ్లలో ని'బంధనాలు'

కొనసాగుతున్న మధ్యవర్తులు, మిల్లర్ల దోపిడీ
అమలు కాని ప్రభుత్వ ఆదేశాలు
తేమ శాతం, ఇతరత్రా కారణాలతో మద్దతు ధరలో భారీగా కోత
తీవ్రంగా నష్టపోతున్న అన్నదాతలు
9

ఐదేళ్లలో పేదలందరికీ ఇళ్లు!

ఎన్నికల హామీపై కూటమి సర్కారు కసరత్తు
రాష్ట్రంలో పీఎంఏవై 2.0 అమలుకు గ్రీన్ సిగ్నల్
12

వెంకట్రామిరెడ్డి మందు పార్టీ



» అరెస్టు చేసిన ఎక్సైజ్ అధికారులు

తాడేపల్లి టౌన్/అమరావతి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సచివాలయ క్యాంటీన్ ఎన్నికల్లో ఉద్యోగులను ప్రలోభపెట్టేందుకు మద్యం పార్టీ ఏర్పాటు చేసిన సచివాలయ ఉద్యోగుల సంఘం నేత వెంకట్రామి రెడ్డిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. ఉద్యోగులను ప్రభావితం చేయడానికి గుంటూరు జిల్లా తాడేపల్లి పరిధిలోని కొండపావులూరి గార్డెన్స్‌లో ఉద్యోగులకు ఆయన మందు పార్టీ ఏర్పాటు చేశారు. ఎక్సైజ్ నిబంధనల ప్రకారం.. ఇటువంటి మందు పార్టీలు ఏర్పాటుకు ముందుగా ఎక్సైజ్ శాఖ నుంచి అనుమతి తీసుకోవాలి. అయితే అటువంటి అనుమతులేవీ లేకుండానే విందు జరుగుతోందన్న సమాచారం ఎక్సైజ్ అధికారులకు గురువారం రాత్రి 11 గంటలకు అందింది. దీంతో స్థానిక పోలీసులతో కలిసి ఆ గార్డెన్స్‌లో సోదాలు చేపట్టారు. అక్కడ ఐదు ఫుల్ బాటిళ్ల మద్యం ఉండడంతో అది నిబంధనలకు విరుద్ధమని ఉద్యోగులకు తెలియజేశారు. తమకీ విషయం తెలియదని.. వెంకట్రామిరెడ్డి ఆహ్వానిస్తే వచ్చామని వారు చెప్పారు. పోలీసులు వెంకట్రామిరెడ్డిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ సూర్యనారాయణ, గుంటూరు ఎక్సైజ్ ఏఈఎస్ మరియబాబు పాల్గొన్నారు. కాగా.. సచివాలయం క్యాంటీన్ ఎన్నికలు వేడి పుట్టిస్తున్నాయి. మొత్తం 10 డైరెక్టర్ పదవుల కోసం 28 మంది పోటీ పడుతున్నారు. వెంకట్రామిరెడ్డి వర్గం నుంచి 11 మంది పోటీలో ఉన్నారు. ఇంకోవైపు.. ఉద్యోగ నేత కంటే వైసీపీ కార్యకర్తగానే ఎక్కువగా వ్యవహరించిన వెంకట్రామిరెడ్డి ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్నారు. సచివాలయంలోకి ఆయనకు ప్రవేశం లేదు. ఈ నేపథ్యంలో ఉద్యోగులను కలుసుకోవాలనే ఉద్దేశంతో ఆయన ప్రైవేటు పార్టీలు ఏర్పాటు చేస్తున్నారు. తన వర్గంలో కొంత మందిని గెలిపించుకోవాలని తాపత్రయపడుతున్నారు.

ఢిల్లీలో ఈడీ అధికారులపై దాడి

» ఫర్నిచర్, కుర్చీలతో కొట్టిన దుండగులు.. ఒకరికి గాయాలు

న్యూఢిల్లీ, నవంబరు 28: దర్యాప్తు కోసం వెళ్లిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులపై గుర్తుతెలియని దుండగులు దాడి చేశారు. కుర్చీలు, ఫర్నిచర్‌తో భౌతిక దాడికి తెగబడటంతో ఓ అధికారి గాయపడ్డారని ఈడీ అధికారులు ఎక్స్ వేదికగా తెలిపారు. ఈ ఘటన ఢిల్లీలోని బిజ్వాసన్ ప్రాంతంలో జరిగింది. పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, క్యూఆర్ కోడ్ చీటింగ్ వంటి సైబర్ మోసాల కేసులో ముడిపడి ఉన్న చార్టెడ్ అకౌంటెంట్స్ లక్ష్యంగా గురువారం దేశవ్యాప్తంగా ఈడీ సోదాలు నిర్వహించింది. ఈ క్రమంలో బిజ్వాసన్ ప్రాంతంలోని అశోక్ శర్మ అనే సీఏ ఫామ్‌హౌస్‌పై అధికారులు దర్యాప్తుకు వెళ్లారు. సోదాలు నిర్వహిస్తున్న వారిపై అశోక్, అతడి సోదరుడు చేతికి దొరికిన ఫర్నిచర్, కుర్చీలతో దాడికి దిగారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు ఈడీ అధికారులు తెలిపారు.

లోకం తీరు



ఐఎన్ఎస్ అరిఘాత్ నుంచి కే-4 క్షిపణి పరీక్ష

విశాఖపట్నం, నవంబరు 28: ఇటీవలే ప్రారంభించిన అణు జలాంతర్గామి ఐఎన్ఎస్ అరిఘాత్ నుంచి భారత నౌకాదళం.. కే-4 బాలిస్టిక్ క్షిపణిని పరీక్షించింది. విశాఖపట్నం సమీపంలోని బంగాళాఖాతంలో బుధవారం ఉదయం ఈ పరీక్ష నిర్వహించినట్టు రక్షణ వర్గాలు పేర్కొన్నాయి. ఈ పరీక్ష ప్రమాణాలకు అనుగుణంగా ఉందో లేదో తెలుసుకోవడానికి ఫలితాన్ని క్షుణ్ణంగా విశ్లేషిస్తున్నామని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. సబ్‌మెరైన్ నుంచి ప్రయోగించగల ఈ అణ్వాయుధ సామర్థ్యం కలిగిన అధునాతన కే-4 బాలిస్టిక్ క్షిపణి (ఎస్ఎల్‌బీఎం) 3,500 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు. 6,000 టన్నుల బరువున్న ఐఎన్ఎస్ అరిఘాత్ నుంచి కే-4 క్షిపణిని పరీక్షించడం ఇదే తొలిసారి. వచ్చే ఏడాది నౌకాదళానికి అందుబాటులోకి రానున్న మరో అణు జలాంతర్గామి ఐఎన్ఎస్ అరిధమన్‌లోనూ కే-4 క్షిపణిని చేర్చేందుకు తాజా పరీక్ష ఉపయోగపడనుంది.

9 నెలల్లో రూ.11,333 కోట్లు దోపిడీ

» దేశంలో పెరిగిపోతున్న సైబర్ నేరాలు: నివేదిక

న్యూఢిల్లీ, నవంబరు 28: సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోయాయి. దేశంలో నెలకు సగటున లక్షకు పైగా ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబరు వరకు 9 నెలల్లో సైబర్ స్కామ్‌ల్లో బాధితులు దాదాపు రూ.11,333 కోట్లు నష్టపోయినట్టు తాజాగా ఓ నివేదిక వెల్లడించింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పరిధిలోని భారత సైబర్ క్రైమ్ కో-ఆర్డినేషన్ సెంటర్ (14సీ) విభాగం డేటాను ఉటంకిస్తూ జాతీయ మీడియా ఈ నివేదికను ప్రచురించింది. ఈ జాబితాలో స్టాక్ ట్రేడింగ్ మోసాలకు సంబంధించినవి ఎక్కువగా ఉన్నాయి. ఆ తర్వాతి స్థానాల్లో పెట్టుబడుల పేరిట మోసాలకు సంబంధించి లక్ష ఫిర్యాదులు (రూ.3,216 కోట్లు), డిజిటల్ అరెస్ట్ కేసులకు సంబంధించి 63 వేల ఫిర్యాదులు (రూ.1,616 కోట్లు) ఉన్నాయి. కాగా ది సిటిజన్ ఫైనాన్షియల్ సైబర్ ఫ్రాడ్ రిపోర్టింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (సీఎఫ్‌సీఎఫ్ఆర్ఎంఎస్) డేటా ప్రకారం ఈ ఏడాది 12 లక్షల ఫిర్యాదులు అందినట్టు పేర్కొంది. ఇందులో 45% కంబోడియా, మయన్మార్, లావోస్‌కు సంబంధించినవి ఉన్నాయి.

యంత్రాలతో కాదు.. యంత్రాంగంతోనే సమస్య

» ఈవీఎంలను సమర్థించిన కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్

న్యూఢిల్లీ, నవంబరు 28: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల(ఈవీఎం)తో సమస్యేమీ లేదని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ అన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సహా పలువురు నేతలు ఈవీఎంలపై అనుమానాలు వ్యక్తం చేయడంతో పాటు బ్యాలెట్ పేపర్ విధానంలో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో శశిథరూర్ ఈవీఎంలను సమర్థించడం గమనార్హం. "మహారాష్ట్ర ఎన్నికల తర్వాత ఈవీఎంల అంశం తెరపైకి వచ్చింది. ఈవీఎంలను తారుమారు చేయొచ్చన్న వాదనలను నేను అంగీకరించను. బ్యాలెట్ పేపర్ల కంటే మెరుగైనవి కాబట్టే మన ఎన్నికల ప్రక్రియలో ఈవీఎంలను భాగం చేశారు" అని థరూర్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ఇక్కడ సమస్య యంత్రాలతో కాదని, ఎన్నికల వ్యవస్థను నడిపే యంత్రాంగంతోనేనని వ్యాఖ్యానించారు. బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు నిర్వహించడమనేది సమస్యకు పరిష్కారం కాదన్నారు.

'ఆల్ట్ న్యూస్' వ్యవస్థాపకుడిపై మరో కేసు

ప్రయాగ్‌రాజ్, నవంబరు 28: ప్రముఖ స్వామీజీ నరసింగానంద్ చేసిన ప్రసంగానికి సంబంధించిన పాత వీడియోను పోస్టు చేసి విద్వేషాలు రెచ్చగొట్టారన్న కేసులో 'ఆల్ట్ న్యూస్' వెబ్ పోర్టల్ సహ వ్యవస్థాపకుడు మహమ్మద్ జుబేర్‌పై ఉత్తరప్రదేశ్ పోలీసులు మరో కేసు పెట్టారు. దేశ సార్వభౌమ అధికారం, సమైక్యత, సమగ్రతకు ముప్పు తెచ్చారంటూ ఐటీ చట్టంలోని 66 సెక్షన్, బీఎన్ఎస్‌లోని సెక్షన్ 152 కింద కేసు నమోదు చేసినట్టు ఘాజియాబాద్ పోలీసులు అలహాబాద్ హైకోర్టుకు తెలిపారు. సెక్షన్ 152 కింద కేసు పెడితే బెయిల్ రావడం కష్టమవుతుంది. యతి నరసింగానంద్ సరస్వతి ట్రస్టు ప్రధాన కార్యదర్శి ఉదిత త్యాగి చేసిన ఫిర్యాదు మేరకు ఘాజియాబాద్ పోలీసులు జుబేర్‌పై కేసు పెట్టారు.



అనంతపురం నగర శివారు ప్రాంతంలో డ్రోన్ కెమెరాల నిఘా, పారిపోతున్న మందుబాబులు

అనంతలో హడలెత్తిస్తున్న పోలీసుల డ్రోన్‌లు

» పరుగులు తీస్తున్న మందుబాబులు, పేకాటరాయుళ్లు

అనంతపురం క్రైం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాలో పోలీసులు ప్రయోగిస్తున్న డ్రోన్ కెమెరాలు అసాంఘిక శక్తులకు వణుకు పుట్టిస్తున్నాయి. నేరాలను అరికట్టేందుకు ఎస్పీ జగదీష్ నేతృత్వంలో పోలీసు శాఖ సాంకేతికతను వినియోగిస్తుండడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. అనంతపురం నగర శివారు ప్రాంతాలలోని పొదలు, నిర్జన ప్రదేశాల్లో పేకాట ఆడేవారిని, మద్యం సేవిస్తున్నవారిని డ్రోన్ కెమెరాలతో గుర్తించి అదుపులోకి తీసుకుంటున్నారు. దీంతో డ్రోన్ కెమెరాలు గాల్లో కనిపిస్తే చాలు.. మందుబాబులు, పేకాటరాయుళ్లు పరుగులు తీస్తున్నారు. డ్రోన్ కెమెరా వీడియోలు, ఫొటోలను పోలీసు శాఖ గురువారం విడుదల చేసింది.

తప్పిన తుఫాను ముప్పు

» స్థిరంగా కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం

విశాఖపట్నం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తుఫాను ముప్పు తప్పింది. నైరుతి బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం స్థిరంగా కొనసాగుతోంది. ఇది గురువారం రాత్రి శ్రీలంకలోని ట్రింకోమలైకు 130 కి.మీ.తూర్పు ఈశాన్యంగా, తమిళనాడులోని నాగపట్నానికి 340 కి.మీ. తూర్పు ఆగ్నేయంగా, చెన్నైకు 470 కి.మీ. దక్షిణ ఆగ్నేయంగా కేంద్రీకృతమై ఉంది. ఇది శుక్రవారం మధ్యాహ్నం వాయుగుండంగా బలహీనపడి తమిళనాడు తీరం దిశగా రానుందని భారత వాతావరణ శాఖ తెలిపింది. శనివారం ఉదయం మహాబలిపురం-కరైకల్ మధ్య తీరం దాటుతుందని పేర్కొంది. దీని ప్రభావంతో గురువారం కోస్తా, రాయలసీమల్లో అనేకచోట్ల మేఘాలు ఆవరించినా, అక్కడక్కడ వర్షాలు కురిశాయి. శుక్రవారం రాయలసీమ, దక్షిణ కోస్తాల్లో అనేక చోట్ల, ఉత్తరకోస్తాలో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ కుంభవృష్టిగా, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ, ప్రకాశం, శ్రీసత్యసాయి, కడప జిల్లాల్లో అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయని తెలిపింది.

ఇస్రో ద్వారా తీవ్ర వాయుగుండం సమాచారం

(సూళ్లూరుపేట-ఆంధ్రజ్యోతి):బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం కదలికలను ఇస్రో ఉపగ్రహాల ద్వారా నిశితంగా ట్రాక్ చేసి ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి సమాచారాన్ని చేరవేస్తోంది. ఇస్రోకు చెందిన ఈవోఎస్-06, ఇన్‌శాట్-3డీఆర్ ఉపగ్రహాల ద్వారా వాయుగుండం సమాచారం అందుతోంది. ఈవోఎస్-06 ద్వారా సముద్రపు గాలి, అక్కడ వాతావరణ పరిస్థితులను గుర్తించి వెంటనే సమాచారాన్ని చేరవేస్తోంది. ఇన్‌శాట్-3డీఆర్ ఉపగ్రహం ద్వారా వాయుగుండం తీవ్రత, దిశ, కదలికల సమాచారం అందుతోంది.

లోక్‌సభలో కొత్త కళ!

సభ్యురాలిగా ప్రమాణం చేసిన ప్రియాంక.. పార్లమెంటులోకి వస్తుండగా ఫొటోలు తీసిన రాహుల్

» అనంతరం యథావిధిగా విపక్ష సభ్యుల నినాదాలు

» సభను వాయిదా వేసిన స్పీకర్



పార్లమెంటులోకి వస్తున్న ప్రియాంకను ఫొటోలు తీస్తున్న రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నేతలు ప్రియాంక, రవీంద్ర వసంత్ రావు చవాన్ గురువారం లోక్‌సభ సభ్యులుగా ప్రమాణం చేశారు. కేరళలోని వయనాడ్ నుంచి ప్రియాంక, మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి రవీంద్ర ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన విషయం తెలిసిందే. ప్రియాంక విజయంతో నెహ్రూ-గాంధీ కుటుంబానికి చెందిన ముగ్గురు సభ్యు లు సోనియా, రాహుల్, ప్రియాంక పార్లమెంటులో ప్రవేశించినట్లయింది. కేరళ సంప్రదాయానికి చెందిన కసావు చీర ధరించిన ప్రియాంక పార్లమెంటులో ప్రవేశించినప్పటి నుంచీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఎంపీలతో పాటు మీడియా ప్రతినిధులు తన వెంట నడుస్తుండగా.. పార్లమెంటులోకి ప్రవేశిస్తున్న ప్రియాంకను సోదరుడు రాహుల్ గాంధీ తన మొబైల్‌లో ఫొటోలు తీశారు. ప్రియాంక రాజ్యాంగం చేతబూని, హిందీ లో ప్రమాణ స్వీకారం చేస్తుండగా ఆమె తల్లి, రాజ్యసభ సభ్యురాలు సోనియా, భర్త రాబర్ట్ వాద్రా గ్యాలరీ నుంచి తిలకించారు. భారత రాజ్యాంగం పట్ల నిజమైన విశ్వాసం, విధేయతను పాటిస్తానని ఆమె ప్రమాణం చేసినప్పుడు రాహుల్, ఇతర కాంగ్రెస్ సభ్యులు బల్లలు చరిచి హర్షధ్వానాలు చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వయనాడ్ నియోజకవర్గం నుంచి ప్రియాంక 4,10,931 ఓట్ల భారీ మెజారిటీతో గెలిచారు. దీంతో ఉత్తరాదిలోని రాయబరేలీకి రాహుల్ గాంధీ, దక్షిణాదిలోని వయనాడుకు ప్రియాంక ప్రాతినిధ్యం వహిస్తున్నట్లయింది. 1999 నుంచి రాజకీయాల్లో ఉన్న ప్రియాంక తొలుత తన తల్లి సోనియా నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారానికే పరిమితమయ్యారు. 2004లో సోనియాతో పాటు రాహుల్ నియోజకవర్గంలో కూడా ప్రచారం చేశారు. 2009లో ఆమెను అధికారికంగా తూర్పు ఉత్తరప్రదేశ్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా, 2020లో జాతీయ స్థాయిలో ప్రధాన కార్యదర్శిగా నియమించారు. దాదాపు పాతికేళ్లుగా రాజకీయాల్లో ఉన్న ప్రియాంక(52) తొలిసారి ప్రత్యక్ష ఎన్నికల బరిలో నిలిచి, గెలిచారు. ప్రియాంక 1972 జనవరి 12న ఢిల్లీలో జన్మించారు. 1997లో ఆమె ఢిల్లీకి చెందిన వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రాను పెళ్లి చేసుకున్నారు. వారికి ఇద్దరు పిల్లలు రెహాన్, మిరయా ఉన్నారు.

గందరగోళం, వాయిదా

లోక్‌సభలో ఉదయం 11 గంటలకు ప్రియాంక, రవీంద్ర ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే అదానీ కుంభకోణం, సంభాల్ హింసాకాండపై యథాప్రకారం గందరగోళం చెలరేగింది. ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి ప్రవేశించడంతో తొలుత 12 గంటలకు వాయిదా వేసిన స్పీకర్ ఓం బిర్లా తర్వాత శుక్రవారానికి వాయిదా వేశారు. అదానీ సంస్థకు వ్యతిరేకంగా వచ్చిన ఆరోపణలపై చర్చించాలన్న కాంగ్రెస్ సభ్యుల డిమాండ్‌ను స్పీకర్ అంగీకరించలేదు. ప్రశ్నోత్తరాల తర్వాత ఈ అంశంపై చర్చించవచ్చని స్పీకర్ చెప్పగా.. సభ్యులు అంగీకరించలేదు.

కాంగ్రెస్‌కు రబ్బర్ స్టాంపుగా ఉండం: మమత

కోల్‌కతా/ముంబై, నవంబరు 28: మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు విపక్ష ఇండియా కూటమిలో లుకలుకలు రేపుతున్నాయి. కాంగ్రెస్ ఆధిపత్య ధోరణిపై పశ్చిమ బెంగాల్ సీఎం, టీఎంసీ అధినాయకురాలు మమతా బెనర్జీ గుర్రుగా ఉన్నారు. ముఖ్యంగా అదానీ వ్యవహారంలో ఏకపక్షంగా పార్లమెంటును స్తంభింపజేయడం ఆమె అసంతృప్తిగా ఉన్నారు. తమ రాష్ట్ర సమస్యలను ప్రస్తావించేందుకు సభలు సజావుగా నడవాలని ఆమె గట్టిగా కోరుకుంటున్నారు. ఇందుకోసం పార్లమెంటులో స్వతంత్రంగా వ్యవహరించాలని భావిస్తున్నారు. కాంగ్రెస్‌కు టీఎంసీ రబ్బర్ స్టాంపుగా ఉండదని తాజాగా తమ ఎంపీలకు తేల్చిచెప్పారు. ఇద్దరం కూటమిలో ఉన్నా.. కాంగ్రెస్‌తో తమకు ఎన్నికల పొత్తు లేదని.. ఆ పార్టీ తీసుకునే ఏకపక్ష నిర్ణయాలను అంగీకరించాల్సిన అవసరం లేదని స్పష్టంచేశారు. అటు మహా వికాస్ అఘాడీలో కీలక పక్షమైన ఉద్ధవ్ శివసేన కూడా కాంగ్రెస్ తీరుపై మండిపడింది. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో 13 సీట్లు గెలుచుకున్న ధీమాతో అతి విశ్వాసంతో వ్యవహరించిందని.. కానీ పరాజయం పాలైందని శాసనమండలిలో విపక్ష నేత అంబాదాస్ దన్వే అన్నారు.

ఝార్ఖండ్ సీఎంగా హేమంత్ ప్రమాణం

» నాలుగోసారి బాధ్యతల స్వీకరణ

» హాజరైన ఇండియా కూటమి నేతలు



సీఎంగా ప్రమాణం చేస్తున్న హేమంత్ సోరెన్

రాంచీ, నవంబరు 28: ఝార్ఖండ్ రాష్ట్ర 14వ ముఖ్యమంత్రిగా హేమంత్ సోరెన్ ప్రమాణ స్వీకారం చేశారు. రాంచీలోని మోరబడి గ్రౌండ్‌లో 'ఇండియా' కూటమి నేతల సమక్షంలో గురువారం ఈ కార్యక్రమం జరిగింది. సోరెన్‌తో గవర్నర్ సంతోష్ కుమార్ గంగ్వార్ ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా రాంచీ పట్టణంలో పాఠశాలలకు గురువారం సెలవు ప్రకటించారు. ఝార్ఖండ్ సీఎంగా సోరెన్ బాధ్యతలు స్వీకరించడం ఇది నాలుగోసారి. ప్రమాణ స్వీకారోత్సవానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, పశ్చిమ బెంగాల్ సీఎం మమతాబెనర్జీ, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, పంజాబ్ సీఎం భగవంత్ మాన్, సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్, బిహార్ ప్రతిపక్ష నేత తేజస్వీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఇటీవల జరిగిన ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో జేఎంఎం నేతృత్వంలో ఇండియా కూటమి ఘన విజయం(జేఎంఎం 34, కాంగ్రెస్ 16, ఆర్జేడీ 4, సీపీఐ(ఎంఎల్)ఎల్ 2 సీట్లు) సాధించిన సంగతి తెలిసిందే.

16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా నిషేధం

(మొదటి పేజీ తరువాయి)

నవంబరు నుంచి ఈ నిషేధం అమల్లోకి రానుంది. ఎక్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం, టిక్‌టాక్, స్నాప్‌చాట్, రెడిట్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫారంలకు ఇది వర్తిస్తుంది. ఈ జాబితాలో యూట్యూబ్‌ను మాత్రం చేర్చలేదు. వయసు నిబంధనను చాలా కఠినంగా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వయసును ఏ విధంగా నిర్ణయించాలన్న బాధ్యతను సామాజిక మాధ్యమాలకే విడిచి పెట్టింది. సామాజిక మాధ్యమాల్లో పిల్లలు ఖాతాలు ప్రారంభించకుండా నిరోధించలేకపోతే సంబంధిత వేదికలకు 50 మిలియన్ ఆస్ట్రేలియన్ డాలర్లు (సుమారు రూ.280 కోట్లు) జరిమానాగా విధించనుంది. ఇందుకు సంబంధించిన బిల్లును ఎగువ సభ సెనేట్ ఆమోదించింది. ఈ విషయంలో అధికార లేబర్ పార్టీకి ప్రతిపక్ష కన్జర్వేటివ్ పార్టీ సంపూర్ణంగా మద్దతు తెలిపింది. దిగువ సభ అయిన హౌస్ ఆఫ్ పీపుల్స్ రిప్రజెంటేటివ్స్ బుధవారమే ఆమోదించడం గమనార్హం. ఈ సందర్భంగా ప్రధాని ఆంటోనీ అల్బనీస్ మాట్లాడుతూ విపరీతంగా సామాజిక మాధ్యమాలను వినియోగిస్తున్న కారణంగా పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యం ప్రభావితమవుతోందని, అందువల్లనే నిషేధాన్ని విధిస్తున్నట్టు చెప్పారు. ఇందుకు తల్లిదండ్రులు కూడా మద్దతు ఇవ్వాలని కోరారు. మే నెలలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆయన తీసుకున్న ఈ నిర్ణయం ప్రాధాన్యతను సంతరించుకొంది. పిల్లల వయసు నిర్ధారణకు బయోమెట్రిక్‌ను ఉపయోగిస్తారా, ప్రభుత్వం ఇచ్చే ధ్రువపత్రాలను వినియోగిస్తారా అన్నది తేలాల్సి ఉంది. ఈ విషయమై పలు సామాజిక మాధ్యమాలు పార్లమెంటుకు తమ అభిప్రాయాలు తెలిపాయి. వయసు నిర్ధారణ ప్రయోగాలు పూర్తయ్యే వరకు అమలును వాయిదా వేయాలని గూగుల్, మెటా సంస్థలు కోరాయి. మరింతగా సంప్రదింపులు జరపాల్సి ఉందని టిక్‌టాక్ కోరింది. ఈ బిల్లుకు ఈ వారంలోనే ఆమోదం తెలిపిన సెనేట్ కమిటీ పలు షరతులు పెట్టింది. వయసు ధ్రువీకరణకు పాసుపోర్టులు, డిజిటల్ ధ్రువీకరణ వంటి వ్యక్తిగత సమాచారాన్ని అడగకూడదని సూచించింది.



మోదీ సెక్యూరిటీలో మహిళా కమాండో

ప్రధాని మోదీ సెక్యూరిటీలో ఓ మహిళా కమాండ్ చేరారు. గురువారం పార్లమెంటు సమావేశాల్లో భాగంగా మోదీ భద్రతలో ప్రత్యేక భద్రతా దళానికి చెందిన మహిళా కమాండో ఉన్న ఫొటో సామాజిక మాధ్యమాల్లో వైరలైంది. ప్రధానికి రక్షణ కవచంగా యువతిని నియమించడం మహిళా సత్తాకు అద్దం పడుతోందని నెటిజన్లు కొనియాడుతున్నారు.

ఉక్రెయిన్ విద్యుత్తు వ్యవస్థపై రాకెట్ల దాడి

200 క్షిపణులు, డ్రోన్లు ప్రయోగించిన రష్యా

కీవ్, నవంబరు 28: ఉక్రెయిన్ విద్యుత్తు వ్యవస్థను లక్ష్యం చేసుకొని గురువారం రష్యా భారీ స్థాయిలో గగనతల యుద్ధం చేసింది. సుమారు 200 క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించి విద్యుత్తు వ్యవస్థను స్తంభింపజేసింది. దాని ప్రభావంగా పది లక్షలకుపైగా ఇళ్లల్లో అంధకారం నెలకొంది. రెండు వారాల వ్యవధిలో పవర్ గ్రిడ్‌పై దాడి చేయడం ఇది రెండోసారికాగా, ఏడాదిలో 11వసారి కావడంతో ఆందోళన నెలకొంది. శీతాకాలంలో విద్యుత్తు ఉత్పాదన సౌకర్యాలను నాశనం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న రష్యా ఈ దాడులు చేసింది. దేశంలోని అన్ని ఇంధన రంగ వనరులపై దాడులు కొనసాగుతున్నాయని ఉక్రెయిన్ ఇంధన శాఖ మంత్రి హెర్మాన్ హాలుషెంకో చెప్పారు.

'ఒరేషింక్' మరో అణుబాంబు: పుతిన్

రష్యా నూతనంగా అభివృద్ధి చేసిన 'ఒరేషింక్' మధ్య శ్రేణి బాలిస్టిక్ క్షిపణి మరో అణు బాంబులాంటిదని పుతిన్ అన్నారు. ఇది అన్నింటినీ బూడిద చేస్తుందని చెప్పారు. కజికిస్థాన్‌లో జరిగిన కలెక్టివ్ సెక్యూరిటీ ట్రీటీ ఆర్గనైజేషన్ సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. పూర్వపు సోవియట్ యూనియన్ నుంచి విడిపోయిన దేశాలతో ఈ కూటమి ఏర్పాటయింది.

మహా సీఎంపై కొనసాగుతున్న సస్పెన్స్

ముఖ్యమంత్రి ఎవరో తేల్చకుండానే ముగిసిన సమావేశం

» షాతో నడ్డా, ఫడణవీస్, శిందే, అజిత్ పవార్ భేటీ

» షా ఢిల్లీ నివాసంలో 2 గంటల పాటు చర్చలు

» వివరాలు వెల్లడించకుండానే వెళ్లిపోయిన నేతలు



ఢిల్లీలో అమిత్ షాతో భేటీ అయిన నడ్డా, అజిత్ పవార్, శిందే, దేవేంద్ర ఫడణవీస్

న్యూఢిల్లీ, నవంబరు28: మహారాష్ట్ర కొత్త సీఎం ఎవరనే సస్పెన్స్ ఇంకా కొనసాగుతోంది. ఢిల్లీలోని కేంద్ర హోం మంత్రి అమిత్ షా నివాసంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, మహారాష్ట్ర బీజేపీ నేత దేవేంద్ర ఫడణవీస్, శివసేన అధ్యక్షుడు ఏక్‌నాథ్ శిందే, ఎన్సీపీ అధ్యక్షుడు అజిత్ పవార్ దాదాపు రెండు గంటల పాటు చర్చించారు. చర్చల్లో తీసుకున్న నిర్ణయాలపై ఏ వివరాలు వెల్లడించకుండానే నేతలు వెళ్లిపోయారు. రెండు రోజుల్లో మహారాష్ట్ర బీజేపీ శాసనసభా పక్ష నేతను ఎన్నుకునేందుకు సమావేశం నిర్వహించనున్నారు. దేవేంద్ర ఫడణవీస్‌ను కొత్త సీఎంగా ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. అయితే పార్టీ నుంచి అధికారిక ప్రకటన మాత్రం వెలువడలేదు. మంత్రిపదవులపై కూడా చర్చించినట్లు సమాచారం. బీజేపీకి 20 నుంచి 22, శివసేనకు 10 నుంచి 12, ఎన్సీపీకి 8 నుంచి 10 మంత్రి పదవులు దక్కే అవకాశం ఉంది. శిందే, అజిత్ పవార్‌లు డిప్యూటీ సీఎంలుగా బాధ్యతలు స్వీకరిస్తారు. పట్టణాభివృద్ధి శాఖను శివసేన డిమాండ్ చేసింది. హోం మంత్రిత్వ శాఖ బీజేపీ వద్దే ఉంటుంది. ఆర్థిక శాఖను అజిత్ పవార్‌కు ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం.

బంగ్లాపై కేంద్రం జోక్యం చేసుకోవాలి

ప్రధానికి 68 మంది ప్రముఖుల లేఖ



బంగ్లాలో చిన్మయ్ కృష్ణదాస్ అరెస్టును నిరసిస్తూ పశ్చిమబెంగాల్‌లోని సిలిగురిలో ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ జాగరణ్ మంచ్ కార్యకర్తలు

న్యూఢిల్లీ, నవంబరు 28: బంగ్లాదేశ్‌లో ఇస్కాన్ నాయకుడు, ఆధ్యాత్మికవేత్త చిన్మయ్ కృష్ణదాస్ అరెస్టుతో పాటు హిందువులపై జరుగుతున్న దాడులు, హింస విషయంలో కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని కోరుతూ 68 మంది ప్రముఖులు ప్రధాని మోదీకి లేఖ రాశారు. వీరిలో ఓ హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి, పలువురు మాజీ ఐఏఎస్, ఏపీఎస్, ఐఎఫ్ఎస్, ఐఆర్ఎస్ అధికారులు, ఒక ఎంపీ తదిరులు ఉన్నారు. హిందువులు, వారి ఆస్తులు, ఆలయాలపై వ్యవస్థీకృత దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవలి కాలంలో ఇవి తీవ్రస్థాయికి చేరుకున్నాయని పేర్కొన్నారు. మహిళలపై హింస మరింత ఆందోళనకరమని, అపహరణలు, బలవంతపు మత మార్పిళ్లు, లైంగిక హింస, మానవ అక్రమ రవాణా వంటికి చోటుచేసుకుంటున్నట్లు నివేదికలు వస్తున్నాయని తెలిపారు. కాగా, బంగ్లాదేశ్‌లో జరుగుతున్న పరిణామాలపై పశ్చిమబెంగాల్ సీఎం, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ స్పందించారు. ఈ విషయంలో తమ ప్రభుత్వం కేంద్రానికి మద్దతుగా ఉంటుందని పేర్కొన్నారు. గురువారం అసెంబ్లీలో మాట్లాడుతూ 'ఏ మతానికైనా నష్టం జరగాలని మేం కోరుకోం. ఇక్కడి ఇస్కాన్ వాళ్లతో నేను మాట్లాడాను. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న ఘటనలపై కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి. ఈ విషయంలో కేంద్రానికి మద్దతుగా ఉంటాం. బంగ్లాదేశ్ వేరే దేశం కావున, మా పరిధిలోకి రాదు. కేంద్ర ప్రభుత్వం జోక్యం తీసుకోవాల్సి ఉంటుంది' అని పేర్కొన్నారు.

ఆ బాధ్యత బంగ్లాదేశ్‌పైనే ఉంది: కేంద్రం

బంగ్లాదేశ్‌లో హిందూ దేవాలయాలను, దేవతా మూర్తులను అపవిత్రం చేయడం, ధ్వంసం చేయడం వంటి ఘటనలపై విదేశాంగ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. హిందువులు, ఇతర మైనారిటీలు, వారి ప్రార్థనా మందిరాల భద్రతకు భరోసా ఇవ్వాలని అక్కడి ప్రభుత్వాన్ని కోరింది. విదేశాంగ శాఖ సహాయమంత్రి కీర్తివర్ధన్ సింగ్ గురువారం రాజ్యసభలో మాట్లాడుతూ, బంగ్లాదేశ్‌లో నెలకొన్న పరిస్థితులపై భారత్ ఆందోళన వ్యక్తం చేసిందని తెలిపారు. ఆ దేశంలో నివసించే మైనారిటీల ప్రాణాలను, స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్యత యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు.

ఇస్కాన్‌పై నిషేధం కుదరదు: బంగ్లా హైకోర్టు

ఢాకా, నవంబరు 28: దేశంలో ఇస్కాన్ కార్యకలాపాలను నిషేధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను బంగ్లాదేశ్ హైకోర్టు తోసిపుచ్చింది. ఆధ్యాత్మికవేత్త చిన్మయ్ కృష్ణదాస్ బ్రహ్మచారి అరెస్టును వ్యతిరేకిస్తూ ఢాకా సహా పలు ప్రాంతాల్లో హిందువులు చేపట్టిన ఆందోళనలు హింసకు దారితీసిన నేపథ్యంలో ఇస్కాన్‌పై నిషేధం విధించాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. గురువారం ఈ వ్యాజ్యాన్ని జస్టిస్ ఫరా మహబూబ్, జస్టిస్ దేబాశిశ్ రాయ్ చౌధురితో కూడిన ధర్మాసనం విచారించింది. వాదనల అనంతరం ఇస్కాన్ కార్యకలాపాలను నిషేధించడానికి బెంచ్ నిరాకరించిందని అటార్నీ జనరల్ కార్యాలయ ప్రతినిధి తెలిపారు. కాగా, బంగ్లాదేశ్‌లోని షిబ్చార్ పట్టణంలో ఉన్న ఇస్కాన్ కేంద్రాన్ని ఇస్లామిక్ నాయకుడి నేతృత్వంలోని బృందం బలవంతంగా మూసివేయించింది. హిందూ సమాజంపై జరుగుతున్న దౌర్జన్యాలు, చిన్మయ్ అరెస్టును నిరసిస్తూ బంగియా హిందూ జాగరణ్ మంచ్ సభ్యులు గురువారం కోల్‌కతాలోని బంగ్లాదేశ్ డిప్యూటీ హైకమిషనర్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. కాగా, చిన్మయ్ కృష్ణదాస్ అరెస్టును బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా గురువారం ఖండించారు. సనాతన వర్గానికి చెందిన ఆధ్యాత్మికవేత్తను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



ఆలయం ముందు వంశీనాథ్ రెడ్డి ఫొటో షూట్

శ్రీవారి ఆలయం ముందు ఫొటో షూట్

- వైసీపీ ఎంపీ అవినాశ్‌రెడ్డి అనుచరుడి అత్యుత్సాహం

తిరుమల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తిరుమలలో వైసీపీ నేతల నిబంధనల ఉల్లంఘనలు కొనసాగుతూనే ఉన్నాయి. దువ్వాడ శ్రీనివాస్, అంబటి రాంబాబు, నారాయణస్వామి ఇప్పటికే టీటీడీ నిబంధనలు ఉల్లంఘించి విమర్శలపాలైన విషయాన్ని మరువక ముందే వైసీపీ ఎంపీ అవినాశ్ రెడ్డి అనుచరుడు, కమలాపురానికి చెందిన వ్యాపారవేత్త వంశీనాథ్ రెడ్డి మరో వివాదానికి తెరతీశారు. తన పుట్టినరోజు సందర్భంగా గురువారం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న ఆయన టీటీడీ నిబంధనలకు విరుద్ధంగా శ్రీవారి ఆలయం ముందు నలుగురు ప్రైవేట్ ఫొటోగ్రాఫర్లతో ఫొటోషూట్ నిర్వహించి విమర్శలపాలయ్యారు. ఆలయం ముందే నిలబడి ఫొటోలు, వీడియోలు తీయించుకుంటూ హల్‌చల్ చేశారు. ఇంత జరుగుతున్నా విజిలెన్స్ అధికారులు, సిబ్బంది పట్టించుకోకపోవడం గమనార్హం. ఈ దృశ్యాలను చిత్రీకరిస్తున్న మీడియా ప్రతినిధుల పైనా వంశీనాథ్‌రెడ్డి అనుచరులు దురుసుగా ప్రవర్తించారు. 'మీరెందుకు ఫొటోలు, వీడియోలు తీసుకుంటున్నారు. ఏం చేసుకుంటారో చేసుకోండి' అని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ వ్యవహారంపై భక్తుల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. దీనిపై టీటీడీ ఎలా స్పందిస్తుందో చూడాలి.

'పది' పరీక్షలు తెలుగులోనే రాస్తాం

- మీడియం మార్చుకున్న 64,600 మంది

అమరావతి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మీడియం ఎంపికపై పాఠశాల విద్యాశాఖ తీసుకున్న నిర్ణయం విద్యార్థులకు ఉపశమనం కలిగించింది. రాష్ట్రవ్యాప్తంగా 64,600 మంది విద్యార్థులు పరీక్షలకు తెలుగు మీడియంను ఎంపిక చేసుకున్నారు. మొత్తం 6,45,000 మంది వచ్చే ఏడాది టెన్త్ పరీక్షలు రాయాల్సి ఉండగా, వారిలో 6,42,635 మంది ఇప్పటివరకూ ఫీజులు చెల్లించారు. ఫీజులు చెల్లించిన విద్యార్థులు ఏ మీడియంలో పరీక్ష రాస్తామనేది కూడా ఎంపిక చేసుకున్నారు. కొందరు ఉర్దూ, కన్నడ లాంటి ఇతర భాషలను ఎంపిక చేసుకోగా 5లక్షల మందికిపైగా ఇంగ్లిష్ మీడియంలో పరీక్షలు రాయబోతున్నారు.

ఇంటర్ పరీక్ష ఫీజుల గడువు పొడిగింపు

అమరావతి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫీజుల చెల్లింపు గడువును పొడిగిస్తూ ఇంటర్ విద్యా మండలి కార్యదర్శి కృతికా శుక్లా గురువారం ఉత్తర్వులు జారీచేశారు. అపరాధ రుసుముతో సహా చెల్లించాల్సిన గడువు ఈ నెల 21తో ముగిసింది. విద్యార్థుల నుంచి విజ్ఞప్తులు రావడంతో గడువును డిసెంబరు 5 వరకు పొడిగించారు. అపరాధ రుసుము లేకుండానే ఫీజులు కట్టొచ్చని తెలిపారు.

ఎక్కడి లారీలు అక్కడే..

జేసీ ప్రభాకర్‌రెడ్డికి చెందిన లారీలను రెండ్రోజులుగా ఆర్‌టీపీపీ 600 మెగా వాట్ల ప్లాంట్ వద్ద నిలిపివేశారు. లారీ డ్రైవర్లు లారీల వద్దే తిని పడుకుంటున్నారు. ఆది వర్గీయులు ఆ చుట్టుపక్కలే మకాం వేసి పరిస్థితిని గమనిస్తున్నారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు ఎట్టి పరిస్థితుల్లోనూ లారీలను లోపలకు అనుమతించేది లేదని భీష్మించారు. జేసీ లారీల డ్రైవర్లు కూడా తాము 80 కిలోమీటర్ల దూరం నుంచి వచ్చామని.. లోడ్ చేసుకోకుండా వెనక్కి వెళ్లేదే లేదని, తమ యజమానుల ఆదేశాలను తప్పకుండా పాటిస్తామని 'ఆంధ్రజ్యోతి'తో స్పష్టం చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో శుక్రవారం సీఎం సమక్షంలో రెండు వర్గాల మధ్య చర్చలు జరుగనున్నాయి. ఆదినారాయణరెడ్డి, జేసీలకు ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) నుంచి పిలుపు వెళ్లింది. ఆర్‌టీపీపీ వద్ద శాంతి భద్రతలను డీఎస్పీ వేంకటేశ్వర్లు పర్యవేక్షిస్తున్నారు. ఈ అంశంపై ఆర్‌డీవో తేజశ్రీ బుధవారమే పూర్తి వివరాలు సేకరించారు. కలెక్టర్‌కు నివేదిక సమర్పించారు. రెవెన్యూ అధికారులు గురువారం కూడా పరిస్థితిని సమీక్షించారు.



గురువారం ఆర్టీపీపీ వద్ద పోలీసుల పహారా

మూడో రోజూ వీడని 'బూడిద'

- ఆర్‌టీపీపీ నుంచి పూర్తిగా ఆగిన ఫ్లైయాష్ రవాణా
- సీఎం హెచ్చరికలు బేఖాతరు
- లారీలను లోపలకు పంపని ఆది వర్గీయులు
- లోడ్ చేసుకోకుండా వెళ్లేది లేదని భీష్మించిన జేసీ లారీ డ్రైవర్లు
- కొనసాగుతున్న ఉద్రిక్తత
- భారీగా మోహరించిన పోలీసులు
- నేడు సీఎంను కలవనున్న జేసీ, ఆది

ఎర్రగుంట్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంట్ (ఆర్‌టీపీపీ) నుంచి ఫ్లైయాష్ రవాణా విషయంలో మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి, జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వర్గాల నడుమ తలెత్తిన వివాదం ఇంకా కొలిక్కి రాలేదు. మూడో రోజైన గురువారం కూడా అక్కడ హైటెన్షన్ కొనసాగింది. వంద మందికి పైగా పోలీసులతో ఆర్‌టీపీపీ మెయిన్ గేట్లు, యాష్‌పాండ్, కూడళ్ల వద్ద భారీ బందోబస్తు కొనసాగుతోంది. కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం ఎర్రగుంట్ల మండలంలోని ఆర్టీపీపీ వద్ద ఫ్లైయాష్ రవాణా విషయంలో జేసీ, ఆది మధ్య నెలకొన్న వివాదం ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి వెళ్లడం.. ఇది పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తోందని ఆయన సీరియస్ కావడం, శుక్రవారం అమరావతికి వచ్చి తనను కలవాలని ఇద్దరినీ ఆదేశించడం తెలిసిందే. అయినా పరిస్థితుల్లో మార్పు రాలేదు. సమస్యను పరిష్కరించుకునే దిశగా రెండు వర్గాల మధ్య చర్చలకు అడుగులు పడలేదు. మరోవైపు.. యాష్ పాండ్ వద్ద మూడ్రోజులుగా ఒక్క లారీలో గానీ, టిప్పర్‌లో గానీ లోడింగ్ కాలేదు. రోజూ వందలాది వాహనాలు లోడింగ్‌కు వచ్చేవి. చుట్టుపక్కల సిమెంట్ పరిశ్రమలకు, మినీ పరిశ్రమలకు ఇక్కడి నుంచే వేల టన్నుల్లో ఫ్లైయాష్ వెళ్లేది. రోడ్లన్నీ కిక్కిరిసి పోయేవి. మరో రెండ్రోజులు లోడింగ్ పూర్తిగా బంద్ చేయాలని ఏపీ జెన్కో యాజమాన్యం ఆదేశాలిచ్చినట్లు సమాచారం. దీంతో అన్ని ప్రాంతాల వాహనాలకు లోడింగ్ ఆపేశారు.



ఉప్పాడ సముద్రం ఒడ్డున బంగారు ముక్కలను సేకరిస్తున్న మత్స్యకారులు



సముద్రం ఒడ్డున ఇసుకలో దొరికిన బంగారు రజను

తీరంలో కనకం వేట!

- ఉప్పాడ తీరంలో మత్స్యకారుల సందడి.. బంగారు రజను కోసం వెతుకులాట

కొత్తపల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బంగారం కోసం గనులు తవ్వుతారని తెలుసు! సముద్రంలో చేపలు వేటాడుతారనీ తెలుసు!! కానీ సముద్రంలో బంగారం వేటాడతారని తెలుసా?!.. అవును.. ఇది నిజమే..! కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరం ప్రత్యేకత ఇది! తుఫాన్, అల్పపీడనాలు ఏర్పడిన సందర్భాల్లో సముద్ర గర్భంలో నుంచి బంగారు రజను కొట్టుకొస్తుందని మత్స్యకారుల నమ్మకం. పూర్వకాలం ఇక్కడో మహానగరం ఉండేదని, అప్పట్లో సముద్రం పొంగి నగరం సముద్ర గర్భంలో కలిసిపోయిందని తమ పెద్దలు చెప్పేవారని మత్స్యకార మహిళ కోదండ తెలిపింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం తీరప్రాంతంలో మత్స్యకారులు చిన్నా పెద్దా.. ప్రస్తుతం కనకం వేట ప్రారంభించారు. తుఫాన్లు, అల్పపీడనాలు ఏర్పడిన సందర్భాల్లో సముద్రం ఉప్పొంగి అల్లకల్లోలంగా మారినప్పుడల్లా ఇలా బంగారు రజను కోసం వెదుకులాట ప్రారంభిస్తారు. ఒక్కొక్కరూ ఒక్కొక్క దువ్వెన పట్టుకుని.. కెరటాలు ఒడ్డుకొచ్చి.. తిరిగి లోపలకు వెళ్లే సమయంలో ఇసుకపై దువ్వెనతో గీస్తారు. ఇలా చేయడం ద్వారా అదృష్టం ఉంటే ఇసుక లోపల నుంచి మిణుకు మిణుకుమంటూ చిన్నచిన్న బంగారు రజను మత్స్యకారుల కంట పడుతుంది.

రెసిడెన్షియల్ శిక్షణ రద్దు చేయాలి

- ఉపాధ్యాయ సంఘాల డిమాండ్

అమరావతి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు ఇస్తున్న శిక్షణలో రెసిడెన్షియల్ విధానాన్ని రద్దుచేయాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి. గజపతినగరం రెసిడెన్షియల్ శిక్షణ కేంద్రంలో శ్రీనివాసరావు అనే టీచర్ మృతిచెందడం పట్ల సంఘాలు ఆగ్రహం వ్యక్తంచేశాయి. శిక్షణ నాన్ రెసిడెన్షియల్ విధానంలో ఉండాలని తాము మొదటినుంచీ డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని, అందువల్లే ఇప్పటివరకూ ఇద్దరు ఉపాధ్యాయులు శిక్షణ కేంద్రాల్లో మరణించారని అంటున్నాయి. ఇప్పటికైనా రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ రద్దుచేసి, టీచర్లు ఇంటి నుంచి వెళ్లి వచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశాయి. ఏపీటీఎఫ్-257 అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెన్నుపాటి మంజుల, కె.భానుమూర్తి, ఏపీటీఎఫ్-1938 అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి, ఆప్టా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏజీఎస్ గణపతిరావు, కె.ప్రకాశ్‌రావు, ఆపస్ అధ్యక్షుడు ఎస్.బాలాజీ, నవ్యాంధ్ర టీచర్ల సంఘం అధ్యక్షుడు కరణం హరికృష్ణ, ఎంటీఎఫ్ అధ్యక్షుడు ఎస్.రామకృష్ణ, ఎస్టీఎఫ్ అధ్యక్షుడు ఎస్.రామాంజనేయులు, ఏపీటీఎఫ్-అమరావతి అధ్యక్షుడు సీవీ ప్రసాద్ తదితరులు రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ రద్దుచేయాలని వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు.



రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు తీసుకొస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, అమ్మవారి ఆలయంలో ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు

పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

తిరుచానూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దేవేరి, తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు గురువారం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. బ్రహ్మోత్సవాల్లో తొలి రోజు సాయంత్రం అమ్మవారు చిన్నశేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం ఉదయం పెద్దశేష, రాత్రి హంస వాహనాలపై విహరించనున్నారు.

మఠాలు వ్యాపార ధోరణితో వ్యవహరిస్తే ఉపేక్షించం

తిరుమల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో మఠాలు వ్యాపార ధోరణితో వ్యవహరిస్తే ఉపేక్షించబోమని దేవదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి హెచ్చరించారు. మంత్రి వాసంశెట్టి సుభాష్‌తో కలిసి గురువారం శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం బయట మీడియాతో మాట్లాడారు. తిరుమలలో ఆధ్యాత్మికతను పెంపొందించడానికి కృషి చేయాలనే నిబంధనతోనే టీటీడీ అనేక మఠాలు, పీఠాలకు స్థలాలు కేటాయించిందన్నారు. కానీ గత ఐదేళ్లలో దుర్వినియోగం జరగడంతో అనేక వివాదాలు తలెత్తాయని, వాటిని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తున్నామని చెప్పారు. తిరుమలలో దర్శన, వసతి ఏర్పాట్లు, ప్రసాదాల నాణ్యతపై ప్రతి నెలా తాను స్వయంగా పర్యవేక్షిస్తానని వెల్లడించారు. మంత్రి సుభాష్ మాట్లాడుతూ.. ప్రసాదాలు స్వీకరిస్తుంటే నాణ్యత పెరిగిందని అర్థమవుతోందన్నారు. ఫిర్యాదుల బుక్‌లో కూడా చాలామంది పాజిటివ్ కామెంట్స్ రాస్తున్నారని తెలిపారు.



కర్నూలు కలెక్టరేట్ ఎదుట జూనియర్ డాక్టర్ల భారీ ర్యాలీ

రోడ్డెక్కిన జూనియర్ వైద్యులు

- కేఎంసీని కబ్జాదారుల నుంచి కాపాడాలంటూ భారీ ర్యాలీ

కర్నూలు హాస్పిటల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కాలేజీని కబ్జాదారుల నుంచి కాపాడాలంటూ కేఎంసీ జూనియర్ డాక్టర్లు గురువారం ఉదయం రోడ్డెక్కారు. ముందుగా కర్నూలు మెడికల్ కాలేజీ ప్రవేశ ద్వారం ఎదుట జూనియర్ డాక్టర్లు, ఏపీజీడీఏ వైద్యులు ఆందోళన చేశారు. అనంతరం మెడికల్ కాలేజీ నుంచి కలెక్టరేట్ వరకు దాదాపు 600 మంది జూడాలు భారీ ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీకి ఏపీజీడీఏ వైద్యులు సంఘీభావం తెలిపారు. ఏపీజీడీఏ అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మాజీ మాస్టర్, ఏపీ జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ సాయికుమార్ మాట్లాడుతూ కాలేజీ స్థలాన్ని ప్రైవేట్ దుకాణాలకు ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. రోడ్డు విస్తరణ కోసం కళాశాల ముందున్న షాపులను తొలగించి ఇన్‌గేట్ పక్కన ఉన్న కళాశాల స్థలాన్ని దుకాణాలకు కేటాయించడం అన్యాయమన్నారు. అనంతరం కర్నూలు కలెక్టర్ పి.రంజిత్ బాషాకు కాలేజీ స్థలాన్ని కాపాడాలంటూ వినతి పత్రం అందజేశారు.

పిల్లలను చట్టబద్ధంగా దత్తత తీసుకోవాలి

- మంత్రి సంధ్యారాణి

విశాఖపట్నం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పిల్లలను విక్రయించినా, కార్మికులుగా మార్చినా కఠిన చర్యలు తప్పవని, పిల్లలు కావాలనుకున్న ఎవరైనా సరే చట్టబద్ధంగా దత్తత తీసుకోవాలని రాష్ట్ర మహిళా, శిశు, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి పేర్కొన్నారు. గురువారం ఉదయం విశాఖపట్నం ఉడా చిల్డ్రన్ ఎరీనాలో పోస్టర్ అడాప్షన్ (ఆరు నుంచి 18 ఏళ్ల లోపు పిల్లలను ఎవరైనా రెండేళ్లపాటు పెంచుకుంటే తదుపరి పూర్తిగా దత్తత తీసుకునేందుకు అవకాశం)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ చట్టబద్ధమైన దత్తతపై అందరికీ అవగాహన కలిగించాలన్నారు. రాష్ట్రంలో 27 శిశు గృహాలు ఉన్నాయని, వాటిలో 108 మంది పిల్లలు ఆశ్రయం పొందుతున్నారన్నారు.

శ్రీవారి ఆలయ పోటుకు మరోసారి 'సిట్'

తిరుమల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడకం.. సరఫరా వివాదానికి సంబంధించి సుప్రీంకోర్టు నియమించిన సిట్ బృందం గురువారం తిరుమల ఆలయంలోని ప్రసాదాల తయారీ పోటును పరిశీలించింది. ఇప్పటికే గత సోమవారం ఇద్దరు డీఎస్పీలు, ఓ సీఐతో కూడిన బృందం శ్రీవారి ఆలయ పోటును పరిశీలించింది. గురువారం మరోసారి ఆలయంలోని పోటును ఈ బృందం పరిశీలించి, లడ్డూలు తయారుచేసే సిబ్బందితో మాట్లాడి, కొన్ని రికార్డులను తీసుకున్నట్లు తెలిసింది.

భూకబ్జాలపై వెల్లువెత్తిన ఫిర్యాదులు

అమరావతి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలు, మోసాలపై టీడీపీ ప్రజావేదికలో గురువారం పలువురు బాధితులు ఫిర్యాదు చేశారు. చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, రాష్ట్ర బిల్డర్స్ అండ్ కన్‌స్ట్రక్షన్ సలహా కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు అర్జీలు స్వీకరించారు. తమకు వారసత్వంగా వచ్చిన భూమిని వైసీపీ నేతలు కబ్జా చేసి, ఆన్‌లైన్‌లో రికార్డులు తారుమారు చేసి, అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని కడప జిల్లా కోటాల గ్రామానికి చెందిన కిరణ్‌కుమార్, బాలయ్య ఫిర్యాదు చేశారు. 22ఏ జాబితాలో ఉన్న తమ పొలానికి ఎన్‌వోసీ ఇప్పిస్తానని సుధీర్ అనే వ్యక్తి తమ వద్ద రూ.50లక్షలు తీసుకుని, మోసం చేశాడని రాజధానిలోని మందడం గ్రామానికి చెందిన వీరయ్య వాపోయారు. 2018-19లో తాను వేసిన సిమెంట్ రోడ్లకు బిల్లులు ఇప్పించాలని ప్రకాశం జిల్లా పెద్ద దోర్నాలకు చెందిన రామారావు కోరారు.

పైసలిస్తేనే పనులు

- పంచాయతీరాజ్ ఈఎన్‌సీలో సెక్షన్ హెడ్ బాగోతం
- ఇంజనీర్ల నుంచి లంచం తీసుకుని అడహాక్ పదోన్నతులు
- హైకోర్టు ఆదేశాలు ఉల్లంఘించి మరీ ఉత్తర్వులు
- వాహన బిల్లులకు కామన్‌గుడ్ ఫండ్ పేరుతో లంచాలు
- ఈఎన్‌సీ, ఏసీబీకి ఫిర్యాదులు... చర్యలకు వినతి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పంచాయతీరాజ్ ఇంజనీర్ ఇన్ చీఫ్ కార్యాలయంలో నాన్ టెక్నికల్ అధికారి ఆగడాలకు అంతే లేకుండా పోతోంది. సెక్షన్ హెడ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయనకు అడిగిన మొత్తంలో చేతులు తడిపితేనే ఎవరి పని అయినా చేస్తారు. ఉన్నతాధికారులు ఈఈ, ఎస్‌ఈలు సైతం ఆయన వద్ద చేతులు కట్టుకుని నిలబడి పనిచేయించుకోవాల్సిన పరిస్థితి. బదిలీలు, పదోన్నతులతో పాటు పలు సర్వీసు అంశాల్లో ఆయన ఆడిందే ఆటగా సాగుతోంది. రిటైర్డ్ అధికారుల పట్ల దురుసుగా ప్రవర్తించడం చూసి పలువురు ఇంజనీర్లు ఈఎన్‌సీకి ఫిర్యాదు చేశారు. స్టెనోగా ఉద్యోగంలోకి చేరిన ఆయన ఈఎన్‌సీ కార్యాలయంలో అన్నీ తానై చక్రం తిప్పుతున్నారు. గతంలో ఈఈ, ఎస్‌ఈ, సీఈలకు సంబంధించిన ఎస్టాబ్లిష్‌మెంట్ జీ సెక్షన్‌లో ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు. పదోన్నతుల విషయంలో భారీగా లంచాలు వసూలు చేశారన్న ఆరోపణలు రావడంతో బడ్జెట్ విభాగానికి బదిలీ చేశారు. బడ్జెట్ విభాగంతో పాటు ఏఈఈ/ఏఈలకు సంబంధించిన వ్యవహారాలను ఈ అధికారికి అప్పచెప్పారు. ఇంజనీరింగ్ అధికారులకు వాహనాల బిల్లులు విడుదల చేయడంలో ఈ అధికారి హస్తలాఘవం చూపిస్తున్నారు. పలువురు ఇంజనీర్లు అద్దె వాహనాలు వాడకుండా సొంత వాహనాలు వాడుకుంటున్నారు. వారికి బిల్లులు కావాలంటే ఏడాదికి ఒక నెల అద్దె బిల్లులు ఈ అధికారికి కామన్ గుడ్ ఫండ్ పేరుతో సమర్పించుకోవాలి. లేకపోతే ఆ బిల్లులకు మోక్షం కలగదు. సుమారు 400కు పైగా వాహనాలకు ఏడాదికి సుమారు రూ.కోటిన్నర దాకా ఆయన వసూలు చేస్తున్నారు. 50 మంది ఇంజనీర్ల పదోన్నతుల విషయంలో భారీగా ముడుపులు తీసుకున్నారన్న ఆరోపణలున్నాయి. ఈఎన్‌సీ కార్యాలయంలో కాంట్రాక్టు ఉద్యోగులున్నా ఎవరూ లేరని ప్రభుత్వానికి లేఖ రాసి వారికి జీతాలు రాకుండా అడ్డుకున్నారు. వాళ్లు లంచమివ్వలేరని ఇలా చేసినట్లు ఆరోపణలున్నాయి. అదే విధంగా రాష్ట్రంలో ఉపాధి మెటీరియల్ నిధులతో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న సిబ్బందికి బిల్లులు పెట్టకపోవడంతో ఏడాది పాటు జీతాలు నిలిచిపోయాయి. చివరకు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను ఆశ్రయించడంతో వారి జీతాలకు మోక్షం కలిగింది. పాండురంగమూర్తి అనే డీఈఈ 2004లో ప్రభుత్వ అనుమతి లేకుండా కెనడాకు వెళ్లి 2014 ఫిబ్రవరిలో తిరిగి స్వదేశానికి వచ్చారు. ఆయనను సస్పెండ్ చేయడమే కాకుండా ఉద్యోగంలో నుంచి తొలగించాలి. అయితే ఆయనను బ్లాక్ మెయిల్ చేసి ఈ అధికారి భారీగా ముడుపులు గుంజుకున్నారు. ఆ తర్వాత ఆయనకు ఈఈగా, ఎస్‌ఈగా పదోన్నతి కల్పించారు. గత జగన్ ప్రభుత్వంలో కాంట్రాక్టు పనులకు వర్క్ ఆర్డర్లు ఇచ్చేందుకు భారీగా వసూలు చేసి అప్పటి ఈఎన్‌సీ అండదండలతో కోట్లకు పడగలెత్తారని ప్రచారం ఉంది.

హైకోర్టు ఆదేశాలు ఉల్లంఘన

ఈఎన్‌సీ కార్యాలయం ఇచ్చిన అడహాక్ పదోన్నతులపై హైకోర్టు ఈ ఏడాది సెప్టెంబరు 12న మధ్యంతర స్టే ఇచ్చింది. అయితే హైకోర్టు ఆదేశాలను ఈ అధికారి ఉల్లంఘించి అదే నెల 14, 15, 16 తేదీల్లో పాత తేదీ 9-9-2024తో పదోన్నతులకు ఆదేశాలిచ్చారు. ఇంజనీర్ల నుంచి రూ.లక్ష చొప్పున వసూలు చేసినట్లు ఆరోపిస్తున్నారు. అప్పటికే కోర్టు ధిక్కరణ కేసు పెండింగ్‌లో ఉన్నా ఈ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన అవినీతి బాగోతంపై ఓ రిటైర్డ్ ఇంజనీర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించినట్లు సమాచారం. ఇలాంటి అధికారిపై ఇంకా చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

జ్యోతిరావ్ పూలే సేవలు ఎనలేనివి: సీఎస్



అమరావతి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సమాజంలో కుల వ్యవస్థ నిర్మూలన, స్త్రీ విద్యను ప్రోత్సహించడం సహా పలు సామాజిక అంశాల్లో మహాత్మా జ్యోతిరావ్ పూలే అందించిన సేవలు ఎనలేనివని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ పేర్కొన్నారు. జ్యోతిరావ్ పూలే వర్ధంతిని పురస్కరించుకుని గురువారం అమరావతి సచివాలయంలో జ్యోతిబా పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.

జ్యోతిరావ్ పూలేను ఆదర్శంగా తీసుకోవాలి: టీడీపీ



సామాజిక సంఘ సంస్కర్త, అణగారిన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావ్ పూలేని ఆదర్శంగా తీసుకోవాలని టీడీపీ నేతలు అన్నారు. గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో జ్యోతిరావ్ పూలే వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పార్టీ నేతలు పూలమాలు వేసి, నివాళులర్పించారు. కుల వ్యవస్థ, జాతి వివక్ష, స్త్రీ అణిచివేతను ఖండించి, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాటుబడిన జ్యోతిరావ్ పూలే మహిళల విద్య కోసం అవిరళ కృషి చేశారని నేతలు కొనియాడారు.

పంచాయతీరాజ్‌లో ఇక ఏటా పదోన్నతులు

- రిటైర్‌మెంట్‌లకు ముందే డీపీసీల ఏర్పాటు
- ఉద్యోగుల్లో పదోన్నతి భరోసాకు చర్యలు
- కమిషనరేట్ పరిధిలో సంస్కరణలకు శ్రీకారం

అమరావతి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ శాఖలో ఏటా ఉద్యోగుల పదోన్నతుల ప్రక్రియ ఒక ప్రహసనంగా మారుతోంది. ఓ వైపు ఉద్యోగుల రిటైర్మెంట్‌తో ఖాళీలేర్పడి, పదోన్నతులకు అర్హత కలిగినవారు ఉన్నప్పటికీ.. ఏళ్ల తరబడి పదోన్నతులు కల్పించకపోవడంపై ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. కొంతమంది ఉద్యోగులు రిటైర్ అయ్యేదాకా పదోన్నతులు పొందే అవకాశం రాకపోవడంతో నిర్వేదానికి లోనవుతున్నారు. పదోన్నతుల ప్రక్రియ ప్రారంభించినప్పుడల్లా కమిషనరేట్‌లో కొంతమంది సిబ్బంది లంచావతారమెత్తి రూ.లక్షలు వసూలు చేయడం, లంచమివ్వని ఉద్యోగులకు పదోన్నతులు ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టడం ఆనవాయితీగా మార్చేశారు!. అయితే.. ఇలా ఏటా పదోన్నతుల ప్రక్రియలో ముడుపుల జోరు ఊపందుకోవడంతో దానికి ఎక్కడికక్కడ ఫుల్‌స్టాప్ పెట్టి.. ఏటా పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ తీర్మానించింది. ఆయా విభాగాల్లో రిటైర్‌మెంట్ ద్వారా ఏర్పడిన ఖాళీలను ఏయేటికాయేడే భర్తీ చేయాలని నిర్ణయించింది. ఉపముఖ్యమంత్రి ఆదేశాలతో పంచాయతీరాజ్‌శాఖ కమిషనరేట్ పరిధిలో పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టిన కమిషనర్ కృష్ణతేజ.. తాజాగా ఉద్యోగుల సంక్షేమం దృష్ట్యా పదోన్నతులపై ప్రత్యేక చర్యలకు ఉపక్రమించారు. ఇందులో భాగంగా ఆయా విభాగాల్లో ఏటా ఖాళీలయ్యే పోస్టులను బట్టి ఉద్యోగులు రిటైర్ అయ్యే ముందే డీపీసీ ఏర్పాటు చేస్తారు. ఉద్యోగులు రిటైర్ అయిన వెంటనే వారిని ఆయా స్థానాల్లో నియమిస్తారు. ఇప్పటికే ఉపాధి హామీ పథకంలో పనులు నిర్వహించే వెండర్లకు భరోసా కల్పించేందుకు ప్రతి గురువారం చెల్లింపులు చేపట్టడం, పంచాయతీల్లో ప్రతి పన్ను చెల్లింపులు వెబ్‌సైట్ ద్వారా చేపట్టాలనే ప్రక్రియకు శ్రీకారం చుట్టడం తదితర చర్యల ద్వారా ఇప్పటికే పంచాయతీరాజ్ మన్ననలు పొందింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఎడతెగని హింస

పాకిస్థాన్ ప్రశాంతంగా ఉండటం ఇటీవల చూడలేదు. కొద్దిరోజులుగా షియా–సున్నీ ముస్లింల మధ్య ఎడతెగని హింస కారణంగా వందమందివరకూ మరణించారు. ఆ యుద్ధం సాగుతూండగానే, మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌ను జైలునుంచి విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆయన పార్టీ భారీ నిరసన ప్రదర్శనలకు పిలుపునిచ్చి, తీవ్ర ఉద్రిక్త పరిస్థితులను సృష్టించింది. వేలాదిమంది భద్రతాబలగాలు అర్థరాత్రివేళ విరుచుకుపడి పీటీఐ మద్దతుదారులను, కార్యకర్తలను చావగొట్టాయి. కనిపిస్తే కాల్చివేత ఆదేశాలతో భయపెట్టాయి. ఇమ్రాన్ మద్దతుదారులు పెద్దసంఖ్యలో మరణించారని, వందలాదిమంది తీవ్రంగా గాయపడ్డారని అనధికారిక సమాచారం. విద్యాలయాలను మూసివేసి, ఇంటర్నెట్ నిలిపివేసి ఒకవిధంగా లాక్‌డౌన్ అమలైంది. ఈ మొత్తం వ్యవహారంలో పైచేయి ఇమ్రాన్ పార్టీది అయిందా, బలగాలు గెలిచాయా అన్నది అటుంచితే, ఇప్పటికీ కటకటాల వెనుకనుంచి ఆయన ఒక సవాలు విసిరినా, నిరసనలకు పిలుపు ఇచ్చినా ప్రభుత్వం అతలాకుతలమవుతోందనడానికి ఈ ఘటన నిదర్శనం.

ఎట్టిపరిస్థితుల్లోనూ ఈ నిరసనలను అనుమతించకూడదన్న లక్ష్యంతో పాకిస్థాన్ ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా వ్యవహరించింది, హద్దులుదాటిన కాఠిన్యాన్ని కనబరిచింది. ఇస్లామాబాద్, రావల్పిండికి వెళ్ళే ప్రధాన దారులను మూసివేసి, రైళ్ళు, బస్సులు నిలిపివేసి, దేశంలోని మిగతా ప్రాంతాలనుంచి ఎవరూ రాజధానికి రాకుండా ప్రభుత్వమే నిలువరించింది. ఒక్కముక్కలో చెప్పాలంటే, తానే రాజధానిని దిగ్బంధించింది. ఇమ్రాన్‌ను విడుదల చేసేవరకూ ఇస్లామాబాద్‌లోని డీచౌక్‌నుంచి కదిలేది లేదని, ఆయనతో కలిసే ఇంటికిపోతామని లక్షలాది కార్యకర్తలముందు భీకర ప్రతిజ్ఞలు చేసిన ఇమ్రాన్ భార్య బుష్రా బీబీ, పోలీసు హింస పతాకస్థాయికి చేరడంతో, కాల్పులు జరగడంతో అక్కడనుంచి పారిపోయారని వార్తలు వచ్చాయి. అయినప్పటికీ, ఆమె నాయకత్వంలో పీటీఐ సాగించిన ఈ పోరాటం ప్రభుత్వాన్ని బాగా భయపెట్టగలిగింది. మరోపక్క భద్రతాదళాలు కూడా వందలాదిమంది కాళ్ళూ చేతులూ విరగ్గొట్టి ఇమ్రాన్ పార్టీని నియంత్రించగలిగాయి.

ఈ భుట్టోలు, షరీఫ్‌లు దేశాన్ని ఇంకెంతకాలం ఏలుతారంటూ వారసత్వరాజకీయాలను తీవ్రంగా విమర్శించే ఇమ్రాన్ ఇప్పుడు తన మూడోభార్యను, సోదరిని యుద్ధక్షేత్రంలోకి దించడం విచిత్రం. రెండున్నరేళ్ళుగా జైల్లో ఉంటున్న ఆయన ఇప్పటికీ తన పార్టీని నియంత్రించగలుగుతున్నాడు, క్షేత్రస్థాయి పోరాటాలకు పురిగొల్పుతున్నాడు. కానీ, వందలాది కేసులు తన మెడకు చుట్టి జైల్లోకి నెట్టేసినవారిని ఢీకొట్టాలంటే, వారి మెడలు వంచి బయటకు రావాలంటే, కదనరంగంలో తానో, తనవారో ప్రత్యక్షంగా కనిపించడం ముఖ్యం. తన పక్షాన కార్యకర్తలకు స్ఫూర్తినిచ్చే శక్తి, తెలివితేటలు, వ్యూహరచనా సామర్థ్యం తన భార్యకు ఉందని ఆయన నమ్మకం.

సైన్యమే ఇమ్రాన్‌ను ఇంతశక్తిమంతుడిగా మార్చిందన్నమాట నిజం. దానికీ, షరీఫ్‌లకు మధ్య లోపాయికారీ అవగాహన కుదరడంతో ఘనంగా గెలిచిన ఇమ్రాన్ తన పదవిని కోల్పోయాడు. గతంలో సైన్యాన్ని విమర్శించి గద్దెదిగిన నవాజ్ షరీఫ్ దానికి ప్రీతిపాత్రుడయ్యాడు. సైన్యానికీ, అమెరికాకూ వ్యతిరేకంగా మాట్లాడిన ఇమ్రాన్ కటకటాలు లెక్కపెట్టవలసి వచ్చింది. అతడిని గద్దెదింపి, కేసులు పెట్టి, శిక్షలు వేసి, జైల్లోకి నెట్టడం వెనుక సైన్యం ఉన్నదని పాకిస్థాన్ ప్రజలకు తెలుసు. చివరకు సుప్రీంకోర్టు, ఎన్నికల సంఘం వంటి బలమైన వ్యవస్థలు కూడా ఆయనకు వ్యతిరేకంగా వ్యవహరించి, ఆయన పార్టీని ఛిన్నాభిన్నం చేసి, కనీసం ఎన్నికల్లో పాల్గొననివ్వని సంగతి తెలిసిందే. బద్ధశత్రువులైన భుట్టోలు, షరీఫ్‌లు చేతులు కలిపి, సైన్యం ఆశీస్సులతో పాలన చేసుకుంటున్నారు. ఇమ్రాన్ జైలునుంచి ప్రజాక్షేత్రంలో వస్తే తమకు ప్రమాదమన్న భయం సైన్యాన్నీ, షరీఫ్ సోదరులను పీడిస్తోంది. ఎన్నికలు నిర్వహించాలన్న ఇమ్రాన్ డిమాండ్‌కు వారు ఇప్పట్లో అంగీకరించరు. ఎంతమంది కార్యకర్తలనైనా బలిపెట్టి జైలునుంచి బయటకు రావాలన్నది ఇమ్రాన్ లక్ష్యం. పాకిస్థాన్ హింస సమీపకాలంలో

అనుసంధానానికున్న అడ్డంకులు సీఎంకు వివరించారా?


చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో జల వనరుల శాఖలో కదలిక వచ్చింది. పైగా మొన్నటి బడ్జెట్‌లో మెట్ట ప్రాంతాల్లోని పెండింగ్ ప్రాజెక్టులకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి లోబడి బాగానే నిధులు కేటాయించారు. వాస్తవం చెప్పాలంటే కొన్ని ప్రాజెక్టులకు కేటాయించిన నిధులు ఈ ఆర్థిక సంవత్సరంలో వ్యయం చేయడం కుదరదు. ఉదాహరణకు– గాలేరు నగరి సుజల స్రవంతికి రూ.2438.84కోట్లు కేటాయించారు. కాని ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ నాలుగైదు నెలల్లో ఈ నిధులు వ్యయం చేయలేరు. ఇదే సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తిరిగి గోదావరి – కృష్ణ – పెన్నా నదుల అనుసంధానాన్ని తెరపైకి తెచ్చి దానిపై దృష్టి సారిస్తున్నారు. ఒక విధంగా ఈ అనుసంధానం రాష్ట్రానికి అవసరం కూడా. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఈ అనుసంధానానికి పలు అడ్డంకులు తప్పవేమో.

ఆ మాట కొస్తే ఈ అనుసంధానానికే కాదు, రాయలసీమలో కొన్ని పథకాలకు, ఉత్తరాంధ్రలో వంశధార – నాగావళి నదుల అనుసంధానికి అంతర్ రాష్ట్ర జల వివాదం అడ్డంగా ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముఖ్యంగా అంతర్ రాష్ట్ర జల వివాదాల పరిష్కారంపై దృష్టి పెట్టాలి. ఇవన్నీ అటుంచి కేంద్ర ప్రభుత్వం గోదావరి – కావేరి అనుసంధానం గురించి పట్టువదలని విక్రమార్కుడులా కొన్నేళ్లుగా వ్యవహరిస్తోంది. ఈ మధ్య రాష్ట్ర జల వనరుల శాఖపై సమీక్షా సమావేశాలు జరిగినప్పుడు అంతర్ రాష్ట్ర జల వివాదాల విషయం గాని, గోదావరి – కావేరి నదుల అనుసంధానం గాని ప్రస్తావనకు రాలేదు. రాష్ట్ర జలవనరుల శాఖ ఉన్నతాధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకొచ్చారో లేదో తెలియదు.

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న గోదావరి – కావేరి అనుసంధానం అంశంలో రాష్ట్ర ప్రభుత్వం వైఖరి ముందుగా తేలితేనే ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పట్టుబడుతున్న గోదావరి – కృష్ణ – పెన్నా అనుసంధానంపై ముందుకు వెళ్లేందుకు వీలు కలుగుతుంది. పైగా ముఖ్యమంత్రి ఢిల్లీలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మల సీతారామ్‌ను కలసి రాష్ట్రం ప్రతిపాదిస్తున్న అనుసంధానానికి ఆర్థిక సాయం అభ్యర్థించారంటే గోదావరి – కావేరి అనుసంధానం అంశంపై ఏ వైఖరి తీసుకొంటారన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా ఉంది. తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో పాగా వేసేందుకు ప్రధాని నరేంద్ర మోదీ గోదావరి – కావేరి అనుసంధానాన్ని ఒక ఆయుధంగా ఉపయోగించుకోవాలని విశ్వప్రయత్నం చేస్తున్నారు. కేసీఆర్ అడ్డు పడకుండా ఉంటే ఎప్పుడో జరిగిపోయేది. ఇప్పుడు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం సవాలక్ష షరతులు పెడుతోంది. పైగా ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ ప్రభుత్వం ఉన్నా తన వాటా నీళ్ల ఇచ్చేందుకు అడ్డు చెబుతోంది. మున్ముందు ఏం జరుగుతుందన్నది పక్కన పెడితే గోదావరిలో రెండు తెలుగు రాష్ట్రాల వాటాలు ఇంకా తేలలేదు. తెలంగాణ అడ్డగోలుగా వాదిస్తోంది. గోదావరి ట్రిబ్యునల్ కేటాయించిన 1480 టీఎంసీల్లో తమ వాటా 967.94 టీఎంసీలనీ, ఆంధ్రప్రదేశ్ వాటా కేవలం 530 టీఎంసీలనీ తెలంగాణ వాదన. ఇటీవల జరిగిన గోదావరి యాజమాన్య బోర్డు సమావేశంలో సీతమ్మ సాగర్ డీపీఆర్‌ను తెలంగాణ సమర్పించినపుడు ఆంధ్రప్రదేశ్ ఇంజనీర్లు నికర జలాలు లేవని అభ్యంతరం చెప్పారు. ఈ సందర్భంగా తెలంగాణ ఇంజనీరింగ్ అధికారులు ఆంధ్రప్రదేశ్ వాటా 530 టీఎంసీలేనని తెగేసి చెప్పారు. అయిదేళ్ల అధికారంలో ఉన్న జగన్మోహన్‌రెడ్డి కేసీఆర్ ఏం చెబితే దానికి తలూపడంతో సరిపెట్టారు. ఫలితంగా కృష్ణా నదీ జలాలు తిరిగి పంపిణీకి ట్రిబ్యునల్ ఏర్పడి తెలంగాణ రొట్టె విరిగి నేతిలో పడింది. అదే సమయంలో కనీసం గోదావరి జలాల వాటా విషయం గట్టిగా పట్టించుకోకపోవడంతో ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ఇబ్బందిపడవలసి వస్తోంది.

కేసీఆర్ తన హయాంలో గోదావరిపై పలు ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు. ఇప్పుడు అవన్నీ చకచకా నిర్మాణం సాగితే, ఆంధ్రప్రదేశ్ వచ్చేసరికి ఒక్క పోలవరం తప్ప మరే పథకమూ నిర్మాణంలో లేదు. అదే జరిగితే కేవలం వరద జలాలపై ఆధారపడి గోదావరి – పెన్నా అనుసంధానం చేపట్టాల్సి ఉంటుంది. కాగా మొన్న జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి మరో ప్రతిపాదన చేసినట్లు వార్తలు వచ్చాయి. కృష్ణా నదికి వరద వచ్చే సమయంలో ఆ నీటిని ముందుగా తరలించే విధంగా ప్రణాళిక వుండాలని, కృష్ణలో వరద లేని రోజుల్లో గోదావరి జలాలు తరలించే విధంగా రూపకల్పన చేయాలని ఆదేశించినట్లు తెలిసింది. కృష్ణలో వరద ఉన్న రోజుల్లో వినియోగించే జలాలు కూడా ఆంధ్రప్రదేశ్ వాటాలో వేయాలని తెలంగాణ వాదిస్తోంది. ప్రకాశం బ్యారేజీ నుంచి విడుదలై సముద్రంలో కలిసే సమయంలో వాడుకొనే నీళ్ల తమ వాటాలో వద్దని ఆంధ్రప్రదేశ్ కోరుతున్నా తెలంగాణ పట్టించుకోవడం లేదు. కృష్ణా యాజమాన్య బోర్డు కేవలం మేక చన్నుగా మిగిలిపోయింది. కృష్ణా వరద జలాలకే కాకుండా గోదావరి వరద జలాలకూ తెలంగాణ మోకాలడ్డుతున్న అంశం రాష్ట్ర ఇంజనీరింగ్ అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారా?

జగన్మోహన్‌రెడ్డి తన హయాంలో కేసీఆర్ నిర్దేశంలో అంతర్ రాష్ట్ర జల వివాదాలు నడిపేవారు. జగన్మోహన్‌రెడ్డికి ఎవరూ చెప్పేందుకు సాహసించేవారు కాదు. ప్రస్తుతం చంద్రబాబు నాయుడు అలా కాదు కదా? మున్ముందు ఎదురు కానున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి దృష్టికి ఇంజనీరింగ్ అధికారులు తేవలసి ఉంది. కృష్ణ ఆయకట్టుకు రెండు వైపుల నుంచీ నీటి సరఫరా వుంటే వాళ్ల దృష్టిలో గోదావరి జలాలు అవి ఏ నీరైనా కృష్ణ ఆయకట్టుకు వస్తే కృష్ణలో మిగులు నీళ్ల తమకు కేటాయించాలనే డిమాండ్‌తోనే ట్రిబ్యునల్ ఏర్పాటు సాధించారు. ప్రధానంగా ఈ డిమాండ్‌తోనే ట్రిబ్యునల్‌లో తెలంగాణ వాదిస్తోంది. ట్రిబ్యునల్ తీర్పు వచ్చే లోపు ఈ అనుసందానం ఎంత వరకు న్యాయపరంగా నిలుస్తుందో, ఒకవేళ అమలుకు పూనుకొంటే ట్రిబ్యునల్ తీర్పుపై ఎలాంటి ప్రభావం ఉంటుందో ముఖ్యమం-



జగన్మోహన్ రెడ్డి తన హయాంలో కేసీఆర్ నిర్దేశంలో అంతర్ రాష్ట్ర జల వివాదాలు నడిపేవారు. జగన్మోహన్‌రెడ్డికి చెప్పేందుకు ఎవరూ సాహసించేవారు కాదు. ప్రస్తుతం చంద్రబాబు నాయుడు అలా కాదు కదా? మున్ముందు ఎదురుకానున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి దృష్టికి ఇంజనీరింగ్ అధికారులు తేవలసి ఉంది.

త్రికి ఇంజనీరింగ్ అధికారులు తప్పకుండా వివరించాలి.

పైగా ఇంతటి భారీ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వ నిధులతోనే నిర్మించడం అసాధ్యం. ఇతర ఏ సంస్థ నుంచైనా అప్పు తేవాలంటే కేంద్ర జల సంఘం ఆమోదం తప్పనిసరి. కేంద్ర జలసంఘమే కాదు, అప్పు ఇచ్చే సంస్థలు కూడా నికర జలాలు లేనిదే పైసా ఇవ్వవు. విదేశీ సంస్థలే కాకుండా కేంద్ర ప్రభుత్వ ఉపాంగాలైన సంస్థలు కూడా ఈ నిబంధన పాటిస్తాయి. ఒకవేళ గోదావరి–కావేరి అనుసందానంలో భాగంగా ఈ పథకం చేపట్టాలంటే పోలవరం నుంచి సాధ్యం కాదని ఈ పాటికే తేలిపోయింది. ఎందుకంటే పోలవరం వద్ద నికర జలాలు లేవు. ఈ పాటికే నదుల అనుసంధానం టాస్క్‌ఫోర్స్ కమిటీ చైర్మన్ వెదిరె శ్రీరాం వీలు కాదని తేల్చి చెప్పారు. జగన్మోహన్‌రెడ్డి హయాంలో తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఒకవేళ సమ్మక్క బ్యారేజీ నుండి గోదావరి కావేరి అనుసంధానం మొదలుపెడితే గోదావరి పెన్నా అనుసంధానం ఎంత వరకు సాధ్యం? గోదావరి కావేరి అనుసంధానం చేపడితే ఆంధ్రప్రదేశ్‌కు దక్కేది కేవలం 80టీఎంసీలు మాత్రమే. జగన్మోహన్‌రెడ్డి దార్శీకం లేకుండా తెలంగాణతో ఇచ్చిపుచ్చుకొనే ధోరణిలో అంతర్ రాష్ట్ర జల వివాదం ఒక కొలిక్కి వచ్చి ఉంటే ప్రస్తుతం చంద్రబాబు నాయుడు ప్రతిపాదిస్తున్న గోదావరి – పెన్నా అనుసంధానంతో రాయలసీమతో పాటు ఉమ్మడి నెల్లూరు ప్రకాశం జిల్లాల పొలాలకు వరద ఉన్న రోజుల్లో కృష్ణ జలాలు మిగిలిన కాలంలో గోదావరి జలాలతో పునీతమయ్యేవి. రాష్ట్ర జలవనరుల శాఖాధికారులు వచ్చే సమావేశంలో గోదావరి–పెన్నా అనుసందానానికి మున్ముందు రానున్న న్యాయపరమైన అంతర్ రాష్ట్ర జల వివాదాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు నివేదించడం ఎంతైనా అవసరం.

'మహా' సునామీ మిగిల్చిన సంశయాలు


మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని మహాయుతి కూటమి విజయానికి నేను ఆశ్చర్యపోలేదు అలాగే విజయావకాశాలు పుష్కలంగా ఉన్న ప్రతిపక్ష ఎమ్‌వీఏ కూటమి ఓడిపోవడం కూడా నన్ను విస్మయపరచలేదు అయినప్పటికీ సునామీ లాంటి మహాయుతి విజయాన్ని నేను అర్థం చేసుకోలేక పోతున్నాను. నా రాజకీయ ఇంగితజ్ఞానం గానీ, రాజనీతిశాస్త్ర పరిజ్ఞానం గానీ మహారాష్ట్ర ఎన్నికల అంతిమ ఫలితాలను అర్థం చేసుకోవడానికి తోడ్పడం లేదు! విజేతకు తోడ్పడిన విజయ బలవర్ధకాలు ఏమిటి అని నన్ను నేను ప్రశ్నించుకోక తప్పలేదు.

మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలపై సంశయాలు నెలకోవడమనేది చాలా తీవ్ర విషయం. అధికారిక ఎన్నికల ఫలితాలను ప్రశ్నించవచ్చు. అయితే అది కొన్ని ప్రాథమిక పరీక్షలలో నెగ్గవలసిన అవసరమున్నది: ఆ ఫలితాలకు దారితీసిన బలమైన కారణాలను వివరించాల్సిన అవసరమున్నదా? పలువురు ఇస్తున్న వివరణలు నమ్మదగినవి కావా? ఈ రెండింటినీ నిశితంగా పరిశీలిద్దాం.

మహారాష్ట్ర ఎన్నికలు అనేక విధాలుగా ఆశ్చర్యాన్ని గొలిపాయి. మహాయుతి విజయం విస్మయకరమైనదేగాక దిగ్భ్రాంతికరమైనది కూడా. నాలుగింట మూడు వంతుల సీట్లను ఆ కూటమి కైవసం చేసుకున్నది. దాని ఓట్ల వాటా 14 శాతం అధికంగా ఉన్నది. ఇటువంటి విజయాలు అరుదైనవి. అయితే అసాధ్యమైనవి కావు, ఇంతకుముందు విననివి కూడా కాదు. మహారాష్ట్ర రాజకీయాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేసే అంశాలు అన్నీ ఈ ఎన్నికలలో కానరాకుండా పోవడం ఆ ఆశ్చర్యాన్ని మరింత అధికం చేస్తోంది. రాష్ట్రంలోని విభిన్న ప్రాంతాల మధ్య అభివృద్ధిపరంగా అసమానతలు, భిన్న కూటములలోని పార్టీల మధ్య ఉన్న వివిధ అంతరాలు అన్నిటినీ అదృశ్య హస్తం ఏదో మటుమాయం చేసినట్టుగా కనిపిస్తోంది. మహాయుతి విజయంలోని నాటకీయ స్వభావమూ విస్మయం కలిగిస్తోంది. 2024 లోక్‌సభ ఎన్నికలలో ఓట్ల లోటును భర్తీ చేసుకోవడమే కాకుండా 14 శాతం ఆధిక్యతను మహాయుతి సాధించింది. అదీ ఐదు నెలల్లో ఎలా సాధ్యమయింది? ఏమైనా మహారాష్ట్ర పాలక కూటమి విజయం భారతదేశ ఎన్నికల చరిత్రలో అపూర్వమైనదేమీ కాదు. మహారాష్ట్రలో ఎన్నికల చరిత్రను నిశితంగా చూస్తే ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ గణనీయమైన సీట్లు సాధించగలగడానికి ఆస్కారం లేదు. ఈ కారణంగానే మహాయుతి విజయాన్ని ఎవరూ పసిగట్టలేక పోయారు. ఎన్నికల పవనాలు వేగంగా, అనూహ్యంగా తప్పుడు దిశలో వీచాయి. మరింత స్పష్టంగా చెప్పాలంటే మహాయుతి విజయం నిజానికి ఒక ఎన్నికల గూగ్లీ.

మహారాష్ట్రలో సంభవించిన దానికి సబబైన వివరణ ఏమైనా ఉన్నదా? కొన్ని ప్రామాణిక వివరణలను పరిశీలిద్దాం. తమకు లభించిన మంచి అవకాశాన్ని ఎమ్‌వీఏ నాయకులు వ్యర్థం చేసుకున్నారనేది వాటిలో ప్రధానమైనది. లోక్‌సభ ఎన్నికలలో చేకూరిన విజయంతో అమిత సంతృప్తితో ఉండిపోయి, వ్యర్థ కలహాలతో కాలం గడుపుతూ దూరదృష్టి లేకుండా వ్యవహరించారనేది ఎమ్‌వీఏ నేతలపై ఒక ప్రధాన ఆక్షేపణ. ఇది చాలవరకు నిజం. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ఎమ్‌వీఏకు ఒక నైతిక సె[illegible]న్నిచ్చాయి. సమష్టి మనుగడకు ఒక సుదృఢ ప్రాతిపదిక కల్పించాయి. అసెంబ్లీ ఎన్నికల సమరానికి సమాయత్తమయ్యేందుకు అనువైన పరిస్థితులను సృష్టించాయి. ప్రజలను సతమతం చేస్తున్న సమస్యలా? కొల్లలు. శిందే సేన, అజిత్ పవార్ ఎన్‌సీపీ, బీజేపీలతో కూడిన మహాయుతి ఒక రాజకీయ పాప ఫలం. సిగ్గు మాలిన ఎత్తుగడలతో శివసేన, ఎన్‌సీపీని బీజేపీ చీల్చింది.

పరిణత రాజకీయవేత్తగా ఉద్ధవ్ ఠాక్రేకు ప్రజల్లో మంచి పేరు ఉన్నది. కోవిడ్ ఉపద్రవంలో మహమ్మారి బాధితులను ఆదుకోవడంలో ఆయన పాలనా దక్షత రుజువయింది. ఈ అనుకూలతలను ఉపయోగించుకునేందుకు ఎమ్‌వీఏ నాయకులు లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల మధ్య ఐదు నెలల కాలంలో చేసిందేమీ లేదు. సీట్ల పంపిణీపై సత్వరమే ఒక నిర్ణయానికి రాలేకపోయారు. ఎన్నికల వాగ్దానాలను ప్రకటించడంలో జాప్యం చేశారు. మరీ ముఖ్యంగా ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరో తేల్చుకోలేక పోయారు. బీజేపీ ఎత్తుగడలకు పై ఎత్తుగడలు వేయలేకపోయారు.



మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను కనిపించే అంశాల కంటే కనిపించనివే ప్రభావితం చేశాయి. తాము వంచనకు గురయ్యామన్న భావనను వ్యక్తం చేస్తున్నందుకు ప్రతిపక్షాలను తప్పుపట్టకూడదు. ఇండియా కూటమి ఈవీఎమ్ కుట్ర విషయంపైనే దృష్టి కేంద్రీకరించి, తన సొంత రాజకీయ వైఫల్యాలను ఉపేక్షించడంలోనే అసలు ప్రమాదం ఉంది. భారత ప్రజాస్వామ్య మనుగడకు ప్రతిపక్ష కూటమి తన రాజకీయ వైఫల్యాలను చిత్తశుద్ధితో పరీక్షించుకోవడమనేది చాలా చాలా ముఖ్యం.

లోక్‌సభ ఎన్నికలలో పరాజయం నుంచి బీజేపీ నేతృత్వంలోని మహాయుతి సరైన పాఠాలు నేర్చుకున్నది. ఒక పటిష్ఠ పథకాన్ని రూపొందించుకుని సమర్థంగా అమలుపరిచింది. తమ పట్ల వివిధ వర్గాలలో ఉన్న వ్యతిరేకతను తటస్థం చేసింది. ప్రభుత్వ కోశాగారాన్ని ప్రజలకు తెరిచింది. లడ్కీ బహిన్‌తో సహా పలు సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టింది. ఓబీసీలను తన వెనుక సమీకరించుకుంది దళితులలో అట్టడుగున ఉన్నవారిని తన వైపునకు తిప్పుకోగలిగింది. సంఘ్ పరివార్ అంతా మహాయుతి వెనుక మోహరించింది. నకిలీ అభ్యర్థులను నిలబెట్టింది. బీజేపీకి గల అపార ధనశక్తి, మీడియా పలుకుబడిని పూర్తిగా వినియోగించుకున్నది. మరి ఎమ్‌వీఏని మహాయుతి ఎందుకు ఓడించిందో మీకు ఇంకా వివరించాలా? అసెంబ్లీ ఎన్నికలకు మహాయుతి, ఎమ్‌వీఏ సంసిద్ధమైన రీతుల్లో చాలా తేడా ఉన్నది. లోక్‌సభ ఎన్నికలలో ఓట్ల లోటును భర్తీ చేసుకోవడంలోను, అదనంగా ఐదు శాతం ఓట్లను కోల్పోయే ప్రమాదాన్ని అధిగమించడంలోను మహాయుతి ఎందుకు సఫలమయిందో ఆ తేడా విశదం చేస్తుంది. ఈ కారణాలు అన్నీ ఓట్ల కైవశంలో మహాయుతి, ఎమ్‌వీఏపై ఆధిక్యత సాధించేందుకు తోడ్పడింది. అయితే ఎటువంటి ఆధిక్యత అది? నాలుగింట మూడు వంతుల సీట్లను స్వాధీనం చేసుకున్నది. ఓట్ల వాటాలో 14శాతం ఆధిక్యత! నేను హతాశుడిని అయ్యాను. ఇంత మహావిజయాన్ని మీడియా గానీ, ఓటర్ల సర్వేలు నిర్వహించినవారు గానీ, చివరకు విజేతలతో సహా రాజకీయ నాయకులుగానీ ముందుగా ఊహించలేకపోయారు. ఎవరూ సమగ్రంగా వివరించలేకపోతున్నారు.

సరే, ఎన్నికల ఫలితాలు ఇప్పుడు అందరినీ విస్మయపరచడం పరిపాటి అయిపోయింది. ఒక నిర్దిష్ట పార్టీ హవా ఉధృతంగా ఉన్న ఎన్నికలు నాయకులు, పరిశీలకులు, విలేఖర్లు, ఓటర్ల సర్వేల నిర్వాహకులతో సహా ప్రతి ఒక్కరినీ విస్మయపరుస్తాయి. 1977లో ఉత్తర భారతావనిలో జనతా పార్టీ, 1985లో రాజీవ్‌గాంధీ, 2019లో వాయవ్య భారతంలో మోదీ సానుకూల పవనాలు ఎలా వీచాయో నేను చూశాను. ఎవరు గెలవగలరో ప్రతి ఒక్కరూ సులభంగా చెప్పగలిగేవిగా సదరు ఎన్నికలు ఉండేవి. ఆయా పార్టీలకు లభించగల సీట్లపై అంచనాలు అటూ ఇటూగా ఉండేవి. విజేత ఎవరో కచ్చితంగా చెప్పగలిగి ఉండేవారు. అయితే మహారాష్ట్ర ఎన్నికలు ఇందుకు పూర్తిగా విరుద్ధమైనవి. వీటి గురించిన రాసినవారెవ్వరూ అంతిమ ఫలితాలను ఏ మాత్రం ఊహించలేకపోయారు.

సంబంధిత అన్ని విషయాలను పరిగణనలోకి తీసుకుని చూస్తే మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలకు ఏదో ఒక ప్రత్యేకత ఉన్నట్టు అనిపిస్తుంది. అయితే ఆ ప్రత్యేకత ఏమిటో సహేతుకంగా వివరించలేని పరిస్థితి! ఈవీఎమ్‌లను తప్పుపట్టడం తొందరపాటే అవుతుంది. అయితే ఈవీఎమ్‌లను ఉపయోగించిన తీరును ప్రశ్నించకుండా ఉండడమనేది అసాధ్యం.



■ యోగేంద్ర యాదవ్

నేను ఒక దశాబ్ద కాలంగా ఈవీఎమ్ కుట్ర సిద్ధాంతాలను విమర్శిస్తూ వస్తున్నాను. ఈ విషయంలో నా స్నేహితులు, రాజకీయ సహచరులు నాతో ఏకీభవించేవారు కాదు. పోలింగ్‌లో పాల్గొన్న ఓటర్ల శాతంపై తొలి అంచనాలకు, అంతిమ ఫలితాలకు మధ్య ఉన్న అంతరం రిగ్గింగ్‌ను సూచిస్తుందనే అభిప్రాయాన్ని నేను ఇప్పటికీ అంగీకరించలేకున్నాను. అదే విధంగా ఈవీఎమ్ ద్వారా పోల్ అయిన ఓట్ల సంఖ్య, ఈవీఎమ్ ద్వారా గణించిన ఓట్ల సంఖ్య మధ్య వ్యత్యాసం కూడా ఎన్నికలలో ఏదో మోసం జరిగిందనడానికి సరైన రుజువు కాదు. ఈవీఎమ్‌లను అధికార పక్షానికి అనుకూలంగా దుర్వినియోగపరిచారని ఆరోపించేవారు తమ ఆక్షేపణలకు మరింత సబబైన ఆధారాలు చూపించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను అర్థం చేసుకోవడం చాలా కష్టం. కనిపించే అంశాల కంటే కనిపించని అంశాలే వాటిని ప్రభావితం చేశాయని అనిపిస్తోంది. తాము వంచనకు గురయ్యామన్న భావనను వ్యక్తం చేస్తున్నందుకు ప్రతిపక్షాలను తప్పుపట్టకూడదు. అయితే అయితే ఇండియా కూటమి ఈవీఎమ్ కుట్ర విషయంపైనే దృష్టి కేంద్రీకరించి, తన సొంత రాజకీయ వైఫల్యాలను ఉపేక్షించడంలోనే అసలు ప్రమాదం ఉంది. ఇండియా కూటమి తన వైఫల్యాలను చిత్తశుద్ధితో పరీక్షించుకోవడమనేది మన దేశంలో ప్రజాస్వామ్య మనుగడకు చాలా చాలా ముఖ్యం.

గత ఒక ఏడాది వ్యవధిలో మూడు రాష్ట్రాల శాసనసభ ఎన్నికలు జరిగాయి. తొలుత మధ్యప్రదేశ్, ఆ తరువాత హర్యానా, ఇప్పుడు మహారాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరిగాయి. మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు పెద్ద ప్రశ్నలకు తావిస్తున్నాయి. వాటికి సరైన సమాధానాలు లభించడం లేదు. లోక్‌సభ ఎన్నికలలో పోలయిన ఓట్లకు సంబంధించిన సమాచారంలోని అంతరాలపై పలువురు లేవనెత్తిన సహేతుకమైన ప్రశ్నలకు ఎన్నికల సంఘం సరైన రీతిలో ప్రతిస్పందించలేదు. ఉత్తరప్రదేశ్‌లో ఇటీవలి ఉప ఎన్నికలలో జరిగింది ఎన్నికల మోసమో కాదో చాలా సులువుగా నిర్ధారించగల వ్యవహారం. ఈ ఎన్నికలు అన్నీ ప్రస్తుత సీఈసీ రాజీవ్ కుమార్ ఎన్నికల సంఘం బాధ్యతలు చేపట్టిన తరువాతే సంభవించినవి కావడం గమనార్హం.

మన ఇరుగు పొరుగు దేశాలలో ఎన్నికలలో పోటీ కంటే ఎన్నికల ఫలితాలపై వాదోపవాదాలు చాలా తీవ్ర స్థాయిలో ఉండడం కద్దు. అటువంటి శోచనీయ పరిస్థితిలోకి మనం కూడా జారిపోతున్నామా? అలా జరగకుండా ఉండాలంటే మనం తక్షణమే అటువంటి పరిస్థితి మనకు దాపురించకుండా ఉండాలంటే మనం తక్షణమే క్రియాశీలంగా ప్రతిస్పందించాలి. మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు స్వతంత్ర, విశ్వసనీయ ఎలెక్షన్ ఫోరెన్సిక్స్ (ఎన్నికల ఫలితాల గణాంకాలు సహజంగా ఉన్నాయా లేక విపరీతంగా ఉన్నాయా అన్న విషయాన్ని నిర్ణయించి ఎన్నికలలో మోసం జరిగిందో లేదో స్పష్టంగా సూచించే పద్ధతులు)కు ఒక సరైన సందర్భం.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

ఆ ధనరాశులు ఎక్కడివి?

'సోలార్ కరెంటుని సప[illegible]చేసే కాంట్రాక్టుల కోసం, అదానీ అనే ఒక పెద్ద పెట్టుబడిదారుడు, దేశంలోని కొన్ని రాష్ట్రాల ప్రభుత్వ పెద్దలకు దాదాపు రెండు వేల కోట్ల రూపాయల లంచాలిచ్చాడని, వారం కిందట పత్రికలూ, టీవీలూ సరికొత్త వార్తలిచ్చాయి! 'అదానీ లంచాల కహానీ' అనీ, 'లంచాల అవదానీ' అనీ, సరదా శీర్షికలు పెట్టి మరీ! లంచాల వార్తల వెనక ఒక పెద్ద కథ వుంది! అదేమిటంటే, సూర్యుడి వల్ల వచ్చే ఎండ వేడినించీ కరెంటుని(సోలార్ ఎనర్జీని) తయారు చేయించడం కోసం, అదానీ కంపెనీ, ప్రపంచ వ్యాప్తంగా, 6 వేల, 3 వందల కోట్ల పెట్టుబడులు సేకరించిందట! వాటిల్లో 15 వందల కోట్లని అమెరికాలోని బ్యాంకుల నించీ, అక్కడి ఇతర ఆర్థిక సంస్థల నించీ కూడా! అలా అమెరికా నించీ నిధులు సేకరించిన స్వదేశీ, విదేశీ కంపెనీలు ఏవైనా, తమ వ్యాపార ప్రయోజనాల కోసం, ఏ దేశంలో అయినా, ప్రభుత్వనేతలకు గానీ, అధికారులకు గానీ, లంచాలుగా ఇచ్చినా, ఇస్తానని ఆశజూపినా, అది అమెరికాలో ఒక చట్టం ప్రకారం పెద్ద నేరం అట! అందుకే, అదానీ కంపెనీ మీద అమెరికా కేసులు పెట్టింది. అదానీ నేరం కొన్ని సంవత్సరాల క్రితమే జరిగినా, అదానీ మీద వున్న అమెరికా కేసుల వివరాలు మొన్నీ మధ్యే బయటపడడంతో, భారతదేశంలో ప్రతిపక్షాలు, అదానీ మీద, కేంద్ర ప్రభుత్వం, అరెస్టుతో సహా, చర్యలు తీసుకోవాలని డిమాండు చేస్తున్నాయి. అదానీ, మోదీకి అత్యంత సన్నిహిత పెట్టుబడిదారీ మిత్రుడు కాబట్టి, అతని మీద ప్రభుత్వం చర్యలు తీసుకోదని ప్రతిపక్షాలకు గట్టి అనుమానాలు!

అదానీ ఇచ్చిన లంచాల వ్యవహారం, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా జగన్ వున్న కాలంలో జరిగిందట! 'జగన్‌కి 1750 కోట్లు' లంచంగా ముట్టిందట! ఏది ఏమైనా, ఆ లంచాలు ఎవరు ఎవరికి ఇచ్చారో, ఎంత ఇచ్చారో, నోట్ల రూపంలో ఇచ్చారా, బంగారు నాణాల రూపంలో ఇచ్చారా, బహుమతుల రూపంలోనా, ఏ రూపాల్లో ఇచ్చారో; ఆ లంచాలు తీసుకున్న వాళ్ళు వాటిని ఎక్కడ ఎలా దాచుకున్నారో- ఆ వివరాలన్నీ మనకి అనవసరం. 'మనకి' అంటే, 'శ్రామిక ప్రజలకు' అని. శ్రామిక ప్రజలు అంటే, రకరకాల స్థాయిల్లో, ఇటూ, అటూ, మేధా శ్రమలూ, శారీరక శ్రమలూ చేసేవారు అనే కదా? ఆ లంచాలు ఇవ్వడానికి, వేల కోట్ల ధనరాసులు, ఆ లంచాలిచ్చే వ్యక్తికి ఎలా వచ్చాయో, ఎక్కణ్ణించీ వచ్చాయో అన్నదే మనకి ముఖ్యంగా రావలిసిన ప్రశ్న! అయితే, దీనికి సాధారణంగా మనలోనే కొందరు చెప్పుకునేది ఏమిటంటే: 'ఏముందీ, అదానీకి, అతడి పెట్టుబడుల వల్ల లాభాలు వస్తాయి కాబట్టి, ఆ లాభాల నించే, కొంత ఇస్తాడు' -అని! కానీ, మనకి అసలు తెలియవలిసింది, లంచాల డబ్బు గురించి కాదు,

లంచాలు ఇవ్వడానికి, వేల కోట్ల ధన రాసులు ఆ లంచాలిచ్చే వ్యక్తికి ఎలా వచ్చాయో, ఎక్కణ్ణించీ వచ్చాయో అన్నదే మనకి ముఖ్యంగా రావలిసిన ప్రశ్న! అయితే, దీనికి సాధారణంగా మనలోనే కొందరు చెప్పుకునేది ఏమిటంటే: 'ఏముందీ, అదానీకి, అతడి పెట్టుబడుల వల్ల లాభాలు వస్తాయి కాబట్టి, ఆ లాభాల నించే, కొంత ఇస్తాడు' అని! కానీ, మనకి అసలు తెలియవలిసింది, లంచాల డబ్బు గురించి కాదు, 'లాభాల' డబ్బు గురించే!



'లాభాల' డబ్బు గురించే! అయినా, లాభం రావడం చాలా సహజమైన విషయం అయినట్టే, పెట్టుబడికి వడ్డీ లాభాలు రావా, రావొద్దా- అని, ప్రపంచ జనం, ఆర్థికవేత్తలతో సహా అందరూ అనేస్తారు, భావిస్తారు! లాభానికి వున్న మూల కారణం గురించి, దాని రహస్యం గురించి 160 ఏళ్ళ క్రితం, మార్క్సు వచ్చి చెప్పేవరకూ ఎవరికీ సరిగా తెలీనే తెలీదు. ఈ సోలార్ కరెంటు పరిశ్రమనే ఉదాహరణగా తీసుకుని, ఆ రహస్యం ఏమిటో తెలుసుకో గలం, మార్క్సుని చదివి.

ఏ పరిశ్రమలో అయినా, అది ఒక్క నిమిషం నడవాలన్నా, దానికి 2 అంశాలు కావాలి! సోలార్ పరిశ్రమకీ అలాగే, 2 అంశాలే! (1) కరెంటుని తయారు చేయడానికి మొట్టమొదట కావలిసిన 'సాధనాలు'. ఆ సాధనాలకి ఏవో పేర్లు వుంటాయి. సోలార్ పానల్సూ, మిరర్సూ, ఇన్వర్టర్లూ, వైర్లూ, గ్రిడ్లూ, మీటర్లూ, బ్యాటరీలూ, వగైరా వగైరాలు. ఆ సాంకేతిక వివరాలు దేనికైనా వుంటాయి. అవి అనవసరం. 'ప్రారంభ పదార్థం' ఇక్కడ సూర్యుడి నించీ వచ్చే ఎండే! ఎండ బాగాపడే అనేక ఎకరాల, విశాలమైన భూమి కూడా సహజ సాధనంగా కావల్సిందే ఇక్కడ. (2) ఆ సాంకేతిక సాధనాలతో సోలార్ కరెంటుని తయారు చేసి, దాన్ని నిల్వచేసి, దాన్ని పంపిణీ కూడా చేయడానికి ఎంతోమంది ఇంజనీర్లూ, రకరకాల టెక్నీషియన్లూ, నైపుణ్యం గల కార్మికులూ, సాధారణ శ్రమల కార్మికులూ కూడా ఎందరో కావాలి. వాళ్ళకి జీతాలు ఇస్తేనే, వాళ్ళకి పోషణ కదా? కాబట్టి, మొదట సాధనాలకు అయ్యే ఖర్చూ, తర్వాత శ్రామికులకు ఇచ్చే జీతాల ఖర్చూ- ఈ 2 ఖర్చులే 'పెట్టుబడి' అవుతాయి. ఈ పెట్టుబడి, ఎంత వుండాలో, జరగవలిసిన పనినిబట్టే కదా? ఎంత భూమిలో, ఎన్ని సాధనాలతో, ఎంత మంది కార్మికులతో, ఎంత 'సోలార్ కరెంటుని' తయారు చేయించాలనుకుంటారో, దానిని బట్టి ఎంత డబ్బు కావాలో వుంటుంది.

ఉదాహరణకి, బాగా ఎండలు వుండే రాజస్తాన్‌లో, 14 వేల ఎకరాల్లో, సోలార్ పరిశ్రమ పెట్టాలంటే, 50 వేల కోట్లు అవుతుందని ఒక లెక్క-అట! ఆ లెక్కల వివరాల గందరగోళంలోకి మనం, ఇంతకన్నా వెళ్ళొద్దు. ఎందుకంటే, ఎవరు ఎంత పెట్టుబడిని పోగుచేసుకోగలిగితే, దాన్ని బట్టి పరిశ్రమని చిన్నదో, పెద్దదో పెట్టుకుంటారు.

ఇక్కడ మన ప్రశ్న: లంచాల్ని ఐదో, పదో కాకుండా, కోట్లలో ఇవ్వాలంటే, వాళ్ళు భారీ పరిశ్రమ పెట్టాలి. దానికి భారీ పెట్టుబడి డబ్బు కావాలి కదా? ఈ గోలంతా ఎందుకంటే, ఏ పరిశ్రమకి అయినా, చివరికి లాభం ఎలా వస్తుందో తెలియడానికి. లాభం గురించి తెలిస్తే, లంచం గురించి తెలుస్తుంది. కాబట్టి, అసలు తెలుసుకోవలిసిన రహస్యం, లాభం ఎలా వస్తుంది?- అనే గానీ, కోట్ల కోట్ల లంచాలు ఎలా ఇస్తారు- అని కాదు. సోలారు కరెంటు పరిశ్రమని ఒక ఉదాహరణగా చెప్పుకుందాం. ఈ పరిశ్రమలో, సోలార్ కరెంటుని తయారు చేయడానికి, సాధనాల కోసం ఖర్చుని 80 అనుకుందాం. ఆ సాధనాలను ఉపయోగిస్తూ, సోలార్ కరెంటు తయారవడానికి అవసరమైన 'శ్రమలు' చేసే కార్మికులందరి జీతాలూ కలిసి 20. ఇది రెండో ఖర్చు. 2 ఖర్చులూ కలిసి 80+20=100. ఇదే పెట్టుబడి. కరెంటు తయారైంది. ఇదే కొత్త సరుకు. దీన్ని అమ్మడానికి పెట్టుబడిదారుడే ధరని నిర్ణయిస్తాడు. ఇక్కడ ఈ సరుకు ధర 120. ఈ ధరతో అమ్మకం జరుగుతుంది. 100 ఖర్చుతో తయారు చేసిన కరెంటుకి, 120 ఎలా వచ్చింది? ఆ 20 అదనంగా ఎలా వచ్చిందో, క్లుప్తంగా చెప్పుకోవాలంటే: (1) సాధనాలు 80 విలువ గల శ్రమతో గతంలో తయారయ్యాయి. అవి నిర్జీవమైనవి కాబట్టి, అవి ఏ శ్రమా చెయ్యవు. అందుకే, అవి తమ విలువకంటే, ఎక్కువ విలువని ఇవ్వలేవు. వాటి విలువ 80గానే వుంటుంది గానీ పెరగదు. అయితే, తయారైన సరుకుని (కరెంటుని) 120కి అమ్మినప్పుడు, ఆ 120లో, సాధనాల 80 విలువని తీసివేస్తే, మిగిలిన 40 విలువ ఏమిటి? సాధనాలను ఉపయోగిస్తూ, కార్మికులు, పనిదినం అంతా, కొత్తగా చేసిన శ్రమల విలువ అది. కానీ, యజమాని కార్మికులకు జీతాల పేరుతో ఇచ్చేది 20 విలువ మాత్రమే! పనిదినం 10 గంటలనుకుంటే, మొదటి 5 గంటల్లోనే, కార్మికులు 20 విలువగల శ్రమ చేసేస్తారనుకుందాం. అంటే, వాళ్ళకి యజమాని ఇచ్చే జీతం విలువకి సమానమైన శ్రమ చేసేస్తారన్నమాట! మిగతా 5 గంటలలో కార్మికులు చేసే శ్రమ అంతా, పెట్టుబడిదారీ యజమానికి, డబ్బు తీసుకోకుండా, ఉచితంగా, కార్మికులు అదనంగా 'శ్రమ' చేసిపెడుతున్నారని అర్థం! అదే అదనపు విలువ. దాన్నే పెట్టుబడిదారీ ఆర్థికశాస్త్ర భాషలో నాజూగ్గా 'లాభం' అంటారు. జీతాల విలువని మించి, అదనంగా విలువ లాగేలా పనిచేయించడమే 'శ్రమ దోపిడీ'! ఈ లాభం (మార్క్సు మాటల్లో 'అదనపు విలువ') మన ఉదాహరణలో, 20. (ఒక వేళ, 120 విలువ గల సరుకుకి ధరని పెంచి, 140కి అమ్మినా, పెరిగిన ధర కూడా, జరిగిన అదనపు శ్రమ విలువే. 20 అదనపు శ్రమ విలువగా వున్నది, ధరని పెంచినప్పుడు 40 అదనపు శ్రమ విలువగా కూడా విస్తరించిందని అర్థం. అంటే, ఇక్కడ ధర, శ్రమ విలువే!) అది, కొన్ని భాగాలుగా పంపిణీ అవుతుంది: (1) సోలార్ కరెంటు తయారీకి ఉపయోగించే సాధనాలు ఏ భూమిమీద అయితే అమర్చుతారో, ఆ భూమికి 'కౌలు' పేరుతో, లేదా 'అద్దె' పేరుతో కొంత వెళ్తుంది. (2) పెట్టుబడి కోసం డబ్బు ఇచ్చిన బ్యాంకులకి 'వడ్డీ'గా కొంత వెళ్తుంది. (3) ప్రభుత్వానికి కట్టే పన్నులు. (4) కాంట్రాక్టులు ఇప్పించినందుకు ప్రభుత్వ పెద్దలకు ఇచ్చే లంచాలు. (6) చివరికి మిగిలేది, తన సంస్థకి లాభం. ఈ లాభం డబ్బుల్లో, కొంత తన కుటుంబ పోషణకీ, విలాసాలకీనూ! ఎక్కువ భాగం, తన శ్రమ దోపిడీని పెద్ద ఎత్తున సాగించడానికి అవసరమైన అదనపు పెట్టుబడిగా వాడతాడు.

చివరికి తేలింది ఏమిటీ అంటే, లంచాలు అనేవి, కార్మికుల శ్రమల్ని దోచి సంపాదించిన 'లాభాల' (అదనపు విలువల) నించే వస్తాయి- అని! కాబట్టి, మేధా శ్రామికులారా! శారీరక శ్రామికులారా! లంచాలు ఇచ్చే వాళ్ళ కుటుంబాలనూ, లంచాలు తీసుకునే వాళ్ళ కుటుంబాలనూ పోషించేది కార్మికవర్గమే! అంటే, మనమే అని గ్రహించండి! ఈ గ్రహింపుని కార్మిక వర్గానికి ఇవ్వకుండా, ఎన్ని పేపర్లలో, ఎన్ని టీవీల్లో, ఎన్ని యూట్యూబుల్లో, ఎంత రాసినా, మాట్లాడినా, అవన్నీ కాయితాల కబుర్లే! కాలక్షేపం కబుర్లే అవుతాయి. అవి, అసలు నిజం వేపు జనాల దృష్టిని తిప్పలేవు.









సరిలేరు మీకెవ్వరూ..

దివ్యాంగులైతేనేం.. దేనిలోనూ తగ్గేది లేదని నిరూపించారు. వైకల్యాన్ని అధిగమించి ఉరుకులు పరుగులు పెట్టారు. కంటిచూపు లేకపోయినా విజయ లక్ష్యాన్ని నిర్దేశించుకుని తేలిగ్గా చేరుకున్నారు. షాట్‌పట్‌లో బాల్‌ను గురిచూసి విసిరి విజేతలుగా నిలిచారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా విభిన్న ప్రతిభావంతుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఇందిరాగాంధీ స్టేడియంలో దివ్యాంగులకు క్రీడా పోటీలు నిర్వహించారు. దివ్యాంగులు ఉత్సాహంగా పాల్గొని తమలోని ప్రతిభను చూపించారు. కలెక్టర్ లక్ష్మీశ పోటీలను ప్రారంభించడమే కాకుండా.. దగ్గరుండి దివ్యాంగులను ఉత్సాహపరిచారు. 8

నగరానికి మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్



మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న కృష్ణా కలెక్టర్ బాలాజీ

గన్నవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. గురువారం రాత్రి ఢిల్లీ నుంచి ఎయిరిండియా విమానంలో రామ్‌నాథ్ దంపతులు గన్నవరం విమానాశ్రయానికి విచ్చేశారు. వారికి కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ గంగాధరరావు తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన రాజ్‌భవన్‌కు వెళ్లారు. నగరంలో ఏర్పాటుచేసిన రెండు ముఖ్యమైన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు రామ్‌నాథ్ దంపతులు విచ్చేశారు. వారికి గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ దంపతులు సాదరస్వాగతం పలికారు. రెండు రోజులు నగరంలోనే ఉంటారు.

అవినీతి మేత

నగరంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ 'ధన'కార్యాలు

తనిఖీలకు వెళ్తే కాసులు రాలాల్సిందే..

- ● బెంజిసర్కిల్‌లోని ఒకటే కాంప్లెక్స్‌లో రెండు బ్రైన్ రెస్టారెంట్లు ఉన్నాయి. ఓ బ్రైన్ రెస్టారెంట్ వైసీపీ అధినేత జగన్ సన్నిహితులది. ఆ పార్టీ అధికారం కోల్పోయే చివరి దశలో జగన్ సన్నిహితులు తమ వ్యాపారం కోసం అదే ప్రాంగణంలో ఉన్న మరో రెస్టారెంట్‌పై ఫుడ్ సేఫ్టీ అధికారులతో దాడులు చేయించారు. అధికారులు తనిఖీలు చేసి సదరు రెస్టారెంట్‌లో ఆహార పదార్థాల్లో నాణ్యత లేదంటూ నోటీసులు జారీ చేశారు. కట్ చేస్తే.. దాడులు చేసిన అధికారి స్వామికార్యంతో పాటు స్వకార్యం కూడా చక్కబెట్టేసుకున్నారు. తనిఖీలు నిర్వహించిన రెస్టారెంట్ యాజమాన్యం నుంచి సుమారు రూ.2 లక్షలు వసూలు చేశారు.
- ● సుమారు నెల క్రితం పంటకాల్వ రోడ్డులోని ఓ హోటల్‌లో బిర్యానీ తిని పదిమంది చిన్నారులు అస్వస్థతకు గురయ్యారు. దీనిపై ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదులు అందడంతో ఆ హోటల్‌లో తనిఖీలు నిర్వహించి నోటీసులు జారీ చేశారు. ఆ తర్వాత సదరు హోటల్‌పై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీనికి కారణం సదరు హోటల్ యాజమాన్యం ఫుడ్ సేఫ్టీ అధికారికి రూ.5 లక్షల వరకు కప్పం చెల్లించుకోవడమే.



ప్రజలు కల్తీ ఆహారం బారిన పడకుండా పర్యవేక్షించాల్సిన ఫుడ్ సేఫ్టీ అధికారులే ఇలా కాసులకు కక్కుర్తిపడి వసూల్ రాజాలుగా మారుతున్నారు.

- వైసీపీ నాయకుల రెస్టారెంట్ కోసం మరొకరిపై దాడి డ్రామా
- రెస్టారెంట్ మూసివేస్తానంటూ భారీగా వసూళ్లు
- పంటకాల్వ రోడ్డులోని ఓ రెస్టారెంట్‌లో ఫుడ్ పాయిజన్
- కాసులు తీసుకుని చర్యల్లేకుండా ఫైల్ క్లోజ్

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : నగరంలో హోటల్ వ్యాపారం దినదినాభివృద్ధి చెందుతోంది. ఆహార కల్తీ కూడా అదేస్థాయిలో వృద్ధి సాధిస్తోంది. నిత్యావసరాల నుంచి పాల వరకు అన్నీ కల్తీకి గురవుతున్నాయి. ఆహార శుద్ధి, రవాణా, నిల్వ, పంపిణీ, తయారీ యూనిట్లను పర్యవేక్షించాల్సిన బాధ్యత ఫుడ్ సేఫ్టీ అధికారులది. ప్రస్తుతం జిల్లాలో ఇద్దరు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు విధులు నిర్వహిస్తున్నారు. ఒకరు నగరంలోని కార్యకలాపాలను పర్యవేక్షిస్తుండగా, మరొకరు మిగిలిన జిల్లాలను పర్యవేక్షిస్తున్నారు. నగరంలో విధులు నిర్వహిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఆహార పదార్థాల నాణ్యతను పర్యవేక్షించడాన్ని గాలికొదిలేసి కాసుల వేటకు ప్రాధాన్యమిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పైన ఉదహరించిన ఉదంతాలు కూడా సదరు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ధనకార్యాలే. మధురానగర్, పసుపుతోట వంటి ప్రాంతాల్లో కొందరు వ్యాపారులు చపాతీలు, పరోటాలు, చేగోడీలు వంటి ఆహార పదార్థాలను తయారుచేసి నగరంలోని వ్యాపారులకు సరఫరా చేస్తుంటారు. ఇలాంటి వ్యాపారులకు లైసెన్సులు మంజూరు చేసే విషయంలో చేతివాటం చూపుతూ ప్రభుత్వ ఖజానాకు జమ కావాల్సిన మొత్తానికి సదరు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ గండికొడుతున్నారు.

సిబ్బంది కొరతతో..

ఫుడ్ ఇన్‌స్పెక్టర్లకు జాబ్‌చార్ట్ చాలా ఉంటుంది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) లైసెన్సులు జారీ చేయడం, మధ్యాహ్న భోజన పథకంలో ఆహార నాణ్యతను పరిశీలించడం, రేషన్ దుకాణాలు, ఎంఎల్ఎస్ పాయింట్లలో తనిఖీలు చేసి కల్తీ ఏమైనా జరిగిందా లేదా చూడటం చేయాలి. తగిన స్థాయిలో సిబ్బంది ఉంటేనే ఇదంతా సాధ్యమవుతుంది. విజయవాడ వంటి నగరంలో కనీసం 15 మంది ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల అవసరం ఉంది. కానీ, ఒక్కరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ, సెంట్రల్ పబ్లిక్ హెల్త్ నిబంధనల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో లక్ష జనాభాకు ఒకరు, పట్టణ ప్రాంతాల్లో ప్రతి 50 వేల మందికి ఒక ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఉండాలి. కానీ, ఈ స్థాయిలో సిబ్బంది ఎక్కడా లేరు. జిల్లాకు ఇద్దరు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఉండగా, కృష్ణాజిల్లాలో మరో ఇద్దరు విధులు నిర్వహిస్తున్నారు. సిబ్బంది కొరత కూడా ఈ అవినీతికి ఆస్కారంగా మారింది.

'నాది ఏపీ సెక్రటేరియేట్ స్థాయి..'

సదరు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సతీమణి వెలగపూడి సచివాలయంలో విధులు నిర్వహిస్తుంటారు. దీంతో ఈయన కూడా తన కారుపై ఏపీ సెక్రటేరియేట్ అని స్టిక్కర్ అతికించుకుని తిరుగుతుంటారు. హోటల్ యజమానులను దాడుల పేరుతో బెదిరించడం, వారి నుంచి భారీగా మామూళ్లు గుంజడం వీరి విధుల్లో భాగమే. ఇది పద్ధతి కాదని, పై అధికారులకు ఫిర్యాదు చేస్తానని ఎవరైనా హోటల్ యజమాని అంటే చాలు.. తనను ఏ అధికారి, ఏమీ చేయలేదని, తనకు సెక్రటేరియేట్ స్థాయిలో పలుకుబడి ఉందంటూ ఈ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ బెదరగొడుతుంటారు. తప్పు చేసిన హోటల్ యజమానులపై చర్యలు తీసుకోవడంతో పాటు అక్రమార్కులకు కొమ్ముకాస్తూ సరైన రీతిలో వ్యాపారాలు చేసుకునే వారిని ఇబ్బంది పెడుతున్న ఈయన అక్రమ దందాలపై సమగ్ర విచారణ జరపాలని హోటల్ యజమానులు కోరుతున్నారు.

ఆరోగ్యంతో ఆటలు

తక్కువ ధరకు కాలం చెల్లిన పదార్థాల విక్రయం

- నగరంలో ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు
- రూ.10 లక్షల విలువైన సరుకు సీజ్ 8లో

• స్వామియే శరణం





- విజయవాడ రైల్వేస్టేషన్‌లో అయ్యప్పల సందడి
- ఉమ్మడి కృష్ణా, గోదావరి జిల్లాల నుంచి భారీగా రాక
- శ్రీకాకుళం, విజయనగరం నుంచి వందల సంఖ్యలో..
- తిరిగి ఇక్కడి నుంచి ప్రత్యేక రైళ్లలో శబరిమలకు..
- రైల్వేస్టేషన్‌లోనే అయ్యప్పల స్నానాలు.. పూజలు
- దుర్గమ్మ దర్శనానికి పోటెత్తుతున్న స్వాములు 6లో

ఆ 8 మందికి రెండు రోజుల పోలీస్ కస్టడీ

- టీడీపీ నేత రంగబాబుపై దాడి కేసు
- ప్రస్తుతం నెల్లూరు జైల్లో నిందితులు 8లో

ఫుడ్ ట్రాక్ తప్పింది



స్టాల్ బయట విక్రయాలు

రైల్వేస్టేషన్‌లో అనధికారికంగా సెల్ కిచెన్ వ్యాపారం



ఫుడ్ ప్లాజాకు ఆహార పదార్థాల చేరవేత

ఆంధ్రజ్యోతి పరిశీలన

- కాంట్రాక్టు గడువు ముగిసినా చాటుగా నిర్వహణ
- ఫుడ్ ప్లాజా స్టాల్‌లో ప్యాకింగ్.. రైళ్లకు అందజేత
- రైల్వేకు రోజుకు రూ.1.30 లక్షల నష్టం
- ఆ మేరకు నిర్వహకుడికి లబ్ధి.. భారీ ఆదాయం
- విజయవాడ, సికింద్రాబాద్ అధికారుల అండతోనే..

గడువు ముగిసినా అనధికారికంగా ఆహార వ్యాపారం చేస్తూ రైల్వే ఆదాయానికి భారీగా గండికొడుతున్నారు. ఐఆర్‌సీటీసీ, రైల్వేస్టేషన్, కమర్షియల్ విభాగంలోని కొందరు అధికారుల అండతో రైల్వేస్టేషన్ కేంద్రంగా 'సెల్ కిచెన్' వ్యాపారాన్ని చాటుగా నడిపిస్తున్నారు. రైల్వేలో జరుగుతున్న ఈ అవినీతి వ్యవహారాలపై ఇటీవల సీబీఐ దృష్టిపెట్టి డీఆర్ఎం స్థాయి అధికారులను పట్టుకుంటున్నా అవినీతి అధికారుల్లో కనీస చలనం కూడా లేకుండాపోయింది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/రైల్వేస్టేషన్) : రైల్వే ప్రయాణికులకు నాణ్యమైన ఆహారాన్ని తక్కువ ధరకు అందించేందుకు ఐఆర్‌సీటీసీ నేతృత్వంలో విజయవాడ రైల్వేస్టేషన్‌లో సెల్ కిచెన్‌ను ఏర్పాటుచేశారు. దీని కాంట్రాక్టు గడువు ముగిసి చాలాకాలం అవుతున్నా అధికారులు మాత్రం ఇంతవరకు టెండర్లు పిలవలేదు. కానీ, సెల్ కిచెన్ మాత్రం రైల్వేస్టేషన్‌లో అనధికారికంగా వ్యాపారం నిర్వహిస్తోంది. దీంతో రైల్వేకు రోజుకు రూ.1.30 లక్షల నష్టం వస్తుండగా, ఆ మొత్తాన్ని అనధికార వ్యక్తులు పొందుతూ ఆహార విక్రయాల ద్వారా రూ.కోట్లు గడిస్తున్నారు. ఈ అక్రమ వ్యవహారంలో సికింద్రాబాద్‌కు చెందిన ఐఆర్‌సీటీసీ అధికారులతో పాటు విజయవాడ రైల్వేస్టేషన్, కమర్షియల్ విభాగంలోని కొందరు అధికారుల హస్తం ఉన్నట్టు తెలుస్తోంది.

అధికారుల అండతో భారీ రాబడి

రైల్వేస్టేషన్‌లోని ఆరో నెంబర్ ప్లాట్‌ఫాంపై ఈ సెల్ కిచెన్‌ను ఏర్పాటు చేశారు. రోజుకు రూ.1.30 లక్షల అద్దె ప్రాతిపదికన ప్రయాణికులకు నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు ఏర్పాటుచేసిన సెల్ కిచెన్ గడువు ముగిసింది. ఆ తర్వాత సెల్ కిచెన్‌కు రైల్వే అధికారులు మిగతా 6లో..

ఎటు చూసినా అయ్యప్పలే..







శబరిమలకు వెళ్లే అయ్యప్ప స్వాములతో బెజవాడ జంక్షన్ కిటకిటలాడింది. భక్తులతో స్టేషన్‌లో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. ఉమ్మడి కృష్ణా, గోదావరి జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో అయ్యప్పలు విజయవాడకు పలు వాహనాల్లో చేరుకుంటున్నారు. అనంతరం వారంతా ఒకటోనెంబర్ ప్లాట్‌ఫామ్‌పైనే సేదదీరుతున్నారు. మరికొందరు బుకింగ్ కౌంటర్ల వద్ద విశ్రమిస్తున్నారు. **(ఆంధ్రజ్యోతి, విజయవాడ)**

విజయవాడ నుంచి శబరిమలకు రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లు నడుపుతుండటంతో.. విజయనగరం, శ్రీకాకుళం తదితర ప్రాంతాల నుంచి విజయవాడ వచ్చి ఇక్కడి నుంచి శబరిమలకు బయలుదేరుతున్నారు. ఒక రోజు ముందుగానే స్టేషన్‌కు చేరుకుని ఇక్కడే పట్టాలపైనే స్నానమాచరిస్తున్నారు. స్టేషన్‌లోనే అయ్యప్ప పూజలు చేస్తున్నారు. ప్రత్యేక రైళ్ల కోసం ఎదురుచూస్తూ అక్కడే విశ్రమిస్తున్నారు. పిల్లలు, పెద్దలు, వృద్ధులు అన్ని వర్గాలు ఈసారి పెద్ద సంఖ్యలో అయ్యప్ప దీక్ష చేపట్టారు. దీంతో రైల్వే స్టేషన్ భక్తులతో సందడిగా మారింది. రైల్వే అధికారులు కూడా అయ్యప్పల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని అదనపు బోగీలు నడపటంతో పాటు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నారు. విజయవాడ డివిజన్ పరిధిలో 20 వరకు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నారు. రైల్వేస్టేషన్‌లో బుకింగ్ కౌంటర్లు, ప్లాట్‌ఫామ్స్ ఎటు చూసినా అయ్యప్పల కోలాహలంతో సందడి నెలకొంది.

వైద్య కళాశాలల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

» మంత్రి సత్యకుమార్ యాదవ్



మచిలీపట్నం టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో వైద్య కళాశాలల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. గురువారం మచిలీపట్నంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ, ఐదేళ్ల వైసీపీ పాలనలో కళాశాలల నిర్వహణ విఫలమైందన్నారు. జగన్ సీఎంగా ఉన్నా సొంత జిల్లాలోనే వైద్య కళాశాలను సమర్థవంతంగా నిర్వహించలేదన్నారు. కూటమి ప్రభుత్వంలో కళాశాలల భవన నిర్మాణాలు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. కళాశాలల్లో ఖాళీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ కళాశాలల్లో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. 17 వైద్య కళాశాల అభివృద్ధిపై సమీక్షించామన్నారు. పారా మెడికల్ సిబ్బంది ఖాళీలను భర్తీ చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సుముఖత వ్యక్తం చేశారన్నారు. సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో సక్రమంగా డ్రెయిన్లు పూడికలు తీయలేదని, దీనివల్ల రాష్ట్ర వ్యాప్తంగా దోమల బెడద ఉందని సర్వేలో తేలిందన్నారు. ఎప్పటికప్పుడు తాగునీటి పరీక్షలు నిర్వహించి నివేదికలు తెప్పిస్తున్నామని, కలుషిత నీరు సరఫరా చేయకుండా మునిసిపాలిటీలు, పంచాయతీలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల బదిలీలపై మంత్రికి సంఘ నాయకులు వినతిపత్రం సమర్పించారు.



క్యూలైన్ల పనులు ప్రారంభిస్తున్న ఈవో రామారావు

భవానీదీక్షల విరమణకు ఏర్పాట్లు

వన్‌టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో భవానీదీక్షల విరమణలకు సంబంధించి ఏర్పాట్లు గురువారం ప్రారంభమయ్యాయి. ప్రతీఏడాది జరుగుతున్న సంప్రదాయంలో భాగంగా మండల, అర్థమండల దీక్షలు తీసుకున్న వారంతా దీక్షల విరమణకు భారీ సంఖ్యలో దేవస్థానానికి రానున్నారు. అత్యధిక శాతం భక్తులు ఆలయంలోనే దీక్షలు విరమించనున్నారు. ఈక్రమంలో భక్తులకు అమ్మవారి శీఘ్రదర్శనానికి ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. గురువారం కెనాల్ రోడ్డులో వినాయకుడి గుడి వద్ద క్యూ ఏర్పాట్లకు సంబంధించి పనులు ప్రారంభమయ్యాయి. తొలుత ఈవో కేఎస్ రామారావు, ఈఈ వైకుంఠరావు, డిప్యూటీ ఈఈలు, ఏఈలు, వైదిక సిబ్బంది విఘ్నేశ్వరుని పూజ, వాస్తుపూజ చేసి గుంజలను నిలబెట్టారు. విఘ్నేశ్వరుడి పూజతో పాటు దుర్గమ్మ చిత్రపటానికి పూజలు నిర్వహించారు. అమ్మవారి చెంతన దీక్ష విరమణల కార్యక్రమం నిర్విఘ్నంగా, విజయవంతంగా జరగాలంటూ సంకల్పించి క్యూ నిర్మాణాలను ప్రారంభించారు.

పుట్టకుండానే.. అమ్మకానికి బిడ్డ!

» వైద్య ఖర్చులకు నగదు చెల్లింపు

» ఐసీడీఎస్ అధికారుల విచారణ

జంగారెడ్డిగూడెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అమ్మ కడుపు నుంచి రాకముందే బేరం మాట్లాడుకున్న దంపతులు బిడ్డ పుట్టగానే ఓ మహిళకు అప్పగించడానికి సిద్ధపడిన ఘటన ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో ఆలస్యంగా వెలుగుచూసింది. పురిటి బిడ్డను తీసుకువెళ్లడానికి ప్రయత్నించిన ఓ మహిళను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బేబీ కమల చొరవతో ఆసుపత్రి సిబ్బంది పోలీసులు అడ్డుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం వేళ్లచింతలగూడెం గ్రామానికి చెందిన కొయ్య చినబాబు ద్వారకాతిరుమల మండలం తిమ్మన పాలెం గ్రామానికి చెందిన గౌరీని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. కులాంతర వివాహం కావడంతో గౌరీ వైపు బంధువులు వీరిని పట్టించుకోవడం లేదు. వివాహం అనంతరం వీరు ఐదుగురు పిల్లలను కన్నారు. ఈ నెల 26వ తేదీ రాత్రి పదిగంటల ప్రాంతంలో గౌరీ ఐదవ బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం ఆసుపత్రి వైద్యులు పిల్లలు పుట్టకుండా ఆమెకు సిజేరియన్ చేశారు. బిడ్డ పుట్టిన కొద్ది గంటలకే విజయవాడ బెంజ్‌సర్కిల్‌కు చెందిన లక్ష్మి అనే మహిళ పుట్టిన మగబిడ్డను తీసుకువెళ్ళడానికి బిడ్డ తల్లిదండ్రులతో మాట్లాడుతుండగా విన్న సిబ్బంది వెంటనే ఆ విషయాన్ని ఆసుపత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ బేబీ కమలకు సమాచారమందించారు. వెంటనే ఆమె స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆసుపత్రికి వచ్చిన పోలీసులు మహిళను విచారించగా విస్తుపోయే విషయాలు చెప్పింది. తన సోదరికి పిల్లలు లేక పోవడంతో పెంచుకోవడానికి ఈ బిడ్డను తమకు ఇస్తానన్నారని గత కొంతకాలం నుంచి మందులకు, వైద్యానికి రూ.20 వేలు ఇచ్చినట్లు ఆమె తెలిపింది. అందుకే బిడ్డను తీసుకువెళ్ళడానికి వచ్చినట్లు చెప్పింది. తల్లిదండ్రులకు ఇష్టపూర్వకంగా బిడ్డను ఇచ్చినా చట్ట ప్రకారం దత్తత తీసుకోవాలి గానీ ఇలా అప్పుడే పుట్టిన పసికందును తీసుకువెళ్ళడం చట్టరీత్యా నేరమని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బేబీ కమల ఆ మహిళను హెచ్చరించారు. దీంతో పోలీసులు ఆ మహిళను గద్దించి ఆసుపత్రి నుంచి పంపించి వేశారు.

ఐసీడీఎస్ సీడీపీవో విచారణ

ఐసీడీఎస్ సీడీపీవో పి.బ్యూలా సిబ్బందితో పసిబిడ్డ తల్లిదండ్రులు చినబాబు, గౌరీలను విచారించారు. చట్టప్రకారమే దత్తత ఇవ్వాలి కానీ సొంత పిల్లలైనంత మాత్రాన ఎవరికి పడితే వారికి ఇవ్వడానికి వీలు లేదని హెచ్చరించారు. ఇదిలావుండగా నాలుగో బిడ్డ పండుబాబు ప్రస్తుతం తల్లిదండ్రుల వద్ద లేడు. ఎక్కడ ఉన్నదో తీసుకురావాలని ఐసీడీసెస్ అధికారులు కోరారు. పిల్లలను పేదరికం కారణంగా పోషించలేకపోతే స్త్రీ,శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సంరక్షణ కేంద్రాలలో చేర్పిస్తామని తెలిపారు.



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, చిత్రంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్యేలు కామినేని, కాగిత కృష్ణప్రసాద్, ముడా చైర్మన్ మట్టా ప్రసాద్ తదితరులు

కృష్ణా జిల్లా అభివృద్ధిలో ముడాది కీలక పాత్ర

» మంత్రి సత్యకుమార్ యాదవ్ » ముడా చైర్మన్‌గా మట్టా ప్రసాద్ బాధ్యతల స్వీకరణ

మచిలీపట్నం టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నంతో పాటు కృష్ణా జిల్లా అభివృద్ధిలో ముడా కీలక పాత్ర వహించాలని.. ఆ దిశగా నూతన చైర్మన్ మట్టా ప్రసాద్ కృషి చేయాలని వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా గురువారం బీజేపీ నేత మట్టా ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో ముడా వైస్‌చైర్మన్, జేసీ గీతాంజలి శర్మ సమక్షంలో ఫైళ్లపై సంతకాలు చేశారు. అనంతరం మంత్రి మంత్రి మాట్లాడుతూ, బందరు పోర్టు అభివృద్ధిలో ముడా గతంలో గణనీయమైన పాత్ర వహించిందన్నారు. నగర అభివృద్ధితో పాటు కలంకారీకి కేంద్రమైన పెడన నియోజకవర్గ అభివృద్ధిని చేపట్టాలన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, బందరు పోర్టు అభివృద్ధి ద్వారా జిల్లా రూపురేఖలే మారిపోతాయన్నారు. జిల్లా అభివృద్ధిలో ముడా ప్రధాన పాత్ర వహిస్తుందన్నారు. ముడా చైర్మన్ మట్టా ప్రసాద్ మాట్లాడుతూ, శక్తివంచన లేకుండా తనకిచ్చిన బాధ్యతలను నిర్వహిస్తానని చెప్పారు. కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, జనసేన జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ, మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, వీరంకి గురుమూర్తి, బత్తిన దాసు, చిగురుపాటి కుమారస్వామి, ఎస్.దయాకరరెడ్డి, సురేంద్రమోహన్, షేక్‌బాజీ, యామిని శర్మ, పంతం గజేంద్ర, బొమ్మిడి గణేష్, కొనకళ్ల బుల్లయ్య, కాగిత వెంకటేశ్వరరావు, తదితరులు మాట్లాడారు.

మోటారు బెల్టు లాగేయడంతో వీఎంసీ ఉద్యోగికి గాయం

చిట్టినగర్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మంచినీళ్లు తాగుతుండగా మోటారు బెల్టు లాగేయడంతో వీఎంసీ ఉద్యోగి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన బుధవారం జరిగింది. విజయవాడ అజిత్‌సింగ్ నగర్ బ్లాక్ నంబరు 31కి చెందిన దిరిసాల సత్యనారాయణ వీఎంసీ వాటర్ వర్క్స్‌లో ఫిట్టర్‌గా పనిచేస్తున్నాడు. ప్రస్తుతం ఆయన శ్రీనగర్ కాలనీలో ఉన్న వాటర్ వర్క్స్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. బుధవారం విధుల్లో ఉండగా మోటారు పక్కన నిలబడి మంచినీళ్లు తాగుతుండగా ఆయన ప్యాంటును బెల్టు లాగేసింది. దీనితో ఆయన మోకాలు కింది భాగం వద్ద తీవ్రమైన గాయమైంది. ప్రస్తుతం ఆయన బెంజ్‌సర్కిల్ వద్ద ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు.

ఫసల్ బీమాతో రైతుకు ధీమా

» నష్టాల నుంచి ఆదాయ స్థిరీకరణకు భరోసా

» పథకంపై రైతుల్లో అవగాహన కల్పించాలి

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వైపరీత్యాలతో పంట దిగుబడి నష్టపోయిన రైతుకు భరోసా కల్పించేలా వ్యవసాయ ఆదాయ స్థిరీకరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై)ను అమలుచేస్తున్నాయని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ నిధి మీనాతో కలిసి పథకం అమలుపై జిల్లాస్థాయి పర్యవేక్షణ, జాయింట్ కమిటీ, సమన్వయ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంటల బీమా పథకం (రబీ 2024-25) పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ప్రకృతి వైపరీత్యాలతో పంట దిగుబడికి నష్టం వాటిల్లిన సందర్భంలో రైతుకు భరోసా కల్పించేలా వ్యవసాయ ఆదాయ స్థిరీకరణ, రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం ఉపయోగపడుతుందన్నారు. పథకం ద్వారా పూర్తి ప్రయోజనం పొందే విషయమై రైతులకు క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని, దిగుబడి ఆధారిత పథకం అమలు విధివిధానాలు, ఎంపిక చేసిన పంటలు, బీమా యూనిట్లు, ప్రీమియం రేట్లు, బీమా మొత్తం, పరిహారాన్ని లెక్కించే విధానం తదితర అంశాలను వివరించాలని అధికారులకు సూచించారు.



పంటల బీమా పథకం పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, జిల్లా అధికారులు

- జిల్లాలో పథకం అమలుకు ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీగా టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్సు కంపెనీ వ్యవహరిస్తోందని వివరించారు. వరికి గ్రామం యూనిట్‌గా, మొక్కజొన్నకు మండలం యూనిట్‌గా, శెనగలకు జిల్లా యూనిట్‌గా తీసుకోవడం జరుగుతుందన్నారు.
- వరి, మొక్కజొన్నలకు ఎకరాకు రూ.42 వేలు బీమా మొత్తానికి రూ.126 ప్రీమియం, శెనగలకు ఎకరాకు రూ.28 వేలు బీమా మొత్తానికి రూ.56 ప్రీమియం రైతులు చెల్లించాల్సి వుంటుందని తెలిపారు. పథకంలో చేరేందుకు వరికి డిసెంబరు 31లోగా మొక్కజొన్న, శెనగలకు డిసెంబరు 15లోగా ప్రీమియం చెల్లించాల్సి వుంటుందని వ్యవసాయశాఖ అధికారులు వివరించారు.
- పంట రుణం తీసుకుంటే సంబంధిత బ్యాంకు నేరుగా బీమా కంపెనీకి ప్రీమియం చెల్లిస్తుందని, రుణం తీసుకోని రైతులు మాత్రం ప్రీమియంను సమీపంలోని కామన్ సర్వీస్ సెంటర్, సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్ తదితర మార్గాల ద్వారా చెల్లించవచ్చన్నారు. ఈ విషయంలో గ్రామస్థాయిలోని రైతు సేవా కేంద్రాలతో సమన్వయం చేసుకోవాలన్నారు.
- నేషనల్ క్రాప్ ఇన్సూరెన్సు పోర్టల్ (ఎన్‌సీఐపీ) ద్వారా నేరుగా వెబ్‌సైట్లో/మొబైల్ యాప్ ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చన్నారు. పథకానికి సంబంధించి పూర్తి వివరాలకు రైతు సేవాకేంద్రాలు, మండల వ్యవసాయ, ఉద్యాన అధికారులను సంప్రదించాలన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ పంటల్లో పురుగులు, తెగుళ్ల యాజమాన్య దీపికలను ఆవిష్కరించారు. సమావేశంలో ప్రగతిశీల రైతులు శీలంనేని సాంబశివరావు, ఉప్పుగుండ్ల మాధవరావు, జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమార్, సీపీఓ వై.శ్రీలత, గరికపాడు కేవీకే శాస్త్రవేత్త శివప్రసాద్, ఇరిగేషన్ డిప్యూటీ ఎస్ఈ కృష్ణప్రసాద్, టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్సు కంపెనీ ప్రతినిధి యు.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లలో సాధారణ సౌకర్యాల కేంద్రాలు చెప్పండి

» ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

వన్‌టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఏపీలో గత అయిదు సంవత్సరాల్లో సాధారణ సౌకర్యాల కేంద్రాలు ఎన్ని ఏర్పాటు చేశారు.. ఎన్టీఆర్ జిల్లాలో ఎన్ని ఉన్నాయి.. వివరాలు తెలపాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ పార్లమెంట్‌లో ప్రస్తావించారు. దీనిపై కేంద్ర మైక్రో, చిన్న, మధ్యతరగతి పరిశ్రమలశాఖ సహాయ మంత్రి సుశ్రీ శోభా కరందాజే బదులిస్తూ ఏపీలో ఎంఎస్ఈ సీడీపీ కింద 7, ఐడీ ప్రాజెక్టులు 21 ఆమోదం పొందాయన్నారు. 2021-2022లో గోల్డ్ ఆభరణాల క్లస్టర్ సాధారణ సౌకర్య కేంద్రం ఏర్పాటు జరిగిందన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలపై అధికారుల చర్యలు

గన్నవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : వీరపనేనిగూడెంలో మట్టి అక్రమ తవ్వకాలపై అధికారులు తనిఖీలు చేపట్టారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాలకు అధికారులు స్పందించారు. తహసీల్దారు కేవీ శివయ్య ఆదేశాల మేరకు ఆర్ఐ రవి, వీఆర్వోలు మట్టి తవ్వకాలు చేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. అలాగే ఇటుక బట్టీల వద్ద పోసిన గుట్టలను తహసీల్దారుకు రిపోర్టు చేశారు. మట్టి తవ్వకందారులను పిలిపించి మాట్లాడారు. క్యూబిక్ మీటర్ చొప్పున జరిమానా చెల్లించాలని, లేకుంటే కేసులు తప్పవని అధికారులు హెచ్చరించారు.



సూపర్ స్టార్ కృష్ణ విగ్రహానికి నివాళులర్పిస్తున్న యువహీరో గల్లా అశోక్

నగరంలో గల్లా అశోక్ సందడి

భారతీనగర్ : యువహీరో సూపర్ స్టార్ కృష్ణ మనవడు గల్లా అశోక్ నగరంలో సందడి చేశారు. దేవకీనందన వాసుదేవ చిత్రప్రమోషన్‌లో భాగంగా గురువారం సాయంత్రం విజయవాడ విచ్చేశారు. ఈ సందర్భంగా గల్లా అశోక్ గురునానక్ రోడ్డులోని కనకదుర్గ గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీ పార్కులో సూపర్ స్టార్ కృష్ణ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. సూపర్‌స్టార్ కృష్ణ, మహేశ్‌బాబు అభిమానులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీ మేరకు ధాన్యాన్ని తరలించాలి

» ఏపీ కౌలు రైతుల సంఘం డిమాండ్

గవర్నర్‌పేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని, 48 గంటల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమచేస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ సరిగా అమలు కావడం లేదని, దీనిని నిరసిస్తూ డిసెంబరు 2, 3 తేదీల్లో నిరసనలు చేపట్టనున్నట్లు ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి పి.మురళీకృష్ణ తెలిపారు. గురువారం ఎంజీ రోడ్డులోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పంచకర్ల రంగారావుతో కలిసి మీడియాతో మాట్లాడారు. ధాన్యం కొనుగోలు చేయడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను స్వాగతిస్తున్నామని, ఆచరణలో ప్రభుత్వ ప్రయత్నాలు అమలు జరగడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఖరీఫ్ ధాన్యం కోతలు వేగంగా జరుగుతున్నాయని, సకాలంలో ధాన్యం కొనుగోళ్లు జరగని కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కోసిన ధాన్యం 48 గంటల్లోనే ప్రభుత్వం కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని కోరుతూ స్థానికంగా రైతులు నిరసన తెలియజేయాలని పిలుపునిచ్చారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన గోనె సంచులు అందుబాటులో ఉండటం లేదని, ఆర్బీకేల వద్ద చూపిన తేమ శాతాన్నే ఫైనల్‌గా నిర్ధారించాలని డిమాండ్ చేశారు. రేటు విషయంలో కూడా ఆర్బీకేల వద్ద రేటు ఫైనల్ చేయాలని కోరారు. రైతులు ధాన్యం నూర్చిన వెంటనే మిల్లులకు లేదా మార్కెట్ యార్డులకు తరలించాలని, దీనికి ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలన్నారు. తేమశాతాన్ని 25వరకు సడలించినట్లు మంత్రి హామీ ప్రకారం ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలన్నారు. గ్రామాల నుంచి ధాన్యం తరలించే వాహనాల సంఖ్య పరిమితిని తొలగించాలని, కేరళ, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాలు ఇస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రం ఇస్తున్న దానికి అదనంగా క్వింటాకు కనీసం రూ.500లు బోనస్ ప్రకటించాలన్నారు. అన్ని మిల్లులు డ్రయర్ విల్లులుగా మార్చడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ప్రతి గ్రామంలో రైతులు పంటలు ఆరబెట్టుకోవడానికి వీలుగా స్థలాలను సేకరించి అభివృద్ధి చేయాలన్నారు.



వాట్సాప్ నెంబరులో ధాన్యం అమ్మకాలు షెడ్యూలు రిజిస్టర్‌ను చూపుతున్న హరిబాబు

అంతర్ జిల్లాల ఆర్చరీకి ఎంపికలు

విజయవాడ స్పోర్ట్స్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహానాడు రోడ్డులోని ఓల్గా ఆర్చరీ అకాడమీలో గురువారం ఎంపిక పోటీలు ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. పోటీల్లో సత్తా చాటిన వారిని ఏపీ సీనియర్ అంతర్ జిల్లాల టోర్నీకి ఎంపికచేసినట్లు జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చెరుకూరి కృష్ణకుమారి తెలిపారు.



రికర్వ్ పురుషులు: ఎం.జైనేంద్ర నాయుడు, ఎ.శ్రీకృష్ణ సాత్విక్, వై వేణుగోపాల్‌రావు, **మహిళలు:** కె.చంద్రహాసిని, కెయుక్త శ్రీ, టి.భువన రాజేశ్వరి, టి.వైష్ణవి, సీహెచ్ డాలీ శివానీ, ఎ.వీర అన్విత, కె.పూజిత, **కాంపౌండ్ పురుషులు:** టి త్రినాథ్ చౌదరీ, బి.రవితేజ, ఇ.సాయి రాధాకృష్ణమూర్తి, పి.చరణ్ శ్రీకర్, అబ్దుల్ రషీద్, జి.బాజీ నాగుల్ మీరా, మహిళల విభాగంలో కె.రిషి కీర్తన, బి.షణ్ముక నాగ సాయి, బి ప్రియ వైష్ణవిలు ఎంపికయ్యారు.

1న అండర్-12 క్రికెట్ సెలక్షన్స్

విజయవాడ స్పోర్ట్స్ : ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలోని క్రికెట్ నెట్స్ వద్ద డిసెంబరు 1 ఉదయం 8 గంటలకు కేడీసీఏ అండర్-12 బాలుర క్రికెట్ సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు కేడీసీఏ సెక్రటరీ ఎం.రవీంద్ర చౌదరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2012 సెప్టెంబరు 1వ తేదీ తర్వాత జన్మించిన క్రీడాకారులు అర్హులని, హాజరయ్యే క్రీడాకారులు పుట్టినతేదీ సర్టిఫికెట్, ఆధార్ ఒరిజనల్, జిరాక్సులతో పాటు తమ వ్యక్తిగత కిట్, బాల్స్‌తో రావాలని రవీంద్ర తెలిపారు.

రెజ్లింగ్‌లో ఠాగూర్ సన్నీకి కాంస్యం

విజయవాడ స్పోర్ట్స్ : ఉత్తరప్రదేశ్ రాష్ట్రం హరిద్వారాలోని ప్రేమ్‌నగర్ ఆశ్రమంలో ఈ నెల 20న ముగిసిన జాతీయస్థాయి రెజ్లింగ్‌లో మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ ఆర్ట్స్, సైన్సు కళాశాల విద్యార్థులు 71 కిలోల పురుషుల విభాగంలో వి లె నిన్(సెకండ్,బీబీఏ), వి సింహాద్రి(సెకండ్ బీకామ్), ఠాగూర్ సన్నీ(సెకండ్ బీఎస్సీ)లు పాల్గొన్నారు. ఇందులో ఠాగూర్‌సన్నీ కాంస్యంతో సత్తా చాటాడు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎం రమేష్, యాజమాన్యం, ఫిజికల్ డైరెక్టర్ టీవీబీ కృష్ణారెడ్డిలు విద్యార్థులను అభినందించారు.



రెజ్లింగ్ క్రీడాకారులతో ప్రిన్సిపాల్, యాజమాన్యం

ఫుడ్ ట్రాక్ తప్పింది

(5వ పేజీ తరువాయి)

ఎలాంటి టెండర్లు పిలవలేదు. టెండర్లు పిలిస్తే రైల్వేకు ఆదాయం వస్తుంది. కానీ, అనధికారికంగా ఒకటో నెంబరు ప్లాట్‌ఫాంలో ఈ సెల్ కిచెన్‌ను నడుపుతున్నారు. ఫుడ్ ప్లాజా స్టాల్ కేంద్రంగా ఈ సెల్ కిచెన్ కార్యకలాపాలు సాగుతున్నాయి. వీటన్నింటి సబ్ లీజుదారుడు ఒక్కరే కావడంతో అనధికా రికంగా కార్యకలాపాలు నడిచిపోతున్నాయి. సాధారణంగా ఫుడ్ ప్లాజా విధులు ఇంచుమించు ఇలాగే ఉంటాయి. కానీ, ఆహారాన్ని రైళ్లకు అందించకూడదు. రైళ్లకు ఒక్క సెల్ కిచెన్ మాత్రమే అందించాలి. దీంతో గడువు ముగిసినా ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకే నిర్వాహకులు ఫుడ్ ప్లాజాను ఎంచుకున్నారు. ఇక్కడి నుంచి బాక్సుల్లో ఆహారాన్ని సర్ది, రైళ్లకు చేరవేస్తున్నారు. దీంతో నిర్వాహకు డికి రోజుకు రూ.1.30 లక్షలఅద్దె మిగులుతోంది. ఈ వ్యాపారానికి ఐఆర్‌సీటీసీ, రైల్వేస్టేషన్, కమర్షియల్ విభాగం లోని కొందరు అధికారులు తెరవెనుక సహకారం అందిస్తు న్నారు. ఇందు కు ప్రతిఫలంగా నిర్వాహకుల నుంచి భారీగా వాటాలు వెళ్తున్నట్టు సమాచారం. ఈ వ్యవహారంపై సీబీఐ అధికారులు దృష్టిపెడితే తప్ప అంతర్గతంగా చర్యలు తీసుకునే పరిస్థితి లేదు.నిర్వాహకులు రైల్వేబోర్డును కూడా శాసించే స్థాయిలో ఉండటమే ఇందుకు కారణం.

ఆంధ్రజ్యోతి పరిశీలనలో నిజాలు

ఈ ఫుడ్ ప్లాజాలో సెల్ కిచెన్ అనధికార నిర్వహణపై గురువారం 'ఆంధ్రజ్యోతి' పరిశీలన జరిపింది. ఫుడ్ ప్లాజాలోని స్టాల్‌లో సెల్ కిచెన్ ఏర్పాటు చేసుకున్నారు. పెద్ద బాండీలలో ఫుడ్‌ను బయట నుంచి సెల్ కిచెన్‌లోకి తెస్తున్నారు. ఇక్కడే ప్యాకింగ్ చేస్తున్నారు. ఇక్కడి నుంచి ఫుడ్ ప్యాకెట్లను పకడ్బందీగా రైళ్లకు అందిస్తున్నారు. ఫుడ్ ప్లాజా బయట ప్లాట్‌ఫాంపై టేబుల్స్ వేసి మరీ ఆహార ప్యాకెట్లను విక్రయిస్తుండటం గమనార్హం.

2న టీటీ జట్ల ఎంపికలు

విజయవాడ స్పోర్ట్స్ : ఉమ్మడి కృష్ణా జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో అసోసియేషన్ కార్యాలయంలో అండర్-15 బాలబాలికలు, పురుషులు, మహిళల ఎంపిక పోటీలను డిసెంబరు 2వ తేదీ ఉదయం 8 గంటలకు నిర్వహిస్తున్నట్లు జిల్లా అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ బొడ్డు శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభ చాటిన క్రీడాకారులను డిసెంబరు 20, 21వ తేదీల్లో కాకినాడలో రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్‌కు పంపుతామన్నారు. వివరాలకు 9494908977 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

దక్షిణామూర్తికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు



వన్‌టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానం మల్లేశ్వరాలయ కుడ్యంలో ఉన్న దక్షిణామూర్తికి గురువారం సందర్భంగా అభిషేకాలు, ప్రత్యేక అర్చనలు చేశారు. దక్షిణామూర్తికి ఆలయ అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అర్చనలు, షోడశోపచార పూజలను నిర్వహించి, మంత్రపుష్పం, హారతులు సమర్పించారు.

ఆలోచింపజేసిన కవన విజయం



కవన విజయం సాహితీ రూపకంలో పాల్గొన్న కవులు

విజయవాడ కల్చరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం ఆధ్వర్యంలో పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల తెలుగు శాఖ నిర్వహించిన నాగభైరవ కోటేశ్వరరావు విరచిత కవనవిజయం సాహిత్య రూపకం ఆద్యంతం హృద్యంగా సాగింది. 515వ ప్రదర్శనగా గురువారం సిద్ధార్థ ఆడిటోరియంలో ఈ రూపకం సాగింది. తొలుత సింహాద్రి జ్యోతిర్మయి కవులను సభకు పరిచయం చేయగా డాక్టర్ నాగభైరవ ఆది నారాయణ ప్రయోక్తగా వ్యవహరించారు. సిహెచ్.ఏడుకొండలు (ప్రబంధకవి),నట్టే ప్రసాద్ (భావకవి), కప్పగంతు జయరామయ్య (అభ్యుదకవి), ఈదుమూడి ఆంజనేయులు (విప్లవకవి), డాక్టర్ నూనె అంకమ్మ రావు (దిగంబరకవి), డాక్టర్ బీరం సుందరరావు (దళితకవి), తేళ్ల అరుణ(సినీకవి), నూకతోటి శరత్‌బాబు (ప్రజాకవి),ఈదుమూడి జయంతి (నవలా రచయిత్రి), బత్తుల బ్రహ్మారెడ్డి (క్లార్క్ సూర్యారావు) కవితా గానం చేసి అలరింపచేశారు. సమకాలీన సమాజంపై ప్రముఖ కవుల అక్షర శతఘ్నులతో సభ మార్మోగింది.

కళాపీఠం పాలకవర్గసభ్యులు తాతినేని శ్రీహరిరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు, కళాశాల డీన్ ఆచార్య రాజేష్ సి.జంపాల, కవుల పాత్రలను పోషించిన వారిని, సాహితీవేత్త డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లును ఘనంగా సత్కరించారు. తెలుగు శాఖాధిపతి డాక్టర్ నందనవనం శివకుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సశ్రీ, జి.శేషారత్నం ఈ కార్యక్రమం పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీ దుర్గా మల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్పందిస్తూ ఈ సాహిత్య కార్యక్రమం ద్వారా ప్రముఖ కవుల పదునైన భావాలను, వారి సాహిత్య ప్రయోగాలను తెలుసుకోగలిగామన్నారు.

డాక్టర్ కొడాలి నగేష్‌బాబుకు ఘన నివాళి

ఆటోనగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ కొడాలి నగేష్‌బాబు ఎంతో నిబద్ధతతో, క్రమశిక్షణతో పశుసంవర్థక శాఖలో విధులు నిర్వహించారని పశుసంవర్థక శాఖ రాష్ట్ర సంచాలకులు డాక్టర్ టి.దామోదర్ నాయుడు అన్నారు. గురువారం లబ్బీపేట ఎన్టీఆర్ వెటర్నరీ హాస్పటల్‌లో డాక్టర్ కొడాలి నగేష్‌బాబు సంస్మరణ సభ నిర్వహించారు. తొలుత కొడాలి నగేష్‌బాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పశుసంవర్థక శాఖ అధికారుల సేవా సంఘానికి అధ్యక్షులుగా సుదీర్ఘకాలం ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. రాష్ట్ర విభజన సమయంలో ఉద్యోగుల పక్షాన వారి ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించారని కొనియాడారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అదనపు సంచాలకులు, సంయుక్త సంచాలకులు, ఉప సంచాలకులు తదితరులు పాల్గొన్నారు.

లారీ ఓనర్స్ అసోసియేషన్ సమస్యలు పరిష్కరించండి

మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు సభ్యుల వినతి



మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

లబ్బీపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కోరారు. గురువారం నగరంలో ఒక కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చిన మంత్రి బెంజిసర్కిల్‌లోని లారీ ఓనర్స్ అసోసియేషన్ హాల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మంత్రిని కలిసి తమ సమస్యలు వివరించారు. రాష్ట్రంలో డీజిల్ ధర పొరుగు రాష్ట్రాల కన్నా ఎక్కువగా ఉందని, డీజిల్ రేటు తగ్గిస్తే అమ్మకాలు ఊపందుకోవడంతో పాటు రాష్ట్రానికి రాబడి పెరుగుతుందని, రవాణా రంగానికి ఎంతో మేలు చేకూరుతుందని వివరించారు. వారి సమస్యలు సానుకూలంగా విన్న ఆయన ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లారీ ఓనర్స్ సంఘం అధ్యక్షుడు నాగమోతు రాజా, రాష్ట్రసంఘం ప్రధాన కార్యదర్శి వై.వి.ఈశ్వరరావు, స్టీరింగ్ కమిటీ సభ్యులు పొట్లూరి సాయిబాబా పాల్గొన్నారు.

ఆయుర్వేద షాపులపై విజిలెన్స్ దాడులు నిలుపుదల చేయాలి

ఆటోనగర్: విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆయుర్వేదిక్ షాపులకు సేల్ లైసెన్స్ లేని కారణాన్ని చూపుతూ ముందస్తు నోటీసులు ఇవ్వకుండా చట్ట వ్యతిరేకంగా షాపులను సీజ్ చేస్తున్నారని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, ఆయుష్ కమిషనర్‌కు ది ఆయుర్వేదిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ విజయవాడ శాఖ అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు, గౌరవ సలహాదారులు డాక్టర్ భానుప్రకాష్‌లు గురువారం వినతిపత్రం అందజేశారు. ఆయుర్వేదంపై జరుగుతున్న దాడుల వల్ల వైద్యులు, వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని వారు హామీనిచ్చినట్లు వెల్లడించారు.

మాణిక్యమ్మ ధర్మసత్రం షాపు లీజు వాయిదా

వన్‌టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గవర్నర్‌పేట గోపాలరెడ్డి రోడ్‌లో ఉన్న కాజ సుబ్బారావు మాణిక్యమ్మ ధర్మసత్రంలోని మొదటి అంతస్థులో ఉన్న షాపు నెంబరు 3కు సంబంధించి అద్దె లీజు వేలంను వాయిదా వేసినట్లు ఈవో కె.సుబ్బారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల కాలానికి గురువారం నిర్వహించిన టెండర్ కమ్ బహిరంగ వేలంలో సరైన పాట రానందున వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు. వేలంలో 10 మంది సభ్యులు హాజరుకాగా, నలుగురు మాత్రమే అడ్వాన్స్ చెల్లించారు. ముగ్గురు సభ్యులు మాత్రమే పాటలో పాల్గొనగా, సరైన ధర రాకపోవటంతో వాయిదా వేసినట్లు వివరించారు.





వేడుకలను ప్రారంభిస్తున్న మోహన్‌రావు, సైనికుల విన్యాసాలను చూపిస్తున్న కేడెట్లు

ఎన్‌సీసీతోనే నాయకత్వ లక్షణాలు

సిద్ధార్థ అకడమిక్ అడ్వయిజర్ మోహన్‌రావు

మొగల్రాజపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎన్సీసీలో చేరడం వల్ల విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు అలవడతాయని సిద్ధార్థ అకడమిక్ అడ్వయిజర్ మోహన్‌రావు తెలిపారు. కళాశాల స్వర్ణోత్సవాల వేళ ఎన్సీసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రదర్శనలో ఎన్సీసీ కేడెట్‌లు ఆర్మీ, నేవీలకు సంబంధించిన వివిధ రకాల నమూనాలను తయారు చేసి ప్రదర్శించారు. వజ్రా, విజయంత, విక్రమాదిత్య, అర్జున్, ధనుష్, చేతక్ ట్యాంకుల ఆర్టిలరీ నమూనాలను విద్యార్థులకు వివరించారు. సైనికులు యుద్ధం ఎలా చేస్తారనే దానిపై సెక్షన్ ఫార్మేషన్, బంకర్ బ్లాస్టర్, సర్జికల్ ఎటాక్, విన్యాసాలను చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు, ఎన్సీసీ అధికారులు కెప్టెన్ విజయ్, లెఫ్టినెంట్ రోహిణి కుసుమ, లెఫ్టినెంట్ వెంకటేష్, కేడెట్ ఆఫీసర్ బాలాజీ , విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల దాతృత్వం



తినుబండారాలను విరాళంగా అందిస్తున్న బాలలు

ప్రసాదంపాడు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పిల్లల్లో సానుభూతి, సేవా లక్షణాలను పెంపొందించడంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం కృషి చేస్తోందని, చైల్డ్ ఎయిడ్ ఫౌండేషన్, మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్‌కు రూ.40వేలు అందజేసినట్లు పాఠశాల వైస్ చైర్మన్ పరిమి నరేంద్రబాబు అన్నారు. గురువారం ఎనికేపాడు ఢిల్లీపబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో స్వచ్ఛంద సంస్థలకు విరాళం కోసం ఫెతేని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు తల్లిదండ్రులు తయారు చేసిన పలు వంటకాలను విక్రయించారన్నారు. అలా వచ్చిన నగదును ప్రత్యేక అవసరాలున్న పిల్లల కోసం కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థలకు అందజేసినట్లు వెల్లడించారు. ప్రత్యేక అవసరం ఉన్న పిల్లల భావోద్వేగానికి మద్దతుగా, కౌన్సెలింగ్ అందించడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. సహకరించిన విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులను అభినందించారు. అకడమిక్ డైరెక్టర్ డేవిడ్ రాజ్, పాఠశాల డైరెక్టర్ పరిమి పవన్ చంద్, కడియాల ప్రవీణ్ కుమార్, ప్రిన్సిపాల్ ఎం.ఎస్ భవనేశ్వరన్, వైస్ ప్రిన్సిపాల్ సంజయ్ భాటియా తదితరులు పాల్గొన్నారు.



12 డివిజన్‌లో హౌస్‌హోల్డ్ సర్వే

విజయవాడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర ఆదేశాల మేరకు హౌస్‌హోల్డ్ సర్వే ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం 12వ డివిజన్‌లో స్పెషలాఫీసర్ వసీంబేగ్ ఆధ్వర్యంలో హౌస్‌హోల్డ్ సర్వే జరిగింది. ఈ కార్యక్రమంలో సెక్రటేరియట్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గద్దె

ప్రభుత్వాసుపత్రి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కొండ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ప్రాధాన్యతనిస్తామని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. గురువారం 6వ డివిజన్‌లోని గులామొయిద్దీన్ నగర్, ముత్యాలమ్మ గుడి, పాత వాటర్ ట్యాంక్, వీరన్న వీధి, మారుతీనగర్, పాత పోలీస్‌స్టేషన్ రోడ్డు, చైతన్య కాలేజ్ ఏరియాలో ఆయన పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మౌలిక వసతులకు కల్పనకు ఎంత ఖర్చు అవుతోంది అంచనా వేయాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో కొండరాళ్లు జారిపడి నష్టపోయిన 96 కుటుంబాలకు ఆర్థిక సాయం చేయాలని, సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ శాఖ మంత్రికి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గన్నే ప్రసాద్, ముమ్మనేని ప్రసాద్, పల్లి దుర్గాప్రసాద్, పునుగుపాటి మోహన్‌రావు, వడ్డేపల్లి కేశవ్, వనుము దుర్గారావు, పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

భారతీనగర్: తూర్పు పరిధి నాల్గవ డివిజన్ శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీలోని వాటర్ ట్యాంక్ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేస్తామని, ఇప్పటికే కొన్ని సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నామన్నారు. రాష్ట్రాన్ని సంక్షేమం, అభివృద్ధితో పాటు ప్రజారోగ్యంలో కూడా ముందుండేలా చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నీ విధాలుగా కష్ట పడుతున్నారన్నారు. కాలనీలోని ప్రధాన సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, వడ్లపాటి గోపాలకృష్ణ, గుజ్జర్లపూడి నాగేశ్వరరావు, యలమంచలి రాజా పాల్గొన్నారు.

జాబ్‌మేళా క్యాలెండరు ఆవిష్కరణ

పటమట: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ)జిల్లా ఉపాధి కల్పనశాఖ, డీఆర్‌డీఏ సీడాప్ ఆధ్వర్యంలో 2025 మార్చి వరకు తూర్పులో నిర్వహించే జాబ్ మేళాల తేదీలు, ప్రదేశాల వివరాలతో రూపొందించిన క్యాలెండర్లను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ గురువారం ఆవిష్కరించారు. ఎమ్మెల్యే కారాల్యయంలో జరిగిన కార్యక్రమంలో గద్దె మాట్లాడుతూ నిరుద్యోగులు ఆసక్తి కలిగిన రంగాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ విభాగం ద్వారా శిక్షణ పొంది ఉపాధి పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎస్. శ్రీనివాసరావు, రమ్య వర్థిని, ఎ మోహన్‌బాబు పాల్గొన్నారు.

విప్‌గా పనిచేయడం అదృష్టంగా భావిస్తా : జీవీ ఆంజనేయులు



విప్ ఆంజనేయులును సత్కరిస్తున్న గొట్టిపాటి రామకృష్ణ

పటమట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు నాయకత్వంలో విప్‌గా పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానని ప్రభుత్వవిప్ జీవీ ఆంజనేయులు అన్నారు. విజయవాడలో గురువారం టీడీపీ అధికార ప్రతినిధి గొట్టిపాటి రామకృష్ణ నివాసంలో ఆయనను విప్ ఆంజనేయులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో నిర్వీర్యం అయిన వ్యవస్థలన్నింటిని గాడిలోపెడుతూ రాష్ట్రాన్ని సీఎం అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తున్నారన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలుకు పక్కా ప్రణాళికతోను ముందుకు వెళుతున్నారని, మెగా డీఎస్సీ ప్రకటించాలని, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ బలోపేతం చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులను గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ తదితరులు సత్కరించారు. ఈ సందర్భంగా గొట్టిపాటి మాట్లాడుతూ తన చిరకాల మిత్రుడు ప్రభుత్వ విప్‌గా నియమితులు కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు దుర్గారావు, సాయి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీ కె దామోదర్ రావు, చిత్రంలో సీఐ వి. పవన్ కిషోర్, ఎస్.ఐ డి.హరికృష్ణ

చోరీ కేసులో ఐదుగురు అరెస్టు

- 18 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

ఆటోనగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడే ఐదుగురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి 18 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ కె. దామోదర్‌రావు తెలిపారు. గురువారం పటమట పోలీస్ స్టేషన్‌లో అదుపులోకి తీసుకున్న నిందితులను మీడియా ముందు హాజరుపర్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆటోనగర్ వంద అడుగుల రోడ్డు సమీపంలోని ఓ టీస్టాల్ వద్ద ఐదుగురు అనుమానాస్పదంగా సంచరించడాన్ని పోలీసులు గమనించారన్నారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా గుడివాడ, గుంటూరు, పటమట పోలీస్‌స్టేషన్ల పరిధిలో పలు చోరీలు చేశారని తెలిసిందన్నారు. వారి నుంచి వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. బంగారు హేమంత్ నాగదుర్గ, బంగారు లక్ష్మిసాయి, ఆకుల మణికంఠ, ఎర్రజర్ల దుర్గాప్రసాద్, పెనుబోతుల జీవన్ ఆకాష్‌లు ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. వీరిలో పటమట రెల్లిస్ కాలనీకి చెందిన బంగారు హేమంత్ నాగ దుర్గాబాబు, బంగారు లక్ష్మిసాయిలపై పాతకేసులు ఉన్నట్లు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపర్చి రిమాండ్ చేస్తామన్నారు. పటమట సీఐ వల్లభనేని పవన్ కిషోర్, ఎస్ఐ డి.హరికృష్ణలు పాల్గొన్నారు.



టీడీపీ జిల్లా కార్యాలయంలో జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

జ్యోతిరావు పూలే సేవలు స్ఫూర్తిదాయకం

వన్‌టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నిజమైన విద్య సాధికారతను ఇస్తుందని, తప్పును తప్పు అని, ఒప్పును ఒప్పు అని చెప్పగల ధైర్యాన్ని ఇస్తుందన్న సందేశాన్ని ఇచ్చిన మహానుభావుడు జ్యోతిరావు పూలే అని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో గురువారం జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పూలే విగ్రహానికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్, ఫ్లోర్‌లీడర్ నెలిబండ్ల బాలస్వామి, తదితరులు పూలమాలలు వేసి ఘన నివాళులు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘ సంస్కరణలలో ఆయన సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరామప్రసాద్ గౌడ్, కార్పొరేటర్ మోదుగుల తిరుపతమ్మ, గొల్లపూడి నాగేశ్వరరావు, పామర్తి కిషోర్ బాబు, బలగం నాగరాజు, యార్లగడ్డ రమేశ్, జాస్తి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ లీగల్: బెజవాడ బార్ అసోసియేషన్‌లో గురువారం మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమాన్ని న్యాయవాదులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు హాజరై పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. బార్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రమౌళి, అరిగెల శివరాంప్రసాద్ (రాజా), బార్ కౌన్సిల్ మెంబర్ సూరాబత్తుల మల్లేశ్వరరావు, చలసాని అజయ్‌కుమార్, మాజీ బార్ అధ్యక్షులు వి.గురునాథం, చేకూరి శ్రీపతిలు, న్యాయవాదులు ఎ.కె.బాషా సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

అప్పుడే కోడిపందేలకు కొక్కొరొకో..!

● కూచిపూడిలో ముందుగానే ఒప్పందాలు ● మెజార్టీ పందేలు గెలిచిన వారికి ఎన్ ఫీల్డ్ బైక్ బహుమతి

కూచిపూడి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భాల్లో నిర్వహించే కోడిపందాలకు నిర్వాహకులు ముందుగానే ఒప్పందాలు కుదుర్చుకుని అడ్వాన్స్‌లు పుచ్చుకుంటున్నారు. ఎక్కువ పందాలు తమ బరుల్లో జరిగేలా ప్రణాళికలు రూపొందించుకుని పందెం రాయుళ్లను ఆకర్షించేలా మెజార్టీ పందాలు గెలిచిన వారికి ఎన్ ఫీల్డ్ బైక్ బహుమతిగా ఇవ్వనున్నట్టు ప్రకటించారు. దీనికి సంబంధించి రెండు రోజుల క్రితం కూచిపూడి కేంద్రంగా ఉభయ కృష్ణాజిల్లాలతోపాటు గుంటూరు జిల్లాకు చెందిన పందెం రాయుళ్లతో నిర్వాహకులు సమావేశమై విధివిధానాలు మాట్లాడుకున్నారు. పెద్ద బరుల్లో వినిమం రూ.లక్ష, మరో రెండు బరుల్లో రూ.50 వేలు, రూ.25 వేలు, ఆ లోపు పందాలు కాసుకునేలా ఒప్పందాలు జరి



గాయి. పండుగ ముందు రెండు లేదా మూడు రోజులపాటు క్రీడలు నిర్వహించి, ఈ ముసుగులో మూడు రోజులపాటు కోడి పందాలు, చిత్తులాట, పేకాట, ఇతర జూద క్రీడలు నిర్వహించేలా రూపకల్పన చేశారు. పందాల్లో ఆరితేరిన ఓ మాజీ సర్పంచ్, ఈవెంట్ నిర్వాహకుడు ఈ బరి నిర్వహించేలా కసరత్తులు ప్రారంభించారు. ఇప్పటికే కూచిపూడిలోని లాడ్జి రూములు బుక్ చేసినట్టు సమాచారం. ఉభయ కృష్ణా జిల్లాలతోపాటు గుంటూరు జిల్లాలో పేరు మోసిన కోడిపందాల రాయుళ్లు ఈ మేరకు కూచిపూడిలో సమావేశమై విధివిధానాలు చేర్చించుకుని కొంతమేర అడ్వాన్స్‌లు కలుపుకున్నారు. ఈ బరుల్లోనే మూడు రోజులపాటు వ్యాపారాలు చేసుకునే దుకాణదారులు బరి నిర్వాహకులతో సంప్రదింపులు జరుపుతున్నారు.

ఆర్టీసీ జోనల్ వర్క్‌షాపులో ఎండీ పరిశీలన



ఆర్టీసీ వర్క్‌షాప్‌ను పరిశీలిస్తున్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

బస్‌స్టేషన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ఆర్టీసీ జోనల్ వర్క్‌షాప్‌ను గురువారం ఆర్టీసీ ఎండీ, రాష్ట్ర డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు సందర్శించారు. ఆర్టీసీ చరిత్రలో తొలిసారిగా సర్వీసబుల్ చాసిస్ మీద, కొత్త బస్ కోచ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన వర్క్‌షాపులో ప్రతి సెక్షన్‌ను పరిశీలించి, అక్కడ జరుగుతున్న అధునాతన పనులను తెలుసుకున్నారు. వరదలు వచ్చాక ఏర్పాటు చేసిన మిషన్లు, గతంలో ఉన్న మిషన్లు ఎలా పనిచేస్తున్నాయనే అంశాలను పరిశీలించి హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఉద్యోగులతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సంస్థ అభివృద్ధికి చేయాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు. ఉద్యోగులకు రావాల్సిన పాత బకాయిలను విడతల వారీగా అందిస్తామన్నారు. విజయవాడ జోన్ ఈడీలు గోపినాథరెడ్డి, రవివర్మ, అప్పలరాజు, చెంగల్ రెడ్డి, సీఈవో సుధాకర్, హెడ్ ఆఫీస్ సీఎంఈ విజయరత్నం, డిప్యూటీ సీఎంఈలు విమల, నీలిమ, విజిలెన్స్ ఏడీ శోభా మంజరి, సీనియర్ లా ఆఫీసర్ పద్మజవాణి, ఈఈ రాజశేఖర్, వర్క్స్ మేనేజర్ సత్యనారాయణ, ఉషారాణి, ఇతర అధికారులు, ఉద్యోగులు, సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాంగణంలో ఒక మామిడి మొక్కను ద్వారకా తిరుమలరావు నాటారు.

నేడు ఈయూ రాష్ట్ర కమిటీతో ఆర్టీసీ ఈడీల సమావేశం

ఆర్టీసీ ఉద్యోగులకు సంబంధించి ప్రభుత్వం, ఆర్టీసీ మేనేజ్‌మెంట్ వద్ద పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ఈనెల 29న ఆర్టీసీ హౌస్‌లో ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీతో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు సమావేశం కానున్నట్టు ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, ప్రధాన కార్యదర్శి ఈవీ నరసయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 7న ఉద్యోగుల సమస్యలను ప్రస్తావిస్తూ రవాణ మంత్రి మండిపల్లి రాం ప్రసాద్ రెడ్డి, ఎండీ ద్వారకా తిరుమలరావుకు ఇచ్చిన వినతి పత్రాల మేరకు సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

న్యాయం జరిగే వరకూ పోరాటం

కొనసాగుతున్న కార్మికుల రిలే దీక్షలు

గన్నవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గన్నవరం అయోధ్య అపార్టుమెంట్ నిర్మాణంలో కార్మికులకు కావాల్సిన రూ.4కోట్ల బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు చేపట్టిన రిలే దీక్షలు గురువారానికి 2వ రోజుకు చేరాయి. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ అనుచరుల్లో ఒకరైన గుర్రం అంజయ్య (నాని) నాలుగేళ్ల పాటు పనులు చేయించుకుని డబ్బులివ్వాల్సి వచ్చేసరికి ఇవ్వాల్సిన పని లేదంటూ భయభ్రాంతులకు గురి చేశారని వాపోయారు. 8 ఏళ్లుగా కార్మికుల కష్టార్జితాన్ని ఇవ్వకుండా తమపై ఎదురు దాడికి దిగారంటూ ఆరోపించారు. ఈ సందర్భంగా మేస్త్రీలు రామ్మోహనరావు, సతీష్ మాట్లాడుతూ తమ బాధలు ఎవరికీ పట్టడం లేదన్నారు. 2018 నుంచి పనులు చేయించుకుని డబ్బులివ్వలేదన్నారు. అదేమంటే దొంగ లెక్కలు చూపి తమకు రావాల్సిన పని లేదంటూ బుకాయిస్తున్నారన్నారు. 14 మంది మేస్త్రులు కింద రోజూ 1200 మంది కార్మికులు పని చేసేవారన్నారు. మాజీ ఎమ్మెల్యే వంశీ ప్రధాన అనుచరుడు ఓలుపల్లి మోహన రంగాకు ఎప్పటికప్పుడు కార్మికులకు డబ్బులిచ్చేసినట్లు గుర్రం నాని చెప్పినట్టు తెలిసిందన్నారు. తమకు డబ్బులిస్తే రోడ్డుకు ఎందుకు ఎక్కుతామన్నారు. గుర్రం నానితో పాటు ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ నారాయణ ప్రసాద్, సైట్ ఇంజనీర్ సాయి సుందర్ తప్పుడు లెక్కలు వేసి పైసా రాదని చెబుతున్నారన్నారు. తమకు న్యాయం జరగకకుంటే ఆత్మహత్యలే శరణ్యమన్నారు. బాబు, తేజ, వెంకన్న, హసీనా, ప్రసన్న, లక్ష్మీ పాల్గొన్నారు.



2వ రోజు రిలే దీక్ష చేస్తున్న అయోధ్య అపార్టుమెంట్స్ బాధితులు



జ్యోతి వెలిగించి సదస్సును ప్రారంభిస్తున్న జేడీ విజయ

మహిళల సమానత్వానికి రాజ్యాంగమే హామీ

● ప్రాసిక్యూషన్స్ జేడీ విజయ

పెనమలూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం మహిళలందరి సమానత్వానికి హామీ ఇస్తుందని ప్రాసిక్యూషన్స్ జాయింట్ డైరెక్టర్ ఎం విజయ పేర్కొన్నారు. గురువారం పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ఫ్రెష్‌మెన్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మహిళలపై హింసను అరికట్టండనే అంశంపై జరిగిన ఒక రోజు సెమినార్‌లో ఆమె పాల్గొని మాట్లాడారు. అతిథిగా హాజరైన సుంకర రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ మహిళా సాధికారతలో చెప్పుకోదగ్గ కార్యక్రమాలను నిర్వహించడంలో సేఫ్ ఫౌండేషన్ కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. డాక్టర్ నీరజ, కే స్వరూపరాణి, ప్రిన్సిపాల్ డాక్టర్ శివాజీబాబు, డాక్టర్ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

నగరంలో దేవకీ నందనుడి సందడి



లబ్బీపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): 'దేవకీ నందన వాసుదేవ' చిత్ర యూనిట్ గురువారం నగరంలో సందడి చేసింది. చిత్రం విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపేందుకు నిర్వహిస్తున్న విజయయాత్రలో భాగంగా చిత్రం బృందం ట్రెండ్ సెట్ మాల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా హీరో అశోక్ గల్లా మాట్లాడుతూ చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని తెలిపారు. ప్రశాంత్ వర్మ కథతో దర్శకుడు అర్జున్ జంధ్యాల తెరకెక్కించిన చిత్రం అఖిలాంధ్ర ప్రేక్షకులను అకట్టుకుందన్నారు. అనంతరం దర్శకుడు అర్జున్ జంధ్యాల మాట్లాడుతూ తమ చిత్రానికి విజయం అందించిన ప్రేక్షకులను రుణపడి ఉంటానన్నారు. ఈ సందర్భంగా గురునానక్ కాలనీలో సూపర్ స్టార్ కృష్ణ విగ్రహానికి హీరో గల్లా అశోక్ పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు.



కృష్ణా తరంగ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కృష్ణా వర్సిటీ రెక్టార్, కేబీఎన్ కాలేజీ సెక్రటరీ తదితరులు

వచ్చేనెల 10 నుంచి కృష్ణాతరంగ్

వన్‌టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కృష్ణా వర్సిటీ అనుబంధ కళాశాలలకు చెందిన విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు వచ్చేనెల 10, 11, 12న వివిధ అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించి పోస్టర్లను గురువారం కృష్ణా వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ ఎంవీ బసవేశ్వరరావు, కేబీఎన్ కళాశాల సెక్రటరీ డాక్టర్ టీ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ డాక్టర్ జీ కృష్ణవేణి, కృష్ణాతరంగ్ కో-కన్వీనర్ డాక్టర్ కె.రామకృష్ణ, హిందూ హైస్కూల్స్ కమిటీ పాలనాధికారి డాక్టర్ వి.నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్స్ పి.ఎల్.రమేష్, డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. కృష్ణా విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న అన్ని కళాశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని నిర్వాహకులు తెలిపారు. సంగీతం, నాట్యం, సారస్వతం వంటి వాటిలో పోటీలు జరుగుతాయని, పాల్గొనదలచిన విద్యార్థులు నిర్దేశిత దరఖాస్తులో వివరాలు పూర్తిచేసి వర్సిటీ వెబ్‌సైట్‌లో మెయిల్‌కు పంపించాలన్నారు. వివరాలకు 9951167965 ఫోన్‌లో సంప్రదించవచ్చన్నారు.



మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న వలంటీర్లు

మోకాళ్లపై నిలబడి వలంటీర్ల నిరసన

చిట్టినగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ముఖ్యమంత్రి ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం వలంటీర్లను కొనసాగించి న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వలంటీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం చిట్టినగర్ విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపం ఎదురుగా వలంటీర్లు మోకాళ్లపై నిలబడి వినూత్న రీతిలో నిరసన ప్రదర్శన చేశారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లంకా గోవిందరాజులు మాట్లాడుతూ ఉగాది పండుగ రోజు శుభవార్త చెప్తానని నమ్మపలికి వలంటీర్ల ఓట్ల ద్వారా అధికారంలోకి వచ్చిన చంద్రబాబు వారి జీవితాలతో ఆడుకుంటున్నారన్నారు. శాసనమండలి సమావేశాల్లో వలంటీర్ వ్యవస్థ లేదని మంత్రి డోల బాల వీరాంజనేయస్వామి ప్రకటించడం బాధకరమన్నారు. వలంటీర్లకు ఉద్యోగ భద్రత కలిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేయాలని కోరారు. 5 నెలల బకాయిలు చెల్లించాలన్నారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జీ మమత, నేతలు రాజ్‌కుమార్, రమేష్, అబ్దుల్, ఏ. మురళి, జీ.వాణి,కాంచన పాల్గొన్నారు.



కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న టీచర్లు

కళ్లకు గంతలతో టీచర్ల నిరసన

ధర్నాచౌక్, నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి): తమకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని, జీవితాలు పెంచుతామని మంత్రి గుమ్మడి సంధ్యారాణి హామీ ఇచ్చి 5 నెలలు గడుస్తున్నా తమ సమస్యలు పరిష్కారం కాలేదని గిరిజన సంక్షేమ గురుకులాల ఔట్‌సోర్సింగ్ టీచర్లు, లెక్చరర్స్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం స్థానిక ధర్నాచౌక్‌లో కళ్లకు గంతలు కట్టుకుని వినూత్న నిరసన వ్యక్తం చేశారు. డీఎస్సీ నుంచి తమ పోస్టులు మినహాయించలేదన్నారు. ఈ నెల 16 నుంచి రాష్ట్రవ్యాప్తంగా తమ విధులను బహిష్కరించి శాంతియుతంగా నిరసన దీక్షలు చేపట్టామన్నారు. అయినా అధికారులు న్యాయం చేయలేదని, కనీసం చర్చలకు కూడా పిలువలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన గురుకుల టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్షులు కే.లక్ష్మీనాయక్, జె.మల్లిఖార్జున నాయక్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్.పరమేష్, ఎస్ఎస్.బాబు, ఏ.తారా, సునీత అధిక సంఖ్యలో టీచర్లు, లెక్చరర్లు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ ప్రాణాలను నిలిపిన కానిస్టేబుల్



ప్రసాదంపాడు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గుండెనొప్పితో బాధపడుతున్న తమిళనాడుకు చెందిన లారీడ్రైవర్ టి.కుమార్‌ను ప్రభుత్వాసుపత్రికి తరలించి ఆతడి ప్రాణాలు కాపాడి మానవత్వం చాటుకున్నారు 4వ ట్రాఫిక్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు. ట్రాఫిక్ సీఐ రమేష్ బాబు వివరాల మేరకు ప్రసాదంపాడు పంచాయతీ సమీపంలో రహదారి పక్కన నిలిపిన లారీని గమనించిన కానిస్టేబుల్ చూడగా డ్రైవర్ గుండెనొప్పితో విలవిలలాడుతున్నాడని, కానిస్టేబుల్ హుటాహుటిన డ్రైవర్‌ను ప్రభుత్వాసుపత్రికి తరలించారన్నారు. వెంటనే స్పందించి వైద్యసహాయం అందించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడని వైద్యులు తెలిపారన్నారు.

తల్లీ, బిడ్డల ఆరోగ్య సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలి

● ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విజయవాడ పార్లమెంటు నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అదనంగా పది పడకల తల్లి, బిడ్డల ఆరోగ్యసంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఎంపీ కేశినేని చిన్ని అన్నారు. నియోజకవర్గ పరిధిలోని ఆరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గర్భిణులు, శిశువులకు మెరుగైన సేవలందించేందుకు అవసరమైన వైద్యసిబ్బంది, ఇతర మౌలిక సౌకర్యాల పెంపు, వాటికి కావాల్సిన నిధులను నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా మంజూరు చేయాలని కేంద్రప్రభుత్వాన్ని ఎంపీ కోరారు. గురువారం, లోక్‌సభలో రూల్ 377 కింద కేశినేని ఈ అంశాన్ని లేవనెత్తారు. తన నియోజకవర్గంలో ఆరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో మొత్తం జనాభా 11,35,129 మంది ఉన్నారని, ఇందులో గర్భిణుల సంఖ్య 17,624, శిశువులు 15,247గా ఉందన్నారు. ప్రజలకు మెరుగైన సేవలను అందించడానికి కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రి జేపీ నడ్డా తన విజ్ఞప్తిపై దృష్టి సారించాలని కోరారు.

హిసార్ - తిరుపతి మధ్య వీక్లీ రైలు

రైల్వేస్టేషన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని తట్టుకునేందుకు హిసార్ - తిరుపతి మధ్య వీక్లి రైలును నడుపుతున్నట్టు సౌత్ సెంట్రల్ రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 7 నుంచి 14 వరకు శనివారం నడిచే హిసార్ - తిరుపతి (04717) రెండు సర్వీసులు నడుస్తోంది. డిసెంబరు 9 నుంచి 16 వరకు సోమవారం నడిచే (04718) తిరుపతి - హిసార్ రైలు కూడా రెండు సర్వీసులు నడుస్తోంది. ఈ ప్రత్యేక రైళ్లు గూడూరు, నెల్లూరు, విజయవాడ, ఖమ్మం, వరంగల్, సిరిపూర్ కాగజ్‌నగర్, బలార్షా మాదపూర్, హిటార్సి, భూపాల్, సంత్ హిద్దరామ్‌నగర్, సుజల్‌పూర్, ఉజ్జయిని, నాగ్దా, రాంగంజిమండి, కోట, సవాయి మధుపూర్, దుర్గాపుర, జైపూర్, దహ ర్కా బాలాజీ, లింగాస్, శిఖర్, నావల్‌గ్రహ్, జుంజునును, చిర్లా, లోహార్, సాదూర్‌పూర్ మీదుగా గమ్యాన్ని చేరుకుంటాయి. ఇదే సమయంలో హిసార్ - తిరుపతి రైలు రాత్రి 1.20 గంటలకు విజయవాడ చేరుకుని 1.30కి బయలుదేరుతుంది. తిరుపతి - హిసార్ రైలు ఉదయం 7.10కి చేరుకుని 7.20కి బయలుదేరుతుంది. ఒంగోలులో హిసార్ - తిరుపతి రైలు వేకువజామున 3.28 గంటలకు చేరుకుని 3.30కి బయలుదేరుతుంది. తిరుపతి - హిసార్ రైలు కూడా ఇదే సమయంలో ఒంగోలుకు వస్తుంది. నెల్లూరులో హిసార్ - తిరుపతి రైలు ఉదయం 4.48కి వచ్చి 4.50 గంటలకు బయలుదేరుతుంది. తిరుపతి - హిసార్ రైలు రాత్రి 1.53కు వచ్చి 1.55 గంటలకు బయలుదేరుతుంది.

సింగపూర్ నేషనల్ చెస్‌లో సంహిత, శౌర్య సత్తా



విజయవాడ స్పోర్ట్స్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 24 నుంచి 28 వరకు జరిగిన సింగపూర్ నేషనల్ ఏజ్ గ్రూప్ చెస్ చాంపియన్‌షిప్‌లో ముస్తాబాద స్పోర్ట్స్, ఎడ్యుకేషనల్ అకాడమీ విద్యార్థిని, లా ఫస్టియర్ చదువుతున్న గార్నేని మేఘా సంహిత అండర్-16 విభాగంలో తృతీయస్థానంలోను, స్కాట్స్‌పైన్ ఇంటర్నేషనల్ విజయవాడ విద్యార్థి శౌర్య కొండ్రు అండర్-9లో ఐదోస్థానంలో నిలిచారు. వీరిని వరల్డ్ చాంప్ విశ్వనాథన్ ఆనంద్ అభినందించినట్లు చీఫ్ కోచ్ బొబ్బా తెలిపారు.

రిమాండ్‌లో ఉన్న 8 మందికి 2 రోజుల పోలీస్ కస్టడీ

గన్నవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత కాసన్నేని రంగబాబుపై జరిగిన దాడి ఘటనలో ఈ నెల 19న మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరులైన 8 మందిని గన్నవరం పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు పెట్టగా రిమాండ్ విధించిన సంగతి తెలిసిందే. వారిని నెల్లూరు జైలుకు తరలించారు. ఏ7 గుర్రం అంజయ్య అలియాస్ నాని, ఏ8 కర్నాటి నిరంజన్‌కుమార్, ఏ9 ఓలుపల్లి మోహన రంగారావు అలియాస్ రంగా, ఏ10 మేచినేని వెంకట శివ సత్యన్నారాయణ అలియాస్ బాబు, ఏ11 అనగాని రవి, ఏ12 గొన్నూరు సీమయ్య, ఏ14 భీమవరపు యెతేంద్ర రామకృష్ణ అలియాస్ రాము, ఏ15 సూరపనేని అనిల్‌ను పోలీసులు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. పిటీషన్‌ను పరిశీలించిన న్యాయమూర్తి రెండు రోజుల పాటు (29, 30 తేదీలు) పోలీస్ కస్టడీకిస్తూ జడ్జీ తీర్పునిచ్చారు. ఈ 8 మందిని నెల్లూరులోనే పోలీసులు విచారణ చేయనున్నారు.

వైకల్యం మనిషికే గానీ మనసుకు కాదు

● విభిన్న ప్రతిభావంతుల్లో మనోధైర్యాన్ని నింపేందుకే క్రీడల నిర్వహణ ● ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ



విభిన్న ప్రతిభావంతుల ఆటలపోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వైకల్యమనేది మనిషికే కానీ, మనస్సుకు కాదని విభిన్న ప్రతిభావంతుల ప్రతిభ ముందు వైకల్యం చిన్నబోతుందని క్రీడల్లో రాణించడం ద్వారా విభిన్న ప్రతిభావంతులు సకలాంగులకు దీటుగా సత్తాను చాటాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా విభిన్న ప్రతిభావంతుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించిన క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. తొలుత కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని వారితో ముచ్చటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు అవసరమైన తోడ్పాటును అందిస్తే ఎటువంటి విజయాలనైనా సాధించగలుగుతారన్నారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరు విజేతగా భావించాలన్నారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి వి.కామరాజు మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు జిల్లాస్థాయిలో జూనియర్, సీనియర్ మహిళలు, పురుషుల విభాగాల్లో చెస్, క్యారమ్స్, సాఫ్ట్‌బాల్, వాలీబాల్, రన్నింగ్, ట్రై సైకిల్ రేస్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో వంటి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ పర్యవేక్షకులు ప్రశాంతి, వార్డెన్ నాగ స్వర్ణ, స్టాఫ్‌నర్స్ సులోచన రాణి, సహాయకులు అవినాష్, సాయిబాబు, సుజిత, రాణి, విభిన్న ప్రతిభావంతుల బాలికల వసతి గృహం, మడోన్నా మూగ బదిరిల కళాశాల, మానసిక వికాస కేంద్రం, ప్రేమవికాస్, ప్రేమనికేతన్, విజయ మేరీ ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఫర్ బ్లైండ్‌కు చెందిన క్రీడాకారులు క్రీడా పోటీల్లో పాల్గొన్నారు.

ఆరోగ్యంతో ఆటలు!

● తక్కువ ధరకు కాలం చెల్లిన పదార్థాల విక్రయం
● ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీల్లో బయట పడిన వ్యవహారం
● రూ.10లక్షల విలువైన సరుకు సీజ్



విజయవాడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రూ.10 విలువైన బిస్కెట్ ప్యాకెట్ ధర రూ.5, రూ.30 ఎమ్మార్పీ ఉన్న కేకుల ప్యాకెట్ రూ.15. కిలో రూ.200 విక్రయించే కిస్‌మిస్ రూ.100. ఇవన్నీ కార్పొరేట్ మాల్స్ ప్రకటించిన ఆఫర్లు కాదు. అలాగని కొత్తగా ప్రారంభించిన షాపు యజమాని తొలిరోజున వినియోగదారులకిచ్చిన అవకాశం అంతకన్నా కాదు. బహుళజాతి సంస్థల నుంచి కాలం చెల్లిన పదార్థాలను కొనుగోలు చేసి ఇక్కడి ప్రజలకు 50శాతం తక్కువ ధరకు విక్రయిస్తున్న వ్యవహారమిది. విజయవాడ అంటేనే కల్తీకి మారుపేరుగా మారింది. నెయ్యి, టీ పొడి, కారంలో ఇప్పటి వరకు కల్తీని చూపించిన వ్యాపారులు ధనదాహంతో ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. వన్‌టౌన్‌లో కేటీ రోడ్డులో కాలం చెల్లిన వస్తువులు, పదార్థాలను విక్రయిస్తున్న గుర్రం లింగయ్య జనరల్ స్టోర్స్‌లో ఫుడ్‌సేఫ్టీ అధికారి పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో గురువారం సోదాలు నిర్వహించారు. షాపును నిర్వహిస్తున్న గోపాలకృష్ణ కాలం చెల్లిన, కాలం చెల్లడానికి రోజుల సమయం ఉన్న తినుబండారాలను హైదరాబాద్, బెంగళూరులోని బహుళజాతి సంస్థల నుంచి ఎమ్మార్పీ కంటే 20శాతం తక్కువకు కొని విజయవాడకు తీసుకొచ్చి ఎమ్మార్పీ కంటే 50శాతం తక్కువకు విక్రయిస్తున్నాడు. కొన్నేళ్లుగా ఇలా చేస్తున్నాడు. దీనిపై సమాచారం రావడంతో ఫుడ్‌సేఫ్టీ అధికారులు నెల రోజులుగా నిఘా పెట్టారు. ఈ షాపులో సోదాలు నిర్వహించగా రూ.10లక్షల విలువైన నిల్వ సరుకులున్నట్టు గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేశారు. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు షాపులో సరుకును అధికారులు లెక్కిస్తూనే ఉన్నారు.



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, జేసీ నిధి మీనా

పూలే ఆశయాలు నేటితరానికి స్ఫూర్తిదాయకం

● ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయం మహిళా అభ్యున్నతికి పోరాడిన మహోన్నత వ్యక్తి జ్యోతిరావు పూలే ఆశయాలు నేటితరానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని ఆయన ఆలోచనలను ఆచరణలోకి పెట్టడం ద్వారా ఘన నివాళులు అర్పించినట్టు అవుతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే 134వ వర్ధంతిని పురస్కరించుకొని కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ గురువారం కలెక్టరేట్‌లో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుండేందుకు కారణం మహాత్మ జ్యోతిరావు పూలే ఆలోచన విధానాలే కారణమన్నారు. తన సహధర్మచారిణి విద్యను అభ్యసించేలా ప్రోత్సహించడం ద్వారా ఆమె దేశంలోనే మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు కాగలిగారన్నారు. జేసీ నిధి మీనా, మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, ఉద్యాన అధికారి బాలాజీ కుమార్, వ్యవసాయ అధికారిణి విజయకుమారి, కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసిక దృఢత్వం

● త్వరలో యువజన క్రీడోత్సవాలు ● పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు



క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న సీపీ రాజశేఖరబాబు

విజయవాడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పోలీసులు ఎప్పటికప్పుడు పనితీరును మెరుగుపరుచుకుని ముందుకు అడుగులు వేయాలని పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు అన్నారు. విజయవాడ ఎంజీ రోడ్డులోని వ్యాస్ కాంప్లెక్స్ వెనుక ఉన్న ఏఆర్ గ్రౌండ్స్‌లో పోలీసు వార్షిక క్రీడాపోటీలను గురువారం ప్రారంభించారు. నిత్యం పని ఒత్తిడితో పోలీసులు 2024లో విపరీతమైన ఒత్తిడిని ఎదుర్కొన్నారన్నారు. పోలీసులపై ప్రజలకు అంచనాలు రోజురోజుకు పెరుగుతున్నాయన్నారు. మానసిక దృఢత్వానికి క్రీడలు దోహదం చేస్తాయన్నారు. ఎప్పటికప్పుడు పరిస్థితులకు అనుగుణంగా పనితీరులో మార్పులు చేస్తున్నామన్నారు. ఇప్పుడు సాంకేతిక నైపుణ్యంతో కేసులను ఛేదిస్తున్నామన్నారు. చాలాకేసుల్లో సాంకేతిక పరిజ్ఞానం ప్రధానంగా మారిందన్నారు. శారీరక, మానసిక శ్రమ ఒత్తిడి పోలీసులపై ఉంటుందన్నారు. ప్రతిరోజూ వ్యాయామం చేస్తున్నా క్రీడలు మరింత ఉత్సాహాన్ని ఇస్తాయన్నారు. సమాజానికి పోలీసు శాఖ దిక్సూచిగా మారాలన్నారు. త్వరలో యువజన క్రీడోత్సవాలు నిర్వహించే ఆలోచనలో ఉన్నామన్నారు. పోలీసులు ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా ముఖ్యమన్నారు. విధుల్లో మహిళా పోలీసులు చాలా చురుగ్గా పని చేస్తున్నారన్నారు. పోలీసులు ఏడు టీంలుగా ఏర్పడి పోటీల్లో పాల్గొన్నారు. పోటీల ప్రారంభోత్సవానికి ముందు టీంల నుంచి సీపీ గౌరవవందనం స్వీకరించారు. డీసీపీలు తిరుమలేశ్వరరెడ్డి, మహేశ్వరరాజు, ఉదయరాణి, కృష్ణమూర్తినాయుడు, ఏఆర్ ఏడీసీపీ ప్రసాదరావు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా రామ్మూర్తి నాయుడి కర్మక్రియలు

- సీఎం సహా నారా, నందమూరి కుటుంబీకుల హాజరు
- పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు రాక
- అందరితో కలసి భోజనం చేసిన సీఎం చంద్రబాబు
- పెద్దఎత్తున జనం రాకతో కిక్కిరిసిన నారావారిపల్లె

తిరుపతి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు సోదరుడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడి కర్మక్రియలు గురువారం నారావారిపల్లెలో శాస్త్రోక్తంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబుతో పాటు నారా, నందమూరి కుటుంబీకులు, పలువురు మంత్రులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. టీడీపీ శ్రేణులు వేలాదిగా తరలిరావడంతో నారావారిపల్లె కిక్కిరిసింది. గురువారం ఉదయం 8.45 గంటలకు కుటుంబీకులతో కలసి చంద్రబాబు ఇంటి నుంచి గ్రామం వెనుకవైపు ప్రాథమిక పాఠశాల సమీపాన ఉన్న బావి వద్దకు చేరుకుని తమ్ముడికి శాస్త్రోక్తంగా కర్మక్రియలు నిర్వహించారు. తనయుడు, మంత్రి లోకేశ్, సోదరుడి కుమారులు రోహిత్, గిరీష్‌తో పాటు మంత్రి నిమ్మల రామానాయుడు, మాజీ మంత్రి దేవినేని ఉమా, గ్రామానికి చెందిన సన్నిహిత బంధువులు ఈ కర్మక్రియల్లో పాల్గొన్నారు. 10.45 గంటలకు కార్యక్రమం ముగిశాక సీఎం ఇంటికి చేరుకుని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తమ్ముడికి నివాళులు అర్పించారు. మధ్యాహ్నం 2 గంటల వరకూ అక్కడే గడిపిన సీఎం వచ్చిన వారిని పలకరించారు. ఆ తర్వాత భోజనాల వద్దకు వెళ్లి అందరితో కలసి భోజనం చేశారు. మంత్రులు అచ్చెన్నాయుడు, వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్, బీసీ జనార్దన్‌రెడ్డి, కొల్లు రవీంద్ర, నిమ్మల రామానాయుడు, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎస్.సవిత, వాసంశెట్టి సుభాష్‌లతో పాటు రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, డిప్యూటీ స్పీకరు రఘురామకృష్ణరాజు, మాజీ మంత్రులు చినరాజప్ప, దేవినేని ఉమా తదితరులు నారావారిపల్లికి వచ్చారు.



తన సోదరుడు నారా రామ్మూర్తి నాయుడు కర్మక్రియలలో పాల్గొన్న సీఎం చంద్రబాబు, పక్కన మాజీ మంత్రి దేవినేని ఉమ, మంత్రి రామానాయుడు

హాజరైన నందమూరి కుటుంబీకులు

రామ్మూర్తినాయుడి కర్మక్రియలకు ఎన్టీఆర్ తనయులు నందమూరి జయకృష్ణ, నందమూరి మోహనకృష్ణతో పాటు నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధర, నందమూరి సాయికృష్ణ సతీమణి, నందమూరి హరికృష్ణ కుమార్తె సుహాసిని, ఎన్టీఆర్ కుమార్తెలు దగ్గుబాటి పురందేశ్వరి, లోకేశ్వరి తదితరులు నారావారిపల్లెకు వచ్చారు.

శేషాచల లింగేశ్వర స్వామిని దర్శించుకున్న సీఎం

కుటుంబంలో ఎవరైనా మరణిస్తే కర్మక్రియల అనంతరం శివాలయాన్ని దర్శించి పూజలు చేయడం సంప్రదాయం. దానికనుగుణంగా సాయంత్రం 5 గంటలకు శేషాపురంలోని శేషాచల లింగేశ్వర స్వామి ఆలయంలో సీఎం చంద్రబాబు పూజలు చేశారు. ఆయన వెంట సతీమణి భువనేశ్వరి, కుమారుడు లోకేశ్, సోదరి హైమావతి, రామ్మూర్తి నాయుడి సతీమణి ఇందిర, కుమారులు రోహిత్, గిరీష్, భువనేశ్వరి సోదరి లోకేశ్వరి తదితరులున్నారు.

బంధుమిత్రులకు రాత్రి భోజనం

గురువారం రాత్రి స్వగ్రామంలోని, అలాగే చుట్టుపక్కల గ్రామాల్లోని బంధు మిత్రులకు సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా భోజనం ఏర్పాటు చేశారు. తానూ వారితో కలిసి భోజనం చేశారు.



తన సోదరుడు నారా రామ్మూర్తినాయుడుకు నివాళులర్పిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రులు అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే పులివర్తి నాని

జిల్లా అభివృద్ధిపై సమీక్ష

ఓవైపు తమ్ముడి కర్మక్రియల కార్యక్రమాల్లో పాల్గొంటూనే మరోవైపు జిల్లా అభివృద్ధి పనులపైనా సీఎం చంద్రబాబు దృష్టి సారించారు. నారావారిపల్లిలోని తన నివాసంలో గురువారం సాయంత్రం 4.30 నుంచి 5 గంటల వరకు కలెక్టర్ సహా ముఖ్య అధికారులతో సమావేశమై జిల్లా అభివృద్ధి గురించి సమీక్షించారు. అవసరమైన దిశా నిర్దేశం చేశారు.

వరి రైతుపై తేమ కత్తి!

పంట కొనుగోళ్లలో ని'బంధనాలు'



ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు

- కొనసాగుతున్న మధ్యవర్తులు, మిల్లర్ల దోపిడీ
- అమలు కాని ప్రభుత్వ ఆదేశాలు
- తేమ శాతం, ఇతరత్రా కారణాలతో మద్దతు ధరలో భారీగా కోత
- తీవ్రంగా నష్టపోతున్న అన్నదాతలు
- ఓ వైపు ప్రకృతి విపత్తుల భయం
- సకాలంలో ధాన్యం కొనుగోలు జరగని వైనం

(ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం)

ఆరుగాలం కష్టించి పండించిన పంటను అమ్ముకోవడానికి వరి రైతు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు! మధ్యవర్తులు, మిల్లర్లు కుమ్మక్కై.. ధాన్యంలో తేమ శాతం, ఇతరత్రా కారణాలు చూపి మద్దతు ధరలో భారీగా కోత పెడుతున్నారు. దీంతో అన్నదాత కనీస మద్దతు ధర దక్కక తీవ్రంగా నష్టపోతున్నాడు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో కచ్చితమైన ఆదేశాలు ఇచ్చామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అమలవుతున్నట్టు కనిపించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. రైతులకు నష్టం కలగకుండా ధాన్యం కొనుగోళ్లు చేయాలంటున్నా.. మధ్యవర్తులు నిబంధనల పేరుతో రైతులను దోచుకుంటున్నారు. తమకు ఇంతనష్టం జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.

మధ్యవర్తుల కనుసన్నల్లోనే ధాన్యం కొనుగోళ్లు

ధాన్యం కొనుగోళ్లు రైతు సేవా కేంద్రాల ద్వారా చేస్తున్నట్లు పైకి చెబుతున్నా.. గ్రామాల్లోని పెట్టుబడిదారులు లేదా మధ్యవర్తుల కనుసన్నల్లోనే ఆ ప్రక్రియ అంతా జరుగుతోంది. కోత కోసిన తర్వాత ధాన్యాన్ని పొలంలోనో లేదా రోడ్డుపైకి చేర్చిన అనంతరం సంచులు సమకూర్చడం, కాటా వేయడం, రవాణా వ్యవహారాలన్నీ రైతులకు వ్యవసాయం నిమిత్తం పెట్టుబడి ఇచ్చిన గ్రామాల్లోని మధ్యవర్తులే చూస్తున్నారు. ఈలోగా తుఫాను హెచ్చరికలు వెలువడితే ధాన్యం తడిచి దెబ్బ తింటుందనే ఆందోళనతో రైతులు విక్రయించేందుకు తొందరపడున్నారు. ఇదే అవకాశంగా తీసుకుంటున్న మధ్యవర్తులు.. ధాన్యంలో తేమ శాతం అధికంగా ఉందని చెప్పి బస్తాకు రూ.275 నుంచి 300 వరకు మద్దతు ధరలో కోత పెడుతున్నారు. ఈ విధంగా ఎకరానికి 35 బస్తాల దిగుబడి వస్తే రైతులు దాదాపు రూ.10 వేలు నష్టపోవాల్సి వస్తోంది.

ఇతర జిల్లాలకు ధాన్యం రవాణా

కృష్ణా జిల్లాలో 149 రైస్ మిల్లులున్నాయి. వాటిల్లో 70 వరకు డ్రయ్యర్ సౌకర్యం ఉన్న మిల్లులు. పెద్ద మిల్లులైతే రోజుకు వంద టన్నుల ధాన్యం మరపట్టగలవు. భారీ వర్షం హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలోని మిల్లుల వద్ద ధాన్యం నిల్వలు పేరుకుపోయాయి. యంత్రాలతో కోతలు చేసిన ధాన్యంలో 25 పాయింట్ల మేర తేమ శాతం ఉంటుంది. ఈ ధాన్యాన్ని సంచుల్లోకి ఎత్తి వాహనాల్లో మిల్లులకు పంపితే.. అక్కడ మూడు రోజులలోపు దిగుమతి చేసుకోవడంలో ఆలస్యం జరిగితే ధాన్యం బూజుపట్టి రంగు మారిపోతుంది. దీంతో మిల్లర్లు తాము ధాన్యం దిగుమతి చేసుకోలేమని చెబుతున్నారు. మిల్లు యజమానులు బ్యాంకు గ్యారెంటీగా కోటి రూపాయలు చూపితే, మరో కోటి రూపాయల విలువైన ధాన్యం దించుకునేలా అధికారులు అనుమతులు మంజూరు చేశారు. దీంతో మిల్లుల సామర్థ్యానికి మించి ధాన్యం రావడంతో ఎక్కడి లారీలు అక్కడే నిలబడిపోతున్నాయి. ఈ కారణాలతో రైతులకు సంచులు ఇవ్వకుండా, వాహనాలు సమకూర్చకుండా మధ్యవర్తులు జాప్యం చేస్తున్నారు. ఇదిలా ఉంటే బస్తా ధాన్యం రూ.1,400లకు విక్రయించేందుకు రైతులు అంగీకరిస్తే.. మధ్యవర్తులు మండపేట, సూళ్లూరుపేట, గుంటూరు, తిరుపతి తదితర ప్రాంతాలకు వాహనాల్లో ధాన్యాన్ని అప్పటికప్పుడు తరలిస్తున్నారు. రోజుకు కనీసంగా 450 లారీలకుపైగా ధాన్యం ఇతర జిల్లాలకు తరలిపోతోంది. స్థానికంగా బస్తాకు రూ.1,450 ధర ఇస్తున్నారు. బస్తా ధాన్యంకు రూ.1,725 మద్దతు ధర ఇవ్వాల్సి ఉండగా, రూ.1,400లకే రైతులు తెగనమ్ముకుంటున్నారు.

1262 రకం కొనుగోళ్లలో తొండి

ప్రస్తుతం 1262 రకం ధాన్యాన్ని మిల్లర్లు కొనుగోలు చేయబోమని చెబుతున్నారు. దీనికి కారణం మాత్రం వారు చెప్పట్లేదు. వాస్తవానికి ఇవి బీపీటీ కన్నా మంచి రకం. అయినా సాకులు చెప్పి కొనుగోలు చేయడం లేదు. బీపీటీ-5204 (సోనా మసూరి) రకం బియ్యం 26 కిలోల బ్యాగును మార్కెట్‌లో కనీసంగా రూ.1,600కు కొనుక్కోవాల్సి వస్తోంది. ఈ రకం 75 కిలోల బస్తాను రైతులు ప్రస్తుతం రూ.1400లకే విక్రయించాల్సిన దుస్థితి ఏర్పడింది. మధ్యవర్తులు, మిల్లర్లు కూడబలుక్కుని బీపీటీ రకం ధాన్యం ధరలను ఈ సీజన్‌లో అమాంతం తగ్గించి వేశారు.

ప్రారంభం కాని బియ్యం సేకరణ

మిల్లులకు చేరిన ధాన్యాన్ని మరపడితే లెవీ బియ్యంగా ప్రభుత్వం తీసుకుంటుంది. లెవీ బియ్యాన్ని ఎఫ్‌సీఐ కొనుగోలు చేస్తుంది. ఈ ప్రక్రియ ఇంకా జిల్లాలో ప్రారంభం కాలేదు. స్టేట్ వేర్‌హౌస్ గోడౌన్(ఎస్‌డబ్ల్యూసీ)లలోనే బియ్యం నిల్వ చేసేందుకు అనుమతులు ఇచ్చారు. ఎఫ్‌సీఐ ద్వారా బియ్యం తీసుకునేందుకు సర్వర్ పనిచేయడం లేదనే సాకు చూపి బియ్యం సేకరణను ఇంకా ప్రారంభించలేదు. దీంతో మిల్లర్లు అన్ని ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో ధాన్యాన్ని మరపట్టేందుకు అవకాశం లేకుండా పోయింది. మిల్లర్ల వద్ద ఉన్న బియ్యాన్ని ఎఫ్‌సీఐ గోడౌన్‌లకు తరలిస్తే, ప్రతి శనివారం ఎఫ్‌సీఐ నుంచి బియ్యం నగదుకు సంబంధించిన బిల్లులు విడుదల అవుతాయి. దీంతో రైతులకు ధాన్యం బిల్లులు చెల్లించడానికి మార్గం సుగమం అవుతుంది. జిల్లాలో 17 మార్కెట్ యార్డులలో గోడౌన్‌లు ఉండగా, వీటిలో లక్షన్నర టన్నుల ధాన్యాన్ని నిల్వ చేసుకునేందుకు అవకాశం ఉంది. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేని సమయంలో ఇక్కడ ధాన్యాన్ని భద్రపరచుకునే వెసులుబాటును ప్రభుత్వం ఇవ్వాలి. వాతావరణం అనుకూలంగా మారిన తర్వాత ధాన్యాన్ని పూర్తిస్థాయిలో ఆరబెట్టి రైతులు తమకు నచ్చిన మిల్లులకు, నచ్చిన ధరకు విక్రయించుకునే వెసులుబాటు వస్తుంది. లేదా ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేసి, ఆ తరువాత మిల్లులకు ఇచ్చే అంశాన్ని పరిశీలించాల్సి ఉంది. రైతు సేవా కేంద్రాలకు అసలు భూమి యజమానులు వచ్చి వేలిముద్రలు వేస్తేనే ధాన్యం ఆన్‌లైన్ చేస్తామనే నిబంధనలను తొలగించాలని కౌలు రైతులు కోరుతున్నారు.

తేమ శాతం 24 ఉన్నా కొనుగోలు చేస్తాం

మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడి



గుడివాడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తేమ 24 శాతం తేమ ఉన్నా ధాన్యం కొనుగోళ్లు చేసేలా మిల్లర్లకు కచ్చితమైన ఆదేశాలిచ్చామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. గురువారం కృష్ణా జిల్లా పామర్రు, గుడివాడ ఎమ్మెల్యేలు వర్ల కుమార్‌రాజా, వెనిగండ్ల రాముతో కలిసి రహదారులపై ఆరబోసిన ధాన్యపు రాసులను పరిశీలించారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఇంటిలో వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మంత్రి మనోహర్ విలేకరులతో మాట్లాడుతూ వాతావరణ మార్పులతో 40 రోజుల పాటు జరగాల్సిన ప్రక్రియ నాలుగు రోజుల్లో చేయాల్సి రావడంతో ఇబ్బందులు వస్తున్నాయన్నారు. రైతులకు నమ్మకం కలిగేలా, ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు లేకుండా ముందుకు వెళ్లాలని అధికారులకు ఆదేశాలిచ్చామని పేర్కొన్నారు. మిల్లర్లకు బ్యాంకు గ్యారెంటీ ఇబ్బందులు తలెత్తకుండా, వారికి రావాల్సిన బకాయిలను విడుదల చేశామన్నారు. కొత్త ఆలోచనతో 1:2 నిష్పత్తిలో బ్యాంకు గ్యారెంటీ వెసులుబాటు కల్పించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి కనీస మద్దతు ధర అందిస్తోందన్నారు. శుక్రవారం సాయంత్రం కల్లా ధాన్యం తరలించేలా చర్యలు తీసుకున్నామన్నారు. సమావేశంలో జనసేన ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నవ్య | చిత్రజ్యోతి

ఎంతో సంతోషంగా ఉంది




అక్కినేని వారి ఇంట పెళ్లి సందడి మొదలైన సంగతి తెలిసిందే. నాగచైతన్య, శోభిత పెళ్లి డిసెంబరు 4న జరగనుండగా.. అఖిల్‌కు ఇటీవలే తన ప్రేయసి జైనబ్‌తో నిశ్చితార్థం జరిగింది. తన కుటుంబంలో జరుగుతోన్న వరుస శుభకార్యాల పట్ల నాగార్జున సంతోషం వ్యక్తం చేశారు. ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ "ఈ ఏడాది మాకెంతో ప్రత్యేకమైనది. ఓ వైపు నాన్న శతజయంతి ఉత్సవాలు జరుగుతున్నాయి. మరోవైపు మా ఇద్దరబ్బాయిలు కొత్త జీవితాన్ని ప్రారంభించబోతున్నారు. నాగచైతన్య, శోభిత పెళ్లికి ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. ఏఎన్నార్ స్థాపించిన అన్నపూర్ణ స్టూడియోస్‌లో ఈ పెళ్లి జరగబోతున్నందుకు, అఖిల్ కూడా వైవాహిక బంధంలోకి అడుగుపెడుతున్నందుకు ఆనందంగా ఉంది. జైనబ్ చాలా మంచి అమ్మాయి. ఇతరులపై ఎంతో ప్రేమ, అభిమానం చూపిస్తారు. వారిద్దరూ కలిసి జీవితాన్ని పంచుకోవాలని నిర్ణయించుకున్నందుకు సంతోషంగా ఉంది. అఖిల్ జీవితాన్ని ఆమె పరిపూర్ణం చేయగలరు. ఆమెను సంతోషంగా మా కుటుంబంలోకి ఆహ్వానిస్తున్నాం. వచ్చే ఏడాదిలో వీరి పెళ్లి జరగనుంది" అని నాగార్జున తెలిపారు.

మీ అభిమానాన్ని మర్చిపోలేను




అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన పాన్ ఇండియా సినిమా 'పుష్ప 2'. నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం డిసెంబరు 5న విడుదలవుతోంది. ఇప్పటికే ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా పట్నా.. చెన్నైలో ఈవెంట్స్ నిర్వహించింది చిత్ర బృందం. తాజాగా, కేరళలో జరిగిన ఈవెంట్‌లో అల్లు అర్జున్ మాట్లాడుతూ 'థ్యాంక్యూ కేరళ. మీ దత్త పుత్రుడు మల్లు అర్జున్‌కు మీరిచ్చిన ఈ ఘనస్వాగతాన్ని జీవితాంతం మరిచిపోలేను. 20 సంవత్సరాలుగా మీరు నాపై ఎంతో ప్రేమ చూపిస్తున్నారు. ఈ సినిమా నా కెరీర్‌లో ఎంతో ప్రత్యేకం. ఫహాద్ ఫాజిల్‌తో నటించినందుకు ఆనందంగా వుంది. ఈ సినిమా కోసం మీరు మూడేళ్లుగా వెయిట్ చేస్తున్నందుకు కృతజ్ఞతలు. తప్పకుండా ఇక నుంచి తొందరగా సినిమాలు చేస్తాను. సుకుమార్ తీసిన 'ఆర్య' చిత్రంతోనే నాకు కేరళలో గుర్తింపు దక్కింది. ఆయన వల్లే నేను మీకు దగ్గరయ్యాను. సినిమాలో మలయాళ లిరిక్స్‌తో ఓ సాంగ్‌ను చేశాం" అని చెప్పారు. "నాకు కుదిరితే కొచ్చి వచ్చి మీ అందరితో కలిసి సినిమా చూస్తాను. కేరళతో నా అనుబంధం ప్రత్యేకమైనది" అని రష్మిక మందన్నా అన్నారు. "మీ అందరి ఆదరాభిమానాలు చూస్తుంటే ఇది మాకు కేరళలా లేదు. హైదరాబాద్‌లో ఉన్నట్లు ఉంది. 'పుష్ప 2' అందరి అంచనాలకు మించి ఉంటుంది" అని నిర్మాతలు నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ అన్నారు.

గగనాలన్నీ పూలడుగులు భువనాలన్నీ పాలమడుగులు



శంకర్ దర్శకత్వంలో రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'గేమ్ చేంజర్'. దిల్ రాజు, శిరీష్ భారీ బడ్జెట్‌తో తెలుగు, తమిళ, హిందీ భాషల్లో నిర్మిస్తున్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 10న విడుదలవుతోంది. ఈ చిత్రం నుంచి రొమాంటిక్ సాంగ్ విడుదలైంది. ఈ పాటను తెలుగులో రామజోగయ్య శాస్త్రి, తమిళంలో వివేక్, హిందీలో కౌశర్ మునీర్ రాశారు. భారతీయ సినిమాల్లో తొలిసారిగా రెడ్ ఇన్‌ఫ్రా కెమెరాతో ఈ పాటను న్యూజిలాండ్‌లో చిత్రీకరించారు. సంగీత దర్శకుడు తమన్ ఈ పాటను ఫ్యూజన్ మెలోడీ(వెస్ట్రన్, కర్ణాటక కాంబో)గా ట్యూన్ చేశారు. శ్రేయా ఘోషల్, కార్తీక్ పాడారు.

తుది దశలో హరి హర వీరమల్లు



పవన్ కళ్యాణ్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'హరి హర వీరమల్లు పార్ట్-1 - స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' నిర్మాణం తుది దశకు చేరుకుంది. ఈ వారాంతంలో విజయవాడలో తుది షెడ్యూల్ ప్రారంభం కానుంది. ప్రేక్షకులకు ప్రత్యేకమైన, మరపురాని థియేట్రికల్ అనుభవాన్ని అందించాలనే లక్ష్యంతో నిర్మాత ఏ.ఎం.రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్స్ బేనర్‌పై ఎ.దయాకర్ రావు భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి 28న ప్రపంచ వ్యాప్తంగా తెలుగు, తమిళం, మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో విడుదలవుతోంది. పవన్ కళ్యాణ్ ఇటీవల మహారాష్ట్రలో పర్యటించారు. ఆయన సభలకు అక్కడి ప్రజల నుంచి విశేష జనాదరణ లభించింది. ఈ సందర్భంగా 'హరి హర వీరమల్లు' చిత్రం గురించి తెలుసుకునేందుకు ఆసక్తిని చూపించారు. సినిమా విడుదల కోసం ఎదరు చూస్తున్నామని వారు చెప్పారు. ఈ చిత్రంపై దేశవ్యాప్తంగా అంచనాలు పెరిగాయి. ఈ నేపథ్యంలో పవన్ కళ్యాణ్ అభిమానుల అంచనాలను దృష్టిలో ఉంచుకొని దర్శకుడు జ్యోతి కృష్ణ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్నారు.

విజయవాడలో ప్రారంభం కానున్న షెడ్యూల్‌లో కీలకమైన భారీ సన్నివేశాలను చిత్రీకరించబోతున్నట్లు చిత్ర నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రీకరణలో పవన్ కళ్యాణ్‌తో పాటు 200 మంది ఆర్టిస్టులు పాల్గొనబోతున్నారు. ఈ షెడ్యూల్‌తో 'హరి హర వీరమల్లు' చిత్రీకరణ మొత్తం పూర్తవుతుందని మేకర్స్ తెలిపారు. ప్రముఖ బాలీవుడ్ నటుడు, యానిమల్ ఫేమ్ బాబీ డియోల్ ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తుండగా, నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తున్నారు. అనుపమ్ ఖేర్, నాజర్, రఘుబాబు తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఎం.ఎం. కీరవాణి ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.

గుర్తింపు కోసం నగ్నంగా నటించాల్సిన అవసరం లేదు



మలయాళ నటి దివ్యప్రభ నటించిన చిత్రం 'ఆల్ వియ్ ఇమాజిన్ ఆజ్ లైట్'. ఈ సినిమా ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఇందులో ఆమె నటించిన ఓ న్యూడ్ సీన్ క్లిప్‌ను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ నెటిజన్లు రకరకాల కామెంట్స్ చేస్తున్నారు. వీటిపై స్పందించారు దివ్యప్రభ. "ఈ సినిమాని అంగీకరించినప్పుడే ఇలాంటి పరిస్థితి వస్తుందని ఊహించాను. నేను ఆ సన్నివేశంలో నటించడాన్ని కొందరు విమర్శిస్తున్నారు. సినిమా మొత్తం చూడకుండా కేవలం ఈ సన్నివేశాన్ని మాత్రమే షేర్ చేస్తోన్న వారి మైండ్ సెట్ ఏంటో నాకు అర్థం కావట్లేదు. నేను గుర్తింపు కోసం ఇటువంటి పని చేశా అంటున్నారు. ఒక నటిగా మంచి ప్రాధాన్యం ఉన్న పాత్రలనే నేను అంగీకరిస్తా. ఈ సినిమాలో నా పాత్ర నచ్చి.. అవసరం మేరకే ఆ సన్నివేశంలో నటించాను. కేవలం గుర్తింపు కోసం నగ్నంగా నటించాల్సిన అవసరం నాకు లేదు. ఒక నటిగా ఇప్పటికే నేను నటించిన చిత్రాలకు పలు పురస్కారాలు.. ప్రశంసలు దక్కాయి" అని పేర్కొన్నారు. కాగా, మేలో జరిగిన కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ 77వ ఎడిషన్‌లో గ్రాండ్ ప్రిక్స్ అవార్డును గెలుచుకున్న ఈ చిత్రాన్ని పాయల్ కపాడియా తెరకెక్కించారు. ఎంతో మంది విమర్శకుల ప్రశంసలు అందుకున్న ఈ చిత్రం ఇటీవలే థియేటర్లలో విడుదలైంది. దగ్గుబాటి రానా ఈ సినిమాను దేశవ్యాప్తంగా డిస్ట్రిబ్యూట్ చేశారు.

మనసులో నిలిచిపోయే సినిమా



అల్లరి నరేశ్ నటిస్తున్న తాజా చిత్రం 'బచ్చలమల్లి'. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాలో పూర్తిస్థాయి మాస్ పాత్రను చేస్తున్నారు నరేశ్. సుబ్బు మంగదేవి దర్శకత్వంలో రాజేశ్ దండా, బాలాజీ గుత్తా నిర్మిస్తున్న ఈ చిత్రం టీజర్‌ను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడుతూ 'దర్శకుడు సుబ్బు కథ ఎంత బాగా చెప్పారో అంత బాగా తీశారు. 'గమ్యం', 'నాంది' చిత్రాల్లా 'బచ్చలమల్లి' కూడా ప్రేక్షకుల మనసులో నిలిచిపోతుంది. సినిమాలో పాటలు కూడా స్పెషల్‌గా ఉండబోతున్నాయి. డిసెంబర్ 20న చిత్రం విడుదలవుతుంది. చూసి ఆదరించండి' అని కోరారు.

'ఇందులో నరేశ్ ఎగ్రెసివ్ క్యారెక్టర్ చేశారు. టీజర్‌కు వచ్చిన రెస్పాన్స్ చూడగానే సినిమా బిగ్ హిట్ అనే కాన్ఫిడెన్స్ వచ్చింది' అని చెప్పారు హీరోయిన్ అమృత.

దర్శకుడు సుబ్బు మాట్లాడుతూ 'కరోనా సమయంలో మా అమ్మగారిని చూడడానికి సరైన సమయంలో వెళ్లలేకపోయా. నేను వెళ్లేటప్పటికే అదే చివరి చూపు అయింది. అప్పుడే అనిపించింది.. లైఫ్‌లో వెనక్కి వెళ్లి సరిదిద్దుకోలేని తప్పు చేయకూడదు.. అని. ఇలాంటి పాయింట్ మీదే కథ తయారు చేయాలనిపించింది. నరేశ్‌గారు కూడా ఎంకరేజ్ చేశారు. చాలా మంచి సినిమా అవుతుంది' అన్నారు.

అప్‌డేట్స్

యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరణ



హీరో నాగశౌర్య తన నూతన చిత్రాన్ని రామ్ దేశిన దర్శకత్వంలో చేస్తున్నారు. శ్రీ వైష్ణవి ఫిల్మ్స్ బేనర్‌పై శ్రీనివాసరావు చింతలపూడి నిర్మిస్తున్నారు. తాజాగా హైదరాబాద్‌లో ప్రారంభమైన ఈ షూటింగ్‌లో యాక్షన్ సీక్వెన్స్‌ని చిత్రీకరిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం 60 శాతం షూటింగ్ పూర్తి చేసుకుంది. త్వరలో టైటిల్, ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేయడానికి చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది. ఈ చిత్రానికి హారీస్ జైరాజ్ సంగీతం సమకూరుస్తున్నారు. సముద్రఖని, రాజేంద్ర ప్రసాద్, సాయికుమార్, మైమ్ గోపి, శ్రీదేవి విజయ్‌కుమార్, వెన్నెల కిశోర్, బ్రహ్మాజీ, పృథ్వీ, అజయ్, ప్రియ, నెల్లూరు సుదర్శన్, కృష్ణుడు, చమక్ చంద్ర, శివన్నారాయణ నటిస్తున్నారు.

అన్ని వర్గాలను అలరించే చిత్రం



అల్లు ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్‌పై అల్లు శ్రీరాములు నాయుడు నిర్మాణంలో కిరణ్ వారియర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మెగాస్టార్ ఫ్యాన్'. పింగ్ పాంగ్ సూర్య, డార్లింగ్ ఫేమ్ నర్సింహ కీలక పాత్రల్లో నటించారు. నేడు విడుదలవుతోంది. ఇటీవలే ఈ చిత్రం ట్రైలర్‌ని దర్శకుడు ఏ.కోదండరామి రెడ్డి విడుదల చేశారు. కిరణ్ వారియర్ మాట్లాడుతూ 'ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాం. ఒక మెగా అభిమానిగా ఈ సినిమా తీయడం చాలా గర్వంగా ఉంది. అన్ని వర్గాల ప్రేక్షకులని అలరిస్తుంది' అని అన్నారు.

పొరపొచ్చాలతోనే పేరు తొలగింపా?



ఐశ్వర్యారాయ్ బచ్చన్, అభిషేక్ బచ్చన్ దంపతులు విడిపోతున్నారంటూ కొన్నాళ్లుగా జరుగుతున్న ఊహాగానాలకు మరోసారి రెక్కలొచ్చాయి. ఈ మధ్య ఐశ్వర్యారాయ్, అభిషేక్ బచ్చన్ కలసి కనిపించడం లేదు అని అంతా చర్చించుకుంటున్న తరుణంలో ఇప్పుడు ఐశ్వర్యారాయ్ పేరులో 'బచ్చన్' అనే వారి ఇంటిపేరు కనిపించడం లేదు. ఇటీవలే దుబాయ్‌లో జరిగిన గ్లోబల్ విమెన్స్ ఫోరమ్‌లో ఐశ్వర్యారాయ్ పాల్గొన్నారు. అక్కడ మహిళా సాధికారతపై ఆమె చేసిన ప్రసంగానికి మంచి స్పందన వచ్చింది. అయితే ఆమె వేదికపై మాట్లాడుతున్న సమయంలో వెనుక తెరపై ప్రదర్శించిన స్లైడ్‌లో నిర్వాహకులు 'ఐశ్వర్యారాయ్ - అంతర్జాతీయ నటి' అని ఆమె పరిచయాన్ని క్లుప్తంగా పేర్కొన్నారు. ఐశ్వర్య పేరు చివర బచ్చన్ అనే ఇంటిపేరు లేకపోవడం నెటిజన్ల దృష్టిని ఆకర్షించింది. దాంతో నెటిజన్లు ఆ వీడియోను వైరల్ చేస్తున్నారు. ఐశ్వర్య, అభిషేక్ మధ్య పొరపొచ్చాలు ఉన్నాయి, వారు విడిపోతున్నారు కాబట్టే ఆమె తన పేరులోని బచ్చన్‌ను తొలగించారనే అభిప్రాయాన్ని వారు వ్యక్తం చేస్తున్నారు. అయితే బచ్చన్ పదాన్ని తొలగించడానికి నిర్వాహకుల పొరపాటు కారణమా, లేదా ఐశ్వర్య సూచన మేరకే అలా చేశారా అనేది తెలియదు. తన కొడుకు అభిషేక్‌బచ్చన్, కోడలు ఐశ్వర్యారాయ్ విడిపోతున్నారంటూ మీడియాలో పదేపదే జరుగుతున్న ప్రచారంపై ఇటీవలే అమితాబ్ బచ్చన్ అసహనం వ్యక్తం చేశారు. అందులో నిజం లేదని తెలిపారు.

స్పోర్ట్స్



42 పరుగులకే ధమాల్

శ్రీలంక చెత్త రికార్డు

- జాన్సెన్‌కు 7 వికెట్లు
- దక్షిణాఫ్రికాతో తొలి టెస్ట్

డర్బన్: దక్షిణాఫ్రికాతో తొలి టెస్ట్ మొదటి ఇన్నింగ్స్‌లో శ్రీలంక 42 పరుగులకే కుప్పకూలింది. ఈ క్రమంలో పర్యాటక జట్టు ఎన్నో చెత్త రికార్డుల్ని మూటగట్టుకుంది. సుదీర్ఘ ఫార్మాట్‌లో లంకేయులకిది అత్యల్ప స్కోరు. ఆ జట్టు గత అత్యల్ప స్కోరు 71. రెండు దశాబ్దాల కిందట క్యాండీలో పాకిస్థాన్‌పై ఆ స్కోరు సాధించింది. పేసర్ మార్కో జాన్సెన్ కెరీర్‌లో ఉత్తమ బౌలింగ్‌తో (6.5-1-13-7) చెలరేగడంతో శ్రీలంక 13.5 ఓవర్లలోనే కుప్పకూలింది. దాంతో గత వందేళ్లలో టెస్ట్ క్రికెట్‌లో అతి తక్కువ బంతుల్లో (78) ఆలౌట్ అయిన జట్టుగా కూడా లంకేయులు మరో రికార్డు సొంతం చేసుకున్నారు. కాగా..తన స్పెల్‌లో ఏడు ఓవర్లలోపే ఏడు వికెట్లు పడగొట్టిన రెండో బౌలర్‌గా జాన్సెన్ రికార్డు సృష్టించాడు. 1924లో ఇంగ్లండ్‌పై ఆస్ట్రేలియా స్పిన్నర్ హగ్ టంబెల్ (6.5-0-28-7) తొలిసారి ఈ ఫీట్ నమోదు చేశాడు. అంతకుముందు ఓవర్‌నైట్ 80/4 స్కోరుతో గురువారం మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆతిథ్య జట్టు 191 పరుగులకు ఆలౌటైంది. శ్రీలంకను స్వల్ప స్కోరుకే కట్టడి చేసిన సఫారీలు..రెండో ఇన్నింగ్స్‌లో రెండోరోజు ఆఖరికి 132/3 స్కోరు చేశారు. ఓవరాల్‌గా 281 పరుగుల ఆధిక్యంలో నిలిచారు.



క్వార్టర్స్‌లో లక్ష్యసేన్

చెమటోడ్చిన సింధు

లఖ్‌నవూ: సయ్యద్ మోదీ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీ ప్రీక్వార్టర్స్ విజయానికి స్టార్ షట్లర్ పీవీ సింధు చెమటోడ్చింది. మరోవైపు లక్ష్యసేన్, గాయత్రీ గోపీచంద్ జోడీ సునాయాస విజయాలతో క్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టారు. టాప్ సీడ్ లక్ష్యసేన్ 21-14, 21-13తో డానిల్ దుబోవెంకో (ఇజ్రాయెల్)ను చిత్తు చేసి క్వార్టర్స్‌కు చేరాడు. మూడో సీడ్ కిరణ్ జార్జ్ 21-19, 20-22, 11-21తో ఒగావా చేతిలో ఓడాడు. గురువారం జరిగిన రౌండ్-16 మ్యాచ్‌లో అంతగా పేరులేని ఇరా శర్మ..ప్రపంచ 18వ ర్యాంకర్ సింధుకు గట్టి పోటీ ఇచ్చింది. మొత్తంగా సింధు 21-10, 12-21, 21-15 ప్రపంచ 147వ ర్యాంకర్ ఇరా శర్మపై నెగ్గి ఊపిరి పీల్చుకుంది. రెండో సీడ్ మాళవిక బన్సోడ్ 12-21, 15-21తో సహచరి శ్రీయాన్షి చేతిలో కంగుతిన్నది. డబుల్స్ ప్రీక్వార్టర్ ఫైనల్లో గాయత్రి/ట్రీసా జాలీ జోడీ 21-13, 21-10తో అశ్వినీ భట్/శిఖా గౌతమ్ జంటపై విజయం సాధించింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో గద్దె రుత్వికా శివానీ/రోహన్ జోడీ ఓటమితో టోర్నీ నుంచి నిష్క్రమించింది.

డబ్ల్యూటీసీ.. అంతా గందరగోళం: స్టోక్స్



క్రైస్ట్‌చర్చ్: వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)పై ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. అసలు ఈఆలోచనే ఎంతో గందరగోళంగా ఉందన్నాడు. మ్యాచ్ తర్వాత మ్యాచ్.. సిరీస్ తర్వాత సిరీస్‌పై దృష్టిసారించడమే తమ తీరని చెప్పాడు. అంతేకానీ రానున్న రెండేళ్లను దృష్టిలో పెట్టుకొని ఆడడం తమ విధానం కాదన్నాడు. అర్థం కాకపోవడంతో డబ్ల్యూటీసీ గురించిన ఆలోచనే నిజంగా చేయలేదని తెలిపాడు.

డబ్ల్యూపీఎల్ మినీ వేలం 15న

న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 2025 సీజన్ మినీ వేలం వచ్చే నెల 15న బెంగళూరులో జరగనుంది. ఐదు ఫ్రాంచైజీలు ఒక్కోటి రూ. 15 కోట్ల మొత్తంతో వేలంలోకి అడుగుపెట్టనున్నాయి. వచ్చే సీజన్ డబ్ల్యూపీఎల్ ఫిబ్రవరి-మార్చిలో జరిగే అవకాశముంది.



దౌత్య సంబంధాల్లో క్రికెట్ అంతర్భాగం

ఆస్ట్రేలియా పార్లమెంట్‌లో రోహిత్

ప్రధాని అల్బనీస్‌తో భారత జట్టు భేటీ

కాన్‌బెర్రా: ఆస్ట్రేలియా టూర్‌లో ఉన్న భారత జట్టు.. ఆ దేశ ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకుంది. శనివారం నుంచి రెండు రోజులపాటు ఆసీస్ ప్రైమ్ మినిస్టర్స్ లెవెన్‌తో టీమిండియా పింక్ బాల్ ప్రాక్టీస్ మ్యాచ్ ఆడనుంది. దీన్ని పురస్కరించుకొని భారత జట్టుకు అల్బనీస్ గురువారం విందు ఏర్పాటు చేశారు. ప్రొటోకాల్ ప్రకారం కెప్టెన్ రోహిత్ శర్మ.. భారత జట్టు ఆటగాళ్లను అల్బనీస్‌కు పరిచయం చేశాడు. ఈ సందర్భంగా పెర్త్ టెస్ట్‌లో అద్భుత ప్రదర్శన కనబరచిన బుమ్రా, కోహ్లీ సహా ఇతర ఆటగాళ్లను ఆయన ప్రశంసించారు. ఆస్ట్రేలియా పార్లమెంట్‌లో రోహిత్ అతిథిగా ప్రసంగించాడు. ఇరుదేశాల దౌత్య సంబంధాల్లో క్రికెట్ అంతర్భాగమని అన్నాడు. 'క్రీడలు, వాణిజ్యంలో ఇరు దేశాల మధ్య బలమైన సంబంధాలున్నాయి. ఆటగాళ్ల పోరాటతత్వం, అభిమానుల మద్దతు కారణంగా ఆసీస్‌తో తలపడడం సవాళ్లతో కూడుకున్నది. అలాంటి టీమ్‌పై పైచేయి సాధించడం సంతోషంగా ఉంద'ని రోహిత్ చెప్పాడు. తమను ఆహ్వానించినందుకు అల్బనీస్‌కు కృతజ్ఞతలు తెలిపాడు. జాక్ ఎడ్వర్డ్స్ సారథ్యంలోని ప్రైమ్ మినిస్టర్స్ లెవెన్ కూడా ఈ కార్యక్రమానికి హాజరైంది. భేటీ ముగిసిన తర్వాత 'భారత్‌తో ఆడడం ప్రైమ్ మినిస్టర్స్ లెవన్‌కు పెను సవాలే. కానీ, మా ఆటగాళ్లకే నా మద్దతు అని మోదీకి కూడా చెప్పా' అని అల్బనీస్ ఎక్స్‌లో పోస్టు చేశారు. దీనికి 'భారత్, ప్రైమ్ మినిస్టర్స్ లెవెన్ జట్లను నా మిత్రుడు కలవడం ఎంతో ఆనందదాయకం. సిరీస్‌ను టీమిండియా అద్భుతంగా ఆరంభించింది. కోట్లాది మంది భారతీయులు తమ జట్టుకు మద్దతుగా ఉన్నారు. రానున్న రోజుల్లో హోరాహోరీ పోరు చూస్తామని ఆశిస్తున్నాన'ని ప్రధాని నరేంద్ర మోదీ సమాధానమిచ్చారు. కాగా, నెట్ ప్రాక్టీస్‌కు టీమిండియా ఒక్క రోజు విరామం ప్రకటించింది. శుక్రవారం మళ్లీ సాధన చేయనుంది.

ఎంతోకొంత మసాలా కావాలిగా!



ఆటగాళ్లతో పరిచయం సందర్భంగా అల్బనీస్-కోహ్లీ మధ్య సంభాషణ హైలైట్‌గా నిలిచింది. తొలి టెస్ట్‌లో విరాట్ శతకంతో ఆకట్టుకున్నాడు. దాని గురించి ప్రస్తావిస్తూ.. 'పెర్త్‌లో అద్భుత సెంచరీ కొట్టావు. అప్పటికింకా మాజట్టు పెద్దగా కష్టాల్లో పడలేదు' అని కోహ్లీతో అల్బనీస్ అన్నారు. దానికి విరాట్ ఏమాత్రం తడుముకోకుండా.. 'ప్రతిసారీ ఎంతో కొంత మసాలా దట్టిస్తూ ఉండాలి కదా' అని నవ్వుతూ సమాధానమిచ్చాడు. వీరి సంభాషణ నెట్‌లో వైరల్‌గా మారింది.

న్యూజిలాండ్ 319/8

- ఇంగ్లండ్‌తో తొలి టెస్ట్



కేన్ విలియమ్సన్ (93)

క్రైస్ట్‌చర్చ్: గాయం నుంచి కోలుకొని జట్టులోకి రీఎంట్రీ ఇచ్చిన కేన్ విలియమ్సన్ (93) రాణించడంతో.. ఇంగ్లండ్‌తో గురువారం ఆరంభమైన తొలి టెస్ట్‌లో ఆతిథ్య న్యూజిలాండ్ మెరుగైన స్కోరు సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన కివీస్ మొదటి రోజు ఆటముగిసే సమయానికి 319/8 స్కోరు చేసింది. గ్లెన్ ఫిలిప్స్ (41), సౌథీ (10) క్రీజులో ఉన్నారు. కెప్టెన్ లాథమ్ (47), రచిన్ రవీంద్ర (34) ఓ మాదిరి స్కోర్లు చేశారు. బషీర్ 4 వికెట్లు పడగొట్టగా.. అట్కిన్సన్, బ్రైడన్ కార్సీ చెరో 2 వికెట్లు దక్కించుకొన్నారు.

ఆఖరి వన్డే పాక్‌దే!



కమ్రాన్ గులామ్ (103)

బులవాయో: జింబాబ్వేతో వన్డే సిరీస్‌ను పాకిస్థాన్ 2-1తో సొంతం చేసుకుంది. గురువారం జరిగిన ఆఖరి మ్యాచ్‌లో పర్యాటక జట్టు 99 పరుగులతో నెగ్గింది. తొలుత పాకిస్థాన్ 50 ఓవర్లలో 303/6 స్కోరు చేసింది. కమ్రాన్ గులామ్ (103) తొలి వన్డే శతకంతో, అబ్దుల్లా (50) హాఫ్ సెంచరీతో సత్తా చాటారు. సికిందర్ రజా, ఎస్ గవారా చెరో రెండు వికెట్లు పడగొట్టారు. భారీ ఛేదనలో జింబాబ్వే 40.1 ఓవర్లలో 204 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ ఇర్విన్ (51), బెన్నెట్ (37) మాత్రమే రాణించారు. జమాల్, అయూబ్, రౌఫ్, అబ్రార్ తలా రెండేసి వికెట్లు సాధించారు.

గుకేష్‌కు రూ. 1.68 కోట్లు



సింగపూర్: డిఫెండింగ్ చాంపియన్ డింగ్ లిరెన్‌పై వరల్డ్ చెస్ చాంపియన్‌షిప్ ఫైనల్ మూడో గేమ్ గెలుపొందిన భారత గ్రాండ్‌మాస్టర్ గుకేష్ రూ. 1.68 కోట్లు అందుకున్నాడు. ఫిడే నిబంధనల ప్రకారం 14 గేమ్‌ల ఈ టోర్నమెంట్‌లో ఒక్కో గేమ్ గెలిచిన ఆటగాడికి రూ. 1.68 కోట్లు లభిస్తాయి. ఈనేపథ్యంలో మొదటి గేమ్‌లో విజయం సాధించిన చైనా గ్రాండ్‌మాస్టర్ లిరెన్ సైతం రూ. 1.68 కోట్లు దక్కించుకున్నాడు.



శివాని శ్రీ నిత్య

శివాని, నిత్యకు స్వర్ణాలు

రాజ్‌కోట్: ఎస్‌జీఎఫ్‌ఐ జాతీయ స్విమ్మింగ్ చాంపియన్ షిప్స్‌లో తెలంగాణ బాలికలు కర్రా శివాని, సాగి శ్రీనిత్య స్వర్ణాలు సాధించారు. అండర్-14 కేటగిరీ 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో శివాని 2 నిమిషాల 33.36 సెకన్ల టైమింగ్‌తో టాప్‌లో నిలిచింది. అండర్-17 విభాగం 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో నిత్య 2 నిమిషాల 27.95 సెకన్ల టైమింగ్‌తో అగ్రస్థానం చేజిక్కించుకుంది.

దాదా ముందే చెప్పాడు!



పెర్త్ విజయంపై వాన్

న్యూఢిల్లీ: పెర్త్ టెస్ట్ ఫలితం గురించి భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ ముందుగానే చెప్పాడని ఇంగ్లండ్ మాజీ ఆటగాడు మైకేల్ వాన్ బయటపెట్టాడు. మ్యాచ్ రెండో రోజే ఫలితాన్ని తనకు మెసేజ్ చేశాడన్నాడు. 'నా అంచనాకు తగ్గట్టుగానే మ్యాచ్ జరుగుతున్నద'ని రాశాడన్నాడు. తీరా అదే నిజం కావడం తనను ఎంతో ఆశ్చర్యానికి గురిచేసిందని చెప్పాడు.

'హైబ్రిడ్' చాంపియన్స్ ట్రోఫీకి

పాకిస్థాన్ ససేమిరా!

కరాచీ: చాంపియన్స్ ట్రోఫీ హైబ్రిడ్ విధానానికి తాము అంగీకరించబోమని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) స్పష్టంజేసింది. ఈ పద్ధతిపై శుక్రవారం జరిగే ఐసీసీ బోర్డు సమావేశంలో చర్చించకూడదని కోరింది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే ఈ ట్రోఫీ నిర్వహణలో ఇతర ప్రత్యామ్నాయాలను పరిశీలించాలని ఐసీసీకి పీసీబీ సూచించినట్టు సమాచారం. చాంపియన్స్ ట్రోఫీ వన్డే టోర్నీ షెడ్యూల్ ఖరారుకు వర్చువల్‌గా భేటీ కావాలని ఐసీసీ నిర్ణయించిన సంగతి తెలిసిందే.

రెండో స్థానానికి టైటాన్స్

నోయిడా: తెలుగు టైటాన్స్ జట్టు ప్రో. కబడ్డీ తాజా సీజన్ పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి దూసుకొచ్చింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 41-35తో యు ముంబాను చిత్తు చేసింది. విజయ్ మాలిక్, రైడర్ ఆశిష్ నర్వాల్ చెరో 10 పాయింట్లు సాధించారు. హోరాహోరీగా సాగిన మరో మ్యాచ్‌లో యూపీ యోధాస్ 33-29తో జైపూర్ పింక్ పాంథర్స్‌ని ఓడించింది.



మణిపాల్‌సిగ్నాపై ఎల్‌ఐసీ ఆసక్తి!?

సంస్థలో 50% వాటా కొనుగోలు ద్వారా 'ఆరోగ్య బీమా'లోకి ప్రవేశం

న్యూఢిల్లీ: ఆరోగ్య బీమా సంస్థ మణిపాల్‌సిగ్నా హెల్త్ ఇన్సూరెన్స్‌లో 50 శాతం వాటా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వ రంగ జీవిత బీమా దిగ్గజం ఎల్‌ఐసీ సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఈ సంస్థలో వాటా కొనుగోలు ద్వారా ఎల్‌ఐసీ కూడా హెల్త్ ఇన్సూరెన్స్ విభాగంలోకి ప్రవేశించినట్లవుతుంది. త్వరలో ఆరోగ్య బీమాలో సేవల్లోకీ అడుగు పెడతామని, ఈ విభాగానికి చెందిన ఏదైనా కంపెనీలో వాటా కొనుగోలు చేయాలనుకుంటున్నట్లు ఎల్‌ఐసీ సీఈఓ, ఎండీ సిద్ధార్థ మొహంతీ ఈ మధ్య వెల్లడించారు. మణిపాల్‌సిగ్నా యాజమాన్యంతో ఎల్‌ఐసీ చర్చలింకా ప్రాథమిక దశలోనే ఉన్నాయని, ఇరు వర్గాలు నాన్ డిస్‌క్లోజర్ ఒప్పందం చేసుకొని చర్చలను ప్రారంభించాయని తెలిసింది. దేశీయ సాధారణ బీమా మార్కెట్ పరిమాణం రూ.3 లక్షల కోట్ల స్థాయికి చేరుకోగా.. అందులో హెల్త్ ఇన్సూరెన్స్ విభాగ వాటా 37 శాతంగా ఉంది.

బెంగళూరుకు చెందిన మణిపాల్ ఎడ్యుకేషన్ అండ్ మెడికల్ గ్రూప్, అమెరికన్ ఇన్సూరెన్స్ కంపెనీ సిగ్నా కార్పొరేషన్ ఉమ్మడి భాగస్వామ్యంలో ఏర్పాటు చేసిన సంస్థే మణిపాల్‌సిగ్నా హెల్త్ ఇన్సూరెన్స్. ఇందులో మణిపాల్ గ్రూప్ 51 శాతం, సిగ్నా కార్పొరేషన్ 49 శాతం వాటా కలిగి ఉన్నాయి. ఎల్‌ఐసీకి వాటా విక్రయంలో భాగంగా ఈ భాగస్వామ్య సంస్థలో మణిపాల్ గ్రూప్‌తోపాటు సిగ్నా కార్ప్ కూడా వాటాను తగ్గించుకోనున్నట్లు సమాచారం. ఈ ఒప్పందంలో భాగంగా మణిపాల్‌సిగ్నా విలువను రూ. 4,000 కోట్లుగా లెక్కగట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

బీమా రంగంలో 100% ఎఫ్‌డీఐ !

న్యూఢిల్లీ: బీమా రంగంలో వంద శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)ను అనుమతించాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి సంబంధించి కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నిర్వహణలోని ఆర్థిక సేవల విభాగం (డీఎఫ్ఎస్) ఒక చర్చా పత్రం విడుదల చేసింది. పరిశ్రమ వర్గాలు దీనిపై తమ అభిప్రాయాలని వచ్చే నెల 10లోగా తెలపాలని కోరింది. ప్రస్తుతం మన దేశ బీమా కంపెనీల ఈక్విటీలో 74 శాతానికి మించి ఎఫ్‌డీఐని అనుమతించడం లేదు. నూరు శాతం ఎఫ్‌డీఐను అనుమతించడం ద్వారా బీమా కవరేజీని చౌకగా మరింత మందికి చేరువ చేయవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. ఎఫ్‌డీఐ పరిమితి పెంచడంతో పాటు రీఇన్సూరెన్స్ కంపెనీల కనీస మూలధన నిబంధనను ప్రస్తుత రూ.5,000 కోట్ల నుంచి రూ.1,000 కోట్లకు కుదించాలని కూడా ప్రభుత్వం యోచిస్తోంది.

అదానీ గ్రూప్ రుణాలపై బ్యాంకుల సమీక్ష!

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ కంపెనీలకు ఇచ్చిన రుణాలపై బ్యాంకులు మల్లగుల్లాలు పడుతున్నాయి. ప్రస్తుతానికి ఈ రుణాలను వెనక్కి తీసుకునే ప్రమాదం లేకపోయినా, రుణాల వినియోగం నిబంధనల మేరకు జరుగుతోందా? లేదా? అనే విషయాన్ని బ్యాంకులు ఎప్పటికపుడు సమీక్షించాలని నిర్ణయించినట్టు సమాచారం. సౌర విద్యుత్ ప్రాజెక్టుల కాంట్రాక్టుల కోసం అదానీ గ్రూప్ కంపెనీ అదానీ గ్రీన్ ఎనర్జీ, వివిధ రాష్ట్రాల విద్యుత్ పంపిణీ సంస్థల అధికారులు, రాజకీయ నేతలకు పెద్ద మొత్తంలో ముడుపులు చెల్లించినట్టు అమెరికాలో కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో దేశీయ బ్యాంకులు ఈ చర్య తీసుకుంటున్నాయి.

ఎస్‌బీఐదే పెద్ద వాటా: ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్, ఆర్‌బీఎల్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐడీబీఐ బ్యాంక్.. అదానీ గ్రూప్ కంపెనీలకు పెద్దమొత్తంలో రుణాలు ఇచ్చాయి. ఇందులో ఎస్‌బీఐ వాటానే అత్యధికంగా రూ.33,800 కోట్ల వరకు ఉంది. అయితే ఈ రుణాలన్నీ ఈ బ్యాంకులు తమ పరిధికి లోబడే ఇచ్చినట్టు సమాచారం.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

29వ తేదీ			
హైదరాబాద్	595	విజయవాడ	600
వరంగల్	597	గోదావరి	595
చిత్తూరు	603	విశాఖపట్నం	585
		డజను గుడ్లు రూ. 84	

ఎయిరిండియా పునరుజ్జీవం 'టీ-20 మ్యాచ్' కాదు

న్యూఢిల్లీ: "ఎయిరిండియా పునరుజ్జీవం నాలుగు గంటల్లో ఫలితం తేలిపోయే టీ-20 మ్యాచ్ కాదు. ఐదు రోజుల పాటు సాగే టెస్ట్ మ్యాచ్. ప్రస్తుతం మేం మూడో రోజు లంచ్ సమయం వద్ద ఉన్నాం" అని కంపెనీ సీఈఓ కాంప్‌బెల్ విల్సన్ అన్నారు. ఎయిరిండియా ప్రయాణాన్ని క్రికెట్ మ్యాచ్‌తో పోల్చుతూ ఆయన చేసిన వ్యాఖ్యలివి. ఎయిరిండియా పగ్గాలు చేపట్టిన తర్వాత టాటా గ్రూప్ "విహాన్ ఏఐ" పేరిట ఐదేళ్ల పునరుజ్జీవ ప్రణాళిక ప్రారంభించింది. అందులో రెండేళ్లకు పైగా సమయం గడిచిపోగా తాము నిర్దేశించుకున్న గమ్యం చేరడానికి మరికొంత కృషి చేయాల్సి ఉందన్నారు.

బిజినెస్

మార్కెట్లోకి డాక్టర్ రెడ్డీస్ క్యాన్సర్ ఔషధం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్ నాసోఫరింజియల్ కార్సినోమా (గొంతు పై భాగంలో ప్రారంభమై తల, మెడ ప్రాంతానికి వ్యాపించే అత్యంత అరుదైన క్యాన్సర్) చికిత్సలో ఉపయోగించే టోరిపాలిమాబ్ టాబ్లెట్లను భారత మార్కెట్లో విడుదల చేసింది. ఈ తరహా క్యాన్సర్ చికిత్సకు అమెరికా ఆహార, ఔషధ సంస్థ (యూఎస్ ఎఫ్‌డీఏ), యూరోపియన్ మెడిసిన్స్ ఏజెన్సీ (ఈఎంఏ), మెడిసిన్స్ అండ్ హెల్త్ కేర్ ప్రొడక్ట్స్ రెగ్యులేటరీ ఏజెన్సీ (ఎంహెచ్‌ఆర్ఏ) సహా పలు ప్రపంచ శ్రేణి ఔషధ నియంత్రణ సంస్థలు ఆమోదించిన ఏకైక ఇమ్యునో అంకాలజీ ఔషధం ఇదేనని డాక్టర్ రెడ్డీస్ తెలిపింది. దేశంలో జీటోర్వి పేరుతో ఈ ఔషధాన్ని మార్కెట్ చేయనున్నట్లు తెలియచేసింది. టోరిపాలిమాబ్ టాబ్లెట్ల తయారీకి 2023లో షాంఘై జున్షీ బయోసైన్సెస్ లిమిటెడ్‌తో లైసెన్స్, వాణిజ్యపరంగా తయారీ ఒప్పందంపై డాక్టర్ రెడ్డీస్ సంతకాలు చేసింది.

మళ్లీ పతనబాటలోకి..



సెన్సెక్స్ 1,200 పాయింట్లు నష్టం

మళ్లీ 80,000 దిగువకు సూచీ

నిఫ్టీ 360 పాయింట్లు డౌన్

ముంబై: భారత ప్రామాణిక ఈక్విటీ సూచీలు గురువారం భారీ నష్టాలు చవిచూశాయి. మార్కెట్ దిగ్గజాలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సహా ప్రధాన కంపెనీల షేర్లలో ఇన్వెస్టర్లు భారీగా అమ్మకాలకు పాల్పడటంతో సెన్సెక్స్ 80,000, నిఫ్టీ 24,000 స్థాయిలను కోల్పోయాయి. సెన్సెక్స్ ఒక దశలో 1,315.16 పాయింట్లు (1.63 శాతం) క్షీణించి 78,918.92 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 1,190.34 పాయింట్ల (1.48 శాతం) నష్టంతో 79,043.74 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 360.75 పాయింట్లు (1.49 శాతం) పతనమై 23,914.15 వద్ద ముగిసింది. మార్కెట్ వర్గాల సంపదగా భావించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1.50 లక్షల కోట్లకు పైగా తగ్గి రూ.442.98 లక్షల కోట్లకు (5.24 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో ఎస్‌బీఐ మినహా అన్నీ నేలచూపు చూశాయి. మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు 3.48 శాతం, ఇన్ఫోసిస్ 3.46 శాతం నష్టంతో సూచీ టాప్ లూజర్లుగా మిగిలాయి. బజాజ్ ఫైనాన్స్, అదానీ పోర్ట్స్, హెచ్‌సీఎల్ టెక్, టైటాన్, టెక్ మహీంద్రా షేర్లు 2 శాతానికి పైగా క్షీణించగా.. ఇండెక్స్‌లో అత్యధిక వెయిటేజీ కలిగిన రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.67 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఒక శాతం తగ్గాయి.

- అదానీ స్టాక్స్ విషయానికొస్తే, గ్రూప్‌లోని 11 లిస్టెడ్ కంపెనీల్లో 5 లాభపడ్డాయి. అదానీ టోటల్ గ్యాస్ 16 శాతం ఎగబాకగా.. అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ 10 శాతం, అదానీ గ్రీన్ ఎనర్జీ 10 శాతం, అదానీ పవర్ 6.95 శాతం, అదానీ ఎంటర్‌ప్రైజెస్ 1.63 శాతం పుంజుకున్నాయి. అదానీ పోర్ట్స్ మాత్రం 2.73 శాతం నష్టపోగా.. ఎన్‌డీటీవీ 2.03 శాతం, ఏసీసీ 0.75 శాతం, అంబుజా సిమెంట్స్ 0.48 శాతం, అదానీ విల్మార్ 0.44 శాతం, సంఘీ ఇండస్ట్రీస్ 0.17 శాతం తగ్గాయి.

ఆపదలో నీకు నేను.. నాకు నువ్వు

పరస్పర ప్రత్యామ్నాయ ట్రేడింగ్ వేదికలుగా బీఎస్ఈ, ఎన్ఎస్ఈ

స్టాక్ మార్కెట్లో నిరంతరాయ ట్రేడింగ్ కోసం సెబీ కొత్త ఫ్రేమ్‌వర్క్

న్యూఢిల్లీ: సాంకేతిక వైఫల్యం లేదా విపత్తు సమయంలోనూ స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నిరంతరాయంగా ట్రేడింగ్ జరిగేలా చూసేందుకు క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ కొత్త ముసాయిదాను ప్రవేశపెట్టింది. స్టాక్ ఎక్స్ఛేంజీల్లో కార్యకలాపాల కొనసాగింపుతో పాటు డిజాస్టర్ రికవరీ మెకానిజాన్ని బలోపేతం చేయడమే ఈ చర్యల ప్రధానోద్దేశమని సెబీ పేర్కొంది. ఇందులో భాగంగా బీఎస్ఈ, ఎన్ఎస్ఈ... ఈక్విటీ, డెరివేటివ్స్, కరెన్సీ మార్కెట్ విభాగాల్లో పరస్పరం సహకరించుకోనున్నాయి. ఉదాహరణకు, సాంకేతిక వైఫల్యాల సమయంలో బీఎస్ఈకి ఎన్ఎస్ఈ, ఎన్ఎస్ఈకి బీఎస్ఈ పరస్పర ప్రత్యామ్నాయ ట్రేడింగ్ వేదికగా పనిచేయనున్నాయి. వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఇది అమలులోకి రానుంది. సాంకేతిక వైఫల్యం లేదా విపత్తు గురించి ప్రభావిత స్టాక్ ఎక్స్ఛేంజీ సెబీతోపాటు ప్రత్యామ్నాయ ఎక్స్ఛేంజీకి 75 నిమిషాల్లో సమాచారం అందించాల్సి ఉంటుంది. ఆ తర్వాత 15 నిమిషాల్లోగా ప్రత్యామ్నాయ ఎక్స్ఛేంజీ ట్రేడింగ్ కొనసాగింపు ప్రణాళికను అమలు చేయాల్సి ఉంటుంది. ఇలాంటి సమయంలో పరస్పర సహకారం కోసం స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ)ను రెండు నెలల్లో ఏర్పాటు చేసుకోవాలని కోరింది.

ఏపీ, తెలంగాణలో | స్టార్‌హెల్త్ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ సనత్ కుమార్

రూ.3,330 కోట్ల క్లెయిమ్స్ సెటిల్‌మెంట్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు తమకు అత్యంత కీలక మార్కెట్లని స్టార్‌హెల్త్ ఇన్సూరెన్స్ ప్రకటించింది. గత ఐదేళ్లలో ఈ రెండు రాష్ట్రాల నుంచి వచ్చిన రూ.3,330 కోట్ల విలువైన క్లెయిమ్‌లను సెటిల్ చేసినట్టు కంపెనీ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ సనత్ కుమార్ తెలిపారు. ఇందులో రూ.920 కోట్ల విలువైన క్లెయిమ్‌లను గత ఆర్థిక సంవత్సరం సెటిల్ చేసినట్టు చెప్పారు. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఏపీ, తెలంగాణల్లో రూ.1,380 కోట్లుగా ఉన్న ప్రీమియం వసూళ్లు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రూ.1,650 కోట్లకు చేరే అవకాశం ఉందని సనత్ కుమార్ తెలిపారు. వచ్చే నాలుగేళ్లలో రెండు తెలుగు రాష్ట్రాల్లో తమ వ్యాపారం రెట్టింపవుతుందన్నారు. దేశవ్యాప్తంగా తమకు 40,000 నెట్‌వర్క్ ఆస్పత్రులు ఉంటే, అందులో 1,840 ఆస్పత్రులు రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్నట్టు చెప్పారు. అందరికీ వైద్యం అందుబాటులోకి రావాలంటే, అన్ని రకాల ఆరోగ్య బీమా పాలసీలపై ప్రభుత్వం జీఎస్‌టీ ఎత్తివేయాలన్నారు. అది సాధ్యం కాని పక్షంలో ప్రస్తుతం 18 శాతంగా ఉన్న జీఎస్‌టీని కనీసం ఐదు శాతానికైనా కుదించాలని కోరారు.

బీఎండబ్ల్యూ ఎం2

ధర రూ.1.03 కోట్లు



లగ్జరీ కార్ల దిగ్గజం బీఎండబ్ల్యూ.. మార్కెట్లోకి ఎం2 కారును విడుదల చేసింది. బీఎండబ్ల్యూ ఆపరేటింగ్ సిస్టమ్ 8.5, సరికొత్త డిజైన్, అప్‌డేటెడ్ ఇంటీరియర్‌తో దీన్ని తీసుకువచ్చింది. పెట్రోల్ వేరియంట్‌లో అందుబాటులో ఉండనున్న ఈ బీఎండబ్ల్యూ ఎం2 ధర రూ.1.03 కోట్లు (ఎక్స్‌షోరూమ్).

● ఆడి క్యూ7 కొత్త వెర్షన్

జర్మనీ లగ్జరీ కార్ల దిగ్గజం ఆడి క్యూ7 ఎస్‌యూవీ కొత్త వెర్షన్‌ను గురువారం మార్కెట్లో ప్రవేశపెట్టింది. పూర్తిగా కొత్త డిజైన్‌తో, మరింత మెరుగైన ఫీచర్లతో వచ్చిన ఈ కారు రెండు వెర్షన్లలో అందుబాటులో ఉంటుంది. ఇందులో ఒక వెర్షన్ ఎక్స్‌షోరూమ్ ధర రూ.88.66 లక్షలు కాగా రెండో వెర్షన్ ధర రూ.97.81 లక్షలు.



సిల్వర్.. ధమాల్

ఒక్కరోజే రూ.4,900 తగ్గిన ధర

న్యూఢిల్లీ: వెండి ధర ఎంత వేగంగా పెరిగిందో.. మళ్లీ అంతే వేగంగా కిందికి జారింది. ఢిల్లీ మార్కెట్లో కిలో వెండి ధర గురువారం రూ.4,900 తగ్గుదలతో మూడు నెలల కనిష్ఠ స్థాయి రూ.90,900 స్థాయికి పడిపోయింది. వెండికిదే అతిపెద్ద ఒక్కరోజు నష్టం. బుధవారం సిల్వర్ రేటు రూ.5,200 పెరిగింది. కానీ, స్టాకిస్టులు, రిటైలర్లు భారీగా అమ్మకాలకు పాల్పడటం ధర పతనానికి ప్రధాన కారణమని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. కాగా, 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.100 తగ్గి రూ.78,700కు పరిమితమైంది. అంతర్జాతీయ మార్కెట్ విషయానికొస్తే, ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం 2,673 డాలర్లకు పెరగగా.. సిల్వర్ 30.51 డాలర్లకు పడిపోయింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,350 ▼	70,090 ▼	98,000 ▲
ముంబై	76,287 ▲	69,879 ▲	87,904 ▼

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	105	విజయవాడ	109
వరంగల్	105	గుంటూరు	109
కరీంనగర్	105	ఒంగోలు	109
మహబూబ్‌నగర్	105	చిత్తూరు	99
కర్నూలు	105	నెల్లూరు	99
విశాఖపట్నం	115	అనంతపురం	99
గోదావరి	109		



గీతాసారం

మనం ఎప్పుడూ ఉంటాం...


న త్వేవాహం జాతు నాసం, నత్వం నేమే జనాధిపాః
న చైవ న భవిష్యామః సర్వే వయ మతః పరమ్

"నేను ఇదివరకు ఎప్పుడూ లేని వాణ్ణి కాదు. నువ్వు కూడా ఇంతకుముందు లేనివాడివి కావు. నీవు కాని, నేను కాని, ఈ పాలకులు కాని ఉండని కాలమే లేదు. ఇక ముందు, అంటే భవిష్యత్తులో 'మనం ఉండేది లేదు' అని అనుకోవద్దు. మనం ఎప్పుడూ ఉంటాం" అని భగవద్గీతలోని రెండో అధ్యాయమైన సాంఖ్యయోగంలో అర్జునుడికి శ్రీకృష్ణుడు బోధించాడు. నాశనంలేనిదీ, శాశ్వతమైనదీ అయిన జీవన అస్తిత్వానికి సంబంధించిన ప్రస్తుత 'లౌకిక భాగం' నశించడం ఖాయమనీ, కాబట్టి ముందున్న యుద్ధాన్ని కొనసాగించాలనీ సూచించాడు. శాశ్వతమైన జీవన అస్తిత్వాన్ని 'ఆత్మ', 'చైతన్యం', 'అవగాహన' అనే పేర్లతో పిలుస్తాం. దాన్నే శ్రీకృష్ణుడు 'దేహి' అన్నాడు. ఈ సృష్టి తాలూకు సారంతో మొదలుపెట్టి... శాశ్వతమైన, అపరిమితమైన జీవన అస్తిత్వం గురించి ఆయన వివరించాడు. శాశ్వతమైన ఆ అస్తిత్వానికి ఒక భౌతిక భాగం ఉందనీ, అది తప్పనిసరిగా నాశనం అవుతుందని చెప్పాడు.



> అవగాహన, బోధన అనే ఆయుధాలతో యుద్ధాలను ఎదుర్కోవాలని శ్రీకృష్ణుడు బోధించాడు. 'అహంకారం' (నేను కర్తను అనే భావన)తో అర్జునుడు యుద్ధం నుంచి ఒకవేళ వైదొలగినా... విషాదానికి శాశ్వతంగా బానిస అవుతాడని శ్రీకృష్ణుడికి తెలుసు. అందుకే 'సత్'ను గ్రహించి యుద్ధం చేయాలని సలహా ఇచ్చాడు.

పాలకుల గురించి ఆయన ప్రస్తావిస్తూ... వారిలో ఉన్న శాశ్వతమైన, నాశనం లేని జీవన అస్తిత్వం గురించి చెప్పాడు. ఈ శ్లోకంలో గమనించవలసిన విషయం ఏమిటంటే... మన సృష్టి రెండు భాగాలుగా జరిగింది. మొదటి భాగం దేహం, మనస్సు. ఈ రెండూ తప్పనిసరిగా నాశనం అవుతాయి. ఇవి సుఖదుఃఖాల్లాంటి ద్వంద్వాలకు లోనవుతున్నాయి. కురుక్షేత్రంలో అర్జునుడు అటువంటి భావనకే లోనవుతున్నాడు. రెండవ భాగం



శాశ్వతమైన 'దేహి'. దీన్ని గ్రహించాలనీ, మనల్ని శరీరంతో, మనస్సుతో (అసత్)తో గుర్తించుకోవడం మానేసి... దేహి (సత్)తో గుర్తించుకోవడం ప్రారంభించాలనీ ఆయన స్పష్టం చేశాడు. బుద్ధత్వం (ఆత్మజ్ఞానం) అనేది ఈ గుర్తింపులను అధిగమించినప్పుడే కలుగుతుంది. దాన్ని అనుభూతి చెందాల్సిందే తప్ప మాటలలో వర్ణించలేం.

యుద్ధం చెయ్యాలని అర్జునుడికి చెప్పే భాగమే 'భగవద్గీత'లో మన అవగాహనకు లొంగని అత్యంత క్లిష్టమైన భాగం. కొంతమంది అసలు కురుక్షేత్ర యుద్ధమే జరగలేదనీ, అది మన దైనందిన పోరాటాలను ప్రదర్శించే రూపకం మాత్రమేననీ అంటారు. అయితే అర్జునుడు విరమించినంత మాత్రాన... యుద్ధం ముగిసే అవకాశం లేదనేది కూడా నిజం. అవగాహన, బోధన అనే ఆయుధాలతో యుద్ధాలను ఎదుర్కోవాలని శ్రీకృష్ణుడు బోధించాడు. 'అహంకారం' (నేను కర్తను అనే భావన)తో అర్జునుడు యుద్ధం నుంచి ఒకవేళ వైదొలగినా... విషాదానికి శాశ్వతంగా బానిస అవుతాడని శ్రీకృష్ణుడికి తెలుసు. అందుకే 'సత్'ను గ్రహించి యుద్ధం చేయాలని సలహా ఇచ్చాడు.



కె. శివప్రసాద్
ఐఎఎస్

ధర్మపథం

బౌద్ధం నాస్తికతకు వ్యతిరేకి. బౌద్ధులు భౌతిక జీవన విధానాన్ని, నాస్తికతను ఎన్నడూ సమర్థించలేదు. దీనికి ఉదాహరణలు కోకొల్లలు. త్రిపిటకాలలో ఒక ఘట్టాన్ని చూద్దాం. పాయాసి రాజు ఆనాటి మేటి తత్త్వాన్వేషి. అతను సేతవ్యా అనే ధన, ధాన్య పరిపూర్ణమైన నగరానికి ప్రభువు. ఆ నగరాన్ని అతనికి బుద్ధ భగవానుడి సమకాలీకుడైన ప్రసేనజిత్తు ఇచ్చాడు. ప్రసేనజిత్తు కోసల రాజ్యానికి రాజు. పాయాసి పూర్ణ భౌతికవాది. కనిపించేవాటిని తప్ప మరి వేటినీ ఒప్పుకొనేవాడు కాదు. పరలోకం, పాపపుణ్యాలు కనిపించవు కాబట్టి వాటిని అంగీకరించేవాడు కాదు. ఆత్మనైతే ససేమిరా ఒప్పుకొనేవాడు కాదు. జీవుడు మరణానంతరం మళ్ళీ పుడతాడన్న సిద్ధాంతాన్ని కూడా అతను అంగీకరించలేదు. మంచి, చెడు కర్మల మీద కూడా అతనికి విశ్వాసం ఉండేది కాదు. పాయాసి రాజు సిద్ధాంతాన్ని బుద్ధుడి శిష్యుడైన కుమార కాశ్యపుడు ఒప్పుకోలేదు. ఒక రోజు పాయాసి పరిపాలించే సేతవ్యా నగరానికి కుమార కాశ్యపుడు వెళ్ళాడు. అతణ్ణి పాయాసి ఆదరాభిమానాలతో ఆహ్వానించాడు. తన సిద్ధాంతాన్ని అతనికి వినిపించాడు.

అయితే బౌద్ధం పునర్జన్మను అంగీకరిస్తుంది. మరణించిన ప్రాణి మళ్ళీ జన్మిస్తాడని బౌద్ధ ధర్మ గ్రంథాలు పేర్కొన్నాయి. హిందూ ధర్మ గ్రంథాల్లో కూడా ఇదే విషయం ఉంది. ఈ విషయాన్ని

మరణం తరువాత ఏమౌతుంది?


అర్థం చేసుకోవాలంటే... శబ్ద ప్రమాణాన్ని నమ్మడం... అంటే పూర్వచార్యులు, ఆప్తులు చెప్పే మాటలను విశ్వసించడం ఎంతో అవసరం. ఎందుకంటే... చనిపోయిన వ్యక్తి నుంచి వేరయిన ఆత్మ మళ్ళీ కొత్త శరీరంలోకి ప్రవేశించే సంఘటనను ఇంతవరకూ ఎవ్వరూ కళ్ళతో చూడలేదు. ఇలాంటి ఆధ్యాత్మిక విషయాలు యోగ సాధనద్వారా అవగతం అవుతాయేమో కానీ... మామూలు కళ్ళకు కనిపించవు. ఆ సంఘటనను చూద్దామంటే వీలు పడదు.

కానీ పాయాసి చాలా పట్టుదల కలిగిన వ్యక్తి. 'జీవుడు మరణానంతరం వేరొక శరీరంలోకి ప్రవేశిస్తాడా?' అనేది తెలుసుకోవడానికి అతను చాలా ప్రయత్నం చేశాడు. దుష్కర్మలను ఆచరించి, మరణానికి సిద్ధంగా ఉన్న కొంతమంది మిత్రులతో 'నరకానికి వెళ్ళి మళ్ళీ భూలోకానికి తిరిగి వచ్చాక, మరణానంతరం ఎక్కడ ఎలా జన్మిస్తారు?' అనే విషయాన్ని తనతో చెప్పమన్నాడు. కానీ పాయాసి మిత్రులెవరూ తిరిగి వచ్చి ఆ విశేషాలను అతనికి చెప్పలేదు. అలాగే సత్కర్మలను ఆచరించే తన మిత్రులతో 'త్రాయస్త్రింశలోకం' నుంచి, అంటే స్వర్గం నుంచి మళ్ళీ భూలోకానికి వచ్చాక... ఆ విశేషాలు తనతో చెప్పమన్నాడు. కానీ ఎవ్వరూ తిరిగి రాలేదు, ఆ విషయాలను చెప్పనూ లేదు. దాంతో అతను పరలోకం ఒకటి ఉందని ఒప్పుకోవడం మానేశాడు. అయితే పాయాసి సిద్ధాంతాన్ని కుమార కాశ్యపుడు అంగీకరించలేదు.



ఆచార్య చౌడూరి ఉపేంద్ర రావు,
జేఎన్‌యు, న్యూఢిల్లీ.
91 98189 69756

> బౌద్ధం పునర్జన్మను అంగీకరిస్తుంది. మరణించిన ప్రాణి మళ్ళీ జన్మిస్తాడని బౌద్ధ ధర్మ గ్రంథాలు పేర్కొన్నాయి. హిందూ ధర్మ గ్రంథాల్లో కూడా ఇదే విషయం ఉంది.



విశేషం

భక్త జన కల్పవల్లి

డిసెంబర్ 2నుంచి శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాలు

తెలుగు నెలల్లో తొమ్మిదోదైన మార్గశిర మాసంతో హేమంత ఋతువు ఆరంభం అవుతుంది. భగవద్గీతలో 'మాసానాం మార్గశీర్షోహం' అన్నాడు శ్రీకృష్ణుడు. అందుకే ఈ నెలను సాక్షాత్తూ విష్ణుస్వరూపంగా పరిగణిస్తారు. ఇది లక్ష్మీప్రదమైన మాసం కూడా. మార్గశిర మాసం, అందునా గురు(లక్ష్మి)వారం శ్రీమహాలక్ష్మీదేవికి ఎంతో ఇష్టమైనవి. మార్గశిర లక్ష్మివారాల్లో ఆమెను పూజిస్తే సకల శుభాలు కలుగుతాయనే విశ్వాసం ఉంది. అందుకే ఆ రోజుల్లో ఆ తల్లి అనుగ్రహాన్ని పొందడానికి నోములు చేసుకుంటారు. మహాలక్ష్మి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహిస్తారు. అటువంటి ఆలయాల్లో మహారాష్ట్రలోని కొల్హాపూర్ ఆలయం ప్రసిద్ధమైనది కాగా... విశాఖపట్నంలోని శ్రీ కనకమహాలక్ష్మి సన్నిధి కూడా ఎంతో ప్రాచుర్యాన్ని సంతరించుకుంది.

నగరానికి రక్షగా...

విశాఖపట్నం ఒకప్పుడు కళింగ గజపతుల పాలనలో ఉండేదని, రాజ్య రక్షణ కోసం సాగరతీరంలోని ఒక కొండ మీద బురుజు నిర్మాణం చేపట్టారని, తవ్వకాలు జరుపుతుండగా శ్రీమహాలక్ష్మి విగ్రహం బయటపడిందని, దాన్ని కొండకు సమీపంలో ప్రతిష్ఠించారనీ ఒక కథ ఉంది. అమ్మవారు కొలువైన ప్రాంతాన్ని ఇప్పటికీ బురుజుపేటగానే వ్యవహరిస్తారు. కాగా కనకమహాలక్ష్మి ఆవిర్భావం గురించి మరో కథనం కూడా వినిపిస్తుంది. తమోగుణంతో నిండిన ఒక శక్తికి శివభక్తుడైన వ్యక్తి మీద ఆగ్రహం కలిగింది. అతణ్ణి తన వజ్రాయుధంతో చంపడానికి సిద్ధమయింది. అప్పుడు శివుడు సాక్షాత్కరించి, అదే వజ్రాయుధంతో ఆ శక్తి చేతులు నరికి, ఆమెలోని తమోగుణాన్ని నిష్ఫలం చేసి, కనకమహాలక్ష్మిగా నామకరణం చేశాడట. అప్పుడు ఆ శక్తి శాంతించింది, కరుణతో నిండిపోయింది. పరమ శివుడి ఆజ్ఞ మేరకు ప్రజల ఆలనా, పాలనా చూడడమే సంకల్పంగా అక్కడ కొలువయింది. ప్రజలకు రక్షణ శక్తిగా ఉండడానికి వీలుగా తనకు ప్రత్యేకంగా ఆలయం నిర్మించవద్దని ఆదేశించిందనీ. కుల, మతాలకు అతీతంగా అందరూ స్వయంగా తనను ఆరాధించుకోవచ్చనీ, ఎటువంటి ప్రతిబంధకాలు కల్పించవద్దని శాసించిందనీ చెబుతారు. ఆ ప్రకారం అమ్మవారి విగ్రహానికి పైన పైకప్పు లాంటిది ఏదీ ఉండదు. ఇప్పటికీ భక్తులు తమ స్వహస్తాలతోనే అమ్మవారికి పూజలు చేస్తారు.

నెల రోజుల వేడుక...

విశాఖపట్టణం ఒకప్పుడు చిన్న ఊరు. ఆంగ్లేయుల కాలంలో బాగా అభివృద్ధి చెందింది. ఆ సమయంలో... బురుజుపేటలో రోడ్డు విస్తరణ కోసం... రోడ్డుకు అడ్డంగా ఉన్న కనకమహాలక్ష్మి అమ్మవారి విగ్రహాన్ని ఒక పక్కకు జరిపారు. వెంటనే ఆ ప్రాంతంలో ప్లేగు వ్యాధి ప్రబలింది. అనేకమంది మృత్యువాత పడ్డారు. అమ్మవారిని కదిలించిన కారణంగానే ఈ విపత్తు వాటిల్లిందన్న ప్రజల ఆందోళనకు అధికారులు స్పందించి, అమ్మవారిని యథాస్థితికి చేర్చారు. వెంటనే వ్యాధి తగ్గడంతో ప్రజల్లో విశ్వాసం మరింత గాఢమయింది. ఆనాటి నుంచి అమ్మవారిని కొలిచే భక్తుల సంఖ్య పెరిగింది. శ్రీ కనకమహాలక్ష్మి ఖ్యాతి దశదిశలా పాకింది. అమ్మవారికి ప్రియమైన మార్గశిరంలో మాసోత్సవాలను ప్రతి సంవత్సరం నిర్వహిస్తారు. ముఖ్యంగా లక్ష్మివారాల్లో రోజంతా ఆలయం భక్తులతో కిటకిటలాడుతుంది. ఈ నెలరోజుల్లో లక్షలాదిమంది అమ్మవారిని దర్శించుకుంటారు. మహిళలు కుంకుమ పూజలు, అభిషేకాలు చేస్తారు. భక్తులపాలిట కల్పవల్లిగా... సిరులు అందించే సౌభాగ్యప్రదాయినిగా కనకమహాలక్ష్మి ఆరాధిస్తారు.

• ఆయపిళ్ళ రాజపాప




చింతన

మానవుల స్వేచ్ఛ కోసం...

తెలుగు గడ్డ మీద పుట్టిన జిడ్డు కృష్ణమూర్తి 20వ శతాబ్దపు తత్త్వవేత్తలందరిలో మకుటాయమానమైనవాడు. కృష్ణమూర్తిని హ్యూమ్, లోక్, కాంట్, హుసర్ల్, సార్త్రే లాంటి ప్రసిద్ధమైన పాశ్చాత్య తత్త్వవేత్తలతో ఒకవైపు, పతంజలి, కపిలుడు, బుద్ధుడు, శంకరాచార్యుడు లాంటి భారతీయ తత్త్వవేత్తలతో ఇంకొకవైపు పోలిస్తే... ఆయన గొప్పతనం అర్థమవుతుంది. ఆయన ఆలోచనల్లో, ప్రతిపాదనల్లో ఉన్న పటిష్ఠత ప్రాక్పశ్చిమ తత్త్వవేత్తలు ఎవరిలోనూ కనిపించదు. కృష్ణమూర్తి 'సృష్టికర్త ఉన్నాడా? ఆత్మ ఆద్యంతరహితమైనదా? మనిషి మేధస్సు పరిమితులు, కార్య కారణాల మధ్య సంబంధం, కాలం, మంచి-చెడు' లాంటి సైద్ధాంతికమైన తాత్త్విక అంశాలను మాత్రమే చర్చించలేదు. 'మనిషి మనుగడతో ముడిపడిన ప్రేమ, అహంకారం, అసూయ, కామం, క్రోధం, హింస, భయం, అధికారం, బానిసత్వం' తదితర విషయాలను కూడా ఆయన విశ్లేషించారు. 'చైతన్యం అంటే ఏమిటి? కాలం ఎలా ఉద్భవిస్తుంది? దాన్ని ఎలా అధిగమించవచ్చు? చావు పుట్టుకల అర్థం ఏమిటి? కుండలినీ శక్తి నిజంగానే ఉందా?' అనే ప్రశ్నల విశ్లేషణలో... కృష్ణమూర్తి తాత్త్వికత పరాకాష్ఠను చేరుకుంది. ఆయన వినియోగించే పద్ధతి.. ఫిలసాఫికల్ మెథడ్. ఆయన చూపిన మార్గం వినూత్నమైనది. తత్త్వవేత్తలందరూ తమ పూర్వకాలం వారి సిద్ధాంతాల మీద, వారి అభిప్రాయాల మీద, ఆప్త వచనాల మీద ఆధారపడతారు. కృష్ణమూర్తి అలా కాదు... వేటిని పాటిస్తే మనిషికి ఆ సమస్యలు స్పష్టంగా అర్థమవుతాయో, తార్కికవాదం, ఊహ సైతం అందుకోలేని సత్యం దర్శనమిస్తుందో... ఆ అంశాలను ఆయన శ్రోతలకు విశదంగా వివరిస్తారు. 'మనిషి తన ప్రశ్నలకు జవాబుల కోసం ఇతరుల మీద ఆధారపడకూడదు, తనకు తానే మార్గదర్శి కావాలి' అనేది ఆయన అభ్యర్థన. సత్యాన్వేషణలో స్వేచ్ఛ అతి ప్రధానమైనది. దాంట్లో గురువులకు, మతాలకు తావు లేదు. ఊత కర్రలాంటి ఇతరుల సిద్ధాంతాలను దూరంగా ఉంచాలి... ఇదీ కృష్ణమూర్తి సందేశం. తాత్త్విక ప్రపంచంలో ఇదొక విప్లవం. సంప్రదాయాలమీద, గురువులమీద ఒక తిరుగుబాటు.

స్వేచ్ఛకు, సత్యానికి ఇంత విలువ ఇచ్చిన జిడ్డు కృష్ణమూర్తి 1895 మే 12న... మదనపల్లిలో నారాయణయ్య, సంజీవమ్మ దంపతులకు ఎనిమిదవ బిడ్డగా జన్మించారు. ఆయన జాతకాన్ని పరిశీలించిన దైవజ్ఞుడు కుమారశ్రౌతులు "ఈ పిల్లవాడు భావికాలంలో జగద్గురువు అవుతాడు" అని జోస్యం చెప్పాడు. కానీ బాల్యంలో కృష్ణమూర్తి చదువుల పట్ల ఎలాటి ఆసక్తి చూపలేదు. గంటల తరబడి చీమల బారులను, ఆకాశంలో మబ్బులను చూస్తూ కూర్చొనేవారు. ఆయన చేష్టలను అందరూ పిచ్చిగా పరిగణించారు. పదేళ్ళ వయసులో ఆయన తల్లి మరణించడంతో... తండ్రి నారాయణయ్య బతుకుతెరువు కోసం కుటుంబాన్ని మద్రాసుకు (చెన్నైకి) మార్చారు. మద్రాసు అడయార్‌లో ఉన్న దివ్యజ్ఞాన సమాజం (థియోసోఫికల్ సొసైటీ)లో చిన్న ఉద్యోగిగా చేరారు. అక్కడ సముద్ర తీరంలో తన తమ్ముడు నిత్యానందుతో ఆడుకుంటున్న కృష్ణమూర్తి వర్చస్సును దివ్యజ్ఞాన సమాజం సభ్యుడైన లెడ్ బీటర్ గమనించారు. 'ఇతను గౌతమ బుద్ధుడి అవతారం. పెద్దవాడయ్యాక జగద్గురువు అవుతాడు' అని నిర్ధారణ చేసుకున్నారు. ఆ విషయాన్ని ప్రపంచానికి చాటి చెప్పారు. సమాజం అధ్యక్షురాలైన అనిబిసెంట్ మన దేశ స్వాతంత్ర్యం కోసం చాలా పాటుపడ్డారు. ఆమె కృష్ణమూర్తిని, అతని తమ్ముణ్ణి దత్తత తీసుకున్నారు. వారిద్దరినీ పై చదువుల కోసం ఇంగ్లండ్‌కు పంపించారు. కృష్ణమూర్తి అక్కడ ఎంత శ్రమపడినా మెట్రిక్యులేషన్‌లోనైనా ఉత్తీర్ణత సాధించలేకపోయారు. కానీ మాతృభాష అయిన తెలుగును మరచిపోయారు. ఒక బ్రిటిష్ పెద్దమనిషిగా మారారు. దివ్యజ్ఞాన సమాజంలో అమెరికా, యూరప్, ఆస్ట్రేలియాలకు చెందిన చాలా మంది సంపన్నులు సభ్యులుగా ఉండేవారు. వారు తమ ఆస్తులను, కోటలను, తోటలను భావి జగద్గురువు కృష్ణమూర్తికి విరాళంగా ఇచ్చారు.

ఆ సమాజం సిద్ధాంతం ప్రకారం... 1929 ఆగస్టు మూడో తేదీన మైత్రేయ బుద్ధుడి ఆత్మ... కృష్ణమూర్తి ఆత్మను ఆవహిస్తుంది. ఆ క్షణం నుంచి కృష్ణమూర్తి జగద్గురువు అవుతారు. అదే నమ్మకంతో అందరూ ఆ క్షణం కోసం ఎదురుచూశారు. ఆ కార్యక్రమంలో పాల్గొనడానికి దేశదేశాల నుంచి ఎంతోమంది హాలెండ్‌కు వచ్చి, ఆ రోజు కృష్ణమూర్తి నిలబడిన వేదిక ముందు భయభక్తులతో కూర్చున్నారు. జగద్గురువుగా కృష్ణమూర్తి ప్రపంచానికి ఇవ్వబోయే సందేశాన్ని ప్రసారం చేసేందుకు రేడియో బృందాలు తయారుగా ఉన్నాయి. కానీ ఆ చారిత్రక సందర్భంలో కృష్ణమూర్తి ఇచ్చిన సందేశం సొసైటీ సభ్యుల మీద పిడుగుపాటులా పడింది, కల్లోలం సృష్టించింది. "మతాలు, సంస్థలు, సమాజాలు సత్యాన్ని అణగదొక్కి, వ్యక్తిని అవిటివాణ్ణి చేస్తాయి. సత్యానికి సంస్థలకు పొత్తు కుదరదు. నేను ఒక కొత్త సిద్ధాంతాన్ని, మతాన్ని స్థాపించడం లేదు. మనిషిని బేషరతుగా ఒక సంపూర్ణ స్వేచ్ఛాజీవిని చేయడం ఒక్కటే నా జీవిత ధ్యేయం" అని ఆయన ప్రకటించారు. ఆ కారణంగా ఆయన దివ్యజ్ఞాన సమాజం నుంచి, ఇతర సంస్థల నుంచి విడిపోయారు. ఆస్తులను వాటి పూర్వ యజమానులకు వాపసు ఇచ్చేశారు. మానవుల మనుగడ మీద తాత్త్విక ఉపన్యాసాలు ఇస్తూ, పుస్తకాలు రాస్తూ, మేధావులతో, శాస్త్రవేత్తలతో, కళాకారులతో, రచయితలతో చర్చలు జరుపుతూ జీవితాన్ని గడిపిన కృష్ణమూర్తి 1986లో మరణించారు.



> మతాలు, సంస్థలు, సమాజాలు సత్యాన్ని అణగదొక్కి, వ్యక్తిని అవిటివాణ్ణి చేస్తాయి. సత్యానికి సంస్థలకు పొత్తు కుదరదు. నేను ఒక కొత్త సిద్ధాంతాన్ని, మతాన్ని స్థాపించడం లేదు. మనిషిని సంపూర్ణ స్వేచ్ఛాజీవిని చేయడం ఒక్కటే నా జీవిత ధ్యేయం

• గుంటూరు వనమాలి
(మ్యూనిక్ విశ్వవిద్యాలయంలో జిడ్డు కృష్ణమూర్తి పై డాక్టరేట్ చేశారు, ఇక్కడే కృష్ణమూర్తి ఫిలాసఫీని బోధించారు)

సద్బోధ

మోక్షానికి అర్హత

ఒక అరణ్యంలో ఇద్దరు యోగులు ఆశ్రమం ఏర్పాటు చేసుకొని, ఆధ్యాత్మిక సాధన చేస్తున్నారు. భగవంతుడి అనుగ్రహం పొంది, మోక్షాన్ని సాధించాలనేది వారి ఆశయం. ఒక రోజు నారద మహర్షి అటువైపుగా వచ్చి, ఆ ఆశ్రమం దగ్గర ఆగాడు. యోగులు ఇద్దరూ ఆయనకు నమస్కరించారు. ఆశ్రమంలోకి ఆహ్వానించారు. అతిథి సత్కారాలు చేశారు. "స్వామీ! ఎక్కడినుంచి వస్తున్నారు?" అని అడిగారు.

"నాయనలారా! నేను దివ్యలోకాలలో ఉన్న ఆ పరంధాముణ్ణి దర్శించుకొని వస్తున్నాను" అని బదులిచ్చాడు నారదుడు.

"మీరు దర్శించినప్పుడు ఆ భగవంతుడు ఏం చేస్తున్నారు?" అని ప్రశ్నించారు యోగులు.

"నేను వెళ్ళేసరికి భగవానుడు తీరికగానే ఉన్నారు. ఒక సూది బెజ్జంలోనుంచి ఏనుగులను, ఒంటెలను ఒకవైపు నుంచి మరో వైపు తీస్తూ ఆడుకుంటున్నారు. ఇది విచిత్రంగా అనిపిస్తోందా?" అన్నాడు నారదుడు.

"అందులో గొప్ప విచిత్రం ఏముంది స్వామీ! ఆయన చేయలేనిది ఏముంటుంది? ఈ సృష్టి అంతా ఆయన లీలే కదా!" అన్నాడు ఒక యోగి.

ఆ మాటలను రెండో యోగి ఖండిస్తూ "మీరు చెబుతున్నదంతా అభూతకల్పన! సూది బెజ్జంలోకి ఏనుగులు, ఒంటెలు ఎలా వెళ్తాయి? అది అసాధ్యం. మీ మాటలను బట్టి... అసలు మీరు భగవంతుణ్ణి కలుసుకోలేదని అర్థమైపోతోంది" అన్నాడు.

అప్పుడు నారదుడు "ఒక చిన్న పిల్లవాడు తనకు తల్లితండ్రులు చెప్పే ప్రతి విషయాన్నీ నమ్ముతాడు. భక్తుడికి కూడా భగవంతుడికి పట్ల అలాంటి నమ్మకమే ఉండాలి. భగవంతుడికి అసాధ్యం అనేది ఏదీ ఉండదు. ఆయన శక్తిని పూర్తిగా



గ్రహించగలిగేవారు ఎవరూ లేరు. ఆయన ఎవరి ఊహలకూ అందనివాడు. ఈ భౌతిక ప్రపంచంలోని కొలమానాలతో ఆయనను లెక్క వెయ్యడం అవివేకం. మీలో ఎవరు మోక్షానికి అర్హులో నిర్ణయించాలని ఆ భగవంతుడు నన్ను అడిగారు. భగవంతుడి మీద నిస్సందేహమైన విశ్వాసమే మోక్షానికి అర్హత. ఆ అర్హత ఎవరికి ఉన్నదో మీకు అర్థమయిందనుకుంటాను" అన్నాడు చిరునవ్వుతో.

"మోక్షం పొందాలంటే ఏం చెయ్యాలి? అది ఎవరికి లభిస్తుంది?" అని శిష్యులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా శ్రీ రామకృష్ణ పరమహంస చెప్పిన కథ ఇది.

సుభాషితం

దైవ బలం లేనప్పుడు...

దురదృష్టవంతులను ఆపదలు ఎలా వెంటాడతాయో...

ఖర్వాటో దివసేశ్వరస్య కిరణైః సంతాడితో మస్తకే
వాంఛన్దేశమనాతపం విధి వశాత్తాలస్య మూలం గతః
తత్రాప్యస్య మహాఫలేన పతతా భగ్నం సశబ్దం శిరః
ప్రాయో గచ్ఛతి యత్ర దైవహతక స్తత్రైవ యాంత్యాపదః ... అనే ఈ శ్లోకంలో భర్తృహరి వర్ణించాడు.



ఆ శ్లోకాన్ని...

ధర ఖర్వాటుడొకండు సూర్య కర సంతప్త ప్రధానాంగుడై
త్వర తోడన్ బరువెత్తి చేరి నిలచెన్ తాళ ద్రుమచ్ఛాయ త
చ్ఛిరమున్ తత్ఫల పాత వేగమున విచ్చెన్ శబ్ద యోగంబుగా
బౌరి దైవోపహతుండు వోవు కడకుం పోవుంగదా యాపదల్ ... అంటూ ఏనుగు లక్ష్మణకవి తెలుగువారికి అందించాడు.

భావం: మండు వేసవి కాలంలో ఒక వ్యక్తి ప్రయాణం చేస్తున్నాడు. మధ్యాహ్న సూర్యుడు నడినెత్తిన ఉన్నాడు. పైగా ఆ వ్యక్తికి బట్టతల. ఎండ కారణంగా తలమాడిపోతూ ఉంటే తట్టుకోలేక.. సొమ్మసిల్లిపోతున్నాడు. ఎండ బారి నుంచి తప్పించుకోవడానికి నీడ కోసం వెతికాడు. కొంతసేపటికి ఒక తాటి చెట్టు కనిపించింది. దాని కింద నీడ ఎక్కువగా లేకపోయినా... గత్యంతరం లేక ఆ చెట్టు కింద నిలబడ్డాడు. ఇంతలో ఆ చెట్టు నుంచి ఒక తాటి పండు రాలి... సరిగ్గా అతని తలమీద పడింది. పెద్ద శబ్దంతో ఆ బాటసారి తల బద్దలై... అతను అక్కడికక్కడే మరణించాడు. 'దైవ బలం లేని దురదృష్టవంతులకు ఎక్కడికి వెళ్ళినా ఆపదలు తప్పవు' అంటున్నాడు ఆ శ్లోకంలో భర్తృహరి.

రాష్ట్ర ప్రభుత్వ ఆర్కిటెక్ట్‌కు అరుదైన గౌరవం

» జాతీయ ఆర్కిటెక్ట్ క్రమశిక్షణా కమిటీ సభ్యుడిగా నవీన్



అమరావతి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) రాష్ట్ర ప్రభుత్వ ఆర్కిటెక్ట్ కె.నవీన్‌కు అరుదైన అవకాశం లభించింది. జాతీయ కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్ట్‌లోని క్రమశిక్షణా సంఘంలో ఆయన్ను సభ్యునిగా నియమిస్తూ కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. క్రమశిక్షణా సంఘంలో ముగ్గురు సభ్యులు ఉండగా, నవీన్ ఒక్కరే ఎన్నికయ్యారు. నవీన్‌కు పోటీగా కర్ణాటక నుంచి గట్టి పోటీ ఎదురైనా, ఆయనకు ఇతర రాష్ట్రాల ఆర్కిటెక్ట్‌లు మద్దతు ఇవ్వడంతో సునాయాసంగా ఎన్నికయ్యారు. కమిటీలో మిగతా ఇద్దరిని కేంద్రమే నామినేట్ చేసింది. నవీన్ ప్రస్తుతం రోడ్లు భవనాల శాఖ (ఆర్అండ్‌బీ)లో జాయింట్ స్టేట్ ఆర్కిటెక్ట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

సీట్లు పొందని అభ్యర్థులతో భర్తీ చేయండి

» కోనసీమ, కర్నూలు వైద్య కాలేజీల్లో పెరిగిన సీట్లపై హైకోర్టు

అమరావతి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అమలాపురంలోని కోనసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రిసెర్చ్ ఫౌండేషన్, కర్నూలులోని విశ్వభారతి మెడికల్ కాలేజీల్లో 76 సీట్ల భర్తీ విషయంలో హైకోర్టు గురువారం కీలక ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటివరకు నిర్వహించిన కౌన్సెలింగ్‌లో కన్వీనర్, యాజమాన్య, ఎన్ఆర్ఐ కోటా కింద సీట్లు కేటాయించని అభ్యర్థులందరినీ అనుమతిస్తూ ప్రత్యేక స్త్రే కౌన్సెలింగ్ నిర్వహించాలని ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ అధికారులను ఆదేశించింది. ప్రస్తుత ఉత్తర్వులు ఆ 76 సీట్లకు మాత్రమే వర్తిస్తాయని స్పష్టంచేసింది. ఈ సీట్ల భర్తీతో బీడీఎస్ విభాగంలో ఏర్పడే ఖాళీలను ప్రత్యేక స్త్రే వేకెన్సీ రౌండ్ ద్వారా భర్తీ చేయాలని ఆదేశించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావు ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది.

ఐదేళ్లలో పేదలందరికీ ఇళ్లు!

» ఎన్నికల హామీపై కూటమి సర్కారు కసరత్తు

అమరావతి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అర్హులైన పేదలందరికీ నాణ్యమైన ఇళ్లు కట్టిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు లబ్ధిదారులకు పట్టణాల్లో 2సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు మంజూరు చేసేందుకు సర్వే ప్రారంభించింది. డిసెంబరు నాటికి రాష్ట్రవ్యాప్తంగా లక్ష ఇళ్లను పూర్తి చేసి.. వాటిలో లబ్ధిదారులతో సామూహిక గృహ ప్రవేశాలు చేయించేందుకు హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేశారు. వచ్చే ఏడాదికల్లా మిగిలిన అసంపూర్తి ఇళ్ల నిర్మాణాన్ని కూడా పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్రంలో పీఎంఏవై 2.0 పథకం అమలుకు కేంద్ర హౌసింగ్ మంత్రిత్వ శాఖతో ఎంవోయూ చేసుకునేందుకు గృహ నిర్మాణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి అధికారం ఇస్తూ తాజాగా ఉత్తర్వులు విడుదల చేసింది. దాంతో వీలైనంత త్వరలోనే ఈ ఎంవోయూ చేసుకునేందుకు రాష్ట్ర హౌసింగ్ అధికారులు సన్నద్ధమవుతున్నారు. 2029 నాటికి రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఇళ్లు నిర్మించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

టిడ్కో లబ్ధిదారుల మార్పుపై విచారణకు కమిటీ

గత వైసీపీ పాలనలో టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల జాబితాలో మార్పులు చేయడంపై కూటమి ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈ నెల 2న విశాఖపట్నంలో పలు అభివృద్ధి ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించిన సందర్భంగా కొంతమంది ఎమ్మెల్యేలు ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తెచ్చారు. 16న అసెంబ్లీలోనూ పలువురు ఎమ్మెల్యేలు ఈ అంశంపై చర్చ లేవనెత్తారు. దీంతో విచారణ చేపడతామని మున్సిపల్ మంత్రి నారాయణ హామీ ఇచ్చారు. విచారణ చేపట్టేందుకు మున్సిపల్‌శాఖ డైరెక్టర్, మెప్మా విషన్ డైరెక్టర్, ఏపీ టిడ్కో ఎండీలతో ఒక కమిటీని ఏర్పాటు చేస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది.

సెర్ప్‌లో 21 పోస్టుల పునరుద్ధరణ

అమరావతి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలన కార్యక్రమం(సెర్ప్)లో వైసీపీ ప్రభుత్వం రద్దుచేసిన కొన్ని పోస్టులను కూటమి ప్రభుత్వం పునరుద్ధరించింది. సెర్ప్ ఆధ్వర్యంలో పలు మహిళా జీవనోపాధిలు, ప్రోత్సాహిక పథకాలు అమలు చేయాల్సి ఉండటంతో రాష్ట్ర ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్, జిల్లా ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్‌లకు తగినంత సిబ్బంది కావాలని సెర్ప్ సీఈవో ప్రతిపాదించారు. దీంతో ఎస్‌పీఎంయూలో 5 డైరెక్టర్ పోస్టులు, డీపీఎంయూలో 3 ప్రాజెక్టు డైరెక్టర్ పోస్టులు, 13 అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ పోస్టులను పునరుద్ధరిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది.

ఎంఎస్ఎంఈ సర్వేపై అవగాహన కల్పించండి

» అధికారులకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశం

అమరావతి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న ఎంఎస్ఎంఈల సర్వేలో ప్రతి వ్యాపారవేత్త ఉత్సాహంగా పాల్గొనేలా అవగాహన కల్పించాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశించారు. గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. జిల్లాల్లో నిర్వహిస్తున్న ఎంఎస్ఎంఈల సర్వేలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్లు, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్లు కీలకపాత్ర పోషించాలని మంత్రి సూచించారు. ఈ సర్వే గురించి విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు.

4న కేబినెట్.. 10, 11 తేదీల్లో కలెక్టర్ల సదస్సు

అమరావతి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గ సమావేశం డిసెంబరు 4వ తేదీన ఉదయం 11 గంటలకు సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో జరుగనుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు ఆయా శాఖలకు సంబంధించిన ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేయాలని ఆదేశించారు. మంత్రివర్గంలో చర్చించాల్సిన అంశాల ప్రతిపాదనలను సోమవారం నాటికి జీఏడీకి పంపించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, డిసెంబరు 10, 11 తేదీల్లో కలెక్టర్ల సదస్సు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సదస్సును తొలుత 3, 4వ తేదీల్లో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 4న కేబినెట్ నిర్వహించనుండటంతోపాటు కలెక్టర్ల సదస్సు అజెండాను సిద్ధం చేసుకోవడానికి కొంత సమయం అవసరమైన నేపథ్యంలో సదస్సు తేదీలను ప్రభుత్వం మార్చింది. డిసెంబరు 10, 11 తేదీల్లో సచివాలయంలో కలెక్టర్ల సదస్సు జరగనుంది.



గ్రాండ్ క్యాన్యన్‌లా గండికోట



» కేంద్ర మంత్రి పెమ్మసాని వెల్లడి

న్యూఢిల్లీ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అమెరికాలోని గ్రాండ్ క్యాన్యన్ తరహాలో గండికోటను అభివృద్ధి చేసే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఇందుకోసం కేంద్రప్రభుత్వం కూడా సహకరిస్తుందని చెప్పారు. గురువారం ఇక్కడ సమాచార భవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. గండికోట అభివృద్ధికి రూ. 77.91 కోట్లను మంజూరు చేసినందుకు కేంద్రప్రభుత్వానికి, కేంద్ర పర్యాటక మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. చరిత్రాత్మక గండికోట వైభవాన్ని పునరుద్ధరించడానికి, పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి కేంద్రప్రభుత్వం ఆ నిధులు మంజూరు చేసింది. కోట అభివృద్ధితో పాటు స్థానిక నదీ పరివాహక ప్రాంతాన్ని కూడా పర్యాటకంగా అందుబాటులోకి తెచ్చేందుకు ఆ నిధులను వినియోగించనున్నారు. కాగా, గండికోట ప్రాభవం, ప్రాశస్త్యం భవిష్యత్ తరాలకు తెలియజేసేలా అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయించాలని కోరుతూ కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖకు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఈనెల 4న లేఖ రాశారు. ఆ తర్వాత కేంద్ర మంత్రిత్వ శాఖతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ నిధుల మంజూరుకు కృషి చేశారు.

'ఈగల్' సైన్యం సిద్ధం

గంజాయి కట్టడికి 459 మంది ప్రత్యేక పోలీసు బృందం

అమరావతి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గంజాయి సాగు, మత్తు పదార్థాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. గంజాయి పంట నుంచి అది చేరే గమ్యం వరకూ అడుగడుగునా 'ఈగల్' సైన్యాన్ని వేటకు దించింది. మంగళగిరిలోని రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో నార్కోటిక్ పోలీసు స్టేషన్.. విశాఖ, పాడేరు, అమరావతిలో స్టేట్ టాస్క్‌ఫోర్స్ విభాగాలు.. 26 జిల్లాల్లో ఈగల్ సెల్స్.. ఐదు ప్రధాన నగరాల్లో ప్రత్యేక కోర్టుల ఏర్పాటుకు గురువారం పచ్చజెండా ఊపింది. దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడినా ఏపీ పేరు గత ఐదేళ్లుగా వినిపించేది. రాష్ట్రంలో ఎక్కడ నేరాలు జరిగినా గంజాయి మత్తులో తప్పు చేశారని పోలీసు దర్యాప్తులో తేలేది. ఈ దుస్థితి నుంచి రాష్ట్రాన్ని, ఇక్కడి యువతను బయటికి తెస్తామని ఎన్డీఏ కూటమి ఎన్నికల ముందు హామీ ఇచ్చింది. అధికారంలోకి రాగానే హోంశాఖ మంత్రి అనిత చైర్మన్‌గా నారా లోకేశ్(విద్య), సత్య కుమార్ యాదవ్(వైద్య), కొల్లు రవీంద్ర(ఎక్సైజ్), గుమ్మిడి సంధ్యారాణి (గిరిజన సంక్షేమం)తో మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. ఐదుగురు మంత్రులు పలుమార్లు సమావేశమై ఇచ్చిన నివేదిక, చేసిన సూచనల ఆధారంగా ఐజీ ర్యాంకు అధికారి ఆకే రవికృష్ణ నేతృత్వంలో ఎలైట్ యాంటీ-నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్(ఈగల్)ను 459 మంది పోలీసులతో ఏర్పాటు చేసింది. అమరావతి కేంద్రంగా డీఎస్పీ స్థాయి అధికారి ఎస్‌హెచ్‌వోగా నార్కోటిక్ పోలీసు స్టేషన్, రాష్ట్రంలోని ప్రతి జిల్లా కేంద్రంలో ఎస్ఐ స్థాయి అధికారి ఎస్‌హెచ్‌వోగా నార్కోటిక్ సెల్ ఏర్పాటు చేసింది. అమరావతిలో రెండు రాష్ట్ర స్థాయి టాస్క్‌ఫోర్స్‌లు ఏర్పాటు చేసి గుంటూరు నుంచి రాయలసీమ జిల్లాల వరకూ మత్తు, గంజాయి కట్టడికి చర్యలు చేపట్టిన ప్రభుత్వం.. గంజాయి ఎక్కువగా సాగయ్యే ఏజెన్సీలోని పాడేరులో, విరివిగా లభించే విశాఖపట్నంలో ఒక్కో రాష్ట్రస్థాయి టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. ప్రతి జిల్లా, మండల, గ్రామ స్థాయిలో ఈగల్ కమిటీలు ఏర్పాటు చేసి ప్రజల్లో చైతన్యం తీసుకొస్తుంది. మరోవైపు గంజాయి, మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరిస్తుంది. ప్రజలకు అందుబాటులో టోల్ ఫ్రీ నంబర్ 1972 ఏర్పాటు చేసి ఫిర్యాదులు స్వీకరిస్తుంది. సాగుదారులు, స్మగ్లర్లు, విక్రేతలు, చివరికి వినియోగదారుల్ని కూడా వదలకుండా కేసులు నమోదు చేసి జైల్లో పెట్టే ఈగల్ విభాగం ఆర్నెల్లలో రాష్ట్రంలో గంజాయి మొక్కేకాదు వాసన కూడా లేకుండా చేసేందుకు నడుం బిగించింది. గంజాయి, మత్తు సంబంధిత కేసుల సత్వర పరిష్కారానికి విశాఖ, రాజమండ్రి, విజయవాడ, గుంటూరు, తిరుపతిలో ప్రత్యేక కోర్టులు ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది.

అందరి సాయంతో అంతమొందిస్తాం

ప్రజల ఆరోగ్యాన్ని, యువత భవిష్యత్‌ను నాశనం చేస్తున్న గంజాయి, మత్తుపదార్థాల కట్టడికి ప్రతి ఒక్కరి సహకారం తీసుకుని విముక్తి కల్పిస్తామని 'ఈగల్' అధిపతి రవికృష్ణ తెలిపారు. సామాజిక సమస్య నుంచి సవాలుగా మారిన మత్తు మహమ్మారిని తరిమేసేందుకు తమ బృందాలు అహర్నిశలు శ్రమిస్తాయని చెప్పారు. మన్యంలో గంజాయి మొక్క గుర్తించడం నుంచి అంతిమంగా వినియోగదారుడి వరకూ తమ డేగ కళ్లు వెంటాడుతాయన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు డ్రోన్లు, జీపీఎస్, ఆర్ఎఫ్ఐడీ, ట్రాకింగ్ సిస్టమ్, ఏఐ ఆధారిత సీసీ కెమెరాల నిఘా.. ఇలా అందుబాటులో ఉన్న ప్రతి టెక్నాలజీని గంజాయి, మత్తు కట్టడికి ప్రయోగిస్తామని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల సహకారం తీసుకుని మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా 'మహా సంకల్పం' పేరుతో సభలు ఏర్పాటు చేస్తామన్నారు.



పట్టుబడిన నిందితులు, గంజాయి, నగదుతో నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ, ఎస్ఐ వై.తారకేశ్వరరావు

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

» 25 కిలోల గంజాయి, 11.06 లక్షలు స్వాధీనం

కృష్ణాదేవిపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతం నుంచి కర్ణాటకకు తరలిస్తున్న 25 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేసినట్టు అనకాపల్లి జిల్లా నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ తెలిపారు. గురువారం గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట అల్లూరి పార్కు వద్ద ఎస్ఐ వై.తారకేశ్వరరావు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో ఏజెన్సీ నుంచి వస్తున్న కారులో కర్ణాటక రాష్ట్రానికి చెందిన కారు తనిఖీ చేయగా డిక్కీలో రెండు ప్లాస్టిక్ సంచుల్లో 25 కిలోల గంజాయి లభించింది. బానెట్‌లో రూ.11.06 లక్షల నగదు గుర్తించారు. కర్ణాటకకు చెందిన పరుశురాం అలియాస్ ప్రశాంత్, రవీంద్ర నుంచి 3 సెల్‌ఫోన్లు, గంజాయి, నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేశారు. నిందితులు 4రోజుల క్రితం గంజాయి కొనుగోలుకు రూ.12.5 లక్షలతో అల్లూరి జిల్లా జీకే వీధి ప్రాంతానికి వెళ్లారు. పోలీసు నిఘా ఉండడంతో ఎక్కువ మోతాదులో గంజాయి రవాణా చేయలేమని భావించి రూ.1.25 లక్షలతో 25 కిలోలు కొనుగోలు చేశారు. మిగిలిన నగదు బానెట్‌లో ఉంచారు. నిందితులను కోర్టు ఆదేశాల మేరకు విశాఖ సెంట్రల్ జైలుకు తరలించారు.

'అదానీ పవర్' పనుల అడ్డగింత!

» బీజేపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడి పేరిట బెదిరింపులు

» ఎన్నికల ముందు వైసీపీ నుంచి బీజేపీలో చేరినవారి రుబాబు

ధర్మవరం/తాడిమర్రి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా తాడిమర్రి మండల పరిధిలోని పెద్దకోట్ల, దాడితోట గ్రామాల మధ్య జరుగుతున్న అదానీ హైడల్ పవర్ ప్రాజెక్టు పనులను బీజేపీ నాయకులు మూడు రోజుల క్రితం అడ్డుకున్నారు. మంగళవార జరిగిన ఈ వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రాజెక్టును 407.6 ఎకరాల విస్తీర్ణంలో దాదాపు రూ.3వేల కోట్ల వ్యయంతో ఏర్పాటు చేస్తున్నారు. ఆ ప్రాంతంలో భారీ యంత్రాలతో కొండలను తవ్వి, చుట్టూ మట్టి పోస్తున్నారు. రాళ్లను పగులగొట్టి పిండి చేసి తరలిస్తున్నారు. ఇప్పటి వరకూ రూ.500 కోట్లకు పైగా విలువైన పనులు పూర్తయ్యాయి. రూ.400 కోట్ల విలువైన యంత్రసామగ్రిని చేర్చారు. తదుపరి నిర్మాణ పనులకు భారీస్థాయిలో కంకర అవసరమవుతుంది. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు, ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ యాదవ్, ముదిగుబ్బ మండలం రాళ్ల అనంతపురానికి చెందిన క్రషర్ యజమాని లక్ష్మీనారాయణ ప్రాజెక్టు పనులు జరుగుతున్న ప్రాంతానికి వెళ్లారు. తాము చెప్పిన చోటే కంకర కొనాలని సైట్ ఇంజనీర్‌ను బెదిరించారు. ముందు పనులాపాలనడతో ఆపేశారు. ఈ విషయం అటువైపు వెళుతున్న టీడీపీ తాడిమర్రి మండల కన్వీనర్ రామ్మోహన్, ఆయన తమ్ముడు మల్లికార్జున తదితరులకు తెలిసింది. వెంటనే వారు కొండపైకి చేరుకున్నారు. 'మా మండలంలో మీ రుబాబు ఏమిటి' అని వారిని నిలదీశారు. ఇక్కడికి పంపించిందెవరని ప్రశ్నించారు. బీజేపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు పంపించారని వారు చెప్పారు. ఆయనతోనే మాట్లాడతామని టీడీపీ నాయకులు ఫోన్ చేసేందుకు యత్నించగా.. వద్దంటూ బీజేపీ నాయకులు జారుకున్నారు.

మంత్రికి తెలియదా?

ఎన్నికలకు 2నెలల ముందు వైసీపీ నుంచి బీజేపీలోకి చేరిన ఎంపీపీ ఆదినారాయణ యాదవ్, లక్ష్మీనారాయణ రూ.3 వేల కోట్ల విలువైన పవర్ ప్రాజెక్టును ఆపే యత్నం చేయడం ఏమిటని టీడీపీ నేతలు ప్రశ్నించారు. ఇంతజరుగుతున్నా మంత్రి సత్యకుమార్ స్పందించకపోవడం ఏమిటని ఆక్షేపిస్తున్నారు. ధర్మవరం నియోజకవర్గంలో కొందరు వైసీపీ నాయకులకు బీజేపీ నేతలు అండగా నిలుస్తున్నారని.. ఏ పనికోసం వెళ్లినా ప్రత్యక్షమవుతున్నారని, ఇంత జరుగుతుంటే సత్యకుమార్‌కు తెలియకుండా ఉంటుందా అని అనుమానం వ్యక్తం చేశారు.



అమరావతి గ్రామాలకు మంచినీటి సరఫరా పనులు

రాజధాని గ్రామాలకు రక్షిత నీరు

» తుళ్లూరు కేంద్రంగా శుద్ధి.. 29 గ్రామాలకు పంపిణీ

విజయవాడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి ప్రాంతంలోని గ్రామాలకు రక్షిత మంచినీటి సరఫరా పనులు ప్రారంభమయ్యాయి. ప్రపంచ బ్యాంకు మార్గదర్శకాల ప్రకారం 29 గ్రామాలకు దశలవారీగా రక్షిత మంచినీటి సౌకర్యం కల్పించేందుకు సీఆర్‌డీఏ నేతృత్వంలో ఇటీవల టెండర్లు పిలిచారు. తొలిదశలో సగం గ్రామాలకు మంచినీటిని అందించేందుకు ప్రస్తుతం పనులు ప్రారంభించారు. కృష్ణా నది నుంచి నీటిని సేకరించి తుళ్లూరు కేంద్రంగా వాటిని శుద్ధి చేసి పైపులైన్ల ద్వారా రాజధాని ప్రాంత గ్రామాలకు తరలిస్తారు. ప్రస్తుతం ఆ నీటి సరఫరా పైపులైన్ల పనులు జోరుగా జరుగుతున్నాయి. అలాగే అమరావతిలో జంగిల్ క్లియరెన్స్‌లో భాగంగా నరికిన ముళ్లపొదలను బ్లోయర్ మెషీన్ల ద్వారా పొట్టుగా మారుస్తున్నారు. ఈపొట్టును వంటచెరుకుగా, ఇటుకల తయారీకి, ఇతర పనులకు ఉచితంగా అందిస్తున్నారు.

ఆంధ్రలో 6 'అనుసంధాన' డీపీఆర్‌లు సిద్ధం

» లోక్‌సభలో జలశక్తి శాఖ వెల్లడి

న్యూఢిల్లీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి ఆరు నదుల అనుసంధాన ప్రాజెక్టుల డీపీఆర్‌లు పూర్తయ్యాయని కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి చెప్పారు. మహానది-గోదావరి (ధవళేశ్వరం), గోదావరి-కృష్ణా (పోలవరం), గోదావరి (ఇచ్ఛంపల్లి)-కృష్ణా (నాగార్జునసాగర్), కృష్ణా-పెన్నార్ (సోమశిల లింక్), పెన్నార్ (సోమశిల)-కావేరీ అనుసంధాన ప్రాజెక్టులు చేపట్టడం సాధ్యమేనని గురువారం లోక్‌సభలో చెప్పారు. అలాగే గోదావరి (ఇచ్ఛంపల్లి)-కృష్ణా(పులిచింతల), కృష్ణా(నాగార్జునసాగర్)-పెన్నా, కృష్ణా (శ్రీశైలం)-పెన్నార్ లింక్, కృష్ణా (ఆలమట్టి)-పెన్నార్ ప్రాజెక్టుల డీపీఆర్‌లు పూర్తయ్యాయని.. ఏకాభిప్రాయం లేనందున మణిభద్ర-ఇచ్ఛంపల్లిపై ప్రత్యామ్నాయ అధ్యయనాలు పూర్తి చేశామని, గోదావరి-కృష్ణా-పెన్నార్-కావేరీ డీపీఆర్ కూడా పూర్తయిందని తెలిపారు. కాగా.. 2021 నుంచి డ్యాముల పునరావాస, మెరుగుదల ప్రాజెక్టు కింద రూ.10,211 కోట్లతో పథకాన్ని చేపట్టామని.. ఏపీ ఇందులో చేరలేదన్నారు. ఇంకోవైపు.. ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ ప్లాంట్లకు బొగ్గు కొరత లేదని కేంద్ర బొగ్గు గనుల మంత్రి కిషన్‌రెడ్డి లోక్‌సభలో టీడీపీ ఎంపీ బైరెడ్డి శబరికి తెలిపారు. ఏపీ జెన్‌కో వద్ద సరిపడా బొగ్గు నిల్వలు ఉన్నాయని చెప్పారు.

ధర్మాన కృష్ణదాస్ మాజీ పీఏ మురళిపై

ఏసీబీ దాడులు

» ఏకకాలంలో ఆరుచోట్ల సోదాలు

» భారీగా అక్రమాస్తుల గుర్తింపు



స్వాధీనం చేసుకున్న వెండి, బంగారం, ఆస్తుల పత్రాలు



మురళి

శ్రీకాకుళం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్ మాజీ పీఏ గొండు మురళి ఆస్తులపై ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. గురువారం శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల్లో ఏకకాలంలో ఆకస్మిక సోదాలు నిర్వహించింది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగి మురళీ, గత వైసీపీ పాలనలో ధర్మానకు పీఏగా చేరిన తర్వాత ఆయన స్థాయి మారిపోయింది. 2019 నుంచి రెండున్నరేళ్లు ధర్మాన ఉపముఖ్యమంత్రిగా, మంత్రిగా వ్యవహరించిన సమయంలో మురళి హవా అంతాఇంతా కాదు. వైద్యఆరోగ్యశాఖ ఉద్యోగుల బదిలీల్లో ప్రత్యక్షంగానూ, శ్రీకాకుళం జిల్లా అధికారులతో నేరుగా వ్యవహారాలను నడిపే విషయంలో కీలకంగా వ్యవహరించారు. ప్రభుత్వం మారడంతో మురళి బాగోతంపై ఏసీబీకి ఫిర్యాదు అందింది. ఏసీబీ డీఈ అతుల్ సింగ్ ఆదేశాలతో గురువారం ఆరుచోట్ల సోదాలు నిర్వహించారు. ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లా సారవకోట మండలం బుడితి కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో మురళి ఉద్యోగం నిర్వర్తిస్తున్నారు. శ్రీకాకుళంలో ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తన బృందంతో సోదాలు చేపట్టారు. కోటబొమ్మాళి మండలం దంత గ్రామం, బుడితి సీహెచ్‌సీ, లింగంనాయుడిపేట, శ్రీకాకుళం నగరం, విశాఖలోని గాజువాకల్లో సోదాలు నిర్వహించారు. లభ్యమైన పత్రాల ఆధారంగా ఆస్తుల విలువ రూ.3కోట్లు అని, మార్కెట్ రేటు దానికి పదింతలు ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

బడ్జెట్ పుస్తకంలో 'ఎడెక్స్' భజన

50 కోట్ల అడ్డగోలు దోపిడీకి అధికారుల కితాబు

- ఉన్నత విద్యను బలోపేతం చేసిందని ప్రశంస
- విద్యార్థులకు 3.2లక్షల సర్టిఫికేషన్లంటూ గొప్పలు
- జగన్ హయాంలో టెండర్లు లేకుండానే ఒప్పందం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర విద్యార్థులకు ప్రపంచ స్థాయి ఆన్‌లైన్ కోర్సులు ఉచితంగా అందిస్తామంటూ గత ప్రభుత్వంలో ఓ కంపెనీకి దాదాపు రూ.50 కోట్లు ధారపోశారు. దీనిపై అప్పటి సీఎం జగన్ నోటి నుంచి మాట రావడం ఆలస్యం ఉన్నత విద్యాశాఖ అధికారులు ఆగమేఘాలపై కదిలారు. టెండర్లు, చర్చలు ఏమీ లేకుండా నేరుగా ఎడెక్స్ అనే కంపెనీతో అడ్డగోలు ఒప్పందం చేసుకున్నారు. తమకు రూ.49.9 కోట్లు ముందస్తుగా కట్టాలని ఆ సంస్థ షరతు విధించడంతో మరోమాట లేకుండా ఆ మొత్తం సమర్పించుకున్నారు. దీనిని అప్పట్లో ప్రతిపక్ష టీడీపీ తూర్పారబట్టింది. ఈ ఒప్పందంలో నిబంధనలు ఎందుకు పాటించలేదని నిలదీసింది. ఇప్పుడు సీన్ రివర్స్ అయింది. అప్పట్లో దోపిడీ అన్న పథకం నేడు గొప్ప కార్యక్రమంగా మారింది. 2023-24లో ఉన్నత విద్యాశాఖను బలోపేతం చేసిన కార్యక్రమాల జాబితాలో ఎడెక్స్‌తో చేసుకున్న ఒప్పందం కూడా చేరిపోయింది. ఈ విషయాన్ని ఏకంగా బడ్జెట్ పుస్తకంలోనే ఉన్నత విద్యాశాఖ పేర్కొనడం విశేషం. అయితే మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రికి తెలిసే దీన్ని చేర్చారా... లేక అధికారుల సొంత నిర్ణయమా అనేది తేలాల్సి ఉంది.

జగన్ హయాంలో ఉన్నత విద్యామండలిలోని కొందరు అధికారులు ప్రభుత్వ పెద్దలతో కలిసి తీసుకున్న అడ్డగోలు నిర్ణయాల్లో విదేశీ కోర్సులు కూడా ఒకటి. ఇక్కడి విద్యార్థులకు అవెంతవరకు ఉపయోగం? అమలు సాధ్యాసాధ్యాలు చూడకుండా జగన్ చెప్పారని ఒప్పందం చేసుకున్నారు. విదేశీ వర్సిటీలు, ఇక్కడి విద్యార్థులకు మధ్య వారధిగా ఉండేందుకు ఎడెక్స్ కంపెనీకి నిధులు చెల్లించారు.

అన్నీ అనుమానాలే

ఏటా 4 లక్షల లైసెన్స్‌లను ఎడెక్స్ ఇచ్చింది. అయితే ఈ ఏడాది జూలై నాటికి అందులో 69వేల లైసెన్స్‌లు మిగిలిపోయాయి. దీంతో అధికారులు విద్యార్థులపై ఒత్తిడి చేసి మరీ అంటగట్టారు. ఈ ఏడాది మార్చి 12న ఒప్పందం చేసుకోగా ఈలోపే లక్షల మంది రాష్ట్ర విద్యార్థులు విదేశీ వర్సిటీల్లోని గొప్ప కోర్సులు నేర్చుకున్నారని ప్రశంసించింది.



● గర్వపడుతున్నామన్న బొత్స

విదేశీ కోర్సులను ఇక్కడి విద్యార్థులకు అందించే ఆలోచన చేసిన సమయంలో ఉన్నత విద్యాశాఖ మరే ఇతర కంపెనీల గురించి పట్టించుకోలేదు. ముందుగానే ఎడెక్స్‌కు కాంట్రాక్టు కట్టబెట్టే ఉద్దేశంతో టెండర్ల జోలికి వెళ్లలేదు. దీనిపై అప్పటి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఓ సందర్భంలో మాట్లాడుతూ... 'ప్రతిదానికీ టెండర్లు పిలవడం సాధ్యం కాదు. ప్రపంచంలో ఇలాంటి కంపెనీ మరొకటి లేదు. అందుకే టెండర్లు లేకుండా కాంట్రాక్టు ఇచ్చినందుకు గర్వపడుతున్నాం' అని వ్యాఖ్యానించారు. అదే స్కిల్ కేసులో చంద్రబాబు అరెస్టును మాత్రం ఆయన సమర్థించారు.

● పాతుకుపోయిన అధికారులు

ఉన్నత విద్యామండలిలో ఇంకా పాత అధికారులే పాతుకుపోయారు. ప్రభుత్వం మారిన తర్వాత ఒక్కరు తప్ప మిగిలినవారంతా తమ స్థానాల్లోనే కొనసాగుతున్నారు. ప్రభుత్వం మారిన తర్వాత ప్రభుత్వం ఎడెక్స్ ఒప్పందంపై ఆరా తీసింది. దీనిపై కొందరు అధికారులను ప్రశ్నించింది. కానీ అధికారులు దానిని దాచిపెట్టే ప్రయత్నం చేశారు. ఇప్పుడు వారే అదొక గొప్ప కార్యక్రమం అన్నట్టుగా బడ్జెట్ పుస్తకంలో రాశారు.

కంప్యూటర్స్‌లో బీకాం!

ఎడెక్స్‌తో ఒప్పందానికి ముందు 'ఇండియా టుడే' నిర్వహించిన ఓ సదస్సులో మాజీ సీఎం జగన్ పాల్గొన్నారు. అందులో ప్రపంచ ప్రముఖ యూనివర్సిటీల్లో ఉన్న కోర్సులను ఇక్కడి విద్యార్థులకు బోధించనున్నట్లు తెలిపారు. వాటిలో ఒక కంప్యూటర్ కోర్సు గురించి చెబుతారా? అని 'ఇండియా టుడే' ప్రతినిధి ప్రశ్నించారు. కాసేపు ఆలోచించిన జగన్ 'ఉదాహరణకు చెప్పాలంటే బీకాం కోర్సు' అని సమాధానమిచ్చారు. కంప్యూటర్స్‌లో బీకాం కోర్సు ఉంటుందా అని తిరిగి ప్రశ్నించడంతో ఆయన మౌనం దాల్చారు. అప్పట్లో ఇది సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయింది. విదేశీ కోర్సులు తెస్తామన్న సీఎంకు కనీసం ఏమేం కోర్సులు వస్తున్నాయో కూడా తెలియదని, కేవలం కమీషన్ల కోసమే రూ.50కోట్ల ఒప్పందం చేసుకున్నారని అప్పుడే స్పష్టమైపోయింది.



ట్యూనాతో ఖుషీ.. ఖుషీగా...!

శీతాకాలంలో పెద్ద సంఖ్యలో లభించే ట్యూనా చేపలు ఇప్పుడు మత్స్యకారులకు విరివిగా లభిస్తున్నాయి. బోటులో వెళ్లి సాధారణ వలలతో చేపలు, రొయ్యలు వేటాడేవారికి సైతం ట్యూనాలు దొరుకుతున్నాయి. వీటిని స్థానికంగా ఎవరూ కొనుగోలు చేయరు. ఇతర రాష్ట్రాలకు, దేశాలకు ఎగుమతి చేస్తారు. మంచి ధర లభిస్తుంది. బుధవారం వేటకు వెళ్లిన వారికి భారీగా ట్యూనాలు దొరకడంతో గురువారం ఉదయాన్నే హార్బర్‌కు వచ్చేసి ఎగుమతికి సిద్ధం చేశారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి





నిండు గోదావరిలో పడవెనుక పడవను పెట్టి... నీటిలో మునిగి బకెట్‌తో లోపలున్న ఇసుకను తోడి.. పైకి తెచ్చి పడవలో నింపి ఒడ్డుకు చేర్చడం... నిత్యం అర్ధరాత్రి దాటిన తర్వాత రెండున్నర గంటల నుంచి నడి నెత్తికి సూర్యుడు వచ్చే మధ్యాహ్నం 12 గంటల వరకూ జరిగే తంతు ఇది. చిన్న పడవలో ఐదుగురు కార్మికులు కలిసి తొమ్మిది టన్నుల ఇసుకను ఒడ్డుకు చేరుస్తారు. ఇలా 12 గంటల నిర్విరామ శ్రమతో నాలుగైదు ట్రిప్పులు వేస్తారు. టన్ను ఇసుక ఒడ్డుకు చేర్చినందుకు రూ.195లు ఇస్తారు. ఇక పెద్ద పడవలో అయితే పదిమంది కార్మికులు కలిసి 44 టన్నుల వరకూ ఇసుకను తీస్తారు. ఇవైతే రోజుకు రెండు ట్రిప్పులు వేస్తారు. ఈ ఇసుకపై సుమారు 3 వేల మంది ఉపాధి పొందుతున్నారు. ఒక్క తూర్పుగోదావరి జిల్లాలోనే బోట్స్‌మన్ సొసైటీలు 160 వరకూ ఉన్నాయి. వాటి ద్వారా 1600 మంది ఉపాధి పొందుతున్నారు. ఇవికాక తూర్పుగోదావరి జిల్లా అఖండ గోదావరి ప్రాంతంలోని రాజమహేంద్రవరం వైపు గాయత్రి, కోటిలింగాల, కొవ్వూరు ర్యాంపుల్లోనూ బోట్స్‌మన్ సొసైటీల ద్వారా డీసిల్టేషన్ పేరుతో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. ఈ ఇసుక తీసే పనిలో పడవలపై పనిచేసేవారంతా దాదాపు యూపీ, బీహార్ తదితర రాష్ట్రాల నుంచి వచ్చినవారే.
- రాజమహేంద్రవరం, ఆంధ్రజ్యోతి



పడవెనుక పడవ పెట్టి...!

ఆ కేసులో నా పేరెక్కడుంది?



సన్మానం చేయాలా?

- అదానీ నాకు లంచం ఇచ్చినట్లు ఎక్కడ రాశారు?
- ఒప్పందం సెకీతో... థర్డ్ పార్టీ ఎక్కడ?
- అతి తక్కువ ధరకు విద్యుత్ కొన్నాం
- రాష్ట్రానికి లక్షల కోట్లు ఆదా చేశాం
- మంచి చేసినందుకు నన్ను సన్మానించాలి
- సీఎంతో పారిశ్రామికవేత్తల భేటీ మామూలే
- 48 గంటల్లో 'ఆంధ్రజ్యోతి' క్షమాపణలు చెప్పాలి
- లేదంటే... రూ.వంద కోట్లకు దావా వేస్తా
- మాజీ సీఎం జగన్ బెదిరింపులు

అమరావతి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): "దేశంలోనే అతితక్కువ ధరకు సౌర విద్యుత్ యూనిట్ రూ.2.49కే సెకీ నుంచి సౌరవిద్యుత్తు కొనుగోలు చేసి, రాష్ట్రానికి మంచి చేస్తే శాలువా కప్పి సన్మానం చేయాలి కదా! అలా చేయకుండా నా వ్యక్తిత్వం మీద బురద జల్లడమేమిటి?'... అని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి విస్మయం, ఆగ్రహం, ఆక్రోశం వ్యక్తం చేశారు. అదానీపై అమెరికాలో పెట్టిన కేసులో తన పేరెక్కడుందని ప్రశ్నించారు. తాను సంపదను సృష్టిస్తే.. ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు దానిని ఆవిరి చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. గురువారం ఆయన మొట్టమొదటిసారిగా 'అదానీ సోలార్ పవర్ డీల్'పై స్పందించారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. మంచి చేసినోడిపై రాళ్లేస్తున్నారని ఆరోపించారు. "ఒప్పందంపై కేంద్ర ప్రభుత్వ సంస్థ సెకీ, ఏపీ ప్రభుత్వం, డిస్కమ్‌లు సంతకాలు చేశాయి. ఇందులో థర్డ్ పార్టీ ఎక్కడుంది?" అంటూ అదానీ గ్రీన్ ఎనర్జీతో సంబంధమే లేదన్నట్లుగా జగన్ మాట్లాడారు. అంతేకాదు... ఇంటర్ స్టేట్ ట్రాన్స్‌మిషన్ చార్జీలను మినహాయిస్తున్నట్లు ఒప్పందంలో స్పష్టంగా ఉందన్నారు. ఇంటర్‌స్టేట్ ట్రాన్స్‌మిషన్ చార్జీలు యూనిట్ రూ.1.98 దాకా పడతాయని.. కానీ, అదేమీ లేకుండానే కేవలం యూనిట్ రూ.2.49కే విద్యుత్తును అందిస్తామని సెకీ వెల్లడించిందని తెలిపారు. రాష్ట్ర చరిత్రలోనే అతి తక్కువ ధరకు విద్యుత్తు కొనుగోలు ఒప్పందం చేశామని జగన్ తనను తాను ప్రశంసించుకున్నారు. గుజరాత్, రాజస్థాన్‌లో ఉన్న ధరల గురించి మాట్లాడుతున్న వాళ్లు... ట్రాన్స్‌మిషన్ కాస్ట్ మినహాయింపు గురించి ఎందుకు మాట్లాడటంలేదని ప్రశ్నించారు. మంచి చేసిన తనపై బండలు వేయడమే పనిగా పెట్టుకుని 'ఆంధ్రజ్యోతి', 'ఈనాడు' కథనాలు రాస్తున్నాయంటూ ఆరోపించారు. ఈ ఒప్పందం వల్ల రాష్ట్రానికి లక్షల కోట్ల రూపాయలు ఆదా అయ్యాయని అన్నారు. ఈ ఒప్పందంలో తప్పుంటే అప్పుడే చంద్రబాబు, 'ఆంధ్రజ్యోతి', 'ఈనాడు' ఊరుకునేవా అని జగన్ ప్రశ్నించారు.

నా పేరెక్కడా లేదు...

వ్యాపారవేత్త గౌతమ్ అదానీపై అమెరికాలో ఎఫ్‌బీఐ నమోదు చేసిన కేసులో తన పేరు లేదని జగన్ పేర్కొన్నారు. అదానీ తనకు లంచం ఇస్తానంటూ బేరాలాడినట్లు ఎక్కడైనా ఉందా అని ప్రశ్నించారు. 'ఈనాడు', 'ఆంధ్రజ్యోతి'కి డెడ్‌లైన్ విధిస్తున్నానని, 48 గంటల్లో క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రూ.100 కోట్లకు పరువు నష్టం దావా వేస్తానని ప్రకటించారు. రిపోర్టులో 'ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి' అని చాలాస్పష్టంగా ఉందికదా అని మీడియా ప్రతినిధి ప్రశ్నించగా... "అమెరికా అధ్యక్షుడు బైడెన్‌కు లంచాలు ఇచ్చినట్లుగా మన రాష్ట్రానికి చెందిన సీబీడీ కేసు నమోదు చేస్తే చెల్లుబాటు అవుతుందా?' అని జగన్ ఎదురు ప్రశ్నించారు. ఎవరు ఎవరిపైనైనా కేసులు పెడితే చెల్లుతాయా అని జగన్ అన్నారు. 2020లోనే రాష్ట్రం పిలిచిన సోలార్ టెండర్లకు యూనిట్‌కు రూ.2.49కే వస్తుందని.. భవిష్యత్తులో ఇంకా తగ్గుతుంది కదా అని రాస్తున్నారని.. మరి ఇప్పుడు సోలార్ పవర్ యూనిట్ రూ.2.72కు ఎందుకు పెరిగిందని ప్రశ్నించారు.

అదానీతో భేటీ ఎందుకంటే...

సెకీతో ఒప్పందానికి ముందు గౌతమ్ అదానీతో జరిగిన భేటీలు సాధారణమైనవే అని జగన్ తెలిపారు. పారిశ్రామికవేత్తలు ముఖ్యమంత్రిని కలవడం సహజమే నన్నారు. సెకీతో ఒప్పందానికి ముందు చాలాసార్లు.. ఒప్పందం జరిగాక కూడా ఆయన చాలాసార్లు తనను కలిశారని జగన్ తెలిపారు.

(మొదటి పేజీ తరువాయి)

కహానీ'ని అమెరికా బయటపెట్టిన వారం తర్వాత ఆయన ఇప్పుడు, ఇన్నాళ్లకు నోరు తెరిచారు. తాడేపల్లిలో ఎంపిక చేసిన, ఎదురు ప్రశ్నించని 'సొంత మీడియా' ప్రతినిధులతో సమావేశమయ్యారు. గంటన్నరపాటు అనేక అబద్ధాలు, అర్ధసత్యాలతో మాయ చేసేందుకు ప్రయత్నించారు. 48 గంటల్లో క్షమాపణలు చెప్పకుంటే వందకోట్లకు పరువునష్టం దావా వేస్తానని 'ఆంధ్రజ్యోతి'ని బెదిరించారు కూడా!

హవ్వ... అంత అబద్ధమా?

'దేశంలోనే అత్యంత చౌకగా... రూ.2.49కే యూనిట్ విద్యుత్ సరఫరా చేసేలా ఒప్పందం చేసుకున్నాం. దీనికి ఇంటర్ స్టేట్ ట్రాన్స్‌మిషన్ చార్జీలను మినహాయించేందుకు సెకీ అంగీకరించింది' అని జగన్ గురువారం గొప్పగా చెప్పారు. ఇదో పెద్ద... శుద్ధ అబద్ధం! ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి గ్రిడ్ ద్వారా విద్యుత్తు సరఫరా చేస్తే వసూలు చార్జీలనే ఇంటర్‌స్టేట్ ట్రాన్స్‌మిషన్ చార్జీలు అంటారు. సెకీ దీనిని వినహాయించలేదని, ఆ మొత్తం యూనిట్‌కు రూ.1.70 వరకు ఉంటుందని అప్పటి ఇంధన శాఖ కార్యదర్శి నాగులాపల్లి శ్రీకాంత్ అప్పట్లో ప్రకటించారు. గత ఏడాది కేంద్ర ప్రభుత్వం దీని పేరును 'జనరల్ పవర్ యాక్సిస్' (జీపీఏ)గా మార్చింది. దీని ప్రకారం... యూనిట్‌కు 80 పైసల నుంచి రూ.1.70 దాకా జీపీఏ చెల్లించాల్సి ఉంటుంది. కనిష్ఠంగా 80 పైసలు లెక్కలోకి తీసుకున్నా, ఒప్పందకాలం పాతికేళ్లకు రూ.62వేల కోట్ల భారం పడుతుంది. ఇదీ అసలు నిజం!

మాటి మాటికీ మారే మాట...

జగన్ ప్రతిపక్ష నేత హోదాలో ఉండగా.. దీర్ఘకాలిక విద్యుత్తు ఒప్పందాలను బలంగా వ్యతిరేకించారు. 2014-19 కాలంలో సౌర విద్యుత్తు సంస్థలతో చంద్రబాబు ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలన్నీ లంచాల కోసమేనని జగన్ ఆరోపించారు. విద్యుత్తు రంగంలో వేగంగా మార్పులు ఉంటాయని .. దీర్ఘకాలిక ఒప్పందాలు చేసుకోవడం తప్పని వాదించారు. అధికారపగ్గాలు చేపట్టిన వెంటనే.. వాస్తవాలను పరిశీలించకుండా, పర్యవసానాలను ఆలోచించకుండా సౌర, పవన విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలను (పీపీఏ) రద్దు చేశారు. దీంతో ఒక్క యూనిట్ కరెంటు వాడుకోకున్నా ఆయా సంస్థలకు రూ.4500 కోట్ల మేర చెల్లింపులు జరపాల్సి వచ్చింది ఆ తర్వాత అదే జగన్... 'సెకీ'తో ఏకంగా పాతికేళ్ల కాలానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. గడచిన పదేళ్లుగా సౌర విద్యుత్తు ధరలు తగ్గుతూ వస్తున్నాయి. 2014లో ఇదే 'సెకీ' యూనిట్ సౌర విద్యుత్తు రూ.5.50కి సరఫరా చేసింది. ఆ తర్వాత ఈ ధర క్రమంగా తగ్గుతూ వచ్చింది. 2021లో కనిష్ఠంగా రూ.2.14కు చేరింది. కానీ... అదే సంవత్సరం జగన్ పాతికేళ్లపాటు యూనిట్‌కు రూ.2.49 చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకోవడం గమనార్హం! ప్రస్తుతం యూనిట్ ధర రూ.2.51 వరకు పలుకుతోంది. అది స్థిరంగా ఉండదని... భవిష్యత్తులో బాగా తగ్గుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. మరి... రాష్ట్ర ప్రజలకు చేసింది మేలా? కీడా?

ఆ టెండర్లు ఎందుకు రద్దు చేశారు?

'2021 సెప్టెంబరులో సెకీ నుంచి తియ్యటి కబురు వచ్చింది. మా విద్యుత్తు విధానాలను ప్రశంసిస్తూ... రూ.2.49కే యూనిట్ సౌర విద్యుత్తు సరఫరా చేసేందుకు ముందుకొచ్చింది" అని జగన్ ముద్దుముద్దు మాటలు చెప్పారు. నిజానికి... 2020లో రాష్ట్ర ప్రభుత్వ గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ లిమిటెడ్ పిలిచిన టెండర్లకే రూ.2.49కే సౌర విద్యుత్తు సరఫరా చేసేందుకు పలు సంస్థలు ముందుకొచ్చాయి. 'సెకీ' కూడా అదే రేటు నిర్ణయించింది. అయినా సరే... గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ పిలిచిన టెండర్లను జగన్ సర్కారు రద్దు చేసింది. 'సెకీ' పవర్‌కు జై కొట్టింది. అందులోనూ... తాను గొప్పగా ప్రవేశపెట్టినట్లు చెప్పుకొనే 'రివర్స్ టెండర్'కు కూడా పోకుండా వేలకోట్ల ఒప్పందాన్ని ఏకపక్షంగా కుదుర్చుకున్నారు. ఇదంతా ఎవరి కోసం?

'అదానీ' కోసం కాదా?

'కేంద్ర ప్రభుత్వ సంస్థ సెకీతో రాష్ట్ర ప్రభుత్వం, డిస్కమ్‌లు ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఇందులో థర్డ్ పార్టీ (అదానీ) ప్రస్తావన ఎక్కడుంది?' అని జగన్ చాలా తెలివిగా ప్రశ్నించారు. ఒప్పందం 'సెకీ'తో కుదిరినప్పటికీ... కరెంటు సరఫరా చేసేది అదానీయే! 'సెకీ' ఒక మధ్యవర్తి మాత్రమే! కమీషన్ తీసుకోవడానికే దీని పాత్ర పరిమితం! 'సెకీ' ద్వారా రాష్ట్రాలకు 12వేల మెగావాట్ల విద్యుత్ సరఫరా చేసేందుకు అదానీ, అజూర్ సంస్థలు ఒప్పందం చేసుకున్నాయి. కానీ... ఆ ధరకు, దీర్ఘకాలం కరెంటు కొనుగోళ్లకు రాష్ట్రాలు ముందుకు రాలేదు. 'పవర్ డీల్' అనిశ్చితిలో పడటం... పెట్టుబడిదారుల నుంచి ఒత్తిడి రావడంతో రాష్ట్రాలకు 'లంచాలు ఎరవేసి' ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు అమెరికా 'సెక్', దర్యాప్తు సంస్థలు నిర్ధారించాయి. 12వేల మెగావాట్లలో ఏపీ ఒక్కటే ఏడువేల మెగావాట్ల కొనుగోలుకు సిద్ధపడటం గమనార్హం. అందుకే... ఈ కేసు నివేదికలో 'ఆంధ్రప్రదేశ్ చీఫ్ మినిస్టర్' అని జగన్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు.



ఆంధ్రా సూరీడు @అదానీ!
9 వేల మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు?

అక్షరాలా ఉతికి ఆరేశాం!

'సెకీతో విద్యుత్తు కొనుగోలు ఒప్పందంలో తప్పులు జరిగితే ఆంధ్రజ్యోతి అప్పుడు ఊరుకునేదా?' అని జగన్ ప్రశ్నించారు. ఆయనకు తెలియదో, తెలిసీ ఇలా అన్నారో తెలియదు కానీ... 'సెకీ'తో డీల్‌పై 'ఆంధ్రజ్యోతి' అనేక కథనాలు ప్రచురించింది. 2021 సెప్టెంబరు 22న 'ఆంధ్రా సూరీడు అదానీ' అనే శీర్షికన 'సెకీ'తో ఒప్పందం వెనుక జరిగిన అనుమానాస్పద పరిణామాలను, కోణాలను వివరించింది. అదే అంశాలను ఇప్పుడు అమెరికా దర్యాప్తు సంస్థలు తమ నివేదికల్లో ప్రస్తావించాయి.

'మామూలే' అయితే గోప్యత ఎందుకు?

'ముఖ్యమంత్రిని పారిశ్రామికవేత్తలు కలవడం సహజం. అదానీ అలాగే నన్ను కలిశారు' అని జగన్ ఇప్పుడు చెబుతున్నారు.

నిజమే... పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రులు కలవడం సహజమే! కానీ... ఇలాంటి భేటీలు రహస్యంగా జరగవు. పెట్టుబడులు, ప్రాజెక్టుల ప్రతిపాదనలపై చర్చలు జరిగితే... ఆ విషయాన్ని ప్రజలకు తెలియజేస్తారు. కానీ... అదానీతో జగన్ జరిపిన సమావేశాలన్నీ గుట్టుగానే! దీని మర్మమేమిటి?

అదానీ ఒప్పందాలపై.. అన్ని కోణాల్లో చర్చించాక చర్యలు



- రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దయనీయం: పయ్యావుల

అనంతపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో అదానీతో విద్యుత్ ఒప్పందాలపై ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ప్రకటన చేశారు. వాటిపై ఆర్థిక, న్యాయపరంగా అన్ని కోణాల్లో చర్చించి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది' అని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. పీఏసీ చైర్మన్‌గా వైసీపీ పాలనలో ఈ ఒప్పందాలపై మాట్లాడానని, కోర్టుకు వెళ్లానని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో ఆ వ్యవహారంపై ఎక్కువగా మాట్లాడదలుచుకోలేదని చెప్పారు. ఆయన గురువారమిక్కడ విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉందని.. ఒక్క మాటలో చెప్పాలంటే కుప్పకూలేందుకు సిద్ధంగా ఉందన్నారు. 'రూ.10 లక్షల కోట్ల అప్పు ఉంది. పలు రకాల పనులకు చెల్లించాల్సిన మొత్తం ప్రతి రోజూ పెరుగుతూనే ఉంది. చేసిన అప్పులు, వడ్డీలు కట్టేందుకు మళ్లీ అప్పులు చేయాల్సి వస్తోంది. అభివృద్ధి కోసం అప్పులు చేయడం తప్పు కాదు. కానీ చేసిన అప్పులను అభివృద్ధి కోసం ఖర్చు పెట్టి.. తర్వాత వచ్చే ఆదాయాన్ని పేదల సంక్షేమానికి ఉపయోగించాలి. చేసిన అప్పులను అధిగమించేందుకు చాలా కాలం పడుతుంది. చంద్రబాబు బ్రాండ్‌తోనే ఆర్థికంగా నిలదొక్కుకునేలా సాగుతున్నాం. కేంద్ర ప్రభుత్వంతో సీఎం సమన్వయం చేసుకుంటున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఆక్సిజన్ ఏ విధంగా అవసరమవుతుందో ఆ తరహాలో రాష్ట్రాన్ని నడిపించగలుగుతున్నాం. గత ఏడాది రాష్ట్ర ఆదాయంలో 99 శాతం వేతనాలు, పింఛన్లకే ఖర్చు చేశారు. అంతకు ముందు ఏడాది ఈ వ్యయం 107 శాతం ఉంది. అస్తవ్యస్త విధానాలతో దెబ్బతిన్న రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు ప్రణాళికలు తయారుచేసి అమలు చేస్తున్నాం. యువతకు మంచి భవిష్యత్ అందించేందుకు ముందుకెళ్తున్నాం. పరిశ్రమలు తీసుకురావడంతోపాటు సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేసి ఆ ఫలాలను ప్రజలకు అందించాలనేదే ప్రభుత్వ లక్ష్యం. ఇప్పటికే అనేక పరిశ్రమల ఏర్పాటుకు ఒప్పందాలు చేసుకున్నాం' అని మంత్రి తెలిపారు.

సొంత ఆస్తులు పెంచుకున్న జగన్

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్

అమరావతి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అధికారం అడ్డుపెట్టుకుని సొంత ఆస్తులు భారీగా పెంచుకున్న జగన్.. ప్రభుత్వ సంపద పెంచానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఎద్దేవా చేశారు. ప్రజాధనాన్ని వెచ్చించి ఒక ముఖ్యమంత్రి సొంత ఆస్తులు ఎలా పెంచుకోవచ్చో జగన్ నిరూపించారని పేర్కొన్నారు. పదవి లేకుండా బతకలేకపోతున్న మాజీ ముఖ్యమంత్రి.. మీడియా సమావేశంలో ప్రజలపై అసహనం ప్రదర్శించడం విడ్డూరంగా ఉందని 'ఎక్స్' ద్వారా ఆశ్చర్యం వ్యక్తం చేశారు. విద్యుత్ రంగాన్ని ధ్వంసం చేసి.. వ్యక్తిగత ఆస్తులు పెంచుకున్న జగన్ రెడ్డి, అందుకు పూర్తి భిన్నంగా నీతులు వల్లెవేయడం విడ్డూరంగా ఉందన్నారు.

జే ట్యాక్స్ పోయింది.. మద్యం ధర తగ్గింది

(మొదటి పేజీ తరువాయి)

బీరు కేసుపై రూ.100 చొప్పున కంపెనీలు కమీషన్లు చెల్లించాయి. దాదాపు నాలుగున్నరేళ్ల పాటు ఈ కమీషన్ల దందా కొనసాగింది. వైసీపీ పెద్దలు అడిగిన కప్పం కట్టిన కంపెనీలకే అప్పట్లో ఆర్డర్లు ఇచ్చారు. కమీషన్లు ఇచ్చినందుకుగాను బదులుగా ఆయా కంపెనీలకు ప్రభుత్వం చెల్లించే రేట్లు పెంచారు. అలా పెంచిన మొత్తాన్ని కంపెనీలు ఆ చేత్తో తీసుకుని, ఈ చేత్తో తాడేపల్లి ప్యాలెస్‌కు పంపాయి. ఇలా రూ.3,100 కోట్లను కమీషన్‌గా మళ్లించినట్లు కూటమి ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసింది. జగన్ ప్రభుత్వం మారడంతో కమీషన్ల బెడద తప్పింది. దీంతో కంపెనీలు వెంటనే ధరలు తగ్గించేశాయి. ఒక్క క్వార్టర్‌పై రూ.30 ధర తగ్గించాయి. దీన్నిబట్టి గత ప్రభుత్వంలో ఏ స్థాయిలో కమీషన్లు దండుకున్నారో, వినియోగదారులపై ఎంతభారం వేశారో అర్థం చేసుకోవచ్చు. కూటమి ప్రభుత్వం వచ్చాక మద్యం పాలసీ మారిన సంగతి తెలిసిందే. చెప్పినట్లుగా మద్యం ధరలు తగ్గాయి. గత ప్రభుత్వంలో భారీగా పెంచిన రేట్లను తగ్గించుకునేందుకు స్వయంగా కంపెనీలే ముందుకొస్తున్నాయి. తాజాగా మరో మూడు పాపులర్ కంపెనీలు ముందుకు వచ్చాయి. ఎక్సైజ్ శాఖ వాటి ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. తగ్గించిన ధరలు కూడా అమల్లోకి వచ్చాయి. అయితే ప్రస్తుతం షాపుల్లో పాత ఎమ్మార్పీలతో ఉన్న బాటిళ్లను ఆ ధరలకే విక్రయిస్తారు. ఇకపై షాపులకు కొత్తగా వచ్చే స్టాకును తగ్గించిన ధరలతో అమ్ముతారు. ఇంకా అనేక కంపెనీలు ధరలు తగ్గించుకునేందుకు సిద్ధమవుతున్నాయి.

తగ్గిన బ్రాండ్ ధరలివే...

మాన్షన్ హౌస్ బ్రాందీ క్వార్టర్ ధర రూ.220 నుంచి రూ.190కి తగ్గింది. అదే బ్రాండ్ హాఫ్ బాటిల్ ధర రూ.440 నుంచి రూ.380కి, ఫుల్ బాటిల్ ధర రూ.870 నుంచి రూ.760కి తగ్గాయి. రాయల్ చాలెంజ్ సెలెక్ట్ గోల్డ్ విస్కీ క్వార్టర్ ధర రూ.230 నుంచి రూ.210కి తగ్గింది. ఇదే బ్రాండ్ ఫుల్ బాటిల్ ధర రూ.920 నుంచి రూ.840కి తగ్గింది. యాంటిక్విటీ బ్లూ విస్కీ ఫుల్ బాటిల్ ధర రూ.1600 నుంచి రూ.1400కు తగ్గింది.

త్వరలో కొత్త ధరలు

మద్యం ధరలపై ఇటీవల ప్రభుత్వం ఓ కమిటీని నియవించింది. త్వరలో ఈ కమిటీ అన్ని బ్రాండ్ల కంపెనీలతో చర్చించి ధరల సవరణపై సిఫారసు చేయనుంది. అందుకు అనుగుణంగా కొత్త ధరలు అమల్లోకి వస్తాయి. అయితే ఈలోపే కొన్ని బ్రాండ్లు రేట్లు తగ్గించుకునేందుకు ముందుకొస్తున్నాయి. మరో రెండు పాపులర్ బ్రాండ్లు మూడు రోజుల్లో ధరలు తగ్గించనున్నాయి. ప్రస్తుతం కంపెనీలు ధరలు తగ్గించుకుంటున్న తీరు పరిశీలిస్తే... గత ప్రభుత్వంలో అసలు ధర కంటే ఎక్కువ వసూలు చేశారని స్పష్టమవుతోంది. ఒక్కో ఫుల్ బాటిల్‌పై దాదాపు రూ.200 అదనంగా వసూలు చేశారు. పక్క రాష్ట్రాల్లో ఒక ధర, ఏపీలో మరో ధర అనే విధానం అమలైంది. తాడేపల్లి ప్యాలెస్‌కు కమీషన్లు ఇవ్వాల్సి రావడమే ఇందుకు కారణం.

కమిటీ ముందు తప్పించుకోవడానికా?

మద్యం కంపెనీలు ఇప్పుడే ధరలు తగ్గించుకోవడం వెనుక మరో కోణం కూడా కనిపిస్తోంది. హైకోర్టు రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో మద్యం ధరల సవరణ కమిటీని ప్రభుత్వం ఇటీవల నియమించింది. త్వరలో ఆ కమిటీ అన్ని కంపెనీలతో ధరల సవరణపై చర్చలు జరపనుంది. ఓ బాటిల్ తయారీకి ఎంత ఖర్చు అవుతుంది? అవే బాటిళ్లను పక్క రాష్ట్రాల్లో ఎంతకు విక్రయిస్తున్నారు? ఇతరత్రా ఖర్చుల వివరాలు పరిగణనలోకి తీసుకుని రాష్ట్రంలో ఏ ధరకు ఇస్తారనే దానిపై కమిటీ చర్చించనుంది. ఈ క్రమంలో ఏపీ, తెలంగాణ మధ్య ఉన్న ధరల్లో భారీ వ్యత్యాసాలుంటే.. ఎక్కువ ఎందుకు ఉందనే కోణంలో కంపెనీలను కమిటీ ప్రశ్నించే అవకాశముంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ముందుగానే రేట్లు తగ్గించుకుంటున్నారనే వాదన వినిపిస్తోంది.

ఇప్పటికీ వాళ్లేనా?

- ఉన్నత విద్యామండలిలో వైసీపీ నియమించిన అధికారులదే హవా
- ప్రభుత్వం మారినా చక్రం తిప్పుతున్న పాత అధికారులు
- చైర్మన్ నియామకంపై లేని స్పష్టత
- ఇన్‌చార్జ్ అధికారుల మధ్య కుదరని సఖ్యత
- యూనివర్సిటీల్లోనూ ఇన్‌చార్జ్ వీసీలే కొనసాగింపు
- అడ్రస్‌లేని సెర్చ్ కమిటీల నియామకం

అమరావతి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మారిన వెంటనే కీలక విభాగాల్లోని ముఖ్యమైన అధికారులు కూడా మారుతూ ఉంటారు. అయితే రాష్ట్ర ఉన్నత విద్యామండలి మాత్రం ఇందుకు భిన్నం. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఐదు నెలలు దాటినా ఇంకా అక్కడ పాతవాసన మాత్రం పోలేదు. వైసీపీ హయాంలో చక్రం తిప్పిన అధికారుల హవానే ఇంకా కొనసాగుతోంది. నారా లోకేశ్ మంత్రిగా ఉన్న ఉన్నత విద్యాశాఖలో మొత్తం పాత అధికారులతోనే పాలన సాగుతోంది. ఉన్నత విద్యామండలిలో అన్ని విభాగాల్లోనూ పాత అధికారులనే కొనసాగిస్తున్నారు. గత ప్రభుత్వంలో చైర్మన్‌గా చక్రం తిప్పిన కె.హేమచంద్రారెడ్డి ప్రభుత్వం మారిన వెంటనే రాజీనామా చేసి వెళ్లిపోయారు. ఆ వెంటనే కూటమి ప్రభుత్వం కొత్త చైర్మన్‌ను నియమిస్తుందని ప్రచారం జరిగింది. ఇంతవరకూ కొత్త చైర్మన్ ఊసే లేకుండా పోయింది. పైగా గత ప్రభుత్వంలో రెండు విడతలు వైస్ చైర్మన్‌గా పనిచేసిన కె.రామ్మోహన్‌రావుకు ఈ ప్రభుత్వం ఇన్‌చార్జ్ చైర్మన్ బాధ్యతలు అప్పగించింది. వైసీపీ ప్రభుత్వంలో అప్పటి చైర్మన్‌తో అంటకాగినట్లు ఆరోపణలున్న వ్యక్తిని ఇన్‌చార్జ్ చైర్మన్‌గా నెలల తరబడి కొనసాగించడంపై విస్మయం వ్యక్తమవుతోంది.

సెర్చ్ కమిటీలు ఎప్పుడు?

ప్రభుత్వం మారిన తర్వాత మండలిలో పాలన చాలావరకు కుంటుపడింది. కొత్త అధికారులను నియమించుకుంటారనే ఆలోచనలో పాత అధికారులు ఉన్నారు. కానీ చైర్మన్ నియామకంపై కూడా కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేకపోతోంది. చైర్మన్‌ను నియమిస్తే మండలి తిరిగి పట్టాలెక్కుతుంది. ముఖ్యంగా రాష్ట్రంలో 17 యూనివర్సిటీల్లో వీసీలు లేరు. ప్రభుత్వం మారిన తర్వాత రాజీనామాలతో ఈ ఖాళీలు ఏర్పడ్డాయి. వీసీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరించి నెల దాటినా సెర్చ్ కమిటీల నియామకం కనుచూపుమేరలో కనిపించడం లేదు. రెగ్యులర్ వీసీలు ఉంటే తప్ప వచ్చే విద్యా సంవత్సరంలో నిర్వహించే సెట్లకు కన్వీనర్లను నియమించడం సాధ్యం కాదు. మరోవైపు వచ్చే విద్యా సంవత్సరంలో నిర్వహించాల్సిన సెట్లకు షెడ్యూలు ప్రకటించాల్సిన సమయం వచ్చింది. ఆ షెడ్యూలు ఇవ్వాలంటే రెగ్యులర్ వీసీలు, చైర్మన్ ఉండాలి. పోనీ పాత అధికారులతోనే మండలిని నడిపించాలనుకుంటే దానిపై అయినా స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

కీలక శాఖలో సఖ్యత లేదు

ఉన్నత విద్యామండలి... ఉన్నత విద్యాశాఖకు సలహా మండలి తరహాలో పనిచేస్తుంది. ఎంట్రన్స్ టెస్ట్‌ల నిర్వహణ, డిగ్రీ అడ్మిషన్ల బాధ్యత కూడా మండలికే ఉంది. మండలిలో చైర్మన్, వైస్ చైర్మన్లు, సెట్స్ అధికారులు, అకడమిక్ అధికారులు అంతా వర్సిటీల నుంచి డిప్యుటేషన్‌పై వచ్చి పనిచేస్తారు. తమకు అనుకూలంగా ఉన్నవారిని ఆయా ప్రభుత్వాలు నియమిస్తుంటాయి. అలా గత ప్రభుత్వంలో నియమితులైన వారే ఇప్పటికీ కీలక బాధ్యతల్లో కొనసాగుతున్నారు. ఇద్దరు వైస్ చైర్మన్లు, అకడమిక్ అధికారులు, ఇతర ప్రాజెక్టుల అధికారులు పాత స్థానాల్లోనే ఉన్నారు. నెల కిందట మాత్రం మండలి కార్యదర్శిని మార్చి, జాయింట్ డైరెక్టర్‌కు ఇన్‌చార్జ్ బాధ్యత అప్పగించారు. గత ప్రభుత్వంలో వేధింపులకు గురైన జేడీకి, మిగిలిన అధికారులకు మధ్య సఖ్యత కుదరట్లేదు. ఇన్‌చార్జ్ చైర్మన్, ఇన్‌చార్జ్ కార్యదర్శి మధ్య సమన్వయం లేదు. గత ప్రభుత్వంలో మండలి ఆర్థిక వ్యవహారాలను క్యాష్‌బుక్స్‌తో సహా సమర్పించాలని జేడీ అడుగుతుంటే, అవి లేవని పాత అధికారులు చెబుతున్నారు. ఇదీ ఇటీవల వివాదానికి దారితీసింది. దాని ఫలితంగా ఉద్యోగులకు జీతాలు కూడా అందలేదు.

వివాదాలకు కేరాఫ్

ఇటీవల మండలి నుంచి రిలీవైన ఓ అధికారిణి నేరుగా ఇన్‌చార్జ్ కార్యదర్శి చాంబర్‌కే వెళ్లి ఆయన్ను బెదిరించారు. భవిష్యత్తులో పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయంలో ఇలాంటి ఘటన జరిగిందంటే దానికి పాత అధికారుల కొనసాగింపే కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇన్‌చార్జ్ కార్యదర్శిని బెదిరించిన అధికారిణికి మండలిలోనే కొందరు మద్దతుగా నిలుస్తున్నారు. ఓవైపు ఇన్‌చార్జ్ కార్యదర్శిని బెదిరించడం.. మరోవైపు ఇతర అధికారులతో సమావేశంకావడం కూడా అనుమానాలకు దారితీస్తోంది. బయటి వ్యక్తులను కార్యాలయంలోకి అనుమతించవద్దని ఆదేశించినప్పటికీ కొందరు అధికారుల సహకారంతో పలువురు మండలిలోకి ప్రవేశిస్తున్నారు. దీంతో వివాదాలకు కేంద్రంగా మారుతోంది. కొత్త పాలనా యంత్రాంగాన్ని నియమిస్తే వివాదాలకు ఆస్కారం ఉండదు.

గనుల వెంకటరెడ్డికి జైల్లో మర్యాదలు..?



- టీవీ ఏర్పాటుపై వివాదం.. విచారణకు విశ్వజీత్ ఆదేశం
- అది హెచ్‌పీసీఎల్ నుంచి వచ్చిందన్న జైలు అధికారులు

అమరావతి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గనుల ఘనుడు వెంకటరెడ్డికి విజయవాడ జైల్లో సకల మర్యాదలు అందాయా..? సహజ సంపద దోపిడీ వ్యవహారంలో ఏసీబీ అరెస్టు చేసిన మైనింగ్ మాజీ డైరెక్టర్‌కు జైలు అధికారులు టీవీ, రిఫ్రిజరేటర్ వంటి సౌకర్యాలు ఏర్పాటు చేశారా..? ఇటీవలే బెయిలుపై విడుదలైన వెంకటరెడ్డిపై విజయవాడ జైలు అధికారులకు అంత ప్రేమ ఎందుకు..? రాష్ట్రంలో గత రెండు రోజులుగా ఇలాంటి ప్రశ్నలే వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ (ఇన్‌చార్జి డీజీ ప్రిజన్స్) విచారణకు ఆదేశించడంతో జైలు అధికారుల వెన్నులో వణుకు మొదలైంది. వివరాల్లోకి వెళితే... రాష్ట్రంలోని ఇసుక, మైనింగ్ లాంటి సహజ సంపద వైసీపీ ప్రభుత్వంలో దోపిడీకి గురైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దీనిపై ఏసీబీ విచారణకు ఆదేశించింది. కేసు నమోదు చేసి ప్రాథమిక దర్యాప్తు చేసిన ఏసీబీ అధికారులు వేల కోట్ల కుంభకోణంలో కీలక సూత్రధారి అయిన వెంకటరెడ్డిని గత నెలలో హైదరాబాద్‌లో అరెస్టు చేసి విజయవాడ కోర్టులో హాజరు పరిచారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు విజయవాడ జైలుకు రిమాండ్‌కు తరలించారు. అయితే వెంకటరెడ్డి జైల్లో ఉన్న సమయంలో గత నెల 11న టీవీ, రిఫ్రిజిరేటర్ విజయవాడ జైలుకు వచ్చాయి. తాజాగా ఆ విషయం వెలుగులోకి రావడంతో వెంకటరెడ్డి తనకోసమే వాటిని తెప్పించుకున్నట్లు ప్రచారం జరిగింది. అయితే జైళ్లలో ఖైదీల కోసం దాతలు విరాళంగా ఇలాంటివి ఇస్తుంటారని, అధికారికంగా వాటిని తీసుకుని పై అధికారులకు ర్యాటిఫికేషన్‌కు పంపుతామని జైళ్ల శాఖ అధికారులు చెబుతున్నారు. విజయవాడ జైలుకు వచ్చిన టీవీని కూడా గుంటూరు జిల్లాలో రెండు పెట్రోలు బంకులు ఏర్పాటుచేసిన హెచ్‌పీసీఎల్ కాంట్రాక్టరు ఇచ్చారని చెబుతున్నారు. ఆ టీవీని బ్యారక్‌లో పెట్టాం తప్ప వెంకటరెడ్డి కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేయలేదన్నారు. ఈ విషయమై హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ మాట్లాడుతూ.. 'డొనేషన్స్ వస్తుంటాయి. ఇక్కడ టీవీ కూడా అలానే వచ్చింది. ఈ విధానం ఎప్పటి నుంచో ఉంది. తీసుకున్నాక ర్యాటిఫికేషన్ చేస్తారు.. కాకపోతే నా అనుమతి లేకుండా తీసుకోవద్దని చెప్పా.. అయినా తీసుకోవడంపై విచారణకు ఆదేశించా. జైళ్ల శాఖ ఐజీ నివేదిక ఇచ్చిన తర్వాత తప్పు ఉంటే చర్యలు తీసుకుంటాం' అని స్పష్టం చేశారు.

విద్యాసాగర్ బెయిల్ పిటిషన్ విచారణ 3కు వాయిదా

అమరావతి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సినీ నటి కాదంబరి జెత్వాని కేసులో బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైసీపీనేత కుక్కల విద్యాసాగర్ వేసిన పిటిషన్ గురువారం హైకోర్టులో విచారణకు వచ్చింది. ప్రాసిక్యూషన్ తరపు న్యాయవాది స్పందిస్తూ పిటిషన్ విషయంలో గురువారమే కౌంటర్ దాఖలు చేశామన్నారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి స్పందిస్తూ పిటిషన్‌పై వాదనలు వినిపించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. జెత్వాని తరఫు న్యాయవాది నర్రా శ్రీనివాసరావు స్పందిస్తూ కౌంటర్ వేసేందుకు మరికొంత సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. అందుకు అంగీకరించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ పిటిషన్‌పై తదుపరి విచారణను డిసెంబర్ 3కి వాయిదా వేశారు.

కిరాయి మూకల అసభ్య పోస్టులు



అలాంటి వారిపై చర్యలు తప్పవు!

- అసభ్య భాషతో తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారు: హైకోర్టు
- వారు సోషల్ మీడియా ఉద్యమకారులు కాదు
- వ్యవస్థీకృత విష ప్రచారంతో.. చట్టాలను గౌరవించే పౌరులకు తీవ్ర నష్టం
- విజయ్‌బాబు పిల్ వెనుక రాజకీయ దురుద్దేశం
- ధర్మాసనం ఆగ్రహం.. వ్యాజ్యం కొట్టివేత
- రూ.50 వేల ఖర్చులు విధింపు
- నెలలోగా న్యాయ సేవాధికార సంస్థకు జమ చేయాలని ఆదేశం



పి. విజయ్ బాబు

> సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వాన్ని విమర్శించేవారికి.. అదే వేదికను వాడుకుని ఏ మాత్రం మర్యాద లేకుండా అసభ్యకరమైన భాష వాడుతూ తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసి.. ఓ అధికారిని లేదా వ్యక్తిని, అతడి కుటుంబ సభ్యులను అపఖ్యాతి పాల్జేసేలా దుర్భాషలాడుతూ వేధించేవారికి మధ్య కచ్చితంగా వ్యత్యాసం ఉంది.
>
> కుల, మతాల మధ్య విద్వేషాలు రగిల్చి సమాజంలో అశాంతి సృష్టించేందుకు కూడా సోషల్ మీడియాను ఉపయోగించే అవకాశం ఉంది. - హైకోర్టు ధర్మాసనం

అమరావతి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): డబ్బులు తీసుకుని అవతలివారిపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టే కిరాయి మూకలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవలసిందేనని హైకోర్టు తేల్చిచెప్పింది. చట్టరీత్యా నేరమైన అంశాలను సోషల్ మీడియాలో ప్రచురించిన వ్యక్తులు.. చర్యల నుంచి ఎలాంటి మినహాయింపూ కోరలేరని స్పష్టం చేసింది. అసభ్యకరమైన భాష వాడుతూ తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసే వ్యక్తులను సోషల్ మీడియా ఉద్యమకారులుగా చెప్పలేమని తెలిపింది. సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నవారిపై కేసులు నమోదు చేయకుండా పోలీసులను ఆదేశించాలని కోరుతూ పాత్రికేయుడు, వైసీపీ ప్రభుత్వంలో అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా పని చేసిన పోలా విజయ్‌బాబు దాఖలు చేసిన ప్రజాప్రయోజనం వ్యాజ్యం వెనుక రాజకీయ దురుద్దేశం ఉందని స్పష్టంచేసింది. దానిని కొట్టివేసింది. ఆయనకు రూ.50 వేల ఖర్చులు విధించింది. ఈ సొమ్మును నెల రోజుల్లోగా రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థకు జమచేయాలని ఆదేశించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం తీర్పు ఇచ్చింది. ఈ నెల 13న ఇచ్చిన ఈ తీర్పు ప్రతి తాజాగా అందుబాటులోకి వచ్చింది. సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నవారిపై సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధంగా కేసులు పెడుతూ పోలీసులు చట్టనిబంధనలు ఉల్లంఘిస్తున్నారని, వారి చర్యలపై విచారణకు ఆదేశించాలని కోరుతూ విజయ్‌బాబు పిల్ వేశారు. దీనిపై ఈ నెల 13న విచారణ జరిపిన ధర్మాసనం.. పోలీసులు నమోదు చేస్తున్న కేసుల విషయంలో జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. అసభ్యకర పోస్టులు పెడుతున్నవారిపై కేసులు పెడితే తప్పేముందని ప్రశ్నించిన విషయం తెలిసిందే. అదే రోజు తీర్పు వెలువరించింది.

తీర్పులో ఏముందంటే..

'హక్కుల రక్షణ కోసం కోర్టును ఆశ్రయించలేని అట్టడుగు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన వ్యక్తుల తరఫున పిటిషనర్ ప్రస్తుత పిల్ దాఖలు చేయలేదు. సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టిన ఓ సమూహానికి మద్దతుగా పిటిషన్ వేశారు. ఆ పోస్టులు పెట్టినవారు ఆర్థికంగా వెనుకబడిన, అణగారినవర్గాలవారు కాదు. వారి తరఫున మరొకరు పిల్ దాఖలు చేయడానికి వీల్లేదు. కంప్యూటర్ లేదా ఆధునిక ఫోను వినియోగించి సోషల్ మీడియాలో వ్యక్తులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తారు. సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వాన్ని విమర్శించే వ్యక్తులకు తమ హక్కుల గురించి పూర్తి అవగాహన ఉంటుంది. సమాజంలో ఏం జరుగుతోందో వాళ్లకు బాగా తెలుసు. అధికారంలో ఉన్నవారి లోటుపాట్లను వారు విమర్శించగలరు. ప్రభుత్వ చర్యలు చట్ట వ్యతిరేకంగా ఉంటే వాటిని సవాల్ చేసే సామర్థ్యం ఉన్న సదరు సమూహం తరఫున దాఖలు చేసిన పిల్‌కు ఏవిధంగా విచారణార్హత ఉంటుందో మాకు అర్థం కావడం లేదు. సోషల్ మీడియా వేదికగా వ్యక్తులను లక్ష్యంగా పెట్టుకుని చేస్తున్న వ్యవస్థీకృత విష ప్రచారంతో.. చట్టాలను గౌరవించే పౌరులకు తీవ్ర నష్టం జరుగుతోంది. చట్టరీత్యా నేరమైన అంశాలను సోషల్ మీడియాలో ప్రచురించిన వ్యక్తులు ఎలాంటి మినహాయింపూ కోరలేరు. డబ్బులు తీసుకుని అవతలవారి మీద అసభ్యకర పోస్టులు పెట్టే కిరాయి వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవలసిందే. కోర్టు ముందున్న రికార్డులను పరిశీలిస్తే ప్రస్తుత పిల్ రాజకీయ దురుద్దేశంతో వేసినట్లు కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో దానిని కొట్టివేస్తున్నాం. పిటిషనర్‌కు రూ.50 వేల ఖర్చులు విధిస్తున్నాం. ఈ సొమ్మును నెలరోజుల్లో న్యాయసేవాధికార సంస్థకు జమచేయాలి. ఈ మొత్తాన్ని చూపు, వినికిడి శక్తిలేని పిల్లల అవసరాల కోసం వినియోగించాలి' అని ధర్మాసనం తన తీర్పులో నిర్దేశించింది.

విజయ్‌పాల్‌ను 5 రోజులు కస్టడీకి ఇవ్వండి

- గుంటూరు కోర్టులో పోలీసుల పిటిషన్



గుంటూరు(లీగల్), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ, ప్రస్తుత అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజును కస్టడీలో చిత్రహింసలకు గురిచేసిన కేసులో సీఐడీ విశ్రాంత ఏఎస్పీ ఆర్.విజయ్‌పాల్‌ను ఐదు రోజులపాటు తమ కస్టడీకి ఇవ్వాలని గుంటూరు నగరంపాలెం పోలీసులు న్యాయస్థానాన్ని కోరారు. ఈ మేరకు గుంటూరు స్పెషల్ మొబైల్ కోర్టులో గురువారం పిటిషన్ దాఖలు చేశారు. అరెస్టుకు ముందు 41ఏ నోటీసు అందుకుని తమ ముందు హాజరైన ఆయన.. దర్యాప్తునకు ఏమాత్రం సహకరించలేదని, కేసుకు సంబంధించి ఏ ప్రశ్న అడిగినా తెలియదు.. గుర్తులేదు.. మరచిపోయానంటూ నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారని పేర్కొన్నారు. రఘురామపై జరిగిన చిత్రహింసలకు ఆ కేసులో దర్యాప్తు అధికారిగా ఉన్న విజయ్‌పాలే జవాబివ్వాల్సి ఉందని, దీనిపై ఆయన్ను లోతుగా విచారించాల్సి ఉందని తెలిపారు. పలు వివరాలు రాబట్టాల్సి ఉందని.. కస్టడీలోకి తీసుకుని ప్రశ్నించాల్సి ఉందని, ఇందుకు అనుమతించాలని పోలీసులు తమ పిటిషన్‌లో కోరారు. దీనిపై కౌంటర్ దాఖలు చేసేందుకు సమయమివ్వాలని విజయ్‌పాల్ తరఫు న్యాయవాదులు కోరారు. కోర్టు తన నిర్ణయాన్ని శుక్రవారం వెల్లడించే అవకాశం ఉంది.

టార్చర్ కుట్ర వెనుక ఎవరున్నారో త్వరలో బయటపడుతుంది: రఘురామరాజు



రేణిగుంట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తనను టార్చర్ చేసిన కుట్ర వెనుక ఎవరున్నారనేది త్వరలో బయటపడుతుందని అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు అన్నారు. తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం నారావారిపల్లిలో మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడి కర్మక్రియలకు హాజరయ్యేందుకు గురువారం వచ్చిన ఆయన తిరుపతి విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడారు. సీఐడీ చీఫ్ సునీల్ కుమార్‌కు దుబాయిలో వ్యాపారాలున్నాయని, ఆయన కుల ధ్రువీకరణ పత్రంపైనా అనుమానం ఉందని తెలిపారు. తనను టార్చర్ చేసిన విషయంలో మరికొంత మంది అధికారులు కూడా అరెస్టయ్యే అవకాశముందని చెప్పారు. తన రిమాండ్ రిపోర్టులో సాక్ష్యాధారాలు స్పష్టంగా ఉన్నాయన్నారు. తనను చిత్ర హింసలకు గురి చేసిన సందర్భంలో సునీల్ కుమార్ కాకుండా ఆయన కలెక్షన్ ఏజెంట్లు ముఖానికి ముసుగులు తొడుకున్నారని, ప్రభుత్వం మారాక వాస్తవాలు వెలుగులోకి వస్తాయనే ఉద్దేశంతోనే ముందు జాగ్రత్తగా ఆయన తన కలెక్షన్ ఏజెంట్లను వాడుకున్నారని రఘురామ అభిప్రాయపడ్డారు. సుప్రీంకోర్టు విచారణ పట్ల సంతృప్తిగా ఉందన్నారు.

ఇక నాపై కేసులు నమోదు చేయొద్దు!

- హైకోర్టుకు రాంగోపాల్ వర్మ.. విచారణ వాయిదా

అమరావతి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌పై సామాజిక మాధ్యమాల్లో అనుచిత, అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యవహారంలో ఇకపై ఎలాంటి కేసులు నమోదు చేయకుండా డీజీపీ, హోంశాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించాలని కోరుతూ దర్శకుడు రాంగోపాల్ వర్మ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం గురువారం విచారణకు వచ్చింది. పోలీసుల తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పాణిని సోమాయాజి స్పందిస్తూ... ఈ కేసులో అడ్వకేట్ జనరల్ హాజరై వాదనలు వినిపిస్తారన్నారు. విచారణను వాయిదా వేయాలని కోరారు. పిటిషనర్ తరఫు న్యాయవాది టి.రాజగోపాలన్ వాదనలు వినిపిస్తూ... ఒకే పోస్టుకు సంబంధించి పిటిషనర్‌పై వివిధ పోలీసుస్టేషన్లలో వరుస కేసులు పెడుతున్నారని పేర్కొన్నారు. పోలీసులు నోటీసులు ఇచ్చి విచారణకు హాజరుకావాలని కోరుతున్నారన్నారు. ప్రకాశం జిల్లా మద్దిపాడు పోలీసులు నమోదు చేసిన కేసును ప్రధాన కేసుగా భావించి, తర్వాత నమోదైన కేసులను వాంగ్మూలాలుగా తీసుకోవాలని అభ్యర్థించారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి .. విచారణను సోమవారానికి వాయిదా వేశారు.

రాఘవరెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టివేత

- అసభ్య పోస్టుల కేసులో అవినాశ్‌రెడ్డి పీఏ కోసం ముమ్మర గాలింపు



కడప రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులకు సంబంధించిన కేసులో ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి బండి రాఘవరెడ్డి దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌ను గురువారం కడప జిల్లా ఎస్సీ ఎస్టీ కోర్టు (4వ అదనపు జిల్లా కోర్టు) కొట్టివేసింది. అప్పటి ప్రతిపక్ష నేతలు చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్, అనిత, మంద కృష్ణమాదిగ, షర్మిల తదితరులపై వైసీపీ సోషల్ మీడియా ఆధ్వర్యంలో అసభ్యకర పోస్టులు పెట్టారు. దీనిపై పులివెందుల నియోజకవర్గం సింహాద్రిపురానికి చెందిన హరి అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు వైసీపీ సోషల్ మీడియా జిల్లా కో-కన్వీనర్ వర్రా రవీంద్రరెడ్డి, సజ్జల భార్గవ్‌రెడ్డి మరికొందరిపై పులివెందులలో ఎస్సీ ఎస్టీ కేసు నమోదైంది. ఇదే కేసులో బండి రాఘవరెడ్డి (ఏ-20) నిందితుడిగా ఉన్నాడు. ఇప్పటికే వర్రాను పోలీసులు అరెస్టు చేశారు. అతడు ప్రస్తుతం కడప సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్నాడు. తనకు ముందస్తు బెయిల్ కోరుతూ రాఘవరెడ్డి ఎస్సీ, ఎస్టీ కోర్టులో పిటిషన్ వేశాడు. దానిపై విచారించిన న్యాయాధికారి దీనబాబు.. తదుపరి ఉత్తర్వుల కోసం 25వ తేదీకి వాయిదా వేశారు. అనంతరం ఆయన సెలవుపై వెళ్లడంతో ఇన్‌చార్జిగా జడ్జిగా వచ్చిన వెంకటేశ్వర రావు (మొదటి అదనపు జిల్లా జడ్జి) ఎదుట 25, 27వ తేదీల్లో విచారణ జరిపారు. రాఘవరెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

వివరాలు సమర్పించేందుకు సమయమివ్వండి

- మేరుగ నాగార్జున కేసు కొనసాగింపుపై పోలీసుల అభ్యర్థన

అమరావతి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అత్యాచారం ఆరోపణలతో మాజీ మంత్రి, వైసీపీ నేత మేరుగ నాగార్జునపై నమోదైన కేసు విషయంలో ఫిర్యాదుదారు స్టేట్‌మెంట్ రికార్డు చేసేందుకు మేజిస్ట్రేట్ ముందు అప్లికేషన్ వేశామని పోలీసులు హైకోర్టుకు నివేదించారు. మేజిస్ట్రేట్ వద్ద స్టేట్‌మెంట్ రికార్డు అనంతరం దర్యాప్తు కొనసాగించాలా? లేదా? అనే విషయంపై నిర్ణయం తీసుకుంటామని పోలీసుల తరఫున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాయి రోహిత్ వివరించారు. వివరాలు సమర్పించేందుకు సమయం ఇవ్వాలని కోరారు. పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్.. వ్యాజ్యంపై విచారణను డిసెంబరు 11కి వాయిదా వేశారు. ఉద్యోగం, కాంట్రాక్ట్ పనులు ఇప్పిస్తామని ఆశ చూపి తన వద్ద నుంచి డబ్బులు తీసుకోవడమే కాకుండా శారీరకంగా వాడుకున్నారని ఆరోపిస్తూ విజయవాడకు చెందిన మహిళ ఫిర్యాదు ఆధారంగా గుంటూరు జిల్లా తాడేపల్లి పోలీసులు మేరుగ నాగార్జున, మురళీమోహన్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు. కేసు కొట్టివేయాలని కోరుతూ వారిద్దరు హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం ఇటీవల విచారణకు రాగా.. కోర్టుకు హాజరైన బాధిత మహిళతో న్యాయమూర్తి నేరుగా మాట్లాడారు. నాగార్జున, మురళీమోహన్‌రెడ్డి తనపై అత్యాచారానికి పాల్పడలేదని, రాజకీయ ఒత్తిడి కారణంగా తప్పుడు కేసు పెట్టానని ఆమె చెప్పారు. కేసు కొట్టివేయాలని అభ్యర్థించారు. ఈ విషయంలో ప్రమాణ పత్రం కూడా దాఖలు చేశానని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మేరుగ నాగార్జునపై నమోదైన అత్యాచారం కేసులో దర్యాప్తును కొనసాగిస్తారా? లేదా? అనే వివరాలను రాతపూర్వకంగా కోర్టు ముందు ఉంచాలని పోలీసులను ఆదేశించిన విషయం తెలిసిందే.



పెంచలకోనలో చిరుత సంచారం

రాపూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన అటవీ పార్కు సమీపంలో బుధవారం రాత్రి చిరుత పులి సంచరించింది. కారులోని భక్తులు చిరుత సంచారాన్ని తమ మొబైల్‌లో చిత్రీకరించి అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. సామాజిక మాధ్యమాల్లోనూ ఈ వీడియోలు వైరల్ కావడంతో కోనకు వచ్చే భక్తుల్లో భయాందోళన నెలకొంది. దీనిపై డీఎఫ్‌వో మహబూబ్‌బాషా మాట్లాడుతూ అటవీశాఖ పార్కు సమీపంలో చిరుత భక్తులకు ఎదురుపడిందని, కారు హారన్ కొట్టడంతో అడవిలోకి వెళ్లిపోయిందన్నారు. వెంటనే అటవీ, బేస్ క్యాంపు, రెగ్యులర్ సిబ్బందిని అప్రమత్తం చేసి అటవీ పరిసరాలన్నీ పరిశీలించినట్లు తెలిపారు.

ఉద్యోగులకు వైద్య బీమా

(మొదటి పేజీ తరువాయి)

భద్రత కల్పిస్తోంది. ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ ద్వారా అమలవుతున్న ఈ పథకంలో ప్యాకేజీలు తక్కువగా ఉండటంతో పాటు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో ఈహెచ్ఎస్ కింద ఉద్యోగులకు వైద్యం అందించలేమని నెట్‌వర్క్ ఆస్పత్రులు చేతులెత్తేస్తున్నాయి. దీంతో ఉద్యోగుల వైద్యం విషయంలో తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయి. మరోవైపు ప్రభుత్వం ఈహెచ్ఎస్ అమలుతో పాటు మెడికల్ రీయింబర్స్‌మెంట్ కూడా ఇస్తోంది. ఈహెచ్ఎస్ కింద ఆస్పత్రులకు రూ.కోట్లు చెల్లించడంతో పాటు రీయింబర్స్‌మెంట్‌కు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇంతచేసినా తమకు సరైన వైద్యం అందడం లేదని ఉద్యోగులు ఆరోపిస్తూనే ఉన్నారు. దీంతో వారికి సకాలంలో నాణ్యమైన వైద్యం అందించడంతో పాటు ఉద్యోగులపై, ప్రభుత్వంపై భారం తగ్గించుకునేందుకు వివిధ మార్గాలను అన్వేషిస్తోంది. అందులో భాగంగా బ్యాంకులతో అనుసంధానం కావాలని భావిస్తోంది. ఎస్‌బీఐ తన ఖాతాదారులకు దాదాపు రూ.కోటి వరకూ ప్రమాద బీమా, మరికొంత మందికి రూ.10 లక్షల వరకూ జీవిత బీమా కల్పిస్తోంది. మరో ప్రముఖ బ్యాంకు ఈ రెండింటితో పాటు ఏటా రూ.2,500 ప్రీమియం చెల్లిస్తే రూ.30 లక్షల వైద్య బీమాను కూడా అందిస్తోంది. వైద్యం ఖర్చు రూ.3లక్షలు దాటితే రూ.30 లక్షల వరకూ బ్యాంకు నుంచి బీమా పొందే అవకాశం ఉంది. ఈ విధంగా చాలా బ్యాంకులు కస్టమర్లకు వివిధ రూపంలో బీమా సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చాయి. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.

అందరికీ ఒకే బ్యాంకులో ఖాతాలు

రాష్ట్రంలోని 5లక్షల మంది ఉద్యోగులకు ఒకే బ్యాంకులో ఖాతా తెరిచి, ఇకపై అందులోనే వారి జీతాలు జమ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆ ఖాతా ద్వారానే వారికి వైద్య బీమా సదుపాయం కల్పించాలనే ఆలోచనలో ఉంది. ఈ ప్రతిపాదనకు ముందుకొచ్చే బ్యాంకులోనే ఉద్యోగులకు ఖాతాలు తెరవాలని నిర్ణయించింది. దీనిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు ఇప్పటికే బ్యాంకర్లతో ఒకసారి సమావేశమయ్యారు. ప్రభుత్వ ప్రతిపాదనలకు అనుగుణంగా ప్రజెంటేషన్లు సిద్ధం చేయాలని సీఎస్ వారికి సూచించారు. అయితే తమకు 15 రోజుల సమయం కావాలని, తమ యాజమాన్యాలతో చర్చించిన తర్వాత నిర్ణయం తెలియజేస్తామని బ్యాంకర్లు పేర్కొన్నారు. అయితే ప్రభుత్వ ప్రతిపాదనలకు కొన్ని బ్యాంకులు అంగీకారం తెలిపాయి. ఉద్యోగులకు వైద్య బీమా కోసం ప్రీమియం ఎంత చెల్లించాలన్న దానిపై ప్రభుత్వం, బ్యాంకర్ల మధ్య చర్చ నడుస్తోంది. ప్రస్తుతం ఈహెచ్ఎస్ కోసం గెజిటెడ్ ఉద్యోగులు నెలకు రూ.300, ఎన్జీవోలు రూ.250 చొప్పున చెల్లిస్తున్నారు. అయితే బ్యాంకుల నుంచి వైద్య బీమా తీసుకుంటే ప్రీమియం ఎక్కువ మొత్తం చెల్లించాలి. ఇది ఏడాదికి దాదాపు రూ.10వేల నుంచి రూ.20వేల వరకూ ఉంటుంది. ఉద్యోగులకు రూ.10లక్షల నుంచి రూ.25 లక్షల వరకూ బీమా అవసరం కాబట్టి దాని ఆధారంగా ఎంత తక్కువ మొత్తంలో ప్రీమియం నిర్ణయిస్తే, అంత మంచిదని బ్యాంకర్లకు అధికారులు స్పష్టం చేశారు. ఈ అంశాలపై మరో 15 రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

ఊపందుకున్న క్రిస్‌సిటీ పనులు



కొత్తపట్నం వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులు

- ఉమ్మడి నెల్లూరు జిల్లాలో అభివృద్ధికి బాటలు
- సీబీఐసీలో తొలివిడతగా 2,500 ఎకరాల్లో క్రిస్‌సిటీ
- పూర్తయిన భూసేకరణ, జోరుగా మొదలైన పనులు
- పరిశ్రమలకు భూముల విక్రయానికి చర్యలు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా సముద్రతీర ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రత్యేక కారిడార్‌లను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. ఈ కారిడార్‌లను ఎన్ఐసీడీసీ (నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) కింద అభివృద్ధి చేయనున్నారు. ఇందులో భాగంగా సీబీఐసీ (చెన్నై- బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్) ఏర్పాటు కానుంది. దాదాపు 13 వేల ఎకరాల్లో రూ. 37,500 కోట్లతో ఈ కారిడార్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ కారిడార్ తొలివిడతలో ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని కృష్ణపట్నం పోర్టుకు సమీపంలో 2,500 ఎకరాల్లో రూ. 2,139.44 కోట్ల వ్యయంతో క్రిస్‌సిటీ (కృష్ణపట్నం ఇండస్ట్రియల్ సిటీ) రూపుదిద్దుకోనుంది. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని కోట, చిల్లకూరు మండలాల పరిధిలోని కొత్తపట్నం, తమ్మినపట్నం గ్రామాల్లో క్రిస్‌సిటీ ఏర్పాటు కానుంది. ఇప్పటికే ఈ గ్రామాల్లో 2,500 ఎకరాల వరకు భూసేకరణ పూర్తి చేయగా, రూ. 600 కోట్లతో టీవీఎస్ఆర్ సంస్థ ద్వారా అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రధానంగా తమ్మినపట్నం ప్రాంతంలోని బీచ్ కెనాల్‌పై వంతెన నిర్మాణం, రోడ్లు, కాలువలతోపాటు అనేక వసతులు కల్పించనున్నారు. కృష్ణపట్నం పోర్టుతోపాటు చెన్నై పోర్టుకు దగ్గరగా ఈ ప్రాంతం ఉండటంతో ఎగుమతులు, దిగుమతులకు సౌకర్యంగా ఉండనున్నది. ప్రస్తుతం క్రిస్‌సిటీ అభివృద్ధి పనులు వేగంగా జరుగుతుండటంతో అనేక పరిశ్రమలు ఈ ప్రాంతానికి రానున్నట్లు తెలుస్తోంది.

త్వరలో భూముల విక్రయం

క్రిస్‌సిటీలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్న నేపథ్యంలో పలు అంతర్జాతీయ పరిశ్రమల ప్రతినిధులు ఈ ప్రాంతంపై ఆసక్తి చూపుతున్నారు. ఇందుకోసం ఎన్ఐసీడీసీ ఆధ్వర్యంలో త్వరలోనే పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూమిని విక్రయించేందుకు చర్యలు చేపడుతున్నట్టు సమాచారం. ఈ క్రిస్‌సిటీ ఏర్పాటుతో ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

'గ్రూప్–1' కథ కంచికేనా?

(మొదటి పేజీ తరువాయి)

మూల్యాంకనం చేశారు. దీనిని అభ్యర్థులు హైకోర్టులో సవాల్ చేయడంతో, మాన్యువల్ విధానంలోనే మూల్యాంకనం చేయాలని కోర్టు ఆదేశించింది. హైకోర్టు ఆదేశాలతో 2021 డిసెంబరు నుంచి 2022 ఫిబ్రవరి వరకూ మెయిన్స్ సమాధాన పత్రాలను గుంటూరు సమీపంలోని హాయ్‌ల్యాండ్ రిసార్ట్స్‌లో ఏపీపీఎస్సీ మూల్యాంకనం చేయించింది. ఈ విషయాన్ని దాచిపెట్టి తమకు కావాల్సిన వారి కోసం రెండోసారి మళ్లీ మాన్యువల్‌గా మూల్యాంకనం చేసింది. ఈ రెండు మూల్యాంకనాలకూ ఫలితాల్లో ఏకంగా 62శాతం తేడా వచ్చింది. డిజిటల్ మూల్యాంకనం చేసినప్పుడు ఎంపికైన 202 మంది పేర్లు మాన్యువల్ మూల్యాంకనం ఫలితాల్లో కనిపించలేదు. ఇదే అభ్యర్థుల్లో అనుమానాలు పెంచింది. ఆరా తీయడంతో ఒకటికి రెండుసార్లు మూల్యాంకనం చేయించారని తెలిసింది. నష్టపోయిన అభ్యర్థులు మళ్లీ న్యాయస్థానానికి వెళ్లారు. రెండుసార్లు మూల్యాంకనం జరగలేదని హైకోర్టులోనూ ఏపీపీఎస్సీ వాదించింది. హాయ్‌ల్యాండ్ రిసార్ట్స్‌లో మూల్యాంకనానికి చేసిన ఏర్పాట్లు, అందుకు చెల్లించిన బిల్లులు, పోలీసు భద్రత కోసం రాసిన లేఖలు అన్నీ అభ్యర్థులు హైకోర్టు ముందుంచడంతో న్యాయస్థానం మెయిన్స్ మొత్తం రద్దుచేస్తూ మార్చి 13న తీర్పు వెలువరించింది. తాజాగా మెయిన్స్ నిర్వహించి, నిబంధనలకు అనుగుణంగా మూల్యాంకనం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం, ఏపీపీఎస్సీని ఆదేశించింది. ఎంపిక ప్రక్రియను ఆరునెలల్లో పూర్తి చేయాలని తేల్చిచెప్పింది. ఈ తీర్పుపై అప్పటి వైసీపీ ప్రభుత్వం, ఏపీపీఎస్సీ హైకోర్టుకే అప్పీలుకు వెళ్లాయి.

రూ.150 కోట్ల స్కాం అన్న టీడీపీ

ఈ వ్యవహారం పెద్ద దుమారం రేపడంతో అప్పట్లో ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు దీనిపై ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి అక్రమాలు ఎలా జరిగాయో వివరించారు. దీనిపై సీబీఐతో దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. మరోవైపు దీనిని రూ.150 కోట్ల స్కాం అని టీడీపీ ఆరోపించింది. వైసీపీకి అనుకూలంగా ఉండేవారిని గ్రూప్-1 అధికారులను చేసేందుకు కోట్లలో స్కాం చేసిందని విమర్శించింది. తాము అధికారంలోకి వచ్చాక దీనిపై సమగ్ర విచారణ జరిపి, నష్టపోయిన వారికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చింది.

అధికారంలోకి వచ్చాక ఇలా...

స్వయంగా హైకోర్టు ముందు అక్రమాలు బయటపడటంతో ఏపీపీఎస్సీ మౌనం దాల్చింది. ప్రభుత్వం మారిన వెంటనే కమిషన్ చైర్మన్ గౌతం సవాంగ్ రాజీనామా చేసి వెళ్లిపోయారు. అయినా కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదు. పైగా నాడు అక్రమాల ద్వారా ఉద్యోగాల్లోకి వచ్చారని ఆరోపణలున్న వారిని కీలక స్థానాల్లో నియమిస్తోంది. దీంతో నష్టపోయిన అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక న్యాయం చేస్తారనుకుంటే ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని వాపోతున్నారు. అధికారంలోకి రాగానే ఏపీపీఎస్సీని ప్రక్షాళన చేస్తామని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు ప్రకటించారు. ఇంతవరకూ ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. అప్పట్లో ఏపీపీఎస్సీ సభ్యులను పేరుపేరునా ప్రస్తావించి వారిపై ఆయన విమర్శలు చేశారు. అయితే ఇప్పటికీ వారు అవే స్థానాల్లో కొనసాగుతున్నారు. వారిలోనూ జగన్ బంధుగణం, గతంలో వైసీపీలో పనిచేసిన వారు కూడా ఉన్నారు. వీరిపై విచారణ చేసేందుకు కూటమి ప్రభుత్వం వెనకడుగు వేస్తోంది. అలాగే గత ప్రభుత్వం నియమించిన అధికారే ఇంకా కమిషన్ కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఇటీవల చైర్మన్‌ను నియమించారు కానీ మిగిలిన వారిని మాత్రం అలాగే కొనసాగించడంపై విమర్శలు వస్తున్నాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.